ఈనాడు

విజయవాడ 19-1-2026 సోమవారం సిటీ సంపుటి 52 . సంచిక 159

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 14

www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

ఈనాడు

విజయవాడ 19-1-2026 సోమవారం సిటీ సంపుటి 52 . సంచిక 159
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 14
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

జీరోలతో హీరోలు!

మీకుందా డిజిటల్ మెచ్యూరిటీ



ఫొటోలు, వీడియోలు, స్టేటస్ అప్‌డేట్‌లు, లైక్స్, కామెంట్లు.. ఇదే లోకం చాలా మంది కుర్రాళ్లకు.. పర్యాటక ప్రదేశాలకు వెళ్లినా.. ఫ్రెండ్స్‌తో బయటకు వెళ్లినా.. ప్రతిదాన్నీ పంచుకోవడం వారి స్టేటస్. అయితే ఇటీవల యువతలో ఒక ఆసక్తికరమైన మార్పు కనిపిస్తోంది. అదే 'జీరో పోస్టింగ్' అనే కొత్త ధోరణి. దీన్ని డిజిటల్ మెచ్యూరిటీగా భావిస్తున్నారు.

ఏంటిది?

సోషల్ మీడియా ఖాతాలున్నప్పటికీ ఫొటోలు పోస్టు చేయకపోవడం.. వ్యక్తిగత జీవితం బయటపెట్టకపోవడం.. లైక్స్, కామెంట్ల కోసం ప్రయత్నించకపోవడమే 'జీరో పోస్టింగ్'. యువత సామాజిక మాధ్యమాలను ఉపయోగిస్తున్నప్పటికీ తమ గురించి ఏమీ పోస్టు చేయకుండడమే ఈ ధోరణి ప్రత్యేకత.

ఎందుకు మొగ్గు చూపుతున్నారు?

- డిజిటల్ ప్రపంచం ప్రారంభ దశలో సోషల్ మీడియా అనేది భావాలను పంచుకునే వేదికగా ఉండేది. కానీ కాలక్రమేణా అది పోలికలు, పోటీలు, విమర్శలకు వేదికగా మారింది.
- ఎవరి జీవితం మారింది? ఎవరి ఫొటోకు ఎక్కువ లైక్స్ వచ్చాయి? ఎవరు ట్రెండింగ్‌లో ఉన్నారు? అనే ఆలోచనలు యువతపై ఒత్తిడిని పెంచాయి.
- ఒక అధ్యయనం ప్రకారం.. సోషల్ మీడియాలో ఎక్కువ సమయం గడిపే యువతలో సుమారు 60శాతం మంది తమ జీవితాలను ఇతరులతో పోల్చుకుని అసంతృప్తికి లోనవుతున్నారని వెల్లడైంది.

ఈ పరిస్థితి పోస్టు చేయకపోవడమే మంచిది అనే దశకు తీసుకువచ్చింది.

లాభాలేంటి?

- ➤ అనవసర ఒత్తిడి నుంచి బయటపడొచ్చు
- ➤ డిజిటల్ గోప్యతా పెరుగుతుంది.
- ➤ నిజ జీవితానికి ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వడం
- ➤ మానసిక ప్రశాంతత

1 ప్రైవసీపై అవగాహన

ఈ రోజుల్లో.. ఫొటోలు, వ్యక్తిగత సమాచారం ఎంత సులభంగా దుర్వినియోగానికి గురవుతోందో యువతకు స్పష్టంగా తెలుసు. ఏఐ వచ్చిన తర్వాత ఈ పరిస్థితి ఇంకా ఎక్కువైంది. ఫొటోలను మార్ఫింగ్ చేయడం, డేటా దుర్వినియోగం, ఫేక్ అకౌంట్లు, ట్రోలింగ్ వంటి విషయాల కారణంగా యువత తమ వ్యక్తిగత విషయాలను పంచుకోవడానికి వెనకాడటం మొదలైంది.

2 మానసిక ఒత్తిడి

మానసిక ఆరోగ్యంపై పెరిగిన అవగాహన కూడా జీరో పోస్టింగ్‌కు దారి తీస్తోంది. లైక్స్ తగ్గితే కలిగే నిరాశ, కామెంట్ల వల్ల వచ్చే ఆందోళన నుంచి బయటపడేందుకు కొందరు పూర్తిగా పోస్టింగ్ మానేశారు. వారు సోషల్ మీడియాను కేవలం సమాచారం తెలుసుకునే సాధనంగా, లేదా ఇతరుల కంటెంట్ చూడడానికి పరిమితం చేస్తున్నారు.

3 ఫేక్ జీవితం చూపించడంపై విసుగు

సోషల్ మీడియాలో చాలామంది వాస్తవానికి దూరమైన జీవితాన్ని చూపిస్తారు. ఈ నకిలీ ప్రదర్శనలపై యువత విసిగిపోతోంది. సోషల్ మీడియాలో కనిపించే 'పర్‌ఫెక్ట్ లైఫ్' నిజం కాదని అర్థం చేసుకున్న యువత, జీరో పోస్టింగ్ వైపు వెళ్తోంది.

4 డిజిటల్ డిటాక్స్

ఎప్పుడూ స్క్రీన్‌లో ఉండడం వల్ల వచ్చే అలసటను తగ్గించుకోవడానికి యువత జీరో పోస్టింగ్‌ను ఎంచుకుంటోంది. అయితే వారు సామాజిక మాధ్యమాలు చూస్తున్నప్పటికీ.. తమ సమాచారాన్ని మాత్రం పంచుకోవడం లేదు. ఒకవేళ పోస్టు చేస్తే.. మన ఫొటోకు ఎన్ని లైక్‌లు వచ్చాయి? ఎంత మంది కామెంట్ చేశారు? వంటి ఆలోచనలతో పదేపదే వాటిని తనిఖీ చేస్తోంటే.. స్క్రీన్ సమయం పెరిగిపోతోంది.

అయితే...

జీరో పోస్టింగ్ అనేది సోషల్ మీడియా నుంచి పూర్తిగా దూరమవడం కాదు, దాన్ని నియంత్రణలో పెట్టుకోవడం. ఇది యువతలో పరిపక్వతను కూడా సూచిస్తుంది. జీవితాన్ని నిరంతరం ప్రదర్శించాల్సిన అవసరం లేదని యువత గ్రహిస్తున్నారు. అందువల్ల ఇది ఒక ట్రెండ్‌గా మాత్రమే కాకుండా, డిజిటల్ సమతుల్యత వైపు యువత వేస్తోన్న ఒక చైతన్యమైన అడుగుగా చూడొచ్చంటున్నారు నిపుణులు.

- ఈనాడు ప్రత్యేక విభాగం

ఆ ముచ్చట... ముదిరితే..!

- మీ అబ్బాయికి పెళ్లెప్పుడు..?
-అమ్మాయికి సంబంధాలు చూస్తున్నావా లేదా?
- ఏరా... మంచి ఉద్యోగం ఉంది పప్పన్నం పెట్టడానికి ఆలస్యమెందుకు చేస్తున్నావ్?
-నేనిప్పుడే పెళ్లి చేసుకోను... కాస్త స్థిరపడ్డాక చూస్తా!
- 30లో పడ్డా మా అమ్మాయి పెళ్లంటే అప్పుడే తొందరేముంది అంటోంది...

సమాజంలో రోజూ వినిపించే కామెంట్లివి! ఈకాలం పిల్లలు పెళ్లికి తొందరపడటం లేదన్నది ఎక్కువగా వినిపిస్తున్న ప్రధాన ఫిర్యాదు! ఇంతకూ ఏ వయసులో తీరాల్సిన ముచ్చట ఆ వయసులో తీరాలంటున్న పెద్దల మాట కరెక్టా? లేక... వాయిదా వేస్తున్న నవతరం తీరు కరెక్టా? పెళ్లి చేసుకునేందుకు ఏది సరైన వయసు? ఏది సరైన సమయం?

పూర్తి వివరాలు 8లో

ల్యాండ్, శాండ్, వైన్, మైన్, గంజాయి, డ్రగ్స్..

మాఫియాలే వైకాపా క్రెడిట్

> సీఎం ఎక్కడుంటే అదే రాజధాని అంటూ జగన్ వక్రభాష్యాలు చెబుతున్నారు. జగన్ బెంగళూరు, ఇడుపులపాయల్లో ఉంటే అవే రాజధానులా? ఓ పార్టీ నిర్వహించే వ్యక్తి మాట్లాడేది ఇలాగేనా? అధికారంలో ఉండగా.. అమరావతిని శ్మశానం, ఎడారి అన్నారు. మూడు రాజధానుల పేరుతో మూడు ముక్కలాట ఆడారు.
> - సీఎం చంద్రబాబు

సర్వే రాళ్లపై బొమ్మలకు రూ.700 కోట్లు వృథా చేసి.. క్రెడిట్ చోరీ అంటున్నారు

బెంగళూరు, ఇడుపులపాయల్లో జగన్ ఉంటే అవి రాజధానులు అవుతాయా?

వ్యక్తిత్వ హననానికి పాల్పడితే ఎక్కడున్నా శిక్షిస్తాం: సీఎం చంద్రబాబు



ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి నివాళులర్పిస్తున్న సీఎం చంద్రబాబు, మంత్రి అచ్చెన్నాయుడు, తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, నాయకులు

ఈనాడు, అమరావతి: ల్యాండ్, శాండ్, వైన్, మైన్, డ్రగ్స్, గంజాయి మాఫియాలే వైకాపా వాళ్ల క్రెడిట్ అని సీఎం చంద్రబాబు ధ్వజమెత్తారు. ఎప్పుడో పూర్తికావాల్సిన ప్రాజెక్టులను తన పాలనలో మూలన పడేసిన జగన్.. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వాటిని పూర్తిచేస్తుంటే తన ఘనతగా అసత్య ప్రచారం చేసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. రూ.700 కోట్లు ఖర్చుచేసి సర్వే రాళ్లపై తన బొమ్మలు వేసుకున్న వ్యక్తి... క్రెడిట్ చోరీ అని మాట్లాడటం సిగ్గుచేటని మండిపడ్డారు. అవినీతి సొమ్ముతో పెట్టిన పత్రికలో క్రెడిట్ చోరీ అంటూ తప్పుడు వార్తలు రాయిస్తున్నారని ఆగ్రహించారు. వైకాపా వంటి ఫేక్ పార్టీతో పోరాడాల్సి రావడం దౌర్భాగ్యమన్నారు. సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిత్వ (మిగతా 2లో)

ఎన్టీఆర్‌కు భారతరత్న సాధిస్తాం

ఇది తెలుగువారి చిరకాల ఆకాంక్ష
ముఖ్యమంత్రి చంద్రబాబు 3లో

కేంద్రం, రాష్ట్రం జత..

అభివృద్ధి జాత!

- కేంద్ర ప్రాయోజిత పథకాలకు రూ.24,513 కోట్లు
- ఇప్పటికే రూ.12,621 కోట్ల ఖర్చు
- మిగిలిన నిధుల సద్వినియోగంపై దృష్టి
- అదనంగా సాధించేందుకు ప్రభుత్వం అడుగులు




ఈనాడు – అమరావతి

రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేందుకు ఎన్డీయే ప్రభుత్వం కష్టపడుతోంది. ఒక్కో రూపాయి సమీకరించుకుంటూ సద్వినియోగం చేస్తోంది. కేంద్ర ప్రాయోజిత పథకాల నుంచి అధిక నిధులు సాధించేందుకు కసరత్తు చేస్తోంది. అటు దిల్లీలో కేంద్రమంత్రులను, మంత్రిత్వశాఖల అధికారులను సమన్వయం చేయడంతో పాటు రాష్ట్రంలోనూ యంత్రాంగాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు పరుగు పెట్టిస్తున్నారు. నిధులు తెచ్చుకోవడం, ఖర్చు చేయడం, అదనంగా సాధించడం అన్న 3 సూత్రాలతో యంత్రాంగాన్ని ముందుకు నడిపిస్తున్నారు. నెల రోజుల్లోనే రెండు సార్లు సమీక్షించి లక్ష్యాలు విధించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 76 కేంద్ర ప్రాయోజిత పథకాలకు సంబంధించి రాష్ట్ర, కేంద్ర వాటా నిధులు కలిపి రూ.24,513 కోట్ల కేటాయింపులు సాధించారు. జగన్ ప్రభుత్వంలో ఐదేళ్లూ కేంద్ర పథకాల్లో రాష్ట్రానికి రూ.39,642 కోట్లు కోత పడ్డాయి. రూ.10,171 కోట్లు వేరే పథకాలకు మళ్లించారు. ఎన్డీయే ప్రభుత్వం తొలి ఏడాదిలోనే వీటిని గాడిన పెట్టి రూ.17 వేల కోట్ల వరకు ఖర్చు చేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కేంద్ర ప్రాయోజిత పథకాలకు కేంద్ర ప్రభుత్వం రూ.15,173 కోట్లు కేటాయించింది. ఆ పథకాల్లో రాష్ట్ర వాటా మొత్తం రూ.9340 కోట్లు. ఈ ఆర్థిక సంవత్సరంలో 76 పథకాలకు మొత్తం రూ.24,513 కోట్లు ఖర్చు చేసేలా ప్రణాళికలు రూపొందించారు.

■ కేంద్ర ప్రాయోజిత పథకాలను రెండు తరహాల్లో అమలు చేస్తున్నారు. గతంలో కేంద్ర నిధులను రాష్ట్రాలు (మిగతా 2లో)

తితిదే శ్రీవాణి ట్రస్ట్ నిధులతో

5 వేల ఆలయాలు



ఎస్సీ, ఎస్టీ, బీసీల ఆవాస ప్రాంతాల్లో నిర్మాణం

ఒక్కో ఆలయానికి రూ.15-30 లక్షల కేటాయింపు ● ఇప్పటికి 463 మంజూరు

ఈనాడు – అమరావతి

శ్రీవాణి ట్రస్ట్ నిధులతో రాష్ట్రవ్యాప్తంగా 5 వేల ఆలయాల నిర్మాణానికి తితిదే శ్రీకారం చుట్టింది. గ్రామాలు, పట్టణాల పరిధిలో ఎస్సీ, ఎస్టీ, బీసీలు ఎక్కువగా నివసించే ప్రాంతాల్లో నిర్మాణానికి ప్రాధాన్యం ఇస్తోంది. గ్రామాల్లో భక్తి, సంస్కృతిని పెంపొందించడం, భజనలు నిర్వహించేందుకు కూడా వీలుకల్పించేలా ఈ ఆలయాలు నిర్మిస్తున్నారు. ఇప్పటి వరకు 1,176 అర్జీలు రాగా 463 ఆలయాలు నిర్మించేందుకు పరిపాలన అనుమతులు ఇచ్చారు. మిగిలినవి పరిశీలనలో ఉన్నాయి.

స్థల లభ్యతకు అనుగుణంగా నిధులు

- ■ ఆయా గ్రామాలు, కాలనీల్లో అందుబాటులో ఉన్న స్థలానికి అనుగుణంగా ఆలయ నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తున్నారు.
- ■ 5 సెంట్ల స్థలం అయితే రూ.10 లక్షలు, 8 సెంట్లకు రూ.15 లక్షలు, 10 సెంట్లు, అంతకంటే ఎక్కువ స్థలమైతే రూ.20 లక్షలతో ఆలయాన్ని నిర్మించనున్నారు.
- ■ ఆలయం చుట్టూ ప్రహరీ, గుడికి ఆర్నమెంటేషన్ ఉండేలా చూడాలని, (మిగతా 2లో)

అమెరికా ముందు మోకరిల్లిన మోదీ

- దేశాభివృద్ధికి ప్రధాని చేసిందేమీ లేదు
- స్వాతంత్ర్యోద్యమంలో భాజపా, ఆరెస్సెస్ పాత్ర లేదు
- శతాబ్ది ఉత్సవాల ముగింపు సభలో సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా



ఖమ్మం సభలో మాట్లాడుతున్న సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా. చిత్రంలో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, సీపీఐ తెలంగాణ కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

ఈనాడు, ఖమ్మం: సీపీఐ వందేళ్ల ఉద్యమ ప్రయాణం చరిత్రాత్మకమని.. దేశం కోసం తమ పార్టీ ఎన్నో త్యాగాలు చేయడంతోపాటు పేద ప్రజల హక్కుల కోసం పోరాడుతోందని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా అన్నారు. కాంగ్రెస్ తర్వాత అత్యధిక కాలం చరిత్ర కలిగిన సీపీఐ దేశ స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో ముందు వరుసలో నిలబడి పోరాటం చేసిందన్న ఆయన భాజపా, ఆరెస్సెస్, ప్రధాని నరేంద్ర మోదీపై నిప్పులు చెరిగారు. అమెరికా ముందు మోదీ తలవంచుతున్నారని, దేశాభివృద్ధికి ఆయన చేసిందేమీ లేదని వ్యాఖ్యానించారు. సీపీఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సందర్భంగా తెలంగాణలోని ఖమ్మంలో ఆదివారం నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా సామ్రాజ్యవాద విధానాలకు వ్యతిరేకంగా ప్రజల హక్కుల కోసం పోరాటాలు కొనసాగిస్తామని అన్నారు.

దేశం కోసం పోరాడాం..

'1925 డిసెంబరు 26న ఉత్తర్‌ప్రదేశ్‌లోని కాన్పూర్‌లో సీపీఐ రాజకీయ పార్టీగా పురుడు పోసుకుంది. అప్పట్నుంచి దేశం కోసం పార్టీ, శ్రేణులు అనేక త్యాగాలు, పోరాటాలు చేశాయి. వందేళ్ల ఉత్సవాలు జరుపుకోవడాన్ని గర్వంగా భావిస్తున్నాం. ఇది చారిత్రక ఘట్టం. దేశ నిర్మాణంలో ఆరెస్సెస్, (మిగతా 2లో)

'గ్రీన్‌లాండ్ సుంకం' ఘోర తప్పిదం

ట్రంప్‌నకు స్టార్మర్ హితవు
రష్యా, చైనా పండగ చేసుకుంటున్నాయన్న ఈయూ దేశాలు
ఆ బెదిరింపులు మమ్మల్ని ఏమీ చేయలేవు: మెక్రాన్ 11లో

ఉత్తమ రచనలకు జాతీయ స్థాయి పురస్కారాలు

తొలివిడత తెలుగు సహా 7 భాషల్లో ప్రదానం చేస్తాం
తమిళనాడు సీఎం స్టాలిన్ ప్రకటన 12లో

ఇదీ సంగతి!



ఇది అన్యాయం డియర్! ఇంతకుముందే నయం.. సెలవు రోజున ఇంట్లో రెస్ట్ తీసుకునేవాడిని!!

'అప్పు'నంగా దోపిడీ!

తక్కువ వడ్డీ పేరిట కొంప ముంచుతారు

ఆన్‌లైన్‌లో దా'రుణ' మోసాలు

ఈనాడు – అమరావతి

వ్యాపారం.. చదువులు.. వస్తువుల కొనుగోళ్లు.. అవసరం ఏదైనా తక్కువ వడ్డీ రుణం కోసం ఆన్‌లైన్‌లో అన్వేషించడం సాధారణమైంది. ఆన్‌లైన్‌లో ప్రకటనలు నమ్మి దరఖాస్తు చేసుకుంటే అంతే సంగతులు. మోసగాళ్లు నిలువునా ముంచుతారు. అవసరానికి రుణం తీసుకునేందుకు ప్రయత్నిస్తే.. మన దగ్గర ఉన్న సొమ్మును వివిధ పేర్లతో అందినకాడికి లాగేస్తారు.



నమ్మి మోసపోతున్నారు

■ విజయవాడకు చెందిన వ్యక్తి.. తన వ్యాపార అవసరాలకు రుణం తీసుకోవాలనుకున్నారు. ఆన్‌లైన్‌లో వెతుకుతుండగా.. ఓ వెబ్‌సైట్‌లో రుణం ఇస్తామన్న ప్రకటన చూసి సంప్రదించారు. వివరాలన్నీ తెలుసుకున్న అవతలి వ్యక్తి, మీకు రూ.2 కోట్ల వరకు రుణం తీసుకునేందుకు అర్హత ఉందని నమ్మించాడు. వెంటనే మంజూరు చేయిస్తానని చెప్పి, అందుకోసం పన్ను, సేవా రుసుము, ప్రాసెసింగ్ ఫీజు కోసం రూ.2,05,600 చెల్లించాలని చెప్పాడు. ఆ వ్యక్తి ఇచ్చిన మూడు బ్యాంకు ఖాతాలకు ఆ మొత్తాన్ని బాధితుడు జమ చేశారు. నగదు జమ కాగానే, మోసగాడు ఫోను స్విచాఫ్ చేశాడు. దీంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించారు.

■ ఫేస్‌బుక్ పేజీలో కనిపించిన వ్యక్తిగత రుణం ప్రకటన చూసిన ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేశారొకరు. మరుసటి రోజు ఒక వ్యక్తి ఫోన్ చేసి.. తాను ఓ సంస్థ ప్రతినిధినని పరిచయం చేసుకున్నాడు. రూ.3 లక్షల రుణానికి అర్హత ఉందని చెప్పి, వ్యక్తిగత సమాచారం, ఐడీ కార్డులు తీసుకున్నాడు. తర్వాత రుణానికి ఆమోదం లభించిందని లేఖ పంపించాడు. (మిగతా 2లో)

జాగరూకతతో ఉందాం

- ➤ పలు రుసుములు, పన్నుల పేరుతో రుణ మంజూరు సంస్థలు ముందుగా డబ్బు చెల్లించాలని అడగవు. రుణం మంజూరు చేసే సమయంలోనే మినహాయించి ఇస్తాయి.
- ➤ సంబంధిత సంస్థల ప్రకటనలు నమ్మి, వివరాలు, గుర్తింపు కార్డులు పంపకూడదు. ఆయా సంస్థల చరిత్ర చూసి దరఖాస్తు చేసుకోవాలి.
- ➤ ఆన్‌లైన్‌లో కనిపించే లింక్‌లపై క్లిక్ చేసి, వాటిలో వివరాలను నింపొద్దు.



వైభవంగా అప్పన్నస్వామి తెప్పోత్సవం

పుష్య బహుళ అమావాస్యను పురస్కరించుకొని సింహాద్రి అప్పన్నస్వామి తెప్ప తిరునాళ్ల మహోత్సవం ఆదివారం సాయంత్రం అంగరంగ వైభవంగా జరిగింది. విశాఖ జిల్లా అడివివరం గ్రామంలోని వరాహ పుష్కరిణిలో హంసనావపై విహరించిన స్వామి, అమ్మవార్లను దర్శించుకుని భక్తులు తన్మయత్వానికి గురయ్యారు. తెప్పోత్సవం అనంతరం సర్వజన మనోరంజని వాహనంపై స్వామివారి గ్రామ తిరువీధి వేడుకగా సాగింది. – న్యూస్‌టుడే, సింహాచలం

తితిదే శ్రీవాణి ట్రస్ట్ నిధులతో 5 వేల ఆలయాలు

(మొదటి పేజీ తరువాయి)

ఇందుకు అవసరమైతే అదనంగా నిధులు వెచ్చించాలని సీఎం చంద్రబాబు ఇటీవల ఆదేశించారు. దీంతో వీటి కోసం అదనంగా రూ.5-10 లక్షల వరకు వెచ్చించనున్నారు.

◆ అంటే ఒక్కో ఆలయానికి కనీసం రూ.15 నుంచి గరిష్ఠంగా రూ.30 లక్షల వరకు ఖర్చు చేయనున్నారు. ◆ గతంలో 2 వేల ఆలయాలు మంజూరు చేశారు. ఒక్కో ఆలయానికి గరిష్ఠంగా రూ.10 లక్షల వరకే వెచ్చించారు. అందులో 1,400 పూర్తి కాగా, మరో 600 నిర్మాణ దశలో ఉన్నాయి. వీటి కంటే మరింత పెద్దగా ఇప్పుడు 5 వేల ఆలయాలు నిర్మించనున్నారు.

◆ ఆలయానికి అవసరమైన స్థలాన్ని గ్రామంలో ప్రైవేటు వ్యక్తులు దానంగా ఇవ్వొచ్చు. పంచాయితీ స్థలంలో నిర్మించాలనుకుంటే తీర్మానం అవసరం. రెవెన్యూ స్థలమైతే ఆ శాఖ అధికారుల నుంచి ఎన్వోసీ తీసుకోవాల్సి ఉంటుంది. ◆ ఆలయం నిర్మించుకునేందుకు కాలనీ, గ్రామంలోని కమిటీ ఏర్పడి.. ముందుకొస్తే, వారికే నిర్మాణ బాధ్యత అప్పగించనున్నారు.

◆ శిర్డీ సాయిబాబా మినహా, మరే ఇతర స్వామి, అమ్మవార్ల ఆలయాలు అయినా మంజూరు చేస్తున్నారు. గ్రామ కమిటీ విగ్రహం సమకూర్చుకుంటే సరి. లేకపోతే విగ్రహానికి కూడా కలిపి నిధులు మంజూరు చేస్తున్నారు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు

◆ ఎవరైనా తమ గ్రామం, కాలనీల్లో ఆలయం కావాలని భావిస్తే దేవాదాయ, తితిదే అధికారులకు దరఖాస్తు చేసుకోవచ్చు.

◆ మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల సిఫార్సు ద్వారా కూడా అర్జీ పెట్టుకోవచ్చు. ◆ నేరుగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు https://endowmentsinfo.ap.gov.in/ttdbhajanamandirams వెబ్‌సైట్ ఉపయోగపడుతుంది. ◆ నియోజకవర్గానికి సగటున 25 ఆలయాలు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లోని ఈ పరిమితి లేకుండా ఇంకా ఎక్కువ ఆలయాలు మంజూరు చేయనున్నారు.

'అప్పు'నంగా దోపిడీ!

(మొదటి పేజీ తరువాయి)

అది అందాక ఫోన్ చేసి రూ.4,500 బీమా చెల్లించాల్సి ఉంటుందని చెప్పడంతో ఫోన్‌పేకు ఆ మొత్తాన్ని పంపించాడు. అనంతరం ఈఎంఐ ఛార్జీలు, జీఎస్టీ, ఎన్వోసీ, ఆర్బీఐ ఛార్జీలు, తదితరాల పేరిట దఫదఫాలుగా భారీగా సొమ్ములు గుంజాడు. అయినా ఇంకా ఏదో కారణం చెబుతుండటంతో మోసపోయినట్లు గ్రహించారు.

అదిగో.. ఇదిగో.. అని బురిడీ

ఆన్‌లైన్‌లో పలు రకాల రుణాలు ఇస్తామంటూ మోసగాళ్లు ఆకర్షణీయ ప్రకటనలు పెడుతుంటారు. అవసరమైన వారు వాటిని చూసి దరఖాస్తు ఫారాల్లో తమ వివరాలను నింపుతుంటారు. ఆ వివరాల ఆధారంగా అవతలి వారు.. దరఖాస్తుదారులకు ఫోన్ చేస్తుంటారు. ఎస్ఎంఎస్‌లు, వాట్సప్ సందేశాలు పంపుతుంటారు. వాటిని చూసి సంప్రదించిన వారిని తీయని మాటలతో నమ్మిస్తారు. పరిశీలన పూర్తి అయినట్లు ఓ పత్రం పంపిస్తారు. తర్వాత లోను చెక్కు ఇదేనని స్కాన్ చేసి పంపుతారు.

◆ నిజంగా రుణం మంజూరైందని నమ్మితే, వారి మాయలో పడ్డట్లే. జీఎస్టీ, ప్రత్యేక ఫీజు.. ఇలా రకరకాల పేర్లతో మన నుంచే డబ్బును ఎదురు తీసుకుంటారు. మనం ఆలోచనలో పడితే, అనేక రకాలుగా ఒత్తిళ్లు తెస్తారు. పరిమిత కాల ఆఫర్ అనీ, ప్రస్తుతం తక్కువ వడ్డీకే ఇస్తున్నట్లు, ఈరోజే ఆఫర్ ముగుస్తుందనీ, ఆలస్యం చేస్తే మంచి అవకాశం కోల్పోతారని చెబుతారు. ఆ క్షణంలో వెంటనే నిర్ణయం తీసుకునేలా చేస్తారు.

నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా మల్లేశ్వరరావు



నూతన కార్యవర్గ సభ్యులతో బొప్పరాజు వెంకటేశ్వర్లు

గుంటూరు (జిల్లా పరిషత్తు), న్యూస్‌టుడే: ఆల్ ఏపీ ప్రభుత్వ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ఎస్.మల్లేశ్వరరావు (గుంటూరు), ప్రధాన కార్యదర్శిగా టి.చెన్నప్ప (అనంతపురం) ఎన్నికయ్యారు. ఆదివారం గుంటూరులో సంఘ రాష్ట్ర కౌన్సిల్ సమావేశం మల్లేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. ఇందులో నూతన కార్యవర్గ ఎన్నికలను ఏపీ సహకార సర్వీసెస్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.సురేష్ నిర్వహించగా, అసోసియేట్ అధ్యక్షుడిగా ఇ.మద్దిలేటి (కర్నూలు), కోశాధికారిగా ఎస్.వి.కృష్ణారావు (కృష్ణా), గౌరవ అధ్యక్షుడిగా ఇ.సుబ్రహ్మణ్యం (చిత్తూరు)తో పాటు రాష్ట్ర కార్యదర్శులుగా ఇద్దరు, ప్రచార కార్యదర్శి కార్యనిర్వాహక కార్యదర్శిగా ఒక్కొక్కరు, ఉపాధ్యక్షులు నలుగురు ఎన్నికయ్యారు. ముఖ్య అతిథిగా హాజరైన ఏపీ జేఏసీ అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు నూతన కార్యవర్గాన్ని అభినందించారు. అనంతరం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి చంద్రబాబు మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించారని, డీఏ బకాయిలు రూ.1,000 కోట్లు విడుదల చేసినందుకు కృతజ్ఞతలు అని పేర్కొన్నారు.

హత్యాయత్నం కేసు నిందితులను రోడ్డుపై నడిపించిన పోలీసులు



నిందితులను రోడ్డుపై నడిపిస్తున్న పోలీసులు

నెల్లూరు (నేర విభాగం), న్యూస్‌టుడే: వ్యక్తిపై హత్యాయత్నం చేసిన నిందితులను శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరులోని వేదాయపాలెం పోలీసులు ఆదివారం రాత్రి నగరంలో రోడ్డుపై నడిపించారు. పోలీసుల కథనం మేరకు.. స్టేషన్ పరిధిలోని అంబాపురం యల్లమ్మగుడి సమీపంలో నివాసం ఉంటున్న మనిదేవి అలియాస్ దేవపై ఈ నెల 16న రాత్రి రౌడీషీటర్లు రవి అలియాస్ ఏక్‌బాల్, కృష్ణసాయి అలియాస్ కిట్టులతో పాటు వాసు, హుస్సేన్, మరో ఐదుగురు బాలురు హత్యాయత్నం చేశారు. వాహనాన్ని పక్కకు తీయనందుకు అతనిపై దాడి చేశారు. ఈ ఘటనపై దేవ భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితులను అరెస్టు చేశారు. నగర డీఎస్పీ దీక్ష పర్యవేక్షణలో గాంధీ బొమ్మ నుంచి వీఆర్సీ సెంటరు వరకు నలుగురు నిందితులను రోడ్డుపై నడిపించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదని పోలీస్ అధికారులు హెచ్చరించారు.

ఛత్తీస్‌గఢ్‌లో మరో ఎన్‌కౌంటర్... ఇద్దరు మావోయిస్టుల మృతి

చర్ల, న్యూస్‌టుడే: ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపుర్ జిల్లా నేషనల్ పార్క్ అడవుల్లో ఆదివారం భద్రతా బలగాలతో జరిగిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందారు. శనివారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో నలుగురు మావోయిస్టులు మృతి చెందిన విషయం తెలిసిందే. ఆదివారం మధ్యాహ్నం అదే ప్రాంతంలో ఎదురుకాల్పులు జరిగినట్లు బీజాపుర్ ఎస్పీ డాక్టర్ జితేంద్ర కుమార్ యాదవ్ తెలిపారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో ముమ్మర గాలింపు కొనసాగుతోందన్నారు. రెండు ఎన్‌కౌంటర్‌లలో మృతి చెందినవారిలో నేషనల్ పార్క్ డివిజనల్ కమిటీ సభ్యుడు దిలీప్ బెడ్జా, నేషనల్ పార్క్ ఏరియా కమిటీ సభ్యులు మాడవి కోసా, లక్కీ మడకం, పార్టీ సభ్యుడు రాధా మెట్టా ఉన్నట్లు గుర్తించినట్లు వివరించారు.

ఓట్ల కోసం దేశ భద్రతతో ఆటలా?

- చొరబాటుదారులకు తృణమూల్ వత్తాసు
- మహా ఆటవిక రాజ్యాన్ని అంతమొందించాలి
- భూముల్ని ధారాదత్తం చేసిన కాంగ్రెస్
- అస్సాం, బెంగాల్ సభల్లో మోదీ విమర్శలు



అస్సాంలోని నాగావ్ జిల్లా కలియాబొర్‌లో ఆదివారం కాజీరంగా ఎలివేటెడ్ కారిడార్ నమూనాను పరిశీలిస్తున్న ప్రధాని మోదీ

సింగూర్ (పశ్చిమబెంగాల్), కలియాబొర్ (అస్సాం): ఓటుబ్యాంకు రాజకీయాల కోసం పశ్చిమ బెంగాల్‌లోని తృణమూల్ కాంగ్రెస్ సర్కారు మన దేశ భద్రతతో ఆటలాడుకుంటోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆరోపించారు. అస్సాంను కాంగ్రెస్ పాలించినప్పుడు ఓట్ల కోసం భూముల్ని చొరబాటుదారులకు అప్పగించిందని విమర్శించారు. ఆదివారం ఆయన తొలుత అస్సాంలోని కలియాబొర్‌లో, ఆ తర్వాత పశ్చిమబెంగాల్‌లో హుగ్లీ జిల్లా సింగూర్‌లో బహిరంగ సభల్లో ప్రసంగిస్తూ ఈ రెండు పార్టీలపై విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ ప్రతికూల రాజకీయాలను దేశ ప్రజలు తిరస్కరిస్తున్నారని, దేశవ్యాప్తంగా భాజపాకు ప్రజల్లో మద్దతు పెరుగుతోందని చెప్పారు. ప్రజల మొదటి ఎంపికగా తమ పార్టీ మారిందన్నారు. ఓటర్లు సుపరిపాలనను, అభివృద్ధిని కోరుకుంటున్నారని.. బిహార్ ఎన్నికలు, తిరువనంతపురం, ముంబయి స్థానిక ఎన్నికల్లో ఈ విషయం స్పష్టమయిందని చెప్పారు.

కాంగ్రెస్‌కు అభివృద్ధి ఎజెండా లేదు

"దేశాన్ని ఎన్నో ఏళ్లు పాలించినప్పటికీ కాంగ్రెస్‌కు అభివృద్ధి ఎజెండా లేదు. అందువల్లే ఆ పార్టీ.. ప్రజల విశ్వాసాన్ని కోల్పోయింది. కాంగ్రెస్ తన రాజకీయాల కోసం భారత వ్యతిరేక భావజాలం ఉన్న వ్యక్తులతో జట్టు కట్టింది. చొరబాటుదారుల మద్దతుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం కోసం కాంగ్రెస్ ఎన్నో ఏళ్లు అస్సాంలో వారికి ఆశ్రయమిచ్చింది. ఆ పార్టీ హయాంలో పెద్దమొత్తంలో చొరబాటుదారులు రాష్ట్రంలోకి వచ్చారు. కాంగ్రెస్ పెంచి, పోషించిన అక్రమ వలసదారులు ప్రజల భూముల్ని ఆక్రమించుకుంటున్నారు. వారి సంస్కృతిపై దాడి చేస్తున్నారు. దీనివల్ల అస్సాం ప్రజల అస్తిత్వం ప్రమాదంలో పడింది. ప్రస్తుతం అధికారంలో ఉన్న భాజపా ప్రభుత్వం ఇలాంటివారిపై కఠిన చర్యలు తీసుకుంటోంది" అని మోదీ పేర్కొన్నారు.

మాపై విశ్వాసం మరింత బలపడింది

ఇటీవలి ఎన్నికల ఫలితాలను ప్రధాని ఉదహరిస్తూ, భాజపాపై ప్రజా విశ్వాసం మరింత బలపడిందని చెప్పారు. బిహార్‌లో 20 ఏళ్ల తర్వాత కూడా రికార్డు స్థాయి ఓట్లు, సీట్లు తమకే వచ్చాయని గుర్తుచేశారు. మహారాష్ట్ర మున్సిపల్ ఎన్నికల్లోనూ భాజపాకి ప్రజలు రికార్డు స్థాయి మద్దతు ఇచ్చారని తెలిపారు. కాంగ్రెస్ జన్మస్థలమైన ముంబయిలోనే ఆ పార్టీ నాలుగైదు స్థానాలకు పరిమితమైందని ఎద్దేవా చేశారు. రూ.6,957 కోట్లతో కాజీరంగా ఎలివేటెడ్ కారిడార్‌కు శంకుస్థాపన చేశామని, దీనివల్ల వరదల సమయంలో ఖడ్గమృగాలు, ఏనుగులు, పులుల వంటి వన్యప్రాణులకు సురక్షిత మార్గం అందుబాటులోకి వస్తుందని చెప్పారు. రెండు అమృత్ భారత్ రైళ్లకు వర్చువల్‌గా జెండా ఊపి ప్రారంభించారు.

అవినీతి, బంధుప్రీతి, బుజ్జగింపులు

ముఖ్యమంత్రి మమతాబెనర్జీ పాలనలో పశ్చిమబెంగాల్‌లో అవినీతి, బంధుప్రీతి, బుజ్జగింపు రాజకీయాలు రాజ్యమేలుతున్నాయని మోదీ ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను బెంగాల్ ప్రజలకు అందకుండా మమత ప్రభుత్వం అడ్డుకుంటోందని, సరిహద్దులో కంచె నిర్మాణానికి స్థలాన్ని కేటాయించడం లేదని చెప్పారు. బెంగాల్‌లో రూ.830 కోట్ల అభివృద్ధి పనుల్ని ఆయన ప్రారంభించారు. కోల్‌కతాలోని వేర్వేరు స్టేషన్ల నుంచి కొత్తదిల్లీ, వారణాసి, చెన్నైలకు వెళ్లే మూడు అమృత్ భారత్ రైళ్లను ప్రారంభించారు.

ల్యాండ్, శాండ్, వైన్, మైన్, గంజాయి, డ్రగ్స్.. మాఫియాలే వైకాపా క్రెడిట్



ఎన్టీఆర్ వర్ధంతి సభలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో గల్లా మాధవి, గద్దె అనురాధ, నన్నపనేని రాజకుమారి, శ్రీరామ్ తాతయ్య, వర్ల రామయ్య, దేవినేని ఉమా, ఆలపాటి రాజేంద్రప్రసాద్, పల్లా శ్రీనివాసరావు, అచ్చెన్నాయుడు, రామాంజనేయులు, కృష్ణప్రసాద్, రవీంద్రబాబు, ఎంఎస్ రాజు, వసంత కృష్ణప్రసాద్, కోటేశ్వరరావు తదితరులు

> ఉమ్మడి రాష్ట్రం, నవ్యాంధ్రల్లో సాగునీటి ప్రాజెక్టులకు ప్రాణం పోసింది తెదేపానే. ఈ ఏడాదే వెలుగొండ, ఉత్తరాంధ్రలోని సాగునీటి ప్రాజెక్టులను పూర్తిచేస్తాం. 2027 జూన్‌లో పోలవరం పూర్తి చేసి జాతికి అంకితం చేస్తాం. విశాఖ, తిరుపతి.. ఇలా అన్ని ప్రాంతాలనూ అభివృద్ధి చేస్తాం. రాష్ట్రానికి రాజధానిగా అమరావతి ఉంటుంది. - సీఎం చంద్రబాబు

(మొదటి పేజీ తరువాయి)

హననానికి పాల్పడితే ఎక్కడున్నా పట్టుకొచ్చి, శిక్షించి తీరుతామని వైకాపా నేతలను హెచ్చరించారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా ఆదివారం ఏర్పాటుచేసిన సభలో చంద్రబాబు ప్రసంగించారు. "ఈ 18 నెలలు వైకాపా వాళ్లు రకరకాల కుట్రలు పన్నారు. కాకినాడలో గ్రీన్ అమ్మోనియా ప్రాజెక్టుకు శంకుస్థాపన చేస్తే వారి ఘనతగా చెబుతున్నారు. భోగాపురం విమానాశ్రయం నిర్మాణానికి గత తెదేపా ప్రభుత్వంలోనే 2,500 ఎకరాలు సేకరించాం. ఎప్పుడో అయిపోవాల్సిన ప్రాజెక్టును ఐదేళ్లు మూలన పడేశారు. మొదటిసారి సివిల్ ఏవియేషన్ యూనివర్సిటీ ఏర్పాటుచేస్తుంటే.. దాన్నీ వారి ఘనతగా చెబుతున్నారు' అని చంద్రబాబు విరుచుకుపడ్డారు. క్రెడిట్ చోరీ అని వైకాపా నేతలు ఎంత గింజుకున్నా.. సైబరాబాద్, కియా, గూగుల్, భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం, గ్రీన్ ఎనర్జీ తదితర ప్రాజెక్టులు తెదేపా ప్రభుత్వమే తెచ్చిందని తేల్చిచెప్పారు. వైకాపా వాళ్ల కుట్రలు, కుతంత్రాల్ని తిప్పికొట్టడానికి నేతలు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.

ఆధునిక సాంకేతికతతో రెవెన్యూ రికార్డులు

"మన తాత, ముత్తాతలిచ్చిన భూముల పాసుపుస్తకాలపై ఆనాటి పాలకుడు తన ఫొటో వేసుకున్నారు. కొన్నింటిని 22ఏలో పెట్టి అవకతవకలకు పాల్పడ్డారు. ల్యాండ్ రికార్డులు అడ్డదిడ్డంగా మార్చారు. గతంలో గ్రామస్థాయిలో కరణాలు, మునసబులు రికార్డులు తారుమారు చేస్తుంటే, ఎన్టీఆర్ ఆ వ్యవస్థను రద్దుచేశారు. జగన్ తెచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను కూడా అదే స్ఫూర్తితో రద్దు చేశాం. పట్టాదారు పుస్తకాలను రాజముద్రతో ఇస్తున్నాం. రికార్డులు ట్యాంపరింగ్ చేయకుండా సాంకేతికత వినియోగిస్తున్నాం. ట్యాంపరింగ్ చేస్తే జైలుకు పోతారు" అని చంద్రబాబు హెచ్చరించారు.

మళ్లీ నేర రాజకీయాలు చేయాలని చూస్తున్నారు

"రాష్ట్రంలో కొందరు పొలిటికల్ రౌడీలు తయారయ్యారు. నేరస్థులు రాజకీయ పార్టీలు నడుపుతున్నారు. వైఎస్ వివేకానందరెడ్డిని చంపి రాజకీయం చేసినట్టు.. రాష్ట్రంలో నేరాలు చేయాలని చూస్తున్నారు. ప్రజలు ఒకసారే మోసపోతారు. ఇక్కడున్నది ఎన్డీయే ప్రభుత్వం. నడిపించేది సీబీఎన్. రాయలసీమలో ఫ్యాక్షన్‌ను అంతం చేసిన పార్టీ తెదేపా. పల్నాడును కూడా పూర్తిగా ప్రక్షాళన చేస్తాం. అక్కడ ఇటీవల ఓ గొడవ జరిగితే రాజకీయ రంగు పులిమి స్థానికుల్ని వైకాపా వాళ్లు రెచ్చగొడుతున్నారు. గిల్లికజ్జాలు పెట్టుకోవాలని చూస్తే మర్యాదగా ఉండదు" అని సీఎం హెచ్చరించారు.

కార్యకర్తల త్యాగాలతోనే పదవులు

"నాకు ఎన్ని పనులున్నా పార్టీని అశ్రద్ధ చేయను. కార్యకర్తలు చనిపోతే వారి కుటుంబాల్ని ఆదుకుంటున్నాం. గొంతుమీద కత్తి పెట్టి 'జై జగన్' అంటే వదిలేస్తామని చెప్పినా జై టీడీపీ, జై సీబీఎన్ అని నినదించిన కార్యకర్తలు తెదేపా సొంతం. అలాంటి కార్యకర్తలు, వారి త్యాగాలు, కష్టార్జితమే నేను సీఎం కావడానికి కారణాలు" అని చంద్రబాబు తెలిపారు.

వచ్చే నెలలో అసెంబ్లీ సమావేశాలు

- జగన్, వైకాపా ఎమ్మెల్యేలు వస్తారని భావిస్తున్నాం
- ఉపసభాపతి రఘురామకృష్ణరాజు

ఈనాడు, విశాఖపట్నం: వచ్చేనెల రెండో లేదా మూడో వారంలో అసెంబ్లీ సమావేశాలు ఉంటాయని శాసనసభ ఉపసభాపతి రఘురామకృష్ణరాజు తెలిపారు. ఆదివారం విశాఖలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అసెంబ్లీ సమావేశాలకు వైకాపా అధినేత జగన్, ఆ పార్టీ పది మంది ఎమ్మెల్యేలు వస్తారని భావిస్తున్నట్లు పేర్కొన్నారు. శాసనమండలిలో ఒకరకం, శాసనసభలో మరో రకమైన వాతావరణం ఉందన్నారు. అసెంబ్లీకి రాకుండా వేతనాలు తీసుకుంటున్న అంశాన్ని నైతిక విలువల కమిటీ పరిశీలిస్తోందన్నారు. వరుసగా 60 రోజుల పని దినాల్లో సభకు హాజరుకాకపోతే అనర్హత వేటు పడుతుందని వివరించారు. మధ్యలో ఒక రోజు వచ్చి వెళ్లిపోతే ఏమీ చేయలేమన్నారు. ఉపసభాపతిగా ఉంటూ తానెప్పుడూ రాజకీయాలు మాట్లాడలేదన్నారు. తాను పార్టీకి రాజీనామా చేయలేదని కొందరు రాష్ట్రపతి, గవర్నర్‌కు లేఖలు రాశారని, నిబంధనల ప్రకారం రాజీనామా చేయాల్సిన అవసరం లేదనే విషయం వారికి తెలియక పోవచ్చని రఘురామ వ్యాఖ్యానించారు.

372 ప్రైవేటు బస్సులపై కేసులు

ఈనాడు, అమరావతి: సంక్రాంతి పండగ వేళ రద్దీని ఆసరాగా చేసుకుని అధిక ఛార్జీలు వసూలు చేస్తున్న ప్రైవేటు బస్సులపై రవాణాశాఖ చర్యలు చేపట్టింది. ఈ నెల 9 నుంచి 17 వరకు నిర్వహించిన తనిఖీల్లో పలు అతిక్రమణలను గుర్తించి కేసులు నమోదు చేసినట్లు రవాణాశాఖ కమిషనర్ మనీష్‌కుమార్ సిన్హా పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా తనిఖీల్లో 372 బస్సుల్లో ఎక్కువ ఛార్జీలు వసూలు చేస్తున్నట్లు గుర్తించి కేసులు నమోదు చేసి, రూ.37.31 లక్షల జరిమానా విధించారు.

కేంద్రం, రాష్ట్రం జత.. అభివృద్ధి జాత!

(మొదటి పేజీ తరువాయి)

పక్కదారి పట్టించిన నేపథ్యంలో కొత్త విధానాలు అమలు చేశారు. ఇందులో సింగిల్ నోడల్ ఏజెన్సీ (ఎస్ఎన్ఏ) తరహా చెల్లింపులు, స్పర్శ్- (సింగిల్ నోడల్ ఖాతా) చెల్లింపులు.

◆ సింగిల్ నోడల్ ఏజెన్సీ ద్వారా అమలయ్యే కేంద్ర పథకాల్లో కేంద్రం ఇచ్చే నిధులు రాష్ట్ర ఖజానాకు చేరతాయి. బిల్లులు సమర్పించిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం ఆ నిధులను నోడల్ ఏజెన్సీలకు విడుదల చేస్తుంది. ◆ ఈ విధానం సరిగా లేదని కొత్తగా స్పర్శ్ మార్గదర్శకాలను కేంద్రం తెచ్చింది. ఇందులో ఉన్న కేంద్ర పథకాలకు రాష్ట్రం సింగిల్ నోడల్ ఖాతా ఏర్పాటు చేయాలి. కేంద్ర వాటా నిధులు, రాష్ట్ర వాటా నిధులు ఆ ఖాతాకే విడుదల చేయాలి.

ఎన్నో ప్రయోజనాలు..

◆ పిల్లలకు, గర్భిణులకు, బాలింతలకు పోషకాహారం అందించేందుకు ఉద్దేశించిన పోషణ 2.0 పథకంలో స్పర్శ్ కింద ఈ ఆర్థిక సంవత్సరం రూ.1,007 కోట్లు కేంద్రం కేటాయించింది. 21 లక్షల మందికి పైగా ప్రయోజనం దక్కుతోంది. ◆ సమగ్ర శిక్షా అభియాన్ కింద ఎన్డీయే ప్రభుత్వం రాగానే పాత బిల్లులు చెల్లించడంతో కేంద్రం గత ఆర్థిక సంవత్సరం మరో రూ.1,240.10 కోట్లు ఇచ్చింది. రాష్ట్ర వాటా కలిపి 1,893.50 కోట్లు వెచ్చించడంతో 35 లక్షల మంది విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు కల్పించే ప్రక్రియ ఊపందుకుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మొత్తం రూ.1,854 కోట్లు సింగిల్ నోడల్ ఖాతాలో ఖర్చు చేసేందుకు అందుబాటులో ఉంచగా ఇంతవరకు రూ.1,446 కోట్లు ఖర్చు చేశారు. ఈ పథకం కింద లక్షల మంది విద్యార్థులకు పాఠశాలల్లో వసతులు మెరుగవుతున్నాయి.

◆ ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన కింద పల్లెల్లో రహదారుల నిర్మాణానికి రూ.550 కోట్లు కేటాయించారు. పనులు ఇంకా ఊపందుకోవాల్సి ఉంది.

◆ ప్రధాన మంత్రి కృషి సించాయి యోజన కింద రూ.111 కోట్లు మంజూరయ్యాయి. ఇప్పటివరకు రూ.62 కోట్లు ఖర్చు చేశారు. ◆ ఉపాధి హామీ పథకం కింద రూ.1,838 కోట్లు ఖర్చు చేశారు. ◆ జాతీయ ఆరోగ్య మిషన్‌లో గర్భిణులు, నవజాత శిశువులు, పిల్లల ఆరోగ్యం కోసం అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాలకు సంబంధించి రూ.1,001 కోట్లు మంజూరయ్యాయి. ఇంతవరకు రూ.187 కోట్లు ఖర్చు చేశారు.

ఈ ఆర్థిక సంవత్సరంలో ఎన్ని నిధులు అందుబాటులో ఉన్నాయంటే...

(అంకెలు రూ.కోట్లలో)

1.4.2025 నాటికి సింగిల్ నోడల్ ఏజెన్సీల వద్ద నిల్వ ఉన్న నిధులు:	1,883
అనంతర కాలంలో సింగిల్ నోడల్ ఏజెన్సీల విధానంలో ఇచ్చిన నిధులు:	8,543
స్పర్శ్ విధానంలో అందుబాటులో ఉంచిన నిధులు:	8,614
మొత్తం:	19,040
స్పర్శ్ కింద ఖర్చు చేసినవి:	4,447
సింగిల్ నోడల్ ఏజెన్సీ విభాగంలో ఖర్చు:	8,174
ఇంతవరకు ఖర్చు చేసిన మొత్తం:	12,621

❖ గత నెల 17వ తేదీ నాటికి రాష్ట్రంలో రూ.10,362 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. నిధులు అందుబాటులో ఉన్నా సరైన పర్యవేక్షణ లేదంటూ ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేయడంతో నెల గడవక ముందే రూ.2,000 కోట్లకు పైగా వెచ్చించారు. కేంద్రం నుంచి మూడో విడత నిధులు తీసుకునేందుకు అడుగులు వేస్తున్నారు.



ఈ ఏడాది మీకు ఎలా గుర్తుండాలనుకుంటున్నారు?

చాలా మంది జీవితంలో విఫలమవడానికి కారణం సాధించాలన్న కోరిక లేకపోవడం కాదు, ఏం చేయాలన్నది నిర్ణయించుకోకపోవడం వల్ల. ఈ ఏడాది మీకు ఎలా గుర్తుండిపోవాలన్నది ముందుగా నిర్ణయించుకోండి. ఆ దిశగా కృషి చేయడం మొదలుపెట్టండి. లేకపోతే ప్రతి ఏడాదిలాగే ఈ సంవత్సరం కూడా నిరర్థకంగా గడిచిపోతుంది.
- టోనీ రాబిన్స్, మోటివేషనల్ స్పీకర్

అమెరికా ముందు మోకరిల్లిన మోదీ

(మొదటి పేజీ తరువాయి)

భాజపా పాత్ర లేదు. అప్పటి బ్రిటీష్ పాలకులతో ఆరెస్సెస్ చేతులు కలిపింది' అంటూ డి.రాజా విమర్శలు గుప్పించారు. ఆరెస్సెస్ దేశ స్వాతంత్ర్య పోరాటంలో ఎలాంటి పాత్ర నిర్వహించిందో చెప్పాలని సవాల్ విసిరారు. 'అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో హిట్లర్‌లా మారారు. నియంతలా వ్యవహరిస్తూ ప్రపంచంలోని అన్ని దేశాల్ని బెదిరిస్తున్నారు. రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు చేయవద్దని ఆంక్షలు పెడుతున్నారు. ప్రధాని మోదీ అమెరికా ఒత్తిడికి తలొగ్గారు. ఆయన ప్రధాని అయ్యాక అంతర్జాతీయంగా దేశ గౌరవం తగ్గుతోంది. మోదీ వెంటనే పదవి నుంచి దిగి పోవాలి' అని డిమాండ్ చేశారు.

తెలుగులో ప్రసంగం

డి.రాజా తెలుగులో ప్రసంగం ప్రారంభించారు. పాలస్తీనాలో వేలమంది మహిళలు, పిల్లల్ని ఊచకోత కోస్తున్నారు. ఇజ్రాయెల్, అమెరికా కలిసి పాలస్తీనాలో మారణహోమం సృష్టిస్తున్నాయి అని మండిపడ్డారు. మేం కేవలం కమ్యూనిస్టులమే కాదు.. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడాం. మేం జాతీయ వాదులం.. అంతర్జాతీయవాదులం అని వ్యాఖ్యానించారు.

ఎర్రజెండా.. ఖమ్మం గుండె నిండా

- సీపీఐ శతాబ్ది ముగింపు వేడుకల బహిరంగ సభతో సమరోత్సాహం
- విదేశాల నుంచీ ప్రతినిధుల రాక



ఖమ్మం సభకు హాజరైన కార్యకర్తలు, అభిమానులు

ఈనాడు డిజిటల్- ఖమ్మం: ఖమ్మం నగరంలో ఎర్రదండు కదం తొక్కింది. సీపీఐ శతాబ్ది ముగింపు వేడుకల బహిరంగసభ ఆ పార్టీ శ్రేణుల్లో సమరోత్సాహం నింపింది. వివిధ జిల్లాలు, రాష్ట్రాలు, దేశాల నుంచి తరలి వచ్చిన నాయకులు, కార్యకర్తలతో ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ కళాశాలలోని బహిరంగసభ ప్రాంగణం ఆదివారం ఎరుపెక్కింది. అంతకుముందు మూడు కూడళ్ల నుంచి సీపీఐ శ్రేణులు భారీ ర్యాలీలు నిర్వహిస్తూ సభాస్థలికి చేరుకున్నాయి. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అధ్యక్షతన జరిగిన సభలో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, ముఖ్యనేతలు అమర్‌జిత్‌కౌర్, కె.నారాయణ తదితరుల ప్రసంగాలు ఆకట్టుకున్నాయి. సభకు విదేశాల నుంచి సైతం ప్రతినిధులు హాజరయ్యారు. క్యూబా, పాలస్తీనా, వియత్నాం కమ్యూనిస్టు పార్టీల ప్రతినిధులు జువాన్ కార్లోస్ అగిలెరా, అబ్దుల్లా అబుషా, హోంగ్‌ట్రాన్, ఉత్తర కొరియా ప్రతినిధి జాంగ్ జోంగ్ హ్వాన్, నేపాల్ ప్రతినిధి ఉదయరాజ్ పాండే తదితరులు పాల్గొన్నారు.

మతతత్వ భాజపాపై పోరాటానికి దండు కడదాం

తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి



సభలో మాట్లాడుతున్న తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి

ప్రజాస్వామ్యాన్ని బతికించుకోవాలని కోరుకునే ప్రతీఒక్కరూ దండు కట్టి మోదీ ప్రభుత్వంపై పోరాటం ప్రకటించాలని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. వారిపై కాంగ్రెస్ చేస్తున్న పోరాటానికి కలిసి రావాలని కమ్యూనిస్టులకు సూచించారు. కాంగ్రెస్ అయినా, కమ్యూనిస్ట్ అయినా, ఇంకెవరైనా సరే అప్రమత్తంగా ఉండాల్సిన అవసరమొచ్చిందన్నారు. అంతా కలిసి మోదీని గద్దె దింపుదామని.. రాహుల్‌గాంధీని ప్రధానిని చేద్దామన్నారు.

గ్రహం అనుగ్రహం

19-1-2026 సోమవారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; ఉత్తరాయణం; శిశిర రుతువు, మాఘమాసం, శుక్లపక్షం
పాడ్యమి: రా. 2-08 తదుపరి విదియ
ఉత్తరాషాఢ: మ. 12-19 తదుపరి శ్రవణ
వర్జ్యం: సా. 4-30 నుంచి 6-11 వరకు
అమృత ఘడియలు: ఉ. 7-10 వరకు తిరిగి తె. 2-34 నుంచి 4-14 వరకు
దుర్ముహూర్తం: మ. 12-33 నుంచి 1-18 వరకు తిరిగి 2-46 నుంచి 3-31 వరకు
రాహుకాలం: ఉ. 7-30 నుంచి 9-00 వరకు
సూర్యోదయం: ఉ.6.39; సూర్యాస్తమయం: సా.5.44
శ్యామలా నవరాత్రి ఆరంభం

చలి పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
ఆదిలాబాద్	9.7	34.3
విజయనగరం	14.0	29.0
విశాఖపట్నం	14.8	28.0
శ్రీకాకుళం	15.0	28.0
కర్నూలు	16.7	34.2
విజయవాడ	16.9	30.6
కడప	17.0	32.0
అనంతపురం	17.6	34.4
తాడేపల్లిగూడెం	18.0	31.0
గుంటూరు	19.0	31.0
నరసాపురం	20.0	29.6
ఒంగోలు	20.0	30.9
రాజమహేంద్రవరం	20.0	34.0
నెల్లూరు	20.6	31.0

భక్తితో విరాళం..

మల్లన్నకు సేవాభాగ్యం

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: శ్రీశైల మహాక్షేత్రంలో శ్రీభ్రమరాంబా మల్లికార్జునస్వామివార్లకు విరాళాలు అందించే దాతలకు సాధారణ రోజుల్లో ప్రత్యేక సదుపాయాలు కల్పించేలా దేవస్థానం శ్రీకారం చుట్టింది. ఈ మేరకు విరాళాల స్వీకరణ విధానాల్లో సమూల మార్పులు తీసుకొచ్చింది. తితిదే తరహాలో దర్శన భాగ్యం నుంచి బహుమతుల వరకు అందిస్తోంది. దీంతో మల్లికార్జునస్వామి స్పర్శ దర్శనం చేసుకొనేందుకు భక్తులు అమితాసక్తి చూపుతున్నారు.



ప్రత్యేక అలంకరణలో భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి

రూ.50 వేలు ..

- రూ.50 వేలు విరాళంగా ఇస్తే.. ఇచ్చిన రోజున వీఐపీ క్యూలైన్ ద్వారా దాతతోపాటు ఐదుగురికి శ్రీమల్లికార్జునస్వామి ఉచిత స్పర్శ దర్శనం కల్పిస్తారు. తదుపరి సంవత్సరం నుంచి ఐదేళ్ల వరకు సంవత్సరంలో ఒక్కరోజు మాత్రమే (రద్దీని దృష్టిలో ఉంచుకొని) దాతతో పాటు ఐదుగురికి స్వామివారి ఉచిత స్పర్శ దర్శనం కల్పిస్తారు.
- విరాళం ఇచ్చిన రోజున దాతకు జూట్‌బ్యాగ్ కిట్‌లో కుంకుమ, విభూతి, అక్షతలు, 250 గ్రాముల లడ్డూలు రెండు, శ్రీశైలప్రభ మాసపత్రిక ఇస్తారు.

రూ.లక్ష

- రూ.లక్ష విరాళం సమర్పిస్తే.. ఇచ్చిన రోజున దాతతోపాటు ఐదుగురికి ఉచిత స్పర్శ దర్శనం కల్పిస్తారు. తదుపరి సంవత్సరం నుంచి ఐదేళ్లపాటు ఏడాదిలో రెండు సార్లు ఉచిత స్పర్శ దర్శనానికి అనుమతిస్తారు.
- దాతకు 250 గ్రాముల లడ్డూలు రెండు, 100 గ్రాముల లడ్డూలు రెండు, దేవస్థానం కండువా, జాకెట్‌ముక్క, కుంకుమ, విభూతి, అక్షతలు, శ్రీశైలప్రభ మాసపత్రిక అందజేస్తారు.

రూ.5 లక్షలు

- రూ.5 లక్షల విరాళం అందజేస్తే.. విరాళమిచ్చిన రోజున గర్భాలయంలో శ్రీమల్లికార్జునస్వామికి గోత్రనామాలతో అభిషేకం నిర్వహిస్తారు. తదుపరి సంవత్సరం నుంచి ఐదేళ్లపాటు ఏడాదిలో 10 రోజులు.. ఐదుగురికి వీఐపీ క్యూలైన్ ద్వారా స్వామివారి ఉచిత స్పర్శ దర్శనం కల్పిస్తారు. దాతలకు రుసుములపై ఆన్‌లైన్ టికెట్లు ఏర్పాటు చేయడం లేదా ప్రత్యేక ఏర్పాట్లకు ప్రాధాన్యమిస్తారు.
- 250 గ్రాముల లడ్డూలు ఐదు, 100 గ్రాముల లడ్డూలు ఐదు, దేవస్థానం కండువా, జాకెట్‌ముక్క, కుంకుమ, విభూతి, అక్షతలు, కైలాస కంకణాల డబ్బా ఒకటి, స్వామి, అమ్మవార్ల ఫొటో(చిన్నది), శ్రీశైలప్రభ మాసపత్రిక ఉన్న జూట్ బ్యాగ్ కిట్ అందిస్తారు.

రూ.10 లక్షలు..

- విరాళం చెల్లించిన రోజున దాతతోపాటు ఐదుగురికి గర్భాలయంలో అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, వేదాశీర్వచనం చేస్తారు. తదుపరి సంవత్సరం నుంచి ఐదేళ్లపాటు సంవత్సరంలో 10 రోజులు (రద్దీని దృష్టిలో ఉంచుకొని) వీఐపీ క్యూలైన్ ద్వారా దాతతోపాటు ఐదుగురికి ఉచిత స్పర్శ దర్శనం చేయిస్తారు. గణేశ్ సదన్‌లో ఉచిత వసతి కల్పిస్తారు. రుసుములపై ఆన్‌లైన్ టికెట్ల ఏర్పాట్లు లేదా ప్రత్యేక ఏర్పాట్లకు ప్రాధాన్యమిస్తారు.
- 250 గ్రాముల లడ్డూలు ఐదు, 100 గ్రాముల లడ్డూలు ఐదు, దేవస్థానం కండువా, జాకెట్ ముక్క, కుంకుమ, విభూతి, కైలాస కంకణాల డబ్బా ఒకటి, స్వామి, అమ్మవార్ల ఫొటో(చిన్నది), శ్రీశైలప్రభ మాస పత్రికతో ఉన్న జూట్ బ్యాగ్ కిట్ అందజేస్తారు.

మరిన్ని సదుపాయాలు: బంగారు, వెండి విరాళాల ఖరీదును బట్టి దాతలకు ఉచిత స్పర్శ దర్శనం, అభిషేకం, ప్రసాదాలు ఇచ్చి శేషవస్త్రాలతో సత్కరిస్తారు. || రూ.లక్ష.. ఆపై విరాళంగా నగదు, ఆభరణాలు, వస్తువులు, కట్టడాల రూపంలో విరాళాలిచ్చే దాతలకు డోనర్ గుర్తింపు కార్డు ఇస్తారు.

లక్ష మంది క్వాంటమ్ నిపుణుల తయారీయే లక్ష్యం: సీఎం

ఈనాడు, అమరావతి: అడ్వాన్స్‌డ్ క్వాంటమ్ స్కిల్లింగ్ కోర్సు నేర్చుకునేందుకు ఇప్పటివరకు 50 వేల మంది నమోదు చేసుకోవడంపై సీఎం చంద్రబాబు 'ఎక్స్' వేదికగా ఆదివారం హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో లక్ష మంది క్వాంటమ్ నిపుణులను తయారు చేసేలా సంకల్పించామని పేర్కొన్నారు. 'కోర్సుకు అనూహ్య స్పందన వస్తోంది. ఐబీఎం, మద్రాస్ ఐఐటీ పరిశోధన కేంద్రం ఆధ్వర్యంలో పనిచేస్తున్న ఎన్‌పీటీఈఎల్ సంయుక్తంగా నిర్వహిస్తున్న అడ్వాన్స్‌డ్ క్వాంటమ్ స్కిల్లింగ్ కోర్సు నేర్చుకునేందుకు ఇంత పెద్ద సంఖ్యలో నమోదు కావడం ఆనందాన్నిస్తోంది. క్వాంటమ్ రంగంలో దీర్ఘకాలిక పెట్టుబడులు, ఆవిష్కరణలు, పరిశోధనలకు ఏపీని గమ్యస్థానంగా ఇది మారుస్తుంది. స్కిల్లింగ్ కోర్సులో బంగారు, వెండిపతకాలు సాధించే నిపుణులను సత్కరించేందుకు ఎదురు చూస్తున్నాను. క్వాంటమ్ రంగంలో భవిష్యత్తులో వారే గ్లోబల్ లీడర్లుగా ఎదిగేందుకు ఆస్కారం ఉంది' అని సీఎం చంద్రబాబు ఆకాంక్షించారు.

కేంద్ర హోంమంత్రితో సీఎం రమేశ్ భేటీ



దిల్లీలో కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో భేటీ అయిన అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్

ఈనాడు, దిల్లీ: కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ ఆదివారం రాత్రి దిల్లీలో భేటీ అయ్యారు. దావోస్‌లో జరిగే ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సుకు బయలుదేరుతున్న సమయంలో సీఎం రమేశ్ మర్యాదపూర్వకంగా హోంమంత్రిని కలిశారు. ఆంధ్రప్రదేశ్‌లోని రాజకీయ పరిస్థితులు, రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. పోలవరం, అమరావతి ప్రాజెక్టుల నిర్మాణం, విశాఖపట్నం, అనకాపల్లి నియోజకవర్గాలకు పెద్దఎత్తున వస్తున్న పెట్టుబడుల గురించి అమిత్ షాకు వివరించారు. రాబోయే బడ్జెట్‌లో రాష్ట్రానికి ప్రాధాన్యమివ్వాలని కోరారు.

పవన్‌కల్యాణ్ చెప్పారనే ఆంధ్రాలో చిత్రీకరణ

నవీన్ పొలిశెట్టి



ప్రేక్షకులతో ముచ్చటిస్తున్న నవీన్ పొలిశెట్టి, మీనాక్షి చౌదరి

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్‌లోనూ సినిమాల చిత్రీకరణ జరగాలని ఓ కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చెప్పిన మాటలు తన మనసును హత్తుకున్నాయని సినీనటుడు నవీన్ పొలిశెట్టి పేర్కొన్నారు. అందుకే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఎక్కువ భాగం షూటింగ్ చేశామన్నారు. 'అనగనగా ఒక రాజు' చిత్రబృందం ఆదివారం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి వచ్చింది. నగరంలోని అప్సరా థియేటర్‌లో చిత్ర ప్రదర్శన జరుగుతున్న సమయంలో నటుడు నవీన్ పొలిశెట్టి, నటి మీనాక్షి చౌదరి వచ్చి.. ప్రేక్షకులతో తమ ఆనందాన్ని పంచుకున్నారు. నవీన్ మాట్లాడుతూ ఎక్కడ షూటింగ్ జరిగినా అధికారులు సులువుగా అనుమతులు ఇచ్చేవారని, ఎంతో సహకరించారని తెలిపారు. స్థానికులు సైతం ఉత్సాహపరిచేవారన్నారు. సినిమాను విజయవంతం చేసినందుకు మీనాక్షి చౌదరి ప్రేక్షకులకు ధన్యవాదాలు తెలిపారు.

ఎన్టీఆర్‌కు భారతరత్న సాధిస్తాం

ఇది తెలుగువారి చిరకాల ఆకాంక్ష ● ఎన్టీఆర్ వర్ధంతి సభలో సీఎం చంద్రబాబు

ఈనాడు, అమరావతి: తెదేపా వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావుకు భారతరత్న తప్పకుండా సాధిస్తామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. దీనికోసం అన్ని విధాలుగా ప్రయత్నిస్తామని తెలిపారు. ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వడం తెలుగు జాతికి గౌరవమని, ఇది తెలుగువారి చిరకాల ఆకాంక్ష అని పేర్కొన్నారు. ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా ఆదివారం మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో ఆయన విగ్రహానికి పూలదండ వేసి నివాళి అర్పించారు. ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మెగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. పలువురు రక్తదాతలకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. అనంతరం సభలో చంద్రబాబు ప్రసంగించారు. "దేశంలో నీతి, నిజాయతీతో రాజకీయాలు చేసిన వ్యక్తి ఎన్టీఆర్. తెలుగుజాతి కోసం ఆయన నిరంతరం శ్రమించారు. సుపరిపాలనకు అర్థం చెప్పారు. రెండు రూపాయలకు కిలో బియ్యం ఇచ్చి ఆహార భద్రతకు నాంది పలికారు. పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగంతో తెలుగు రాష్ట్రం ఏర్పడినా.. మనల్ని మదరాసీలని ఉత్తరాదివారు పిలుస్తుంటే.. తెలుగుజాతి ఒకటుందని ప్రపంచానికి చాటిన వ్యక్తి ఎన్టీఆర్. బడుగు బలహీనవర్గాలు, విద్యావంతులకు టికెట్లు ఇచ్చి రాజకీయాల్లో అవకాశాలు కల్పించారు. తితిదేలో నిత్యాన్నదాన పథకాన్ని ప్రవేశపెట్టారు. ఈ రోజుకూ లక్షమందికి నిత్యం అన్నదానం జరుగుతోంది" అని చంద్రబాబు వివరించారు. ఎన్టీఆర్ స్ఫూర్తితో ప్రతి నియోజకవర్గంలోనూ అన్నక్యాంటీన్లు ఏర్పాటు చేసి పేదవారి ఆకలి తీరుస్తామని తెలిపారు. తెదేపా ఆవిర్భావానికి ముందు ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న పరిస్థితులు, ఎన్టీఆర్ పార్టీ ఏర్పాటు చేయడం, అధికారంలోకి తీసుకురావడం తదితర అంశాలతో రూపొందించిన వీడియోను ప్రదర్శించారు. అనంతరం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.


పేదల ఆకలి తీర్చారు

"అప్పట్లో రెండు రూపాయలకే కిలో బియ్యం అందించి ఎన్టీఆర్ పేదల ఆకలి తీర్చారు. మహిళలకు ఆస్తిహక్కు కల్పించి సామాజిక విప్లవానికి నాంది పలికారు. బడుగు, బలహీనవర్గాలకు చట్టసభల్లో ప్రాతినిధ్యం కల్పించారు. ఎన్టీఆర్ ఆశయాల్ని చంద్రబాబు పుణికిపుచ్చుకున్నారు" అని తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు కొనియాడారు.

■ "తెలుగు జాతి ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు ఎన్టీఆర్ చేసిన కృషి నేటికీ కొనసాగుతోంది. ఎన్నో సాగునీటి ప్రాజెక్టులకు ఆయన పేర్లు పెట్టారు. సంక్షేమానికి పెద్దపీట వేశారు" అని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ తెలిపారు. తరాలు మారినా ఎన్టీఆర్ కీర్తి పదిలంగా ఉంటుందని.. ఆయన స్ఫూర్తిని చంద్రబాబు, లోకేశ్ అందిపుచ్చుకున్నారని మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అన్నారు. ఎన్టీఆర్ తెచ్చిన పాలనా సంస్కరణలు తెలుగు రాష్ట్రాలకు ఇప్పటికీ తలమానికంగా ఉన్నాయని మాజీ మంత్రి దేవినేని ఉమా మహేశ్వరరావు తెలిపారు. "నాలాంటి ఎందరికో తెదేపా రాజకీయ జీవితం ఇచ్చింది. వాలంటీర్‌గా ఉన్న నేను ఇప్పుడు ఎమ్మెల్యేగా ఎదిగానంటే అది పార్టీ గొప్పతనం" అని పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. ఎన్టీఆర్ మరణం లేదని, ఆయన ప్రజల హృదయాల్లో శాశ్వతంగా ఉంటారని గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ గొనుగుంట్ల కోటేశ్వరరావు పేర్కొన్నారు.



ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో మంత్రులు పయ్యావుల కేశవ్, అచ్చెన్నాయుడు, అనగాని సత్యప్రసాద్, తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, నాయకులు



రక్తదానం చేసిన కార్యకర్తకు ధ్రువపత్రం అందజేస్తున్న చంద్రబాబు

తెలుగు జాతి ఆత్మగౌరవ పతాక ఎన్టీఆర్

మంత్రి నారా లోకేశ్

ఈనాడు, అమరావతి: విశ్వవిఖ్యాత నట సార్వభౌముడు, మహా నాయకుడు ఎన్టీఆర్ తెలుగు జాతి ఆత్మగౌరవ పతాక అని మంత్రి నారా లోకేశ్ కొనియాడారు. ఆయన పోషించిన పౌరాణిక పాత్రల ఫొటోలను ఇళ్లలో పెట్టుకొని ప్రజలు దేవుడిగా పూజిస్తుంటారని ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా ఆయన 'ఎక్స్' వేదికగా ఆదివారం పోస్టు చేశారు. 'భౌతికంగా దూరమై ఇన్నేళ్లయినా తెలుగు వారి హృదయాల్లో సజీవంగా ఉన్న తాతయ్యా.. మీ జన్మ ధన్యమయ్యా' అని కొనియాడారు.



హైదరాబాద్‌లో ఎన్టీఆర్ ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న లోకేశ్, తెదేపా నేతలు అరవింద్ గౌడ్, బక్కని నర్సింలు ★ భువనేశ్వరి

రాజకీయాలను ఎన్టీఆర్ అందరికీ చేరువ చేశారు: బాలకృష్ణ



మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేస్తున్న బాలకృష్ణ. చిత్రంలో సుహాసిని

హైదరాబాద్, న్యూస్‌టుడే: కొందరికే పరిమితమైన రాజకీయాలను.. తెదేపా స్థాపనతో అన్ని వర్గాలకు చేరువ చేసిన మహనీయుడు ఎన్టీఆర్ అని ఆయన తనయుడు నందమూరి బాలకృష్ణ అన్నారు. ఆదివారం ఎన్టీఆర్ 30వ వర్ధంతి సందర్భంగా ఎన్టీఆర్ ఘాట్‌లోని సమాధి వద్ద ఆయన కుటుంబసభ్యులు నివాళులర్పించారు. బాలకృష్ణ, రామకృష్ణ, నారా భువనేశ్వరి, ఏపీ మంత్రి నారా లోకేశ్, దగ్గుబాటి పురందేశ్వరి, ఆమె తనయుడు హితేశ్, కల్యాణ్‌రామ్, సుహాసిని, మాజీ మంత్రులు పెద్దిరెడ్డి, మోత్కుపల్లి నర్సింహులు, బాబు మోహన్ తదితరులు వేర్వేరుగా హాజరై ఎన్టీఆర్ ఘాట్ వద్ద పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ.. అకుంఠిత దీక్షతోనే ఎన్టీఆర్ గొప్ప స్థాయికి ఎదిగారన్నారు. నివాళులు అర్పించిన వారిలో తెదేపా నేతలు కంభంపాటి రామ్మోహన్‌రావు, అరవింద్‌కుమార్ గౌడ్, తీగల కృష్ణారెడ్డి, బక్కని నర్సింలు తదితరులు ఉన్నారు. అనంతరం ఎన్టీఆర్ ఘాట్ వద్ద చేతన ఫౌండేషన్, వికలాంగుల హక్కుల వేదిక సహకారంతో 16 మంది పేద మహిళలకు కుట్టు మిషన్లు, మరో 10 మంది దివ్యాంగులకు వీల్ ఛైర్లు పంపిణీ చేశారు.

దావోస్ పర్యటనకు వెళ్లిన సీఎం చంద్రబాబు

● వెంట మంత్రులు లోకేశ్, టీజీ భరత్, అధికారుల బృందం

ఈనాడు, అమరావతి: ప్రపంచ ఆర్థిక సదస్సులో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులు లోకేశ్, టీజీ భరత్, అధికారుల బృందం గన్నవరం విమానాశ్రయం నుంచి ఆదివారం రాత్రి దిల్లీ వెళ్లింది. రాత్రి 1.45 గంటలకు దిల్లీ నుంచి బయల్దేరి భారత కాలమానం ప్రకారం సోమవారం ఉదయం 11 గంటలకు జ్యూరిక్ చేరుకుంటారు. మధ్యాహ్నం 2.30కి జ్యూరిక్‌లోని స్విట్జర్లాండ్ భారతీయ రాయబారి మృదుల్‌కుమార్.. సీఎం చంద్రబాబుతో మర్యాదపూర్వకంగా భేటీ అవుతారు. అనంతరం సీఎంతో ఎరోస్ ఇన్నోవేషన్ వ్యవస్థాపక ఛైర్మన్ కిశోర్ లుల్లా, సహాధ్యక్షులు రిధిమా లుల్లా, స్వనీ తొసింగ్ సమావేశమవుతారు. సాయంత్రం 4 గంటలకు భారత ఎంబసీ ఆధ్వర్యంలో జ్యూరిక్‌లో నిర్వహించే తెలుగు డయాస్పోరా సమావేశంలో సీఎం పాల్గొని తెలుగువారిని ఉద్దేశించి ప్రసంగిస్తారు. అనంతరం జ్యూరిక్ నుంచి రోడ్డుమార్గంలో దావోస్‌కు వెళ్తారు. దావోస్‌లో తొలిరోజు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ఆర్థిక, పర్యాటక విభాగాల మంత్రి అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మర్రితో పాటు వివిధ దేశాల ప్రతినిధులతో జరిగే సమావేశంలో సీఎం పాల్గొంటారు. అనంతరం టాటా సన్స్ ఛైర్మన్ ఎన్.చంద్రశేఖరన్‌తో భేటీ అవుతారు.




ప్రపంచ ఆర్థిక సదస్సులో పాల్గొనేందుకు స్విట్జర్లాండ్‌లోని జ్యూరిక్‌కు చేరుకున్న కేంద్ర మంత్రులు ప్రహ్లాద్ జోషి, రామ్మోహన్ నాయుడు, మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్

కోటరీల్లో బందీలైన నేతలారా ఆలోచించుకోండి..

వెనెజువెలాలో ఏం జరిగిందో?

'ఎక్స్'లో మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి



ఈనాడు, అమరావతి: అమ్ముడు పోయిన 'కోటరీల' మధ్య 'బందీలుగా' ఉన్న ఓ ప్రజా నాయకులారా ఆలోచించుకోండి అంటూ ఆదివారం 'ఎక్స్' వేదికగా మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి చేసిన వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. 'భవిష్యత్తులో ఇక్కడ మీకూ ఏం జరగబోతోందో ఇప్పటికైనా గుర్తించండి' అని పేర్కొన్నారు. ఆయన వైకాపాలో ఉన్నప్పుడు, రాజీనామా చేసి బయటకు వచ్చాక ఆ పార్టీలో కోటరీలపైనే వ్యాఖ్యలు చేస్తున్నారు. తాజా వ్యాఖ్యలు కూడా జగన్‌ను ఉద్దేశించి చేసినవే అనే చర్చ జరుగుతోంది. 'వెనెజువెలాలో ఎంతో భారీ ప్రజాదరణతో ఎన్నికైన తర్వాత.. ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్ ఇంటెలిజెన్స్ అధిపతులు చుట్టూ ఉన్నా.. మిస్సైళ్లు, యుద్ధ విమానాలు, భారీ సైన్యం ఉన్నా.. ఆ దేశ అధ్యక్షుడు, ఆయన భార్యను ప్రెసిడెన్షియల్ ప్యాలెస్ నుంచి ఎలాంటి ప్రతిఘటనా లేకుండా అమెరికా ఎత్తుకు పోగలిగిందంటే కారణం ఏంటి? వారంతా అమ్ముడు పోవడమే కదా?' అని 'ఎక్స్'లో పేర్కొన్నారు.

విజయవాడలో ఏకాత్మ మానవ దర్శన్ జాతీయ మహాసభ పునఃస్మరణ సదస్సు

23, 24 తేదీల్లో నిర్వహణ

ఈనాడు, అమరావతి: విజయవాడలో 1965లో జరిగిన జనసంఘ్ మహాసభల స్మృతులను గుర్తు చేసుకునేలా.. ఈనెల 23, 24 తేదీల్లో ఏకాత్మ మానవ దర్శన్ జాతీయ మహాసభ- పునఃస్మరణ సదస్సు నిర్వహించనున్నట్లు భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తెలిపారు. విజయవాడలో ఆదివారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. విజయవాడలో ప్రస్తుతం ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం ఉన్న ప్రాంగణంలోనే 60 ఏళ్ల క్రితం 1965లో భారతీయ జనసంఘ్ సదస్సు జరిగిందని, పండిత్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ఏకాత్మ మానవ దర్శనాన్ని అధికారిక మార్గదర్శక సిద్ధాంతంగా ప్రకటించారని గుర్తుచేశారు. తాజాగా నిర్వహించనున్న రెండు రోజుల సదస్సులో వివిధ అంశాలపై సమావేశాలు నిర్వహిస్తామన్నారు. జాతీయ సంఘటన ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్, సహ సంఘటన ప్రధాన కార్యదర్శి శివప్రకాశ్, కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్‌వాల్, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, సీనియర్ నేతలు రామ్‌మాధవ్, మురళీధరరావు హాజరవుతారన్నారు. ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షాలు వీడియో సందేశం ద్వారా మాట్లాడతారని మాధవ్ వెల్లడించారు. ఈ సందర్భంగా మహాసభల పోస్టర్ ఆవిష్కరించారు. భాజపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి, సాలిగ్రామ లక్ష్మీ ప్రసన్న, కార్యక్రమం ఇన్‌ఛార్జి కోడూరి లక్ష్మీనారాయణ, రాష్ట్ర కార్యదర్శి బొడ్డు నాగలక్ష్మి, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు రొంగల గోపీ శ్రీనివాస్, అధికార ప్రతినిధులు సాధినేని యామినీశర్మ, షేక్ బాజీ, ఎన్టీఆర్ జిల్లా భాజపా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న పీవీఎన్ మాధవ్, ప్రసన్నలక్ష్మి, కోడూరి లక్ష్మీనారాయణ, దయాకరరెడ్డి, సాధినేని యామినీశర్మ, నాగలక్ష్మి

జాతీయ అధ్యక్షుడికి మద్దతుగా నామినేషన్

భాజపా జాతీయ అధ్యక్షుడి ఎన్నిక నేపథ్యంలో నితిన్ నబీన్‌కు మద్దతుగా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన జాతీయ కౌన్సిల్ సభ్యులు సోమవారం ఒక సెట్ నామినేషన్‌ను దాఖలు చేయనున్నట్లు మాధవ్ తెలిపారు.



మీది కాని రోజుల్లో ఇలా ఉండండి

జీవితంలో ఏదీ శాశ్వతం కాదని గుర్తుంచుకోండి. మీకు మంచి జరుగుతున్నప్పుడు, ఆ ఆనందకర క్షణాలను పూర్తిగా ఆస్వాదించడంపై దృష్టి పెట్టండి. అదే విధంగా ప్రతికూల సమయాల్లో కుంగిపోకుండా, మంచి రోజులు తప్పక వస్తాయన్న ఆశావాద దృక్పథంతో ఉండండి.

– లెవిస్ హోవెస్, రచయిత

అతిగా మద్యం తాగి.. ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ల మృతి!

● అన్నమయ్య జిల్లాలో ఘటన



మణికుమార్



పుష్పరాజ్

కంభంవారిపల్లి, న్యూస్‌టుడే: సంక్రాంతిని సంతోషంగా జరుపుకొన్న మిత్రులు ఆ ఆనందంలో అతిగా మద్యం తాగగా, ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు మృతి చెందారు. ఈ ఘటన అన్నమయ్య జిల్లా కంభంవారిపల్లె మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై శివకుమార్ కథనం ప్రకారం.. బండవడ్డిపల్లెకు చెందిన మణికుమార్(35) చెన్నైలో, పుష్పరాజ్(22) బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు. పండగకు స్వగ్రామానికి వచ్చిన వీరు. . మరో నలుగురు స్నేహితులతో కలిసి శనివారం రాత్రి ఊరికి సమీపంలో మద్యం తాగారు. ఈ క్రమంలో మణికుమార్, పుష్పరాజ్ కింద పడిపోయి, అపస్మారక స్థితిలోకి వెళ్లారు. వెంటనే వారిని పీలేరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లగా వైద్యులు పరీక్షించి, ప్రభుత్వ ఆసుపత్రికి సిఫార్సు చేశారు. అక్కడికి తరలిస్తుండగా మణికుమార్ మార్గంమధ్యలోనే చనిపోగా, పుష్పరాజ్ చికిత్స పొందుతూ మరణించారు. పీలేరు ప్రభుత్వ ఆసుపత్రిలో శవపరీక్షలు పూర్తిచేశారు. యువకులు అనుమానాస్పదంగా మృతి చెందడంతో బండవడ్డిపల్లెలో విషాదఛాయలు అలుముకున్నాయి. మణికుమార్‌కు భార్య, రెండేళ్ల వయసున్న కుమారుడు ఉన్నారు. పుష్పరాజ్‌కు వివాహం కాలేదు. మృతుల కుటుంబసభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు మొదలుపెట్టారు.

■ రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. అధిక మోతాదులో మద్యం తాగడమే మరణాలకు కారణమని ప్రాథమికంగా అంచనా వేసినట్లు తెలిపారు. రెండు ప్రత్యేక బృందాలతో లోతుగా దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. మద్యం నమూనాలను ల్యాబ్‌కు పంపి పరీక్షలు నిర్వహిస్తామన్నారు.

అతిగా తాగడం వల్లే...

– మధుసూదన్, ఎక్సైజ్ సూపరింటెండెంట్, అన్నమయ్య జిల్లా

ఆరుగురు కలిసి ఒకే రకం మద్యం తాగారు. వారిలో ఇద్దరు మరణించారు. అతిగా మద్యం తాగడంతోనే వారు మరణించినట్లు పోస్టుమార్టం నివేదికలో తేలింది. మిగిలిన నలుగురూ ఆరోగ్యంగానే ఉన్నారు. మద్యంలో ఎలాంటి లోపమూ లేదని ప్రాథమిక విచారణలో గుర్తించాం.

షేర్‌మార్కెట్ చిట్కాల పేరిట టోకరా

● సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ నుంచి రూ.కోటి కాజేసిన సైబర్ నేరగాళ్లు

శ్రీకాకుళం నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి ట్రేడింగ్‌పై ఉన్న ఆసక్తిని అలుసుగా తీసుకున్న సైబర్ నేరగాళ్లు రూ.1.03 కోట్లు కొట్టేసిన ఘటన శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో జరిగింది. నగరంలో కర్రా వీధికి చెందిన శిల్లా శ్రీనివాసరావు సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. ప్రస్తుతం వర్క్ ఫ్రం హోంలో కొనసాగుతున్నారు. షేర్ మార్కెట్‌పై ఆసక్తితో గతనెల 21న ఆన్‌లైన్ ట్రేడింగ్‌పై అవగాహన పెంచుకునేందుకు యూట్యూబ్‌లో ఓ ఛానల్‌లోని వీడియోలు చూశారు. మరిన్ని మెలకువలు నేర్చుకునేందుకు సబ్‌స్క్రిప్షన్ పొంది.. ఇన్‌ఫ్లుయన్సర్ చెప్పినట్లుగా క్యూఐబీ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని వ్యక్తిగత వివరాలతో పాటు ఆధార్, బ్యాంకు ఖాతా, పాన్‌కార్డు నంబరు ఇతర డాక్యుమెంట్లను నమోదు చేశారు. మొదటి డిపాజిట్‌గా ఓ ఖాతాకు రూ.50 వేలు చెల్లించారు. మరుసటి రోజు షేర్ విలువ పెరిగిందని రూ.2 వేలు లాభం చూపించిన నేరగాళ్లు వాటిని తీసుకునేందుకు వీలు కల్పించారు. మరుసటి రోజు వంద షేర్లు కొనుక్కుంటే లాభం వస్తుందని నమ్మించారు. ఇది నమ్మిన బాధితుడు అప్పటి నుంచి ఈనెల 16 వరకు దశలవారీగా షేర్ల పేరిట రూ.1,03,55,000 వరకు చెల్లించారు. భార్య నగలు, ఆస్తి పత్రాలూ తాకట్టు పెట్టేశారు. షేర్లలో పెట్టిన ధనం తిరిగి పొందే వీల్లేకపోవడంతో మోసపోయానని గుర్తించి, 1930 నంబరుకు ఫిర్యాదు చేశారు. సైబర్ పోలీసులు బ్యాంకు ఖాతాలో అప్పటి వరకూ ఉన్న నగదు లావాదేవీలను స్తంభింపజేశారు. శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రెండోపట్టణ సీఐ ఈశ్వరరావు ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఈనాడు

ఐక్యరాజ్య సమితి ఎక్కడ?

సాధారణ జనజీవనాన్ని స్వర్గతుల్యం చేయడం అటుంచితే, మానవాళి బతుకులు నరక కూపంలోకి జారిపోకుండా కాపాడటం ఐక్యరాజ్య సమితి కర్తవ్యంగా ఆ సంస్థ రెండో సెక్రటరీ జనరల్ డ్యాగ్ హామర్‌షోల్డ్ అభివర్ణించారు. ఆ మేరకు విధి నిర్వహణలో ఐరాస పూర్తిస్థాయిలో నెగ్గుకురాగలుగుతోందా అంటే ఆవేదనే మిగులుతుంది. కొరియా, వియత్నాం, ఇరాక్ యుద్ధాలతో పాటు నిన్న మొన్నటి రష్యా-ఉక్రెయిన్, ఇజ్రాయెల్-పాలస్తీనా కదనాలనూ సమితి నివారించలేకపోయింది. ఇటీవల వెనెజువెలాపై అమెరికా దాడినీ, అంతకు మునుపు ఇరాన్‌పై బాంబుల గుమ్మరింతనూ గుడ్లప్పగించి చూస్తుండిపోయింది. లిబియా, సోమాలియా, సూడాన్, సిరియా తదితర ఎన్నో దేశాల్లో అంతర్యుద్ధాలు, సంక్షోభాలు, అవి రగిల్చిన మారణహోమాలను అడ్డుకోవడంలో సమితి ఘోరంగా విఫలమైంది. తమ స్వార్థం కోసం 'వీటో' అధికారాన్ని దుర్వినియోగం చేస్తున్న భద్రతామండలిలోని అగ్రరాజ్యాలు- సమితి స్థాపనా లక్ష్యాలను నీరుగారుస్తున్నాయి. దాని ఉనికినే ప్రశ్నార్థకంగా మారుస్తున్నాయి. ఆధిపత్య ధోరణులు, ఏకపక్ష విధానాలు పెను ఉద్రిక్తతలు రాజేస్తున్న ప్రస్తుత తరుణంలో ప్రపంచ శాంతిభద్రతల పరిరక్షణ కోసం ఐరాస బలోపేతం కావాల్సి ఉంది. అందుకోసం సమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ తాజాగా పిలుపిచ్చినట్లు ఐరాసలో సంస్కరణలు అత్యావశ్యకం!

రెండో ప్రపంచ యుద్ధాన్ని అడ్డుకోవడంలో నానాజాతి సమితి చతికిలపడిన దరిమిలా భవిష్యత్తులో దేశాల మధ్య ఘర్షణలు తలెత్తకుండా చూస్తూ, స్నేహ సౌహార్దాలతో మానవాళి సమష్టిగా పురోగమించేందుకు సాయపడాలన్న ఘన సంకల్పాలతో 1945లో ఐరాస ఏర్పాటైంది. అది మొదలు అమెరికా, యూకే, ఫ్రాన్స్, రష్యా, చైనా.. ఇవే భద్రతామండలిలో శాశ్వత సభ్య దేశాలుగా వీటో అధికారాన్ని ఒడిసిపట్టి, ఐరాసపై పెత్తనం చలాయిస్తున్నాయి. సమితి తీర్మానాలను ఇష్టమొచ్చినట్లు 'వీటో' చేస్తూ తమ ప్రయోజనాలను కాపాడుకుంటున్నాయి. గాజాను నేలమట్టం చేసిన ఇజ్రాయెల్ కోసం అమెరికా గడిచిన అయిదు దశాబ్దాల్లో 50 సార్లకు పైగా 'వీటో'ను వాడింది. పాకిస్థాన్‌ను చంకనెక్కించుకున్న చైనా ఉగ్రవాదులపై ఉక్కుపాదం మోపడానికి అడ్డుపడుతోంది. పైగా మండలిలో ఇండియాకు శాశ్వత ప్రాతినిధ్యం కల్పించే విషయంలోనూ డ్రాగన్ మోకాలడ్డుతోంది. ప్రపంచ శ్రేయస్సుకోసం పురుడుపోసుకున్న సమితి ఆ అయిదు దేశాల గుప్పిట్లో చిక్కుకుపోవడం విశ్వజన సౌభాగ్యానికి చేటుచేస్తోంది!

ఐరాసకు నిధులు బిగబట్టిన డొనాల్డ్ ట్రంప్- సమితి వల్ల ఒరుగుతోందేమీ లేదని తూలనాడుతున్నారు. తమ అధ్యక్షుడికి వంతపాడుతున్న అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో- వెనెజువెలా విషయంలో ఐరాస ఏం చెప్పినా వినే ప్రసక్తే లేదని కొద్దిరోజుల కిందట తెగేసి చెప్పారు. ఐరాస కాగితం పులిలా మారిన దురవస్థకు ఇవన్నీ నిదర్శనాలే. గుటెరస్ హెచ్చరించినట్లు, బలసంపన్న దేశాలు విశ్వవేదికలపై గుత్తాధిపత్యం సాధించి అంతర్జాతీయ న్యాయ సూత్రాలను కాలరాస్తుండటం ప్రపంచాన్ని వినాశనం వైపు నెడుతుంది. అలాంటి భయంకర స్థితి దాపురించకూడదంటే ప్రాతినిధ్యం, ప్రభావాల పరంగా భద్రతా మండలిని తక్షణం సంస్కరించాలి. ఇండియా, బ్రెజిల్, జపాన్, జర్మనీ, దక్షిణాఫ్రికా, నైజీరియా వంటి దేశాలకు శాశ్వత సభ్యత్వం కల్పించి దాన్ని ప్రజాస్వామ్యీకరించాలి. ఐరాస నిబంధనావళిని అన్ని దేశాలు గౌరవించడంతో పాటు ఆర్థికంగానూ సమితికి వెన్నుదన్నుగా నిలవాలి. ముఖ్యంగా అగ్రరాజ్యాలు వీటన్నింటి పట్ల ఎంత నిబద్ధతతో వ్యవహరిస్తే అంతగా ప్రపంచంలో శాంతి, సామరస్యాలు వెల్లివిరుస్తాయి!

మంచి నీళ్లే తాగుతున్నామా?

ఇటీవల కొత్త ఏడాది సంబరాల నడుమ చోటుచేసుకున్న జల కాలుష్య దుర్ఘటనలు కలకలం రేపాయి. దేశంలో అత్యంత శుభ్రమైన నగరంగా రికార్డులకెక్కిన ఇందౌర్‌లో తాగునీరు కలుషితమై పలువురు మరణించారు. గుజరాత్ రాజధాని గాంధీనగర్‌లో కలుషిత తాగునీటితో దాదాపు వంద మంది టైఫాయిడ్ బారినపడ్డారు. భారతీయ సిలికాన్ వ్యాలీగా ప్రసిద్ధిపొందిన బెంగళూరులో తాగునీరు మురుగు వాసన వస్తోందని ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. మరి, ఇలాంటి సమస్యలకు పరిష్కారమేంటి?

జల కాలుష్యం కారణంగా ప్రాణనష్టం సంభవించడం తరవాత దుర్ఘటనల్లో బాధితులకు వెంటనే నష్టపరిహారం ప్రకటించడం ద్వారా ఆదుకునే ప్రయత్నాలు మంచివే. అయితే, సమస్య అంతటితో తీరిపోదు. శాశ్వత పరిష్కారాల్ని గుర్తించాలి. రాజకీయాలకు తావులేకుండా, సమిష్టిగా ఆలోచించి పరిష్కారాలు వెదకాలి. వివిధ జాతీయ తాగునీటి కార్యక్రమాల్లో లోపాలేమైనా ఉన్నాయా అనేది తరచి చూసుకోవాలి. వాటి పరిష్కారానికి పటిష్ఠ చర్యలు తీసుకోవాలి. కలుషిత నీటితో మరెవరి ప్రాణాలూ పోకుండా జాగ్రత్త పడాలి. ముఖ్యంగా కేంద్ర బడ్జెట్‌లో రూ.67 వేల కోట్ల కేటాయింపుల జల్ జీవన్ మిషన్ సఫలం కావాలంటే ఇలాంటి లోపాలను పరిహరించాలి. వాటికి బాధ్యులైన అధికారులు, సాంకేతిక సిబ్బందిని కోర్టులో విచారించి శిక్షలు వేయించాలి. మరోవైపు, వేసవిలో తాగునీటి డిమాండ్ పెరిగి, సరఫరా తగ్గే అవకాశాలున్నాయి. అందుకని ఇప్పటి నుంచే పట్టణ తాగునీటి సరఫరా వ్యవస్థను ప్రక్షాళన చేయాలి. ఈ మేరకు దీన్ని కేంద్ర ప్రభుత్వం ముందుగానే గుర్తించి వివిధ జిల్లాల్లో కాలువలు, చెరువుల పునరుద్ధరణ, సంరక్షణ పనులను ఉపాధి పథకం కింద చేపట్టాలని ఆదేశించింది.




వాతావరణ మార్పుల ప్రభావం

దేశ జనాభాలో సగమందికి 2030నాటికి శుభ్రమైన తాగునీటికి కొరత ఏర్పడుతుందని నీతి ఆయోగ్ ఇప్పటికే హెచ్చరించింది. వాతావరణ మార్పులు, కాలుష్యం నీటి సరఫరాను కుదిపివేస్తూ కలుషిత జలాలకు కారణమవుతున్నాయి. 2025-26లో దేశంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురవగా, హిమాలయ ప్రాంతంలో హిమానీ నదాలు కరిగిపోతూ, మంచు కురవడం తగ్గిపోయింది. హిమాచల్, ఉత్తరాఖండ్‌లలో కొన్ని ప్రాంతాల్లో ప్రజలు హిమపాతం కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. ఇలాంటి పరిస్థితులకు వాతావరణ మార్పులే కారణంగా నిలుస్తున్నాయి. నదుల్లోకి పట్టణాల మురుగు నీరు, పారిశ్రామిక వ్యర్థాలు చేరిపోతున్నాయి. నదీ తీరాలు ఆక్రమణకు గురవుతున్నాయి. పారిశ్రామిక స్థాయిలో వ్యవసాయం, వరి, చెరకు సాగుకు భారీ సబ్సిడీల వల్ల వర్షాభావ ప్రాంతాల్లో సైతం పంటల కోసం భూగర్భ జలాలను తోడివేయడం మితిమీరింది. ఫలితంగా భూగర్భ జలమట్టాలు లోలోతులకు దిగిపోతున్నాయి. దీనివల్ల భూమి కుంగిపోతోంది. ఇలా దుర్వినియోగం, కాలుష్యం, వాతావరణ మార్పులు వంటివన్నీ కలగలిసి జల వనరులు హరించుకుపోవడానికి కారణమవుతున్నాయి. మరోవైపు సాగు, తాగునీరు, పారిశ్రామిక అవసరాలకూ నీటి కొరత ఏర్పడుతోంది.

ఇంటింటికీ కొళాయిల ద్వారా నీటి సరఫరా, నదుల అనుసంధానం వంటివి తాత్కాలిక పరిష్కారాలే తప్ప శుభ్రమైన తాగునీటి సరఫరాకు భరోసా ఇచ్చే మార్గాలు కావు. ప్రభుత్వం సరఫరా చేసే పైపులైన్ల ద్వారా కూడా కలుషిత జలం ఇళ్లకు చేరి ప్రజలను అనారోగ్యంపాలు చేస్తోందని తాజా ప్రమాదాలు చాటి చెబుతున్నాయి. ఇక సరికొత్త పంథా చేపట్టక తప్పదు. అదే నీటి సరఫరాకూ గాంధేయ గ్రామ స్వరాజ్య సిద్ధాంతాన్ని వర్తింపజేయడం. ప్రస్తుతం ప్రభుత్వం అనుసరిస్తున్న కేంద్రీకరణ, ప్రైవేటీకరణ మార్గాల బదులు వికేంద్రిత సామూహిక జల నిర్వహణ పద్ధతులను చేపట్టాలి. ఇందుకు ఆధునిక సాంకేతికతలను ఉపయోగించాలి. ప్రజల చేతికే జలస్వరాజ్యం బాధ్యతలను అప్పగించి శుభ్రమైన తాగునీటికి భరోసా సాధించాలి. స్థానిక జలవనరుల రక్షణ, వాననీటి సంరక్షణను ఉద్దేశించిన ప్రభుత్వ పథకాల అమలు బాధ్యతను గ్రామ పంచాయతీలకు ఇవ్వాలి. ఆ పథకాలకు కేటాయించిన నిధులను వెచ్చించి, ఆశించిన ఫలితాలను సాధించే బాధ్యతనూ అప్పగించాలి. కొన్ని గ్రామాలు కలిసి సామూహిక జలాశయాలను ఏర్పాటు చేసుకుని, వాన నీటిని సంరక్షించుకునేలా ప్రేరణ అందించాలి. అంటే జల నిర్వహణ బాధ్యతను స్థానిక స్వపరిపాలన సంస్థలకు అప్పగించాలి. భూగర్భ జలాల పునరుద్ధరణను గ్రామాల చేతికే ఇవ్వాలి. మట్టికట్టలు పోయడం, వాన నీటిని నేలలోకి ఇంకించి భూగర్భ జలాలను పునరుద్ధరించాలి. జిల్లా స్థాయిలో పట్టణాలు, బ్లాకులను అనుసంధానించి ఉపరితల, భూగర్భ జల సంరక్షణ బాధ్యతలను అప్పగించాలి. ఇలా జిల్లాల్లో తాగునీటి లభ్యత ఉండేలా చూడాలి. గ్రామాల స్థాయిలోనే నీటి నాణ్యతను సంరక్షించాలి. కలుషిత జలాల వల్ల వ్యాధులు విరుచుకుపడినా, నీటి కాలుష్యం ఏర్పడినా స్థానికులను మొబైల్ ఫోన్ల ద్వారా వెంటనే హెచ్చరించి, నివారణ మార్గాలను తెలిపే ఏర్పాట్లు చేయాలి.

నీటి నిర్వహణే కీలకం

మన సంస్కృతి ప్రకృతిని ఆరాధిస్తుంది. ప్రజాస్వామ్య లక్షణం మన నాగరికతలోనే ఉంది. ఈ లక్షణాలను ఆధారంగా చేసుకుని జల స్వరాజ్యం సాధించాలి. పూడుకుపోయిన కుంటలు, చెరువులను యుద్ధప్రాతిపదికన పునరుద్ధరించాలి. ఆయకట్టు ప్రాంతాల్లో అడవులను పెంచి సహజసిద్ధమైన రీతిలో నీటి వనరులను పునరుద్ధరించాలి. పొలాలను అమితంగా నీటిని తాగే పరిస్థితి నుంచి నీటిని ఇముడ్చుకునే స్థాయికి చేర్చేలా చర్యలు తీసుకోవాలి. సేంద్రియ వ్యవసాయాన్ని విస్తరించి పొలాలను కూడా నీటి సంరక్షణలో అంతర్భాగంగా మార్చాలి. నగరాల్లో తప్పనిసరిగా వాన నీటి సంరక్షణ విధానాలను రూపొందించి పకడ్బందీగా అమలు చేయాలి. కాంక్రీటు అరణ్యాలుగా మారిన మన నగరాల్లో కురిసిన వాన నీరంతా డ్రైనేజీల్లోకి పారుతోంది. వాన నీటిని భూగర్భంలోకి ఇంకించి, నీటి సంరక్షణ సాధించాలి. జల సంరక్షణ విషయంలో కలిసికట్టుగా కృషి చేయాలి. మన సంస్కృతి ప్రబోధాన్ని పాటించి జల వనరులను కాపాడుకోవాలి. భారీ నీటిపారుదల ప్రాజెక్టులకన్నా, గ్రామస్థాయిలో నీటి కుంటలు, చెరువుల సంరక్షణ, సామూహిక నీటి నిర్వహణే ప్రస్తుతావసరం.




ఇంద్రశేఖర్ సింగ్
వ్యవసాయ విధానాల విశ్లేషకులు, నేషనల్ సీడ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా మాజీ డైరెక్టర్

మార్టిన్, పీటర్‌ల వయసు అయిదేళ్లు. ఒకేచోట ఉండటం వల్ల పార్కులో కలిసి ఆడుకునేవారు. ఓ రోజు మార్టిన్.. పీటర్ ఇంటి దగ్గరికి వెళ్లి ఆడుకుందాం రమ్మని పిలిచాడు. 'ఇక నుంచి నీతో ఆడుకోవద్దంది మా అమ్మ' అని సమాధానమిచ్చాడు పీటర్. 'ఎందుకని?' అమాయకంగా ప్రశ్నించాడు మార్టిన్. 'మీరు నల్లవారు' చెప్పాడు పీటర్.

ప్రాథమిక పాఠశాల విద్యార్థులు విహారయాత్రకు వెళ్లి బస్సులో తిరిగొస్తున్నారు. అప్పటికే బస్సు నిండిపోయింది. మరో స్టాప్ రాగానే కొందరు తెల్లవారు బస్సెక్కారు. నల్లవారు లేచి తెల్లవారికి సీటు ఇవ్వాలి. అందుకు మార్టిన్ నిరాకరించడంతో డ్రైవర్ తిట్ల దండకం మొదలెట్టాడు. అనంతరం ఆ చిన్నారి 90 మైళ్లు నిలబడి ప్రయాణించాడు. ఈ వరస సంఘ

హక్కుల దిక్సూచి




టనలు ఆ బాలుడిపై తీవ్ర ప్రభావం చూపాయి. అనంతర కాలంలో అతణ్ని బలమైన హక్కుల నేతగా మార్చాయి. ఆయనే అమెరికన్ గాంధీగా ప్రఖ్యాతి గాంచిన మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్.

1929 జనవరి 15న అమెరికాలోని అట్లాంటా నగరంలో పుట్టారు మార్టిన్. చదువుతో పాటు చుట్టూ ఉన్న పరిస్థితులపై అవగాహన పెంచుకున్నారు. గాంధీ సిద్ధాంతాలతో ఆయన ప్రేరణ పొందారు. 1955లో చోటుచేసుకున్న ఓ ఘటన అమెరికా భవిష్యత్తు ముఖచిత్రాన్నే మార్చేసింది. రోజంతా పనిచేసి అలసిపోయి బస్సెక్కిన నల్లజాతి మహిళ రోజా పార్క్ తెల్లవారికి సీటు ఇవ్వడానికి నిరాకరించింది. దాంతో అధికారులు ఆమెను అరెస్టు చేసి, జరిమానా విధించారు. ఈ ఘటనతో ప్రారంభమైన నిరసనలకు మార్టిన్ నాయకత్వం వహించి, అహింసా పద్ధతిలో ముందుకు తీసుకెళ్లారు. ఏడాదికి పైగా బస్సుల బహిష్కరణ కొనసాగింది. ఈ నిరసన బస్సుల కంపెనీలకు, ప్రభుత్వ పెద్దలకు తీవ్ర ఆగ్రహం కలిగించింది. మార్టిన్‌పై రకరకాలుగా దాడులు చేశారు. అరెస్టు చేసి జైలుకు పంపారు. వ్యతిరేక తీర్పులు ఇప్పించారు. తప్పనిసరి పరిస్థితుల్లో మార్టిన్ సుప్రీంకోర్టుకు వెళ్లారు. వాద ప్రతివాదనల అనంతరం 1956 నవంబరు 13న బస్సుల్లో వర్ణ వివక్ష రాజ్యాంగ విరుద్ధమని తీర్పు వచ్చింది. గాంధీజీ అహింసా పోరాట పద్ధతి గురించి మరింత లోతుగా తెలుసుకోవడానికి 1959లో మార్టిన్ తన భార్యతో కలిసి మన దేశానికి వచ్చివెళ్లారు.

అన్నిరంగాల్లో సమానత్వం కోసం 1963లో మార్టిన్ నేతృత్వంలో అమెరికాలో శాంతియుత పోరాటం ప్రారంభమైంది. తమకు ప్రవేశం లేని ప్రాంతాలకు వెళ్లి నిరసన తెలిపేవారు. మార్టిన్‌తో పాటు వేలాది మంది అరెస్టయ్యారు. మార్టిన్ పోరాటాలకు అనేక దేశాలు మద్దతు ప్రకటించాయి. అదే సంవత్సరం ఆయనకు నోబెల్ శాంతి బహుమతి లభించింది. ఉద్యమం కొనసాగుతుండగానే 39 ఏళ్ల వయసులో 1968 ఏప్రిల్ 4న ఓ దుండగుడి కాల్పులకు మార్టిన్ బలయ్యారు. ఆయన కారణంగానే అమెరికాలో జాతి వివక్ష నిషేధ చట్టం, నల్లవారికి ఓటు హక్కు, పౌరహక్కుల చట్టం అమలులోకి వచ్చాయి. దేశాధ్యక్షుడు కాకుండా జయంతి సందర్భంగా జాతీయ సెలవుదినం ప్రకటించిన ఒకే ఒక్కరు మార్టిన్ లూథర్ కింగ్.

మనుషులంతా సమానమేనని.. రంగు, జాతి కారణంగా వివక్ష తగదనే విషయాన్ని గుర్తు చేసుకునేందుకు జనవరి 3వ సోమవారాన్ని 'మార్టిన్ లూథర్ కింగ్ డే'గా నిర్వహిస్తున్నారు.

– ఎస్.మధుసూదన్




> వ్యాపారంలో సాంకేతికతను ఉపయోగించేవారు గుర్తుంచుకోవాల్సిన ముఖ్యమైన విషయం ఒకటుంది. చాలా బాగా జరిగే పనికి ఆటోమేషన్‌ని ఉపయోగిస్తే ఆ పని మరెన్నో రెట్లు సమర్థంగా జరుగుతుంది. అదే బాగా జరగని పనికి దాన్ని వాడితే ఆ అసమర్థతే మరింతగా పెరుగుతుంది.
>
> – బిల్ గేట్స్

భక్తిదే పైచేయి!

అహంకారం మనిషి ఎదుగుదలను ఆపేస్తుంది. అజ్ఞానపు సంకెళ్లతో మనసును కట్టిపడేస్తుంది. భక్తి ఆ సంకెళ్లను తెంచే తాళంచెవి. అహంకారం అంటే- నేను, నాది, నేనే.. అన్న భావన. భక్తి అంటే- నువ్వు, నీది, నీవే... అన్న సమర్పణ భావం. భక్తి పెరిగితే అహంకారం తగ్గుతుంది, అహంకారం తగ్గితే జీవితంలో సమస్యలూ తగ్గుతాయి.

భక్తి వల్లే వినయం వస్తుంది. మనసును, గర్వాన్ని దైవంపాదాల చెంత సమర్పించడమే నిజమైన భక్తి. అది ఉంటే అన్నీ నా వల్లే జరిగాయి... అన్న భావన కరిగిపోతుంది. ఏది జరిగినా ఆ పరమాత్మ అనుగ్రహంతోనే జరిగిందన్న గ్రహింపు వచ్చి అహంకారం కనుమరుగవుతుంది. కొన్నిసార్లు భక్తి కూడా గర్వానికి దారితీస్తుంది. 'నేనే మంచి భక్తుణ్ని, సాధనలో నన్ను మించినవారు లేరు' అనుకుంటుంటారు. భక్తిని ప్రదర్శనగా మార్చి ఇతరుల మెప్పు పొందాలనే తపన కలుగుతుంది. అది నిజమైన భక్తి కాదు. భగవద్గీత ప్రకారం, ఇది డంభం అనే అసుర గుణానికి చెందుతుంది.

ఒకసారి గరుడుడు గర్వంగా కృష్ణుణ్ని అడిగాడు- 'స్వామీ! నాకన్నా వేగంగా ఎగరగలవారు ఎవరున్నారు?' అని. అది విన్న సుదర్శన చక్రం 'స్వామీ! నాకన్నా బలవంతుడు ఎవరు?' అని అడిగింది. సత్యభామ తన సౌందర్యంపై గర్వంతో... 'త్రేతాయుగంలో మీ సీతమ్మ కన్నా నేను అందంగా లేనా?' అని ప్రశ్నించింది. ఈ ముగ్గురి మాటల్లో వినిపించింది ఒకే రాగం... అదే అహంకారం.



అంతర్యామి

కృష్ణుడు వీరి అహంకారాన్ని ఒకేసారి తొలగించాలని తనదైన శైలిలో ఒక లీల ప్రదర్శించాడు. 'గరుడా! కొన్ని యోజనాల దూరంలో ఒక గుహలో మహాత్ముడు తపస్సు చేస్తున్నాడు. నీ సీతారాములు ద్వారకలో ఉన్నారని చెప్పి, వెంటనే ఇక్కడికి రప్పించు' అని ఆజ్ఞాపించాడు. అంతః పురాన్ని కాపాడమని సుదర్శనాన్ని ఆజ్ఞాపించాడు. గరుడుడు వెళ్లి హనుమంతుడికి ఈ వార్త చెప్పగానే, హనుమ కళ్లు ఆనందంతో మెరిశాయి. 'నా సీతారాములు ద్వారకలో ఉన్నారా?..' అంటూ తపస్సు ఆపేసి, గరుడుడి కన్నా లక్ష రెట్లు వేగంగా గగనవిహారం చేశాడు. క్షణాల్లోనే ద్వారక చేరాడు. కృష్ణుడు ఆశ్చర్యంగా అడిగాడు- 'హనుమా! సుదర్శనం నిన్ను అడ్డుకోలేదా?' అని. హనుమ నమస్కరిస్తూ 'నా సీతారాములను చూడాలనే ఆత్రుతతో వచ్చాను. చక్రం అడ్డుకుంది. కానీ యుద్ధం చెయ్యడం ఇష్టం లేక ఉన్నపళాన దాన్ని మింగేశాను...' అంటూ నోటిలోంచి సుదర్శనాన్ని బయటికి తీశాడు. తరవాత సత్యభామను చూసి 'నా తల్లి సీతమ్మ ఎక్కడ? ఈ చెలికత్తె ఎవరు?' అని ప్రశ్నించాడు.

ఆ క్షణంలో గరుడుడి గర్వం అణగిపోయింది. సుదర్శన చక్రం చిన్నబోయింది. సత్యభామ ముఖం వెలవెలబోయింది. హనుమ భక్తి ముందు వీరందరి అహంకారం కరిగిపోయింది.

బలం, వేగం, సౌందర్యం మనిషిని గొప్పవాణ్ని చేయవు. నిజమైన భక్తి... వినయం, సమర్పణలోనే ఉంది. మన విజయాలన్నీ ఆ దైవానుగ్రహమే అని గుర్తించగలిగితే, అహంకారం మన దరికి రాదు. అదే నిజమైన భక్తి సాధన!

– కరణం హరికిషన్

కటిక పేదరికంలో...

వెనెజువెలాపైకి ఇటీవల సైన్యాన్ని పంపిన ట్రంప్, ఆ తరవాతి వంతు మెక్సికో, కొలంబియాలదేనని హెచ్చరిస్తున్నారు. అయితే, లాటిన్ అమెరికాలో ఎక్కువ సంఖ్యలో పేదలు బ్రెజిల్‌తో పాటు ఈ మూడు దేశాల్లో కనిపిస్తారు. ప్రభుత్వాల అసమర్థ విధానాలు, అవినీతి, మితిమీరిన ద్రవ్యోల్బణం, అగ్రరాజ్యాల ఆంక్షలు వంటి వాటి వల్ల ఆ దేశాల్లో ఎక్కువశాతం మంది దారిద్ర్యరేఖకు దిగువన బతుకీడుస్తున్నారు. 2023నాటికి లాటిన్ అమెరికాలోని ఆయా దేశాల్లో రోజుకు 3.65 డాలర్ల కన్నా తక్కువ వ్యయంతో జీవిస్తున్నవారి సంఖ్య... (కోట్లలో)

బ్రెజిల్	2.35
వెనెజువెలా	1.55
మెక్సికో	1.32
కొలంబియా	1.02
గ్వాటిమాలా	0.58
పెరూ	0.43
హోండురాస్, అర్జెంటీనా	0.37
ఈక్వెడార్	0.29
బొలీవియా	0.11

(ఆధారం: ఇంటర్-అమెరికన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ నివేదిక)

ఏఐ తోడుగా... పనులు జోరుగా!

ఏ ఆర్థిక వ్యవస్థలోనైనా ఉత్పత్తికి అవసరమైన వనరులు పరిమితంగానే ఉంటాయి. మెటీరియల్, శ్రామిక శక్తి, యంత్రాలు, మూలధనం వంటి ప్రాథమిక ఉత్పాదక వనరులను సమర్థంగా వినియోగిస్తేనే తక్కువ ఖర్చుతో ఎక్కువ ఫలితాలు సాధ్యమవుతాయి. ఇందుకు ఏఐ కీలకమవుతోంది. ఈ సాంకేతిక వినియోగం సాఫ్ట్‌వేర్ కంపెనీలకే పరిమితం కాదు. విద్య, వైద్యం, వ్యవసాయం, పరిశ్రమలు, ఇంజినీరింగ్, బ్యాంకింగ్, ప్రభుత్వ సేవలు... ఇలా అన్ని రంగాలూ దీన్ని ఉపయోగిస్తున్నాయి. ఒక పరిశ్రమలో యంత్రం ఎప్పుడు మొరాయిస్తుందో ముందే చెప్పడం, ఆసుపత్రిలో రోగికి ఏయే పరీక్షలు అవసరమో సూచించడం, బ్యాంకులో పారు బాకీలను ముందుగానే గుర్తించడం ఏఐతో సాధ్యమవుతున్నాయి. పంటను చీడపీడలు చుట్టుముట్టే ప్రమాదముందని రైతును హెచ్చరించడం, విద్యార్థి స్థాయికీ సామర్థ్యానికీ తగ్గట్లు పాఠాలను అందివ్వడం వంటివన్నీ ఇప్పుడు కృత్రిమ మేధ ద్వారా సులభమవుతున్నాయి. ఇటువంటి మార్పుల వల్ల డబ్బు, శ్రమ, సమయం చాలా ఆదా అవుతున్నాయి.

ఎన్నో ప్రయోజనాలు...

- ఏఐ ద్వారా తక్కువ ఖర్చుకే నాణ్యమైన వస్తుసేవల ఉత్పత్తి జరిగితే, ప్రజలపై భారం తగ్గి వినియోగం పెరుగుతుంది. దానివల్ల ఉత్పత్తి కార్యక్రమాలు ఊపందుకుని కొత్త ఉద్యోగాల సృష్టి జరుగుతుంది. ప్రభుత్వాలకూ పన్నుల రూపంలో ఆదాయం పెరుగుతుంది. ఇలా ఉత్పత్తి-ఆదాయం-పన్నుల చక్రం బలపడితే- పేదరిక నిర్మూలనకు ప్రభుత్వాలు మరింత ముమ్మరంగా కృషి చేయగలుగుతాయి.
- డిజిటల్ సాంకేతికతలతో సంక్షేమ పథకాల్లోని లీకేజీలు గణనీయంగా తగ్గాయని కేంద్ర ప్రభుత్వం చెబుతోంది. ఆధార్, ప్రత్యక్ష నగదు బదిలీ వంటి వ్యవస్థలతో ఏటా వేల కోట్ల రూపాయలు ఆదా అవుతున్నాయి. ఏఐ ఆధారిత డేటా విశ్లేషణతో నిజమైన లబ్ధిదారులెవరో కచ్చితంగా గుర్తించడం వీలవుతోంది.
- వ్యాధిని ఆదిలోనే గుర్తిస్తే, చికిత్స వ్యయం 30-40 శాతం మేర తగ్గుతుందని ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచిస్తోంది. కొన్ని రాష్ట్రాల ప్రభుత్వ ఆసుపత్రుల్లో కంటి వ్యాధులు, మధుమేహం, ఊపిరితిత్తుల సమస్యలను గుర్తించడానికి ఏఐ ఆధారిత స్కానింగ్ వ్యవస్థలను ఉపయోగిస్తున్నారు. దీనివల్ల పేద రోగులకూ మెరుగైన వైద్యం అందుతోంది.
- వ్యవసాయంలో ఏఐ యాప్‌లు వాతావరణ సమాచారంతో పాటు మట్టిలోని పోషకాలు, పంటల ఆరోగ్యం వంటి విషయాలను ముందుగానే తెలియజేస్తున్నాయి. భారత వ్యవసాయ పరిశోధనా మండలి(ఐసీఏఆర్) అధ్యయనాల ప్రకారం, రైతులకు సమయానికి సలహాలు అందితే దిగుబడులు 10-15శాతం మేర పెరిగే అవకాశం ఉంటుంది. అదే సమయంలో ఎరువులూ పురుగుమందులకు అయ్యే ఖర్చు తగ్గిపోతుంది.




నేడు ప్రపంచ దిశను మారుస్తున్న ప్రధాన సాంకేతికతల్లో కృత్రిమ మేధ(ఏఐ) ముందువరసలో ఉంది. శ్రమనూ సమయాన్నీ ఖర్చులనూ తగ్గించి అధిక ఉత్పాదకత సాధించేందుకు ఇది ఎంతగానో అక్కరకొస్తోంది. ప్రజలు దైనందిన పనుల్ని సులభంగా చక్కబెట్టుకోవడానికీ ఉపయోగపడుతోంది. అందుకనే ప్రభుత్వాలు, పరిశ్రమలతో పాటు సమాజమూ ఏఐపై దృష్టి సారిస్తోంది. కానీ, మానవాళి జీవన నాణ్యతను పెంచడమే దీని ప్రధాన లక్ష్యం కావాలి.

- కృత్రిమ మేధ వల్ల కొత్తతరహా వర్తక వ్యాపారాలు అందుబాటులోకి వస్తున్నాయి. ముఖ్యంగా చిన్న వ్యాపారులకు బిల్లింగ్ వ్యవస్థ, సరకు నిర్వహణ, డిజిటల్ మార్కెటింగ్, అనువాద సేవలు వంటివి తక్కువ ధరకే లభిస్తున్నాయి.

ఉద్యోగం పోయినట్లు కాదు...


మానవ సిబ్బంది గంటల తరబడి చేసే పనులను ఏఐ క్షణాల్లో పూర్తిచేస్తుంది. దీనర్థం, ఆ ఉద్యోగులను పనిలోంచి తీసేయాలని కాదు. తరచూ చేసే, కష్టమైన పనుల నుంచి మానవ వనరులను విముక్తం చేసి... ఆలోచనాత్మకమైన, సృజనాత్మకమైన పనులవైపు వారిని నడిపించాలని భావించాలి. ఉదాహరణకు, ఉపాధ్యాయుడు హాజరు పట్టికలు, మార్కుల నమోదు వంటి పనులను ఏఐకి అప్పగిస్తే... విద్యార్థులపై మరింత శ్రద్ధ పెట్టడానికి సమయం దొరుకుతుంది. అయితే ఏఐతో కొన్ని సవాళ్లు లేకపోలేదు. ఈ టెక్నాలజీ రాకతో అసలు కొన్నిరకాల ఉద్యోగాల అవసరమే ఉండదు. డిజిటల్ నైపుణ్యాలు లేనివారికి ఇది కష్టమవుతుంది. గ్రామాల్లో ఇంటర్నెట్, కంప్యూటర్ వసతులు తక్కువ. కాబట్టి, ఏఐ ప్రయోజనాలు అందరికీ సమానంగా అందకపోవచ్చు. మరోవైపు ఏఐ తీసుకునే నిర్ణయాలకు బాధ్యత ఎవరిదనే ప్రశ్న తలెత్తుతుంది. అందుకే, ఏఐ వినియోగానికి సంబంధించి సమగ్ర శిక్షణ, నియంత్రణ, స్పష్టమైన విధివిధానాలు అవసరం. కృత్రిమ మేధ ద్వారా ఆర్థికాభివృద్ధిని నగరాల నుంచి గ్రామాలకు విస్తరించే అవకాశముంది. కాబట్టి, దీన్ని ఉద్యోగాలు తీసేసే సాంకేతికతగా చూడకుండా, ఒక కొత్త ఆర్థిక పునర్నిర్మాణ శక్తిగానే భావించాలి. అలా విద్యాసంస్థలు, ఆసుపత్రులు, వ్యవసాయం, వ్యాపారం, పరిశ్రమలు, ప్రభుత్వ సేవలు వంటి రంగాల్లో కృత్రిమ మేధను బాధ్యతాయుతంగా ఉపయోగించినప్పుడే, దేశమంతటా సమగ్రాభివృద్ధి కనిపిస్తుంది.



డాక్టర్ మైలవరం చంద్రశేఖర్
సహాయ ఆచార్యులు, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజ్

అలాగే అమ్మా..!

ఒక అడవిలో ఏనుగుకు కేసరి అనే బిడ్డ ఉండేది. అందరితో చాలా సరదాగా ఉండేది. ఒకసారి అడవిలోని కొండ మీద నుంచి చుట్టుపక్కల ఉన్న ఊరిని చూసింది. అక్కడ రంగురంగుల పువ్వులు, నీటి కాలువలు చూసి చాలా అందంగా అనిపించింది. దాంతో ఎలాగైనా అక్కడికి వెళ్లాలనుకుంది కేసరి. అదే విషయం వాళ్లమ్మకు చెప్పింది. అప్పుడు.. 'మనం అక్కడికి వెళ్లడం అంత మంచిది కాదు. అది మనకు ప్రమాదం కూడా కావొచ్చు' అని వారించింది. అప్పుడు విన్నట్లే ఉన్నా.. ఎవరూ లేని సమయంలో మెల్లగా ఊరి బాట పట్టింది కేసరి. గ్రామం లోపలికి వెళ్లగానే.. అక్కడున్న జనాలందరూ ఒక్కసారిగా భయపడిపోయారు. కొందరు దాని దగ్గరి నుంచి పరిగెత్తసాగారు. అది ఏమైనా చేస్తుందేమోననే



భయంతో కొంతమంది అయితే.. రాళ్లతో కొట్టడం మొదలుపెట్టారు. దాంతో కేసరి గట్టిగా అరుస్తూ పరుగులు తీసింది. అలాగే పరుగులు పెడుతూ ఎలాగోలా తప్పించుకుని అడవిలోకి వెళ్లి.. హమ్మయ్యా అంటూ ఊపిరి పీల్చుకుంది. విషయం తెలుసుకున్న తల్లి ఏనుగు కేసరి దగ్గరికి వెళ్లింది. వెంటనే ఎలుగుబంటి దగ్గరికి తీసుకెళ్లి వైద్యం చేయించింది. తరవాత.. 'అమ్మా! నేను అక్కడికి చూడటానికి మాత్రమే వెళ్లాను. కానీ అక్కడ ఉన్నవాళ్లే నన్ను కొట్టారు' అంది కేసరి. 'నువ్వు ఆ ఊరి అందాన్ని చూసి అక్కడికి వెళ్లాలి అనుకోవడం బాగానే ఉంది. కానీ అది మనం ఉండాల్సిన ప్రదేశం కాదు. అక్కడ నువ్వు భయపడి పరుగులు

హాయ్! బుజ్జీ!!

పెట్టినా, వాళ్లను ఇబ్బంది పెట్టడానికే అలా చేస్తున్నావు అనుకుని కొట్టేశారు. కాబట్టి మన చోటు కాని ప్రాంతానికి ఎంత దూరంగా ఉంటే అంత మంచిది. అందుకే ఆరోజు అటువైపు మనం వెళ్లొద్దని చెప్పాను' అంది తల్లి ఏనుగు. 'అలాగేనమ్మా! ఇప్పటి నుంచి అడవి దాటి ఎటూ వెళ్లను' అంది కేసరి.

– పేట యుగంధర్

మన సామెతలు!

ఇక్కడ కొన్ని సామెతలు అసంపూర్తిగా ఉన్నాయి. వాటిని పూర్తి చేయగలరా?

1. ఇంటి □□ లంకకు □□.
2. □□ లేనిదే □□ రాదు.
3. ఆకలి □□ ఎరుగదు. నిద్ర □□ ఎరుగదు.
4. తన □□□ తన □□□.


ఎన్టీఆర్ సర్కిల్‌లో నివాళులర్పిస్తూ..

ప్రజల గుండెల్లో ఎన్టీఆర్ స్థానం పదిలం

పటమట, న్యూస్‌టుడే: శ్రీరాముడి మాదిరిగా దివంగత నేత ఎన్టీఆర్ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారని జిల్లా తెదేపా అధ్యక్షురాలు గద్దె అనూరాధ, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌లు అన్నారు. ఆదివారం ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా అశోక్‌నగర్‌లోని తూర్పు నియోజకవర్గ కార్యాలయంలో ఎన్టీఆర్ విగ్రహానికి, ఎన్టీఆర్ సర్కిల్‌లోని ఎన్టీఆర్ విగ్రహానికి తెదేపా నేతలతో కలిసి వారు పూలమాల వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ సినిమా రంగంలోనే కాకుండా రాజకీయ రంగంలో ఎన్టీఆర్ ఎన్నో రికార్డులను సృష్టించారని పేర్కొన్నారు. కూడు, గూడు అనే నినాదంతో తెదేపాను స్థాపించారని, ఆ విధానాన్నే సీఎం చంద్రబాబు కొనసాగిస్తున్నారన్నారు.



కొబ్బరికాయపై... శ్రీరామ పట్టాభిషేకం

అవనిగడ్డ లక్ష్మీ నారాయణస్వామి ఆలయం మండపంపై శ్రీరామ పట్టాభిషేకాన్ని ఓ శిల్పి చెక్కారు. ఆయనతోనే కొబ్బరికాయపై శ్రీరామ పట్టాభిషేకం చిత్రాన్ని కూడా క్రీ.శ.1135 సంవత్సరంలో చెక్కించారు. ఆలయ పూజారిగా ఉన్న దీవి లక్ష్మీపతికి దీన్ని బహుమతిగా ఇచ్చారు. ఆ కొబ్బరికాయను ఆనాటి నుంచి దీవి లక్ష్మీపతి వంశీకుల ఇంట భద్రపరిచారు. నేడు అది దీవి వంశస్థుల పూజలందుకుంటోంది.
- అవనిగడ్డ, న్యూస్‌టుడే

జల్లెడ పట్టేలా.. జాడ కనిపెట్టేలా

- నగరంలోని ఆటోల్లో సురక్షిత ప్రయాణానికి సాంకేతిక నిఘా
- ప్రత్యేక యాప్‌లో ప్రయాణికులు ఫీడ్‌బ్యాక్ ఇచ్చే అవకాశం

ఈనాడు, అమరావతి

గత నెల 31న రాత్రి నున్న స్టేషన్ పరిధిలో నివసించే అరుణ ఇంట్లో 20 కాసుల బంగారం చోరీకి గురైంది. పోలీసులు సీసీ కెమెరాలను పరిశీలించగా.. ఓ వ్యక్తి దొంగతనం చేసి ఆటోలో వెళ్తున్నట్లు కనిపించింది. ఆటోపై ఉన్న గుర్తులు కనిపించాయి. కానీ ఆ వాహనం నంబరు స్పష్టంగా రికార్డు కాలేదు. దర్యాప్తులో ఆమె మేనల్లుడే చోరీకి పాల్పడ్డాడని తేలింది.

..ఈ నేపథ్యంలో ఆటోలకు సంబంధించి నాలుగు వైపులా ఫొటోలు తీసుకోవడంతో పాటు సమస్త సమాచారాన్ని డేటాబేస్‌లో నిక్షిప్తం చేసేందుకు పోలీసులు మరో ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. ఇటీవలి కాలంలో ఎక్కువ మంది నిందితులు నేరం చేసి పారిపోయే సమయంలో ఆటోల్లో వెళ్తున్నారు. కేసులను త్వరితగతిన ఛేదించేందుకు డేటాబేస్‌లోని సమాచారాన్ని ఉపయోగించుకునేందుకు ప్రత్యేక యాప్ రూపొందించారు. ఏఐ ఆధారంగా పనిచేసే దీని లాగిన్, పాస్‌వర్డ్‌లను శాంతి భద్రతలు, ట్రాఫిక్ పోలీసులకు ఇచ్చారు.


యాప్‌లో ఫొటోలు, వివరాలు ఇలా..

అటు పోలీసులకు.. ఇటు ప్రయాణికులకు..

క్యూఆర్ కోడ్ రెండు రకాలుగా రూపొందించారు. పోలీసులు యాప్ ఓపెన్ చేసి స్కాన్ చేస్తే ఆటో వివరాలు కనిపిస్తాయి. ఇక ఆటో ఎక్కిన ప్రయాణికులు గమ్యస్థానం చేరిన తర్వాత క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి రేటింగ్ ఇవ్వొచ్చు. డ్రైవర్ ప్రవర్తన సరిగా లేకుంటే టెక్స్ట్ బాక్స్‌లో టైప్ చేయొచ్చు.

ప్రతి ఆటోకు క్యూఆర్ కోడ్

నగరంలో సుమారు 20వేల ఆటోలు తిరుగుతున్నాయి. ఇవి ప్రయాణికులను ఆయా గమ్యస్థానాలకు చేరవేస్తున్నాయి. ప్రస్తుతం వీటన్నింటి ఫొటోలు, వివరాలు నమోదు చేస్తున్నారు. దీని కోసం కృత్రిమ మేధ ఆధారంగా పనిచేసే ప్రత్యేక యాప్ రూపొందించారు. యాప్‌ను ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీసుల ఫోన్లలో ఇన్‌స్టాల్ చేశారు. వాహనం యజమాని పేరు, ఫొటో, ఆటో డ్రైవర్ ఫొటో, డ్రైవింగ్ లైసెన్సు వివరాలను ఇందులో నమోదు చేస్తున్నారు. ప్రతి ఆటోకు ఓ క్యూఆర్ కోడ్ ఇస్తున్నారు. ఇప్పటివరకు 2వేలకు పైగా ఆటోల వివరాలు సేకరించారు. ఈ స్టిక్కర్‌ను ఆటోలకు అతికించాల్సి ఉంటుంది.

రేటింగ్, ఫీడ్‌బ్యాక్ ఆధారంగా చర్యలు...

ప్రయాణికుల రేటింగ్, భద్రతపై ఫీడ్‌బ్యాక్ వివరాలను కృత్రిమ మేధ విశ్లేషించి నివేదిక ఇస్తుంది. దీన్ని లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ స్టేషన్లకు పంపుతారు. ఆ నివేదికలో ఆటో డ్రైవర్ తీరు బాగోలేదంటే పోలీస్ స్టేషన్‌కు పిలిపించి హెచ్చరిస్తారు. డ్రైవర్‌పై నిఘా పెడతారు.

తలతిప్పి చూడరు.. తప్పు దిద్దరు!


ఈనాడు, అమరావతి, న్యూస్‌టుడే, నందిగామ గ్రామీణ, గన్నవరం, హనుమాన్‌జంక్షన్

విస్తీర్ణం..సామాజిక వర్గం..సర్వే నంబర్లు తదితర విషయాల్లో తప్పుల్లేని పాసుపుస్తకాలను రైతులకు ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించింది. అయితే తప్పుల తడకగా ఉన్న వాటినే అధికారులు రైతులకిచ్చి సంతకాలు చేయించుకుని చేతులు దులుపేసుకున్నారు.

❖ ఉమ్మడి జిల్లాలో రీసర్వే చేసిన గ్రామాల్లో పంపిణీ చేసేందుకు 1,04,275 పాసుపుస్తకాలు వచ్చాయి. జనవరి 2 నుంచి 9 వరకు గ్రామ సభల్లో పంపిణీ చేశారు. చాలా పుస్తకాల్లో వైకాపా పాలనలో వచ్చిన తప్పులే పునరావృతం కావడంతో పాటు కొత్తవి వెలుగు చూశాయి. ❖ వీరులపాడు మండలం గూడెంమాధవరానికి చెందిన బట్టా శ్రీనివాసరావుకు పాత ఆర్ఎస్ఆర్ ప్రకారం 1.82 ఎకరాల పొలం ఉంది. వైకాపా పాలనలో పాసుపుస్తకంలో 1.72 ఎకరాలుగా నమోదు చేశారు. తాజాగా ఇచ్చిన పాసు పుస్తకంలో విస్తీర్ణం 1.03 ఎకరాలు ఉన్నట్లు చూపిస్తోంది. దీంతో రైతు ఆవేదన చెందుతున్నారు. ❖ బాపులపాడు మండలం బిళ్లనపల్లికి చెందిన కాకుల సుజాత, శశిధర్ తల్లీ కొడుకులు..ఇద్దరికీ వేర్వేరుగా పొలాలు ఉన్నాయి. వైకాపా పాలనలో ఇచ్చిన పాసుపుస్తకాల్లో తల్లి సర్వే నంబర్లు కొడుకు పాసుపుస్తకంలో ముద్రించారు. వీటిని సరి చేయాలని అనేక సార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. తాజాగా ఇచ్చిన పాసు పుస్తకాల్లోనూ ఇవే తప్పులున్నాయి. వీరిది బీసీ సామాజిక వర్గం. ఓసీ అని నమోదు చేశారు. ❖ గన్నవరం మండలం బొమ్ములూరుకు చెందిన రైతు శ్రీనివాస్‌ది ఓసీ సామాజిక వర్గం కాగా 'బీసీ-బీ'గా నమోదైంది. ❖ బీబీగూడెంలోనూ మరి కొందరు రైతులకీ ఇదే సమస్య ఎదురైంది.

❖ నందిగామ మండలం పల్లగిరికి చెందిన పవన్, రత్నకుమారి, రామకృష్ణకు కలిపి 60 సెంట్ల పొలం ఉండాలి. పాసు పుస్తకంలో 52సెంట్లుగా నమోదు చేశారు.

కొత్త పుస్తకాల్లోనూ విస్తీర్ణంలో తేడాలు



చేతులు దులుపేసుకున్నారు..

- పుస్తకాల ముద్రణకు ముందే నిశితంగా పరిశీలించి తప్పులు సరి చేయాలి. ఒకవేళ తప్పులున్న పుస్తకాలైతే పంపిణీ నిలిపేయాలని ప్రభుత్వం చెబుతున్నా అధికారులు రైతులకు ఇచ్చేశారు.
- వచ్చిన పుస్తకాల్లో 20 నుంచి 30శాతం వరకు తప్పులున్నవే. గ్రామ సభల సమయంలోనే చాలా ప్రాంతాల్లో రైతులు తప్పులను అధికారుల దృష్టికి తెచ్చినా తర్వాత సరి చేస్తామంటూ సంతకం చేయించుకుంటున్నారని వారు వాపోతున్నారు.

తప్పులు సరిచేస్తాం..

ఈ అంశమై కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల కలెక్టర్లు బాలాజీ, లక్ష్మీశ మాట్లాడుతూ 'తప్పులపై కసరత్తు చేసి అన్నీ సరి చేసి ఫిబ్రవరిలో తప్పుల్లేని పాస్‌పుస్తకాలు పంపిణీ చేస్తామని' తెలిపారు.

అలుపెరగని పోరు.. విజయాల జోరు..


అతిథి నుంచి పతకం అందుకుంటున్న శ్రీనివాస నాయక్

ఆయన వయసు 53.. విజయవాడ వాసి. ఆర్మ్‌డ్ రిజర్వ్ బెటాలియన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. మాస్టర్ అథ్లెటిక్స్‌లో సత్తా చాటుతూ జిల్లాకు పేరు తెచ్చారు. వరల్డ్ ఛాంపియన్‌షిప్ లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. హైదరాబాద్‌లో ఈ నెల 6, 7 తేదీల్లో జరిగిన ఆలిండియా మాస్టర్స్ స్పోర్ట్స్ ఛాంపియన్‌షిప్‌లో పోలీస్ ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ గునుగుల శ్రీనివాస నాయక్ సత్తా చాటి పలు పతకాలు కైవసం చేసుకున్నారు. 50+ పురుషుల విభాగంలో తలపడిన శ్రీనివాస నాయక్ 400 మీ.లు, 800 మీ.లు, 1500 మీ.ల పరుగు పోటీల్లో మూడు పసిడి పతకాలు సొంతం చేసుకున్నారు. ఈ ప్రతిభ ఆధారంగా త్వరలో థాయిలాండ్‌లో జరిగే ప్రపంచ మాస్టర్స్ స్పోర్ట్స్ ఛాంపియన్‌షిప్‌కు అర్హత సాధించారు. పలువురు పోలీసు అధికారులు, సిబ్బంది శ్రీనివాస నాయక్‌ను అభినందించారు.
- విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే

దుమ్ము దులిపేశారు..


బెంజిసర్కిల్ నుంచి రామవరప్పాడు రింగు వరకు జాతీయ రహదారిని, చెట్లను నీటితో శుభ్రం చేస్తూ..

దుమ్ము, ధూళి ఎగసిపడకుండా, కాలుష్యం తగ్గించేలా విజయవాడ నగరపాలక సంస్థ చర్యలు చేపట్టింది. కంట్రోల్ రూం నుంచి బెంజిసర్కిల్, అక్కడి నుంచి రామవరప్పాడు రింగు వరకు జాతీయ రహదారిని నీటితో శుభ్రం చేశారు. చెట్లకు పట్టిన ధూళిని దులిపేశారు. నగరపాలక సంస్థ కమిషనర్ ఆదేశంతో వారానికి రెండు రోజులు రోడ్లను శుభ్రం చేస్తామని సిబ్బంది తెలిపారు.
–ఈనాడు, అమరావతి



అడ్డంగా నిలిపేసి.. దారి మూసేసి..

నగరంలో ఉన్న ఇరుకు రోడ్లపై ప్రైవేటు ట్రావెల్స్ బస్సులను ఇష్టారాజ్యంగా రోజంతా నిలిపేస్తున్నారు. అటు వైపు కనీసం కారు కూడా వెళ్లలేని పరిస్థితి. దీంతో గాంధీనగర్, హనుమాన్‌పేట, పాతాసుపత్రి, కంట్రోల్ రూం సమీపంలో ఇతర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే వాగ్వాదానికి దిగుతున్నారు. ఇప్పటికైనా ట్రాఫిక్ పోలీసులు చర్యలు చేపట్టాలని వీరు కోరుతున్నారు. **-ఈనాడు, అమరావతి**

'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' నేడు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : జిల్లాలో ఈ నెల 19వ తేదీ సోమవారం 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. అన్ని మండల కేంద్రాలు, మున్సిపల్/ నగరపాలక సంస్థ, రెవెన్యూ డివిజనల్ కార్యాలయాల్లో అర్జీలు స్వీకరిస్తారని పేర్కొన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. జిల్లా స్థాయి రెవెన్యూ క్లినిక్ అందుబాటులో ఉంటుందని వివరించారు. **మీకోసం వెబ్‌సైట్‌లోనూ:** ప్రజలు తమ సమస్యల అర్జీలను మీకోసం వెబ్‌సైట్ meekosam.ap.gov.in లోనూ దాఖలు చేసుకోవచ్చని సూచించారు. దాఖలైన అర్జీల స్థితి, సంబంధిత సమాచారాన్ని తెలుసుకొనేందుకు 1100 నంబరుకు ఫోన్ చేయవచ్చన్నారు.

గుణదల పైవంతెన నిర్మాణానికి అనుమతులు

తుది దశకు

గుణదల ఒకటో డివిజన్ కార్మెల్‌నగర్ నుంచి మూడు వంతెనల మీదుగా కార్మెల్‌మార్గ్ రోడ్డుకు అనుసంధానం చేసే పైవంతెన నిర్మాణానికి అనుమతులు తుది దశకు చేరుకున్నాయి. సుమారు రూ.50 కోట్ల ఖర్చుతో ఈ వంతెనను నూరు శాతం రైల్వే నిధులతో నిర్మించేందుకు రంగం సిద్ధమైంది. గత ప్రభుత్వ హయాంలో దీనిని గతిశక్తి ప్రాజెక్టులో చేర్చారు. ఫలితంగా మొత్తం నిర్మాణ ఖర్చును రైల్వే శాఖ భరించేందుకు ముందుకు వచ్చింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఎంపీ కేశినేని శివనాథ్ చొరవతో పాలనాపరమైన అనుమతులు వచ్చాయి. తద్వారా ఈ వంతెనను పూర్తి స్థాయిలో రైల్వే శాఖ నిర్మిస్తుంది. **- మధురానగర్, న్యూస్‌టుడే**

రూ.36 కోట్ల ఖర్చుతో నిర్మించే ఈ పైవంతెన పనులకు 2009 ఫిబ్రవరి 19న శంకుస్థాపన చేశారు. నాలుగు పిల్లర్లు నిర్మించిన తరువాత పనులు ఆగిపోయాయి. కొంత భూసేకరణ జరగాల్సి ఉంది. ఇదేమీ చూడకుండానే పనులు ప్రారంభించి సగంలో ఆపేశారు. దాదాపు 15 సంవత్సరాల తర్వాత దీనికి సంబంధించిన భూసేకరణ పూర్తయింది. కాలువ గట్టుపై నివాసాలను తొలగించి మార్గం సుగమం చేశారు. హైటెన్షన్ విద్యుత్తు లైన్లను సైతం రైల్వే శాఖ తొలగించి వంతెన నిర్మించేందుకు అనుమతులు మంజూరయ్యాయి. రైల్వే డీఆర్ఎం ఇతర అధికారులతో నిరంతరం పైవంతెన నిర్మాణంపై సంప్రదింపులు జరపడంతో ఫైలు అనుమతుల ప్రక్రియ తుది దశకు చేరుకుంది.


నిలిచిపోయిన వారధి పనులు

ఫిబ్రవరిలో టెండర్లు

విజయవాడ - గుడివాడ రైలు మార్గం మీదుగా నిర్మించే ఈ పైవంతెన నిర్మాణానికి టెండర్లు పిలిచేందుకు సిద్ధం అయింది. రైల్వే శాఖ ఒకటి రెండు సమస్యలను తీర్చాలని కోరుతుండడంతో వాటిని ఫిబ్రవరిలోగా పూర్తి చేస్తామని అధికారులు చెబుతున్నారు. ఇవన్నీ పూర్తి చేసి ఫిబ్రవరి నాటికి టెండర్లు పిలుస్తారని విజయవాడ మధ్య ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు తెలిపారు. వంతెన నిర్మాణానికి టెండర్లు ఖరారు కాగానే పనులు ప్రారంభించి యుద్ధప్రాతిపదికన నిర్మాణం పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

వేలాది మందికి ప్రయోజనం

ఈ వంతెన పూర్తయితే వేలాది మందికి ప్రయోజనం చేకూరుతుంది. గుణదల-కర్మెల్‌నగర్ నిర్మాణం పూర్తయితే గుణదల నుంచి నున్నకు చేరుకునే మార్గం సుగమం అవుతుంది. విశాఖ రైల్వే లైనుపై మరో పైవంతెన నిర్మాణానికి రూ.112 కోట్లతో పైవంతెన నిర్మాణానికి అనుమతి వచ్చేసింది. ఈ రెండు వంతెనలు పూర్తయితే గుణదల నుంచి ఎక్కడా ఆగకుండా నున్న పవర్‌గ్రిడ్ వరకు రాకపోకలు సాగించవచ్చు. దీంతో అజిత్‌సింగ్‌నగర్, రామవరప్పాడు వంతెనలపై ట్రాఫిక్ రద్దీ తగ్గుతుంది. వాహనచోదకులకు ప్రయాణం సులువు అవుతుంది.

ఎన్టీఆర్ @12

సచివాలయాల సేవలపై ప్రజల్లో అసంతృప్తి

ఈనాడు డిజిటల్, మచిలీపట్నం

ఉమ్మడి కృష్ణా జిల్లాలోని గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల సేవలపై ప్రజలు అసంతృప్తి కనబరుస్తున్నారు. ఐవీఆర్ఎస్ ద్వారా ప్రభుత్వం వీరి సేవలపై ప్రజల అభిప్రాయాలు సేకరించగా సంతృప్తిలో విశాఖపట్నం తొలిస్థానం కాగా.. కృష్ణా 9, ఎన్టీఆర్ 12వ స్థానంలో నిలిచాయి. ప్రజలకు అందుబాటులో ఉండి జవాబుదారీతనంతో సేవలందించాల్సిన గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులు నిత్యం విమర్శలు ఎదుర్కొంటున్నారు. పురపాలికల్లో కౌన్సిల్.. మండల, జిల్లా ప్రజా పరిషత్, సర్వసభ్య సమావేశాల్లో ప్రజాప్రతినిధులు, పంచాయతీల సర్పంచులు, స్థానిక ప్రజలు, ఎమ్మెల్యేలు నిత్యం ఏదో ఒకచోట సచివాలయ ఉద్యోగుల తీరుపై ఫిర్యాదు చేస్తున్నారు. సమావేశాలు, క్షేత్రస్థాయి పనులు, సర్వేలంటూ ప్రజలకు అందుబాటులో ఉండకుండా ఎక్కువ మంది సిబ్బంది సేవలకు ఎగనామం పెట్టడమే దీనికి కారణం.

ఐవీఆర్ఎస్ సర్వేలో ప్రజాభిప్రాయాలు ఇలా..

సిబ్బంది అందుబాటులో ఉంటున్నారా?		
జిల్లా	అవును	లేదు
కృష్ణా	69.6	30.4
ఎన్టీఆర్	67.8	32.2
అనధికార వసూళ్లు ఉన్నాయా?		
"	27.5	72.5
	27.1	72.9
సిబ్బంది ప్రవర్తన ఎలా ఉంది..?	బాగుంది	బాగోలేదు
"	76.2	23.8
	75.7	24.3

గాడిన పడేనా..

జవాబుదారీగా వ్యవహరించాల్సిన సచివాలయాల సిబ్బందిలో కొందరు దారి తప్పుతున్నారు. దీంతో గ్రామ, వార్డు సచివాలయాలను, స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డులుగా ప్రభుత్వం మార్చింది. పాలనతో పాటు ఉద్యోగులను గాడిన పెట్టేలా మండల, మున్సిపాలిటీల్లో ప్రత్యేకాధికారులను కూడా నియమించింది.

మెరుగుపడితే ఇబ్బందులు తీరేను..

సచివాలయ ఉద్యోగులు రోజూ ఉదయం 10 నుంచి సాయంత్రం 5 వరకు విధులు నిర్వహించాలి. సర్వేలు, వివిధ పనులపై క్షేత్రస్థాయికి వెళ్లాల్సి వస్తే మూమెంట్ రిజిస్టర్‌లో సంతకాలు పెట్టాలి. కొందరు ఉద్యోగులు వీటిని పాటించట్లేదు. డిజిటల్ అసిస్టెంట్లు తప్పనిసరిగా కార్యాలయాల్లోనే ఉండాలి. చాలాచోట్ల వారూ డుమ్మా కొడుతున్నారు. అర్జీదారులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి. అవసరం లేకపోయినా తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల్లోని సిబ్బంది నుంచి సంతకాలు పెట్టించుకు రావాలని తిప్పుతున్నారు. అవినీతిలోనూ క్షేత్రస్థాయి సిబ్బంది ఆరోపణలు ఎదుర్కొంటున్నారు.

- సచివాలయ ఉద్యోగుల సేవలు గాడిన పెట్టేలా ప్రభుత్వం ముఖ ఆధారిత హాజరు తప్పనిసరి చేసింది. డుమ్మా కొడితే వేతనం నిలిపివేసేలా విధివిధానాలు రూపొందించింది. ఉద్యోగుల పనితీరుపై జిల్లా స్థాయి అధికారులు అప్పుడప్పుడు తనిఖీలు చేస్తే వీరిలో జవాబుదారితనం పెరుగుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

వెలగని దీపాలు.. గాలిలో ప్రాణాలు..




హనుమాన్‌జంక్షన్ నుంచి నూజివీడు వెళ్లే రహదారి విభాగిని మధ్యలో ఉన్న విద్యుత్తు స్తంభాల నిర్వహణ కొరవడింది. కొన్నింటికి దీపాలు లేవు. మరి కొన్ని స్తంభాలు నేలకొరిగాయి. కొన్నిచోట్ల విద్యుద్దీపాలు ప్రమాదకరంగా వేలాడుతున్నాయి. నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గంలోనూ, వంతెనపైన రాత్రివేళల్లో చీకట్లు అలముకుంటున్నాయని స్థానికులు, వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
-ఈనాడు, అమరావతి



మూడు గంటల్లో చక్కబెట్టేశారు

- రైలులో వచ్చిన బిహార్ ముఠా
- ఎలక్ట్రానిక్స్ షోరూమ్ చోరీ కేసులో ఆధారాలు

ఈనాడు, అమరావతి

ఎలక్ట్రానిక్స్ షోరూమ్‌లో చోరీ కోసమే రైల్లో వచ్చారు.. నేరుగా దుకాణం వద్దకు వెళ్లారు.. మూడో అంతస్తులోకి చొరబడి ఖరీదైన మొబైళ్లను చోరీ చేశారు.. బయటకు వచ్చి ఆటో పట్టుకుని రైల్వేస్టేషన్ చేరుకున్నారు.. తెల్లారేసరికి రైలెక్కి విశాఖపట్నం వెళ్లిపోయారు. కేవలం మూడు గంటల్లో పని పూర్తి చేసుకుని అంతే వేగంతో దొంగలు పారిపోయారు. ఎక్కడా వేలిముద్రలు పడకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. శనివారం ఉదయం విజయవాడ పటమటలోని ఓ ఎలక్ట్రానిక్స్ షోరూమ్‌లో జరిగిన భారీ చోరీకి సంబంధించి పలు కోణాలు వెలుగుచూస్తున్నాయి. ఇది ఆరుగురు సభ్యుల బిహార్ ముఠా పనిగా పోలీసులు భావిస్తున్నారు.

షోరూమ్‌లోని సీసీ కెమెరా కట్ చేసి.. బిహార్ ముఠా శనివారం తెల్లవారుజామున 3గంటల సమయంలో విజయవాడ స్టేషన్‌లో రైలు దిగింది. నేరుగా పటమటకు ఆటో మాట్లాడుకున్నారు. షోరూమ్ వద్ద దిగి నిర్మాణంలో ఉన్న అంతస్తులోకి చేరుకున్నారు. సీసీ కెమెరా వైర్లను కట్ చేశారు. వారి ఆనవాళ్లను నిఘా కెమెరాల్లో దొరక్కుండా జాగ్రత్తలు తీసుకున్నారు. అక్కడ నిర్మాణంలో భాగంగా ఉన్న సామగ్రిని తొలగించి లోపలకు వెళ్లి రూ.18లక్షల విలువైన 52 సెల్‌ఫోన్లను చోరీ చేశారు. మొబైళ్లను తమ వెంట తెచ్చుకున్న బ్యాగుల్లోకి సర్దుకుని ఉదయం 5.45గంటలకు బయటపడ్డారు. పటమటలో ఆటో మాట్లాడుకుని తిరిగి రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు.


రైల్వేస్టేషన్ సీసీ ఫుటేజీలో బిహార్ ముఠా

రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ ఎక్కారు: రైల్వేస్టేషన్‌లో విజయవాడ నుంచి విశాఖపట్నం వెళ్లే రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ ఎక్కారు. వీరు ఎక్కిన ఆటో, రైల్వేస్టేషన్‌లో వీరి కదలికలు రైల్వేస్టేషన్‌లోని నిఘా కెమెరాల్లో రికార్డు అయ్యాయి. వాటి ఆధారంగా బిహార్‌కు చెందిన ముఠాగా పోలీసులు నిర్ధారణకు వచ్చారు. రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ ఎక్కి విశాఖపట్నం స్టేషన్‌లో దిగినట్లు తేలింది.

టవర్ డంప్ విశ్లేషణ: దొంగల్లో ఒకరు రైల్వేస్టేషన్ మొబైల్‌లో మాట్లాడడం కనిపించింది. రైల్వేస్టేషన్ పరిసరాల్లోని సెల్ టవర్ల ఇన్‌కమింగ్, అవుట్‌గోయింగ్ కాల్స్‌పై పోలీసులు దృష్టి సారించారు. వేలాది కాల్స్‌ను వడపోస్తున్నారు. దర్యాప్తు కోసం ప్రత్యేక బృందం ఒకటి విశాఖపట్నం వెళ్లింది.

తెలిసిన వారి పనేనా?: షోరూమ్‌లో పనిచేసి ఇటీవల మానేసిన వారి వివరాలను పోలీసులు పరిశీలిస్తున్నారు. గతంలో కొందరు బిహార్‌కు చెందిన వారు పనిచేసినట్లుగా గుర్తించారు. షాపు గురించి తెలిసిన వారు ఇచ్చిన సమాచారంతోనే పక్కాగా చోరీకి పాల్పడినట్లుగా అనుమానిస్తున్నారు.

36 గంటలు.. 48,535 వాహనాలు

విజయవాడ-హైదరాబాద్ ఎన్‌హెచ్‌పై రద్దీ

విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై సంక్రాంతి తిరుగు ప్రయాణాల రద్దీ కొనసాగుతోంది. ఆదివారం అమావాస్య నేపథ్యంలో చాలా మంది శనివారమే తిరుగు పయనమయ్యారు. దీంతో ఆదివారం భారీ రద్దీ లేదు. గొల్లపూడి, ఇబ్రహీంపట్నం కీసర, వైజంక్షన్ దగ్గర వాహనాలు సజావుగానే సాగిపోయాయి. ★ శనివారం ఉదయం 6 గంటల నుంచి ఆదివారం సాయంత్రం 6 వరకు 36 గంటల్లో 48,535 వాహనాలు కీసర టోల్‌ప్లాజా మీదుగా వెళ్లినట్లు నమోదైంది. రాత్రి వరకు ఇదే స్థాయిలో రద్దీ కొనసాగుతుందని, 53వేలకు పైగా వాహనాలు వెళ్లే అవకాశం ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ★ వీరు కాకుండా సంక్రాంతికి హైదరాబాద్ నుంచి ద్విచక్రవాహనాలపై వచ్చిన వారు 5వేలకు పైగా తిరుగు ప్రయాణంలో వెళ్లినట్లు తెలుస్తోంది. విశాఖ, ఉభయ గోదావరి, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల నుంచి హైదరాబాద్‌కు ఈ దారిలోనే వెళుతున్నారు. పశ్చిమ బైపాస్‌పై రాకపోకలు అనుమతించడంతో విజయవాడ నగరానికి రద్దీ తగ్గింది. ★ రద్దీ కూడళ్లలో పోలీసులను మోహరించి ట్రాఫిక్ సజావుగా సాగేలా చూశారు. రాత్రికి రద్దీ పెరిగే అవకాశం ఉన్నందుకు డ్రోన్ కెమెరాలతో ఎప్పటికప్పుడు ట్రాఫిక్‌ను అంచనా వేస్తూ సమస్య వచ్చిన చోటుకు సిబ్బందిని పంపిస్తున్నారు. వైజంక్షన్ దగ్గర సర్వీస్ రహదారికి మరమ్మతులు చేయించడం, వేగ నియంత్రికలు ఏర్పాటు చేయడంతో ఇబ్బంది లేకుండా వాహనాలు సాగిపోయాయి.


కీసర టోల్‌గేట్ వద్ద వాహనాల బారులు


విజయవాడ బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ

- ఉత్తరాంధ్ర, రాయలసీమతో పాటు వివిధ ప్రాంతాల నుంచి విజయవాడ వచ్చే ప్రయాణికులు.. విజయవాడ నుంచి హైదరాబాద్ వెళ్లే వారు..జిల్లా వెలుపల ప్రయాణించే వారితో విజయవాడ పండిట్ నెహ్రూ బస్టాండ్ కిటకిటలాడింది. టికెట్ కౌంటర్ల దగ్గర పెద్ద వరుసలు దర్శనమిచ్చాయి. స్త్రీశక్తి పథకం ఉన్నందున మహిళా ప్రయాణికులు కిక్కిరిశారు. బస్సులన్నీ ప్రయాణికులతో నిండిపోయాయి.

- ఈనాడు, అమరావతి

పాడి రైతుకు.. 100శాతం దన్ను

★ పశుగ్రాస, నర్సరీల నిర్వహణకు ప్రభుత్వం భరోసా

★ రెండేళ్లలో రూ.56,488 నుంచి రూ.1,05,016 వరకు లబ్ధి

ఈనాడు, అమరావతి

వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా జిల్లాలో దాదాపు యంత్రాలతోనే పైరు కోస్తున్నారు. దీంతో పశుగ్రాసం కొరత వేధిస్తోంది. విజన్-2047లో భాగంగా పాల ఉత్పత్తిని గణనీయంగా పెంచాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. దీనికి పరిష్కారంగా 100శాతం రాయితీపై హరిత గోపాలం..పశుగ్రాస పెంపకం పేరుతో ప్రభుత్వం కొత్త పథకానికి శ్రీకారం చుట్టింది. రైతు పైసా పెట్టుబడి పెట్టకుండా మొత్తం ఉపాధి హామీ పథకం ద్వారానే నిధులు సమకూర్చేందుకు నిర్ణయించారు.

వ్యక్తిగతంతో పాటు సంఘాలకు అవకాశం..

★ వ్యక్తిగత లబ్ధిదారులకు వారి సొంత స్థలంలో 2 ఏళ్లు పశుగ్రాస పెంపకం చేపట్టేందుకు కనీసం 25 సెంట్లు, గరిష్ఠంగా ఎకరం ఉండొచ్చు. మొదటి ఏడాది 30,700, రెండో ఏడాది రూ.25,788 మొత్తంగా ఎకరానికి రూ.56,488 వేతనం రూపంలో చెల్లిస్తారు. ఆ భూమిలో తప్పనిసరిగా నీటి పారుదల సౌకర్యం ఉండాలి. అద్దె, లీజు భూముల్లో నిర్వహించేందుకు పథకం వర్తించదు.

★ స్వయం సహాయక, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు అందులోని పాడి రైతుల అవసరాల కోసం.. ప్రభుత్వ, సంఘాల, గ్రామంలోని దేవాలయాల భూముల్లో పశుగ్రాస పెంపకం చేపట్టవచ్చు. దీనికి కనీసం ఎకరం నుంచి గరిష్ఠంగా 5 ఎకరాల వరకు భూమి ఉండాలి. రెండేళ్లకు రూ.56,488 వేతన రూపంలో చెల్లిస్తారు. పశుగ్రాస పెంపకంలో సూపర్‌నేపియర్ వంటి మెరుగైన గడ్డి రకాల పెంపకానికే అనుమతి.

పూర్తి రాయితీతో..

★ భూమి చదును, గట్ల ఏర్పాటు, కణుపులు నాటేందుకు, కలుపు తొలగించేందుకు, కాంప్లెక్స్, యూరియా, కంపోస్టు ఎరువుల తయారీ, కొనుగోలుకు, గడ్డికోతకు, నీటి నిర్వహణకు, నర్సరీల్లో కణుపులు కొనుగోలు, కాండం కత్తిరింపులు, ఎరువులు వేసినందుకు ఇలా అన్ని పనులకు విడతల వారీగా వేతనాలు చెల్లిస్తారు.

నిబంధనలు ఇలా..

★ పశుగ్రాస పెంపకం చేపడుతున్న రైతులకు అవసరమైన పశుగ్రాస కణుపులు ఉచితంగా సరఫరా చేసేందుకు ఈ నర్సరీలు ఏర్పాటు చేయాలి. ఈ నర్సరీలు ఏర్పాటు చేసి రెండేళ్లు నిర్వహించుకునేందుకు మొదటి ఏడాది రూ.55,666, రెండో ఏడాది రూ.49,350 కలిపి ఎకరానికి రూ.1,05,016 ఆర్థిక సాయం చేస్తున్నారు. ★ ఈ నర్సరీలు సొంత భూమితో పాటు అనుమతులతో ప్రభుత్వ, సంఘ, దేవాదాయ, వ్యవసాయ శాఖకు సంబంధించిన కృషి విజ్ఞాన కేంద్రం ఖాళీ భూముల్లో చేపట్టవచ్చు. అద్దె, లీజు భూములకు

ఎన్టీఆర్ చిత్రాలపై ఫొటో ఎగ్జిబిషన్

నందిగామ, నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకుని ఎన్టీఆర్ జిల్లా నందిగామలో ఆదివారం అఖిలభారత ఎన్టీఆర్ అభిమాన సంఘాల ఉపాధ్యక్షుడు వడ్డెల్లి సాంబశివరావు ఏర్పాటుచేసిన ఫొటో ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. ఎన్టీఆర్ నటించిన తొలి చిత్రం మనదేశం నుంచి ఆఖరుగా నటించిన చిత్రం మేజరు చంద్రకాంత్, చివరిగా విడుదలైన శ్రీనాథకవి సార్వభౌమ(1993) వరకు 302 సినిమాలకు సంబంధించి అరుదైన చిత్రాలను సేకరించి ఈ ప్రదర్శన ఏర్పాటుచేశారు. సీనియర్ సిటిజన్ వీరమాచినేని బసవయ్య ఈ ప్రదర్శనను ప్రారంభించారు. ఎన్టీఆర్ ఆ కాలంలో ధరించిన పంచె, చొక్కాను కూడా ప్రదర్శించారు. భావి తరాలకు ఎన్టీఆర్ గురించి తెలియాలనే ఈ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశానని చెప్పారు. మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు తదితరులు ప్రదర్శనను తిలకించి నిర్వాహకుడిని అభినందించారు.



ఎన్టీఆర్ ధరించిన పంచె, చొక్కా చూపుతున్న సాంబశివరావు



తిలకిస్తున్న మాజీ మంత్రి ఉమామహేశ్వరరావు తదితరులు

ఈఎస్ఎల్ ప్రాంతీయ సమరానికి సై

నేటి నుంచి సెంట్రల్ ఆంధ్రా స్థాయి ఈనాడు క్రికెట్ పోటీలు

గుంటూరు క్రీడలు, తాడికొండ, న్యూస్‌టుడే: 'ఈనాడు స్పోర్ట్స్ లీగ్' (ఈఎస్ఎల్) టోర్నమెంట్‌లో ప్రాంతీయ సమరానికి రంగం సిద్ధమైంది. క్రికెట్‌లో ప్రతిభావంతులను వెలుగులోకి తీసుకురావడమే లక్ష్యంగా నిర్వహిస్తున్న 'ఈఎస్ఎల్' పండగ రెండో దశకు చేరుకుంది. 'ఈనాడు క్రికెట్ సంబరం' సెంట్రల్ ఆంధ్రా స్థాయి పోటీలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. గత నెలలో జిల్లా స్థాయిలో పోటీలు జరిగాయి. ఆ టోర్నమెంట్‌లో ప్రథమ స్థానం సాధించిన జూనియర్స్, సీనియర్స్ జట్లు ఇప్పుడు ప్రాంతీయ స్థాయిలో నిర్వహించే పోటీల్లో తలపడనున్నాయి. దీనికోసం గుంటూరు సమీప మోతడకలోని చలపతి హిల్ వ్యూ స్టేడియాన్ని ముస్తాబు చేశారు. ఈ పోటీలు నాకౌట్ పద్ధతిలో నిర్వహిస్తారు. గుంటూరు, కృష్ణా, పశ్చిమ గోదావరి, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో విజేతలుగా నిలిచిన జట్లు ఈ టోర్నమెంట్‌లో తలపడనున్నాయి. నిర్ణీత 20 ఓవర్లలో పోటీలు జరగనున్నాయి.

వేదిక: చలపతి హిల్ వ్యూ స్టేడియం, మోతడక

సీనియర్స్: మొదటి మ్యాచ్ (ఉదయం) గుంటూరు × పశ్చిమ గోదావరి

జూనియర్స్: రెండో మ్యాచ్ (మధ్యాహ్నం) గుంటూరు × కృష్ణా

పగడ్బందీగా ట్రాఫిక్ నియంత్రణ

ఇబ్రహీంపట్నం, విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : జాతీయ రహదారిపై వాహనాల రద్దీని అదుపు చేయడానికి అన్ని చర్యలు చేపట్టినట్లు ట్రాఫిక్ డీసీపీ షేక్ షిరీన్ బేగం తెలిపారు. ఆదివారం ఇబ్రహీంపట్నం రింగుకూడలి వద్ద ఆమె మీడియాతో మాట్లాడారు. సంక్రాంతిని పురస్కరించుకొని హైదరాబాద్ నుంచి ఆంధ్రాకు లక్షకు పైగా వాహనాలు వచ్చాయని చెప్పారు. సెలవులు ముగియడంతో వారందరూ తిరుగు ప్రయాణం చేపట్టారన్నారు. ఈ సందర్భంగా శనివారం మధ్యాహ్నం నుంచి హైదరాబాద్ వైపు 30 వేల వాహనాలు వెళ్లాయని వెల్లడించారు. వాహనాలు ఆగకుండా ఉండేందుకు డ్రోన్ సాయంతో అన్ని ప్రాంతాల్లో ట్రాఫిక్‌ను పర్యవేక్షించి భారీ వాహనాలు, ఎగుమతి చేసే లారీలను ఆయా ప్రాంతాల్లో నిలుపుదల చేశామన్నారు. మరి కొన్ని వాహనాలను గొల్లపూడి, ఇబ్రహీంపట్నం వైపు రాకుండా మళ్లించామన్నారు. ఆదివారం రాత్రికి మరో 30 వేల వాహనాలు హైదరాబాద్ వైపు వెళ్లే అవకాశం ఉందని చెప్పారు. కార్యక్రమంలో ఏడీసీపీ రామకృష్ణ, ఏసీపీ దుర్గారావు, సీఐ చంద్రశేఖర్, ట్రాఫిక్ ఎస్సైలు కృష్ణ, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.



డ్రోన్ సాయంతో ట్రాఫిక్ పరిస్థితిని సమీక్షిస్తున్న డీసీపీ షిరీన్ బేగం

పోలీసు అధికారుల ఆత్మీయ సమ్మేళనం



కార్యక్రమంలో 1989 బ్యాచ్ పోలీస్ అధికారులు

పటమట, న్యూస్‌టుడే: కాలం మారింది.. బాధ్యతలు పెరిగాయి.. కానీ వారి స్నేహబంధం మాత్రం చెక్కు చెదరలేదు. ఉమ్మడి రాష్ట్రం నుంచి విడిపోయిన తర్వాత ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో వివిధ బాధ్యతల్లో కొనసాగుతున్న 1989 బ్యాచ్ పోలీసు అధికారులు ఆదివారం విజయవాడ గురునానక్ కాలనీలోని ఎన్ఎస్ కల్యాణ మండపంలో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో కలుసుకున్నారు. 1989లో 434 మంది సబ్ ఇన్‌స్పెక్టర్లుగా బాధ్యతలు స్వీకరించారు. ఐపీఎస్, ఏఎస్పీ, డీఎస్పీలుగా వివిధ హోదాల్లో పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన వారు.. ప్రస్తుతం ఉద్యోగాల్లో కొనసాగుతున్నవారు అందరూ ఒకచోట చేరి శిక్షణ రోజుల్లోని కష్టాలు.. తొలి పోస్టింగ్ అనుభవాలు.. విధుల్లో ఎదురైన సవాళ్లు.. సాధించిన విజయాలు.. కుటుంబ సభ్యుల బాగోగులు పరస్పరం గుర్తు చేసుకుని ఆనందం పంచుకున్నారు. తమతో పాటు శిక్షణ పొంది మృతి చెందిన 63 మంది మిత్రులకు నివాళులర్పించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు ఉత్సాహంగా సాగాయి. భవిష్యత్తులోనూ ఇలాంటి సమావేశాలు కొనసాగిస్తూ స్నేహబంధాన్ని బలోపేతం చేయాలని నిర్ణయించుకున్నారు. తెలంగాణలోని నిజామాబాద్ సీపీగా పనిచేసి ఉద్యోగ విరమణ చేసి వర్ధన్నపేట ఎమ్మెల్యేగా ఎన్నికైన నాగరాజు హాజరై తన బ్యాచ్ సభ్యులతో ఉత్సాహంగా గడిపారు. కమిషనరేట్ నుంచి ఏడీసీపీలు గున్నం రామకృష్ణ, ఎన్.మురళీకృష్ణ, రమణమూర్తి, ఉమ్మడి రాష్ట్రం నుంచి సుమారు 200 మంది సభ్యులు పాల్గొన్నారు.

ధర వరలు

వంకాయలు-24/28, టమాటా-20, బెండ-22, పచ్చిమిర్చి-35, కాకర-46, బీర-28, క్యాలీ ఫ్లవర్-25/20, క్యాబేజి-22, క్యారెట్-35, దొండ-46, బంగాళదుంప-22, ఉల్లిపాయలు-26, గోరుచిక్కుళ్లు-32, దోస-30/40, సొర-12, పొట్ల-30, అరటికాయ-7/8, చామదుంప-24, అల్లం-68, ఆకు కూరలు (కట్ట)-2.50, కంద-44, బీట్ రూట్-26, కీరదోస-32, బీన్స్-65/60, క్యాప్సికమ్-60, నిమ్మ (డజను)-18/24, కొత్తిమీర-5/10, పుదీనా-5/15, ముల్లంగి-8, (నిన్నటివి). నగరంలోని రైతు బజార్లలో ఈ ధరలు (రూ.ల్లో) వర్తిస్తాయి. - ఎన్టీఆర్ కలెక్టరేట్, విజయవాడ

తెలుగువారి సాంస్కృతిక చిహ్నం.. శ్రీకృష్ణదేవరాయలు

హైడ్రా కమిషనర్ ఆవుల రంగనాథ్

విజయవాడ (గాంధీనగర్), న్యూస్‌టుడే : తెలుగు వారి సాంస్కృతిక వైభవానికి చిహ్నం శ్రీకృష్ణ దేవరాయలని హైడ్రా (హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ) కమిషనర్ ఆవుల రంగనాథ్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ శ్రీకృష్ణదేవరాయ ఉద్యోగ ఐకాస ఆధ్వర్యంలో ఆదివారం విజయవాడ, హనుమాన్‌పేటలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన శ్రీకృష్ణదేవరాయల జయంతి వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. సమాజంలో విశిష్ట సేవలు అందించిన వ్యక్తులకు గుంటూరు విరూపాక్ష పీఠాధిపతి గభిరానంద స్వామి చేతుల మీదుగా రాయల పురస్కారాలు అందించడం గౌరవప్రదంగా ఉందన్నారు. ఇలాంటి సమావేశాలు కాపు ఉద్యోగుల్లో ఐక్యతను పెంపొందిస్తాయన్నారు. కాపు ఉద్యోగులు అందరితో ఐకమత్యంగా ఉంటూ రాయల వారసులుగా సామాజిక బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. శ్రీకృష్ణదేవరాయ ఉద్యోగ ఐకాస రాష్ట్ర కన్వీనర్ సోమరౌతు రామకృష్ణ మాట్లాడుతూ.. శ్రీకృష్ణ దేవరాయల జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. కాపు ఐకాస ద్వారా సమాజ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. కాపు రాక్స్ వ్యవస్థాపకుడు పెద్దిరెడ్డి శివ భాస్కర్, ఐకాన్ వ్యవస్థాపకుడు మిండు చక్రపాణి, రవాణా శాఖ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి రాజ్యలక్ష్మి, సాఫ్ట్‌వేర్ కంపెనీ అధినేత ఎల్.మదన్ మోహన్ తదితరులకు శ్రీకృష్ణదేవరాయల పురస్కారాలు అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఐకాస నాయకులు సి.హెచ్ శ్రీనివాస్, బి.శ్రీనివాస్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల ఐకాస నాయకులు, పెద్ద సంఖ్యలో కాపు ఉద్యోగులు పాల్గొన్నారు.



కమిషనర్ రంగనాథ్‌కు పురస్కారం అందించి సత్కరిస్తున్న గభిరానంద స్వామి, రామకృష్ణ, కాపు ఐకాస నాయకులు

అటకెక్కిన దుర్గగుడి కాలిబాట

వైకాపా పాలనలో పట్టించుకోని పాలకులు

గత తెదేపా ప్రభుత్వం ఖర్చుచేసిన రూ.1.20 కోట్లు వృథా

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే

బెజవాడ దుర్గమ్మ దర్శనానికి వచ్చే భక్తుల కోసం ఆహ్లాదకర వాతావరణంలో రావిచెట్టు సెంటరు నుంచి కాలిబాట మార్గంలో నేరుగా ఘాట్ రోడ్డులోకి చేరే విధంగా చేపట్టిన అభివృద్ధి పనులు అటకెక్కాయి. వైకాపా పాలనలో పాలకులు ఈ విషయాన్ని పూర్తిగా విస్మరించారు. రాష్ట్ర విభజన తర్వాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం దుర్గగుడి అభివృద్ధిలో భాగంగా సమీపంలోని ఇళ్లను తొలగించారు. రావి చెట్టు సెంటరు కొండ ప్రాంతాన్ని రూ.1.20 కోట్ల వ్యయంతో చదును చేసి 2018లో గ్రీనరీ అభివృద్ధి చేశారు.

▮ రావిచెట్టు సెంటరు నుంచి దుర్గగుడి ఘాట్ రోడ్డుకు కొండపై నుంచి వెళ్లే విధంగా నడక మార్గాన్ని కొంత మేర అభివృద్ధి చేశారు. ఘాట్ రోడ్డుకు రావిచెట్టు సెంటరుకు మధ్యలో ఒక చోట లోయ ఉండడంతో పనులు ముందుకు సాగలేదు. అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఏడీసీ) అధికారులకు అప్పటి తెదేపా ప్రభుత్వం అప్పగించింది.

▮ ప్రస్తుతం ఈ మార్గాన్ని అనుసంధానం చేయకుంటే ఇప్పటి వరకు చేసిన అభివృద్ధి నిరుపయోగంగా ఉంటుందని అధికారులే చెబుతున్నారు. నడక మార్గం ఘాట్ రోడ్డు కలిపేందుకు ఒక చిన్న బ్రిడ్జి ఏర్పాటు చేస్తే సరిపోతుందని భక్తులు పలుమార్లు దేవస్థానం అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. కానీ ప్రయాజనం లేదని వాపోతున్నారు.

▮ రావిచెట్టు సెంటరు నుంచి నేరుగా దుర్గగుడి ఘాట్ రోడ్డుకు వచ్చే కాలినడక మార్గం పనులు నిలిచిపోవడంపై దేవస్థానం పాలకమండలి ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణను సంప్రదించగా.. గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు దుర్గగుడి అభివృద్ధి క్రమంలో చేసిన ప్రతిపాదనలు పరిశీలిస్తామన్నారు. అమ్మవారి దర్శనం చేసుకునే భక్తుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో కాలినడక మార్గం భక్తులకు ఉపయోగ పడితే కనెక్టివిటీ బ్రిడ్జి నిర్మాణం ఎంత వరకు సాధ్యమో పాలకమండలి సమావేశంలో చర్చించిన తర్వాత నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.



పనులు నిలిపి వేయడంతో పెరిగిన పిచ్చిమొక్కలు

మహా కుంభాభిషేకం ముహూర్తంపై చర్చ

శృంగేరి పీఠాన్ని సంప్రదించని వైదిక కమిటీ

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: శ్రీదుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో మహాకుంభాభిషేకం ముహూర్తంపై ఇంద్రకీలాద్రిపై చర్చ మొదలైంది. దేవస్థానంలో ఆగమ, వైదిక పరంగా నిర్ణయం తీసుకోవాలన్నా దేవస్థానం వైదిక కమిటీ సభ్యులు శృంగేరి పీఠాధిపతిని సంప్రదించిన తర్వాత నిర్ణయం తీసుకోవడం సంప్రదాయంగా వస్తుంది. 2012లో మహా కుంభాభిషేకం నిర్వహించారు. తిరిగి 2024 చేయాల్సి ఉన్నా దేవస్థానం వైదిక కమిటీ సభ్యులు, అధికారులు ఈ విషయాన్ని పక్కన పెట్టారు. రెండేళ్ల ఆలస్యమైనప్పటికీ ముహూర్తం నిర్ణయించాల్సిన సమయంలో వైదిక కమిటీ సభ్యులు శృంగేరి పీఠాన్ని సంప్రదించకుండా కాలాయాపన చేస్తున్నారు. మార్చి 3న చంద్ర గ్రహణం ఉంది. గ్రహణానికి ముందు, తర్వాత వారం రోజుల వ్యవధిలో మహా కుంభాభిషేకం నిర్వహించరాదని పండితులు చెబుతున్నారు. వైదిక కమిటీ మాత్రం మార్చి మొదటి వారంలో చేయాలని నిర్ణయించినట్లు ప్రచారం జరుగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం నియమించిన దుర్గగుడి ఆస్థాన సిద్ధాంతిని కూడా దేవస్థానం వైదిక కమిటీ ఇంతవరకు సంప్రదించలేదు. వైదిక కమిటీ సభ్యులు, వేదపండితుల్లో కూడా మార్చి మొదటి వారంలో ముహూర్తం నిర్ణయించడంపై భేదాభిప్రాయాలు స్పష్టమవుతున్నాయి. ఈ విషయం దుర్గగుడి ఈవో శీనానాయక్‌ను సంప్రదించగా మహాకుంభాభిషేకం ముహూర్తంపై వైదిక కమిటీతో సమావేశం నిర్వహించిన తర్వాత నిర్ణయం తీసుకుంటామన్నారు. శృంగేరి పీఠంనా.. కంచి పీఠం సహకారం తీసుకోవాలా..? అన్న విషయాన్ని పరిశీలిస్తామని తెలిపారు.

టెన్నిస్ లీగ్ పోటీల్లో శ్రీమతి సత్తా

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: స్థానిక ఐజీఎంసీ స్టేడియంలోని టెన్నిస్ కాంప్లెక్స్‌లో జరుగుతున్న అస్మిత ఖేలో ఇండియా సౌత్ జోన్ సాఫ్ట్ టెన్నిస్ మహిళల లీగ్ పోటీల్లో సబ్ జూనియర్ విభాగంలో శ్రీమతి(తమిళనాడు) ఛాంపియన్‌షిప్ కైవసం చేసుకుంది. సబ్ జూనియర్స్‌లో ఏఎస్ వైశాలి(ఆంధ్రప్రదేశ్, ద్వితీయ), రీత్యా, శస్టిగా(తమిళనాడు) సంయుక్తంగా తృతీయ స్థానాల్లో నిలిచారు. సబ్ జూనియర్ డబుల్స్ కేటగిరీలో శ్రీమతి, అనిలా(తమిళనాడు) జోడీ, శృతిలయ, రిషిక(తమిళనాడు) జోడీలు ఫైనల్స్‌లో ప్రవేశించగా.. జూనియర్స్ డబుల్స్ కేటగిరీలో నిషాలిని, తమిళ్వజి(తమిళనాడు) జోడీ, సాధన, నరుమూగయ్ (తమిళనాడు) జోడీలు ఫైనల్స్‌కు చేరుకున్నాయి. సీనియర్స్ కేటగిరీలో రాగశ్రీ, శ్వేత(తమిళనాడు) జోడీ, శరణ్య, హమృత (తమిళనాడు) జోడీ ఫైనల్స్‌లో ప్రవేశించాయి. పోటీలు సోమవారం ముగియనున్నాయి.

రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్‌లో సత్తా

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: తూర్పు గోదావరి జిల్లా రామచంద్రపురంలో ఈ నెల 14 నుంచి 17వ తేదీ వరకు జరిగిన 15వ ఆలిండియా, 21వ ఆంధ్రప్రదేశ్ బాస్కెట్‌బాల్ పోటీల్లో ఉమ్మడి కృష్ణా జిల్లా పరిధిలోని పలు జట్లు సత్తా చాటి ట్రోఫీలు కైవసం చేసుకున్నాయని జిల్లా బాస్కెట్‌బాల్ సంఘం అధ్యక్షుడు గుత్తికొండ సుభాష్ చంద్రబోస్ తెలిపారు. బాలుర అండర్-14 విభాగంలో నగరంలోని సీబీఏ(సిటీ బాస్కెట్‌బాల్ అసోసియేషన్) జట్టు విన్నర్ ట్రోఫీ కైవసం చేసుకోవడంతో పాటు బాలికల విభాగంలో గన్నవరంలోని సెయింట్ జాన్స్ హయ్యర్ సెకండరీ స్కూల్ జట్టు తృతీయ స్థానంలో నిలిచింది. సీనియర్ బాలికల విభాగంలో నాల్గో స్థానం సాధించిందని ఆయన పేర్కొన్నారు. విజేతలను సంఘ సభ్యులు అభినందించారు.



ట్రోఫీలు సాధించిన క్రీడాకారులతో సంఘ ప్రతినిధులు

నేటి నుంచి బాలికల కబడ్డీ పోటీలు

27 రాష్ట్రాల నుంచి 400 మంది క్రీడాకారుల రాక

గుడివాడ, న్యూస్‌టుడే : గుడివాడ ఎన్టీఆర్ స్టేడియంలో నేటి నుంచి 23 వరకు నిర్వహించే 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ అండర్- 14 బాలికల కబడ్డీ పోటీలకు 27 రాష్ట్రాల నుంచి క్రీడాకారులు తరలి వస్తున్నారు. ఐదు రోజుల పాటు దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి 400 మంది క్రీడాకారులు పాల్గొని సందడి చేయనున్నారు. దీనికి ఆంధ్రప్రదేశ్, కృష్ణా జిల్లా కబడ్డీ కమిటీల వారు ఏర్పాట్లు పూర్తి చేశారు. గుడివాడ ఎన్టీఆర్ స్టేడియం డార్మెటరీలో 10 రాష్ట్రాల జట్లకు, అక్కినేని నాగేశ్వరరావు కళాశాలలో 9 రాష్ట్రాల జట్లు, వలివర్తిపాడు రోడ్డులోని లలిత విద్యాలయంలో మిగిలిన జట్లకు వసతి సౌకర్యం కల్పించారు. క్రీడాకారులకు ఎన్టీఆర్ ఇండోర్ స్టేడియంలో కేంద్ర ప్రభుత్వ క్రీడా శాఖ సూచించిన మెనూ ప్రకారం భోజన, అల్పాహార ఏర్పాట్లు చేశారు. పోటీలను పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి, ఏపీ ఎస్టీఎఫ్ ఛైర్మన్ కోన శ్రీధర్, రాష్ట్ర మంత్రి నారా లోకేశ్, పలువురు మంత్రులు ప్రారంభిస్తారు. పోటీల ఏర్పాట్లను గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పర్యవేక్షిస్తున్నారు.



స్టేడియంలో కోర్టుల ఏర్పాటు

వాహనాల వెలుగులోనే ప్రయాణాలు

చెన్నై- కోల్‌కతా జాతీయ రహదారిపై సెంట్రల్ లైటింగ్ విద్యుత్తు దీపాలు ఎక్కడా వెలగడం లేదు. సంక్రాంతి ముగియడంతో తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి హైదరాబాద్‌కు వెళ్లే వాహనాల లైట్లే.. వీధి దీపాలుగా దర్శనమిస్తోంటే చూడముచ్చటగా ఉన్నాయి. శుక్రవారం సాయంత్రం నుంచి ఆదివారం అర్ధరాత్రి వరకు విజయవాడ పశ్చిమ బైపాస్, చెన్నై- కోల్‌కతా జాతీయ రహదారి పరిసరాల్లో ఎటు చూసినా వాహనాలే. ఈ నేపథ్యంలో చిన్నఅవుటపల్లి జీరో కటింగ్ వద్ద ఆతుక్కూరు ఎస్సై మూర్తి బృందం దగ్గర ఉండి వాహనదారులకు దారి మళ్లిస్తూ ట్రాఫిక్‌ను నియంత్రించారు. - న్యూస్‌టుడే, గన్నవరం గ్రామీణం



బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -157 రిటైల్ ధర 184 చికెన్ విత్ స్కిన్ -267 చికెన్ స్కిన్‌లెస్ - 304.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 180, 189, 200 చికెన్ విత్ స్కిన్ - 350 చికెన్ స్కిన్‌లెస్ - 360.

25న ఎంబీవీకేలో జాతీయ సదస్సు

రాఘవయ్యపార్క్ కూడలి(కృష్ణలంక), న్యూస్‌టుడే : ఈ నెల 25వ తేదీన ఎంబీ విజ్ఞాన కేంద్రంలో 'భారత రాజ్యాంగం-సవాళ్లు' అంశంపై జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు జవివే రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు, ఐలూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.మాధవరావులు తెలిపారు. జన విజ్ఞాన వేదిక (జవివే), ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్(ఐలూ) సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆదివారం బాలోత్సవ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో వారు వివరాలు వెల్లడించారు. దీనికి సంబంధించిన ప్రచార పత్రాలను ఆవిష్కరించారు. లక్ష్మణరావు మాట్లాడుతూ.. అభివృద్ధి గల ఉన్నత సమాజం ఏర్పాటులో రాజ్యాంగం ఎంతో కీలకమన్నారు. రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75ఏళ్ల పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న ఈ సదస్సును జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో ఏయూ విశ్రాంత సహాయ రిజిస్ట్రార్ కోటేశ్వరరావు, బోయి రవి, డాక్టర్ వసుంధర, శోభన్, రత్నకమల్, యశ్వంత్, సుబ్రహ్మణ్యం, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



ప్రచార ప్రతులు విడుదల చేస్తున్న లక్ష్మణరావు, మాధవరావు, వసుంధర తదితరులు

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

తిరువూరు
• తిరువూరు • మైలవరం

విష్ణు సహస్రనామ పారాయణం

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే : విశ్వాస్ సంస్థ ఆధ్వర్యంలో పటమట శ్రీనివాసనగర్ బ్యాంకు కాలనీలో ఆదివారం నిర్వహించిన విష్ణు సహస్ర నామ పారాయణ కార్యక్రమాన్ని దుర్గగుడి పాలక మండలి ఛైర్మన్ రాధాకృష్ణ ప్రారంభించారు. హరి భక్త మహిళా బృందం 27 సార్లు పారాయణ చేశారు. ఈసందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ.. విష్ణు సహస్ర నామపారాయణ ద్వారా ప్రజల్లో ఆధ్యాత్మిక వికాసం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో విశ్వాస్ సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ టి.జె.శ్రీధరన్, ట్రస్టీ బాలసుబ్రమణియన్, ప్రతినిధులు గుండారపు భవానీ, పరిటాల ఓంకార్, కార్పొరేటరు జాస్తి సాంబశివరావు, కాలనీ అధ్యక్షుడు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వాట్సప్‌లో చంద్రబాబుపై దుష్ప్రచారం..

వీరులపాడు, న్యూస్‌టుడే : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రతిష్ఠకు భంగం కలిగించేలా వాట్సప్‌లో పోస్ట్ చేసిన బి. హరిసింగ్ అనే వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని వీరులపాడు మండల తెదేపా నాయకులు ఎస్సై అభిమన్యుకు ఆదివారం ఫిర్యాదు చేశారు. కృత్రిమ మేధ ద్వారా చంద్రబాబునాయుడు ఒక సినిమా పాటకు నృత్యం చేస్తున్నట్లుగా సృష్టించిన వీడియోను ఈనెల 15వ తేదీన పోస్ట్ చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఇంద్రకీలాద్రిపై భక్తుల సందడి


యాగశాలలో చండీహోమాన్ని వీక్షిస్తున్న ఉభయదాతలు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: అమావాస్య నేపథ్యంలో ఇంద్రకీలాద్రిపై ఆర్జిత సేవల్లో పెద్ద సంఖ్యలో భక్తులు ఆదివారం పాల్గొన్నారు. చండీ హోమం, కుంకుమార్చన, శాంతి కల్యాణం, సూర్యోపాసన, ఖడ్గమాల పూజలకు తరలివచ్చిన ఉభయదాతలతో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. వేకువజాము నుంచి అమ్మవారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. ముఖ్యంగా సంక్రాంతి సెలవులు ముగుస్తుండడంతో తెలంగాణ నుంచి వచ్చిన వాహనాల్లో భక్తులు రావడంతో ఘాట్ రోడ్డు, కనకదుర్గానగర్ లిఫ్టు మార్గాలు కిటకిటలాడాయి. దుర్గగుడి ఈవో శీనానాయక్, పాలకమండలి సభ్యులు అవ్వారు శ్రీనివాసరావు స్కానింగ్ పాయింట్ వద్ద భక్తులను నియంత్రించేందుకు చర్యలు తీసుకున్నారు. దీంతో రూ.100, రూ.300, రూ.500 దర్శనం టికెట్ల ద్వారా దేవస్థానానికి రూ.19.62 లక్షల ఆదాయం లభించింది. భక్తుల రద్దీ దృష్టిలో ఉంచుకొని నివేదన సమయంలో ప్రొటోకాల్ దర్శనానికి వచ్చిన వారిని నియంత్రించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

? చెవుటూరు ఎస్సీ ఏరియాలో అంగన్‌వాడీ కేంద్రం పక్కనే స్థానికులు చెత్త వేయడంతో డంపింగ్ యార్డును తలపిస్తోంది. తక్షణమే చెత్త తొలగించి పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలి. **- నారాయణ, గ్రామస్థుడు**

✔ సమస్య తెలిసింది. సిబ్బందితో చెత్తను తొలగించి పారిశుద్ధ్య చర్యలు చేపడతాం. **- బసవ లింగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి - న్యూస్‌టుడే, జి.కొండూరు**

? కొండపల్లి ఆర్యవైశ్య కల్యాణ మండపం రహదారిలో అనేక చోట్ల రహదారి గుంతలమయమైంది. దీంతో ద్విచక్ర వాహనాల రాకపోకలు ఇబ్బందిగా మారింది. **- ఈశ్వరరావు, స్థానికుడు** ✔ ఆ రహదారిలో చిన్నపాటి గుంతలు అధికంగానే ఉన్నాయి. ఆ గుంతల్లో మట్టిని పోసి చదును చేయిస్తాం. **- పవన్, పారిశుద్ధ్య మేస్త్రి - న్యూస్‌టుడే, కొండపల్లి**

? ఇబ్రహీంపట్నం గ్రామీణ మండలం దాములూరు గ్రామంలోని ఇందిరమ్మ కాలనీలో మురుగు కాలువల్లో పూడిక పేరుకుపోయి మురుగు ఎక్కడిక్కడే నిలుస్తోంది. **- లాల్ సాహెబ్, స్థానికుడు** ✔ పారిశుద్ధ్య కార్మికులను పంపించి మురుగు కాలువల్లోని పూడికలను తీయించి సమస్య పరిష్కరిస్తాం. **- కె.గణేష్, గ్రామ కార్యదర్శి, దాములూరు - న్యూస్‌టుడే, ఇబ్రహీంపట్నం గ్రామీణం**

నీరు విడుదల

గంపలగూడెం : ఎన్నెస్పీ రెండో జోన్ పరిధిలోని మధిర బ్రాంచి కెనాల్‌కు ఆదివారం కల్లూరు మండలం కప్పలబంధం నియంత్రిక నుంచి 980 క్యూసెక్కుల సాగర్ జలాలు విడుదలైనట్లు ఏఈ మహేష్ బాబు తెలిపారు. గంపలగూడెం మండలం సరిహద్దులోని 23వ కి.మీ వద్దకు 371 క్యూసెక్కులు చేరగా దిగువన మేజర్ల వారీగా గంపలగూడెం 20, ఊటుకూరు-1కి 45, పెదకొమిర 20, మధిర 30, నిదానపురం 40 క్యూసెక్కులు చొప్పున సరఫరా చేస్తున్నట్లు చెప్పారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

నందిగామ, న్యూస్‌టుడే: నందిగామ పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీషీటర్లకు సీఐ వైవీఎల్ నాయుడు ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. నందిగామ పోలీస్ స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు తావులేదన్నారు.

అభివృద్ధికి సహకారం.. రైతుల ఆనందం

జి.కొండూరు, న్యూస్‌టుడే


పడమర చెరువులో పుష్కలంగా నీరు

రెండేళ్ల కిందట బుడమేరు వాగుకు సంభవించిన వరదల కారణంగా వెల్లటూరు పడమర చెరువు(పెద్ద చెరువు)కు గండ్లు పడి రైతులు నానా అవస్థలు పడ్డారు. అధిక మొత్తం అన్నదాతలు ఖరీఫ్ సాగు చేసేందుకు నీరందదని ఆందోళన చెందారు. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం చెరువును అభివృద్ధి చేసేందుకు చర్యలకు ఉపక్రమించింది. మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ సహకారంతో, రైతాంగం అభ్యర్థనల మేరకు మరమ్మతుల కోసం రూ.48 లక్షలను జూన్ 2025లో మంజూరు చేసి ఆయా పనులకు శ్రీకారం చుట్టింది. దీంతో చెరువుకు పడ్డ నాలుగు భారీ గండ్లను పూడ్చివేత పనులు ప్రారంభించి, దానికి చెరువులోని మట్టినే వినియోగించారు. ఈ పనులు చేయడానికి దాదాపు నెలన్నర రోజులు సమయం పట్టింది. అనంతరం రోలర్‌ను వినియోగించి చదును చేసి గట్లను బలోపేతం చేశామని చెరువు సంఘం అధ్యక్షుడు పగడాల పెద సాంబయ్య తెలిపారు.

✤ అలుగు పారడంతో..

వెల్లటూరు పడమటి చెరువు దాదాపు 278 ఎకరాలలో వ్యాపించి చుట్టు పక్కల గ్రామాలన్నింటికీ నీరు సరఫరా చేస్తోంది. చెరువు పూర్తిగా నిండి అలుగు పారడంతో ఆయకట్టులోని వెల్లటూరు, చెగిరెడ్డిపాడు, కందులపాడు, హెచ్.ముత్యాలంపాడు, ఆత్కూరు, చెవుటూరు తదితర గ్రామాలకు సాగు నీరు లభించినట్లైంది. దాదాపు ఆయా గ్రామాల్లో 1200 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందనుంది. దీంతో రైతులు అధిక భాగం వరి పంట సాగు చేపట్టారు. కొంత మేర పత్తి పంటకు కూడా నీరు అక్కరకు వచ్చింది. ప్రస్తుతం వరి కోతలు పూర్తయ్యి పంట చేతికి రావడంతో ఎకరాకు 35 బస్తాలు దిగుబడి వచ్చిందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


గుంటుపల్లి: చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణప్రసాద్


రాఘవాపురం బీసీ కాలనీలో..


తిరువూరు ఫ్యాక్టరీ సెంటర్‌లో..


ఎ.కొండూరులో..


కొండపల్లిలో..


మొర్సుమిల్లిలో వస్త్రదానం


గంపలగూడెం మండలం గోసవీడులో..


గొల్లపూడిలో నివాళులర్పిస్తున్న ఉమా


మైలవరంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేస్తూ..


చెవుటూరులో..

సంక్షేమానికి ఆద్యుడు ఎన్టీఆర్

పేదలకు సంక్షేమ పథకాలు అందించడంలో ఎన్టీఆర్ ఆద్యుడని పలువురు తెదేపా నాయకులు అన్నారు. తెదేపా వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి దివంగత నందమూరి తారక రామారావు వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం తిరువూరు, మైలవరం నియోజకవర్గాల్లోని ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. తెలుగు వారి కీర్తిని ప్రపంచానికి తెలియజేసిన మహనీయుడని కొనియాడారు. **- న్యూస్‌టుడే, బృందం**

పండగ ముగిసింది.. రద్దీగా మారింది


ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వారికి కౌన్సెలింగ్ ఇస్తున్న షిరీనాబేగం



గొల్లపూడి వద్ద హైదరాబాద్ వైపు వెళ్తున్న వాహనాలు

గొల్లపూడి, న్యూస్‌టుడే : సంక్రాంతికి వచ్చిన వారంతా తిరిగి వెళ్లడంతో విజయవాడ- హైదరాబాద్ జాతీయ రహదారి ఆదివారం రద్దీగా మారింది. పలువురు వందలాది వాహనాల్లో విజయవాడ పశ్చిమ బైపాస్ మీదుగా గొల్లపూడి, ఇబ్రహీంపట్నం ప్రాంతాల మీదుగా హైదరాబాద్ వైపు వెళ్లారు. గుంటూరు వైపు నుంచి వచ్చే వాహనాలు కాజా సమీపంలోని పశ్చిమ బైపాస్ మీదుగా గొల్లపూడి వద్దకు చేరుకున్నాయి. ఇందులో భాగంగా వాహనాలు సజావుగా వెళ్లేలా ట్రాఫిక్ పోలీసులు చర్యలు చేపట్టారు.

✤ ప్రమాదకర ప్రయాణం వద్దు

పిల్లలు, బ్యాగులతో ద్విచక్ర వాహనాలపై ప్రమాదకరంగా ప్రయాణం చేయవద్దని ట్రాఫిక్ డీసీపీ షిరీనా బేగం పేర్కొన్నారు. విజయవాడ పశ్చిమ బైపాస్, జాతీయ రహదారిపై ప్రమాదకరంగా వెళ్తున్న వారికి ట్రాఫిక్ పోలీసులు ఆదివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా షిరీనా బేగం మాట్లాడుతూ బరువైన బ్యాగులతో కుటుంబ సమేతంగా ద్విచక్ర వాహనాలపై వెళ్లడం వల్ల ప్రమాదాలు జరిగేందుకు ఆస్కారం ఉంటుందని తెలిపారు. ఆ విధంగా దూర ప్రయాణం చేయడం శ్రేయస్కరం కాదని సూచించారు. కారులో వెళ్తున్న వారు సీటు బెల్టు పెట్టుకుని వెళ్లాలని కోరారు. గొల్లపూడి, ఇబ్రహీంపట్నం పరిధిలో డ్రోన్ సాయంతో వాహనాల రాకపోకలను ఆమె పరిశీలించారు.

అల్పాహారం అందేనా.. ఆకలి తీరేనా?

గంపలగూడెం, న్యూస్‌టుడే


ప్రత్యేక తరగతులకు హాజరైన పది విద్యార్థులు

ప్రభుత్వ పాఠశాలల్లో అభ్యసిస్తున్న పది విద్యార్థులకు సాయంత్రం వేళ అందించే అల్పాహారం ఈ సంవత్సరం సకాలంలో అందేలా లేదు. గతేడాది పరీక్షలకు పది రోజుల ముందు అందించి మమ అనిపించారు. ఈ ఏడాది కూడా అదే తంతు కొనసాగిస్తారనే అనుమానం వ్యక్తమవుతోంది. పైగా ఈ సంవత్సరం నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలనే లక్ష్యంతో వంద రోజుల ప్రణాళికతో డిసెంబరు నెల నుంచే ఉదయం, సాయంత్రం విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ విద్యాలయాల్లో పది చదువుతున్న బాలబాలికలు ఉదయం 8 గంటలకే బడిలో ఉండాలి. సమీప గ్రామాల నుంచి పాఠశాలకు వచ్చే వారు ఉదయం 7 గంటలకే ఇంటి నుంచి బయలుదేరి వెళ్లి తిరిగి రాత్రి 7 గంటలకు తిరిగి వస్తారు. ఈ క్రమంలో విద్యార్థులకు సరైన పోషకాహారం అందితేనే శారీరక అలసట లేకుండా చదువుతారు.

మండలం	పాఠశాలలు	విద్యార్థులు
గంపలగూడెం	12	467
విస్సన్నపేట	7	362
తిరువూరు	8	402
ఎ.కొండూరు	9	367

✤ ఊసెత్తడం లేదు

ఏటా జడ్పీ నిధులతో బడులకు గోధుమ రవ్వ, శనగలు సరఫరా చేసేవారు. దీంతో రోజుకో రకం పోషకాహారం పది విద్యార్థులకు సాయంత్రం వేళ అందించారు. ఈ సంవత్సరం జడ్పీ నుంచి నిధులు కేటాయింపు జరగలేదు. అధికారులు కూడా అల్పాహారం ఊసెత్తడం లేదు. మరో రెండు నెలల్లో పది పరీక్షలు ప్రారంభం కానున్నాయి. తిరువూరు నియోజకవర్గంలోని 36 పాఠశాలల్లో 1,598 మంది పది విద్యార్థులున్నారు. ఏటా కొన్ని పాఠశాలల్లో దాతలు అల్పాహారం అందించారు. కానీ ఈ సారి వారి నుంచి స్పందన కొరవడింది. ఇప్పటికైనా జడ్పీ ఉన్నత అధికారులు స్పందించి నిధులు కేటాయించి అల్పాహారం అందించేందుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

'కేంద్రం తెచ్చిన కొత్త చట్టం రాష్ట్రానికి భారం'


గోడ ప్రతులు ఆవిష్కరిస్తున్న నాయకులు

మైలవరం, న్యూస్‌టుడే : కేంద్ర ప్రభుత్వం కొత్తగా తెచ్చిన వీబీ జీ రామ్‌జీ తో ఉపాధికి హామీ లేదని సీపీఎం మండల కార్యదర్శి సీహెచ్. సుధాకర్ పేర్కొన్నారు. పని హక్కును కాపాడుకుందాం, ఇంటింటికీ ఉపాధి పేరుతో సీపీఎం రూపొందించిన గోడ ప్రతులను స్థానిక కార్యాలయంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం తెచ్చిన కొత్త చట్టం రాష్ట్రానికి భారమని ఆరోపించారు. యూపీఏ హయాంలో కమ్యూనిస్టు పార్టీల ఉమ్మడి పోరాట ఫలితంగా నాటి ప్రభుత్వం పథకాన్ని తెచ్చిందన్నారు. దాని ద్వారా పేదలకు ఉపాధి దొరికిందని, నూతన విధానంలో రాష్ట్రాలు 40 శాతం నిధులను భరించాలని చెప్పడంతో పథకం మందగించే అవకాశం ఉందన్నారు. పథకాన్ని తిరిగి గత నిబంధనలతో పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటరెడ్డి, సుబ్బారావు, ఇస్సాక్, రమేష్, పౌలు, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీకి మార్చురీ బాక్సు అందజేత


కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచి తదితరులు

మైలవరం, న్యూస్‌టుడే : మండలంలోని వెల్వడం గ్రామ పంచాయతీలో వినియోగార్థం లయన్స్ క్లబ్ ఆఫ్ మైలవరం ఆధ్వర్యంలో బండి కోటేశ్వరరావు కుమారుడు నరేష్ మార్చురీ బాక్సును పంచాయతీకి వితరణ చేశారు. గ్రామంలో అంత్యక్రియల సమయంలో ఎదురవుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వితరణ చేయడం అభినందనీయమని తెదేపా రాష్ట్ర నాయకుడు కోమటి సుధాకరరావు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచి ధర్మరాజు, సతీష్, క్లబ్ నాయకులు రాంభూపాల్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, జాస్తి వెంకటేశ్వరరావు, నాగభూషణం, రామిరెడ్డి, హరీష్ కుమార్, శ్రీధర్, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

20న వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే : నందిగామ వాసవీ మాత మందిరంలో ఈ నెల 20న అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం నిర్వహిస్తున్నామని మందిర కమిటీ అధ్యక్షుడు చవట నాగేశ్వరరావు ఆదివారం తెలిపారు. ఉదయం 9 గంటలకు దేవతల బావి నుంచి పవిత్ర జలాన్ని ఊరేగింపుగా తీసుకొస్తామన్నారు. 9.30 గంటలకు అష్టోత్తర కలశారాధన, 10.30కి పంచామృతాలు, ఫలరసాలు, అష్టోత్తర కలశాల జలాలతో అమ్మవారి అభిషేకం, 11కి అమ్మవారికి వెయ్యి ఫలాలతో అర్చన, లలితాసహస్రనామ పారాయణం ఉంటుందని వివరించారు.

ప్రకటన

నా క్లయింట్స్ ఎన్టీఆర్ జిల్లా, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఏరియాలో చేరినటువంటి చిట్టినగర్ వాస్తవ్యులు శ్రీ అల్లు మధుసూదన్‌రావు, S/o మాల కొండయ్య మరియు వారి భార్య శ్రీమతి అల్లు హైమావతి గార్ల సంజాయిషీ పొంది యావన్మందికీ తెలియజేయునది ఏమనగా..

క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని షేక్ జహీర్ గారి భార్య శ్రీమతి షేక్ మహబూబ్ సుల్తాన్ గారు రిజిస్టరు క్రయ దస్తావేజు నెం: 4830/2004 ద్వారా శ్రీ అధికారి రంగారావు గారి కుమారుడు అధికారి వెంకట మోహనరావు గారు వారి రిజిస్టరు విక్రయ ఎగ్రిమెంటు మరియు జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ ఏజెంట్ కందుకూరి అనిల్ కుమార్ గారి వద్ద నుండి క్రయం పొంది తదాది నేటి వరకు వారి స్వాధీన హక్కు భుక్తములలో కలిగివున్నారు అని తెలియజేసినారు. నా క్లయింట్సు క్రింది షెడ్యూలు ఆస్తిని క్రయం పొందుటకు షేక్ మహబూబ్ సుల్తాన్ గారితో ఖరారు పరుచుకొని రిజిస్ట్రేషన్ చేయించుకోదలచినారు. కావున నా క్లయింటు క్రింది షెడ్యూలు ఆస్తిని క్రయం పొంది రిజిస్ట్రేషన్ చేయించు కొనుటకు ఎవరికి అయినా ఎటువంటి అభ్యంతరములు గాని, కోర్టు ఎటాచ్‌మెంట్లు గాని, తనఖాలు గాని మరియు యే ఇతర క్లయిమ్‌లు వున్నయెడల వారి అభ్యంతరములు గాని క్లయిమ్‌లు గాని ఈ క్రింది అడ్రసుకు Regd Post With Ack Due ద్వారా 7 రోజులలోగా వారి అభ్యంతరములు గాని, క్లయిమ్‌లు గాని తెలియజేయగలరు. లేని యెడల ఆపై వచ్చు అభ్యంతరములు నా క్లయింట్సును బైండు చేయజాలవు అని యావన్మందికీ తెలియజేయటమైనది.

షెడ్యూల్: కృష్ణా జిల్లా ప్రస్తుతము NTR జిల్లా ఇబ్రహీంపట్నం సబ్ రిజిస్ట్రార్ వారి యిలాకా రాయనపాడు గ్రామ పంచాయితీ ఏరియాలో చేరిన రాయనపాడు గ్రామ R.S.R. 72/3 దాఖలా LP No: 28/2008 లో చూపబడిన PLot No 313 & 314 దాఖలా చ॥గ॥ 825ల ఖాళీ నివేశన స్థలముకు **హద్దులు: తూర్పు:** అ.50-0లు వెడల్పుగల రోడ్డు, **దక్షిణం:** అ.30-0లు వెడల్పుగల రోడ్డు, **పడమర:** ఖాళీ స్థలం, **ఉత్తరం: ప్లాటు నెం:** 312 దాఖలా స్థలం.

Kollipara Mukundini, Advocate
విజయవాడ Flat No. 104, Splender Garden Apartments, Road No: 5, Sector No. 1, Louts Land Mark, Ayodhyanagar, Vijayawada, Cell: 94409 88010.
తేది:18-1-26

శిథిలావస్థలో అంగన్‌వాడీ కేంద్రం



వెలగలేరు ఎస్సీ ఏరియాలోని అంగన్‌వాడీ కేంద్రం పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో నిర్వహణ కష్టమైంది. దీంతో కేంద్రాన్ని కొంత కాలంగా తాత్కాలికంగా పక్కనే అసంపూర్తిగా నిర్మించిన ఎస్సీ సామాజిక భవనంలో నిర్వహిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. దాదాపు రెండేళ్ల కిందటే దుస్థితికి చేరిన అంగన్‌వాడీని వైకాపా సర్కారు పట్టించుకోకపోవడంతోనే ఈ పరిస్థితి ఏర్పడిందని స్థానికులు మండిపడుతున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వమైన శిథిలావస్థకు చేరిన కేంద్రాన్ని తొలగించి కొత్త భవనాన్ని నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, జి.కొండూరు**

నడక దారి.. కంపమయంగా మారి



కొండపల్లి గజరాజు చెరువు ప్రాంగణంలో రెండేళ్ల కిందట ఎన్టీటీపీఎస్, పురపాలిక సంఘం ఆధ్వర్యంలో వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేశారు. రెండు నెలల పాటు పర్యవేక్షణ ఉండటంతో స్థానికులు, ఎన్టీటీపీఎస్ ఉద్యోగులు దాన్ని ఉపయోగించుకున్నారు. ఇదిలా ఉంటే పురపాలికకు కమిషనర్లు మారుతుండటంతో పాటు సాధారణ ఎన్నికలు వచ్చాయి. దీంతో అటు పురపాలిక, ఇటు ఎన్టీటీపీఎస్ దాన్ని పూర్తిగా పక్కన పెట్టాయి. ఇంకేముంది కంప చెట్లు మొలవడం ప్రారంభమయ్యాయి. నిర్వహణ లేకపోవడంతో వాకింగ్ చేసే వారు తగ్గిపోయి దాదాపుగా కిలో మీటరు ఉన్న ట్రాక్ పూర్తిగా కంపమయమైంది. ఈ సమస్యను అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదని వాకింగ్ చేసే వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. **- న్యూస్‌టుడే, కొండపల్లి**

పాడి రైతుకు భరోసా

✤ నేటి నుంచి పశు ఆరోగ్య శిబిరాలు

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లో అధిక శాతం మంది రైతులు పాడి పరిశ్రమపై ఆధారపడి జీవిస్తుంటారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి పాడి రైతులకు అండగా ఈ నెల 19 నుంచి గ్రామాల్లో ఉచిత పశు ఆరోగ్య శిబిరాలను నిర్వహించనుంది. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా పశువులు, జీవాలు పలు వ్యాధుల బారిన పడుతున్నాయి. కొన్ని చోట్ల మృత్యువాత పడుతున్న సంఘటనలున్నాయి. ఈ సమస్యలను పరిష్కరించడంతో పాటు పాడి రైతులకు భరోసా కల్పించేందుకు రాష్ట్ర పశు సంవర్ధక శాఖ కృషి చేస్తోంది. ఈ నేపథ్యంలో ఈ నెల 19 నుంచి 31 వరకు ప్రతి మండలంలో రోజుకు రెండు వైద్య బృందాలు రెండు గ్రామ పంచాయతీల పరిధిలో శిబిరాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఇబ్రహీంపట్నం పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు తాళ్లూరి శ్రీనివాసరావు తెలిపారు. ఇబ్రహీంపట్నం మండలంలో గ్రామాలు తక్కువగా ఉండటంతో శిబిరాలు ఈ నెల 24వ తేదీతో ముగుస్తాయని చెప్పారు.

✤ సేవలు ఇలా..

శిబిరాల్లో వైద్యులు పశువులను పరీక్షించి సేవలందిస్తారు. ముఖ్యంగా దూడలు, ఆవులు, గేదెలు, చిన్న జీవాలకు నట్టల నివారణ మందులు అందిస్తారు. కృత్రిమ గర్భధారణ, చూడి పరీక్షలు చేసి సూచనలు చేస్తారు. ఎదకు రాని, చూలు కట్టని ఇతర గర్భకోశ వ్యాధులకు చికిత్స అందిస్తారు. వ్యాధి నిరోధక టీకాలు వేస్తారు.

ఆ ముచ్చట... ముదిరితే..!



పెళ్లి అనేది కేవలం ఇద్దరు వ్యక్తుల్లో, రెండు కుటుంబాలకో మాత్రమే సంబంధించింది కాదు. సమాజాన్ని ముందుకు నడిపించే ఓ బలమైన వ్యవస్థ కూడా! పాత తరాల్లో ఉమ్మడి కుటుంబాలున్న దశల్లో... ఇబ్బందులున్నా సర్దుకునే వెసులుబాట్లు, సర్దే మెకానిజం ఉండేవి. వయసే ప్రధానంగానో, వయసుతో సంబంధం లేకుండానో పెళ్లిళ్లు జరిగినా సాగిపోయింది. కానీ భార్యా భర్తలు కలసి ఉండటమే... ఉమ్మడి కుటుంబంగా చెప్పుకునే దశకు చేరుకుంటున్న ఈ తరంలో వయసొక్కటే పెళ్లిని నిర్ణయించలేని పరిస్థితి!

ఈ తరంలో పెళ్లికి ఏది ఆదర్శ వయసనే దానికి ఓ కచ్చితమైన సంఖ్యతో సమాధానం చెప్పటం కష్టం. నిజానికి పెళ్లి విషయంలో వేసుకోవాల్సిన ప్రశ్న సంసిద్ధత గురించి! వయసుతో పాటు... ఆరోగ్యం, మానసిక పరిపక్వత, ఆర్థిక స్థిరత్వం అనే కీలక ప్రమాణాల మీద సంసిద్ధత ఆధారపడి ఉంటుంది. అయితే పెళ్లి మరీ ఆలస్యంగా చేసుకున్నా సమస్యలు తప్పవని అంటున్నారు నిపుణులు.

విముఖత ఎందుకు?

1. ఆర్థిక అస్థిరత

ప్రస్తుతం ఉద్యోగం దొరకడం మాత్రమే కాదు...దాన్ని నిలుపుకోవడమూ పెద్ద సవాల్‌గా మారింది. తక్కువ జీతాలు, పెరుగుతున్న జీవన వ్యయాలు, గృహ రుణాలు, ఈఎంఐలు.. ఇవన్నీ యువత భవిష్యత్తుపై అనిశ్చితికి గురిచేస్తున్నాయి. 'నా జీవితాన్నే గడపలేకపోతున్నా, ఇంకొకరి బాధ్యత ఎలా తీసుకోగలను' అనే భయం యువతలో పెరుగుతోంది.

2. కెరీర్‌కు ప్రాధాన్యం

చదువు, ఉద్యోగం, స్వీయ గుర్తింపుతో జీవితాన్ని నిర్మించుకోవాలనుకుంటున్నారు. వివాహం వల్ల కెరీర్ ఆగిపోతుందేమో, కుటుంబ బాధ్యతలు పెరిగి లక్ష్యాలను సాధించలేమనే భయం పెరిగింది

3. విఫలమైన వివాహాల ప్రభావం

పెరుగుతోన్న విడాకులు, గొడవలు, కుటుంబ హింస. .వంటి సమస్యలు ఇప్పుడు ఎక్కువగా కనిపిస్తున్నాయి. దీంతో వివాహాన్ని ఒక సమస్యల పుట్టగా భావిస్తున్నారు. ఒకరి తప్పు వల్ల మరొకరి జీవితం నాశనం అవుతుండడం చూసి వివాహంపై భయం పెరుగుతోంది.

4. స్వేచ్ఛకు అలవాటు

ఒంటరిగా జీవించడం, స్వతంత్ర నిర్ణయాలు తీసుకోవడం, వ్యక్తిగత జీవితాన్ని ఆస్వాదించడం, ఇవన్నీ నేటి యువతకు అలవాటయ్యాయి. వివాహం అంటే సర్దుకోవడం, రాజీ పడడం, ఇతరుల అభిప్రాయాలకు చోటివ్వడం.. ఈ మార్పును కొంతమంది అంగీకరించలేకపోతున్నారు.

5. మానసిక ఆరోగ్య సమస్యలు

డిప్రెషన్, ఆందోళన, ట్రామా వంటి మానసిక సమస్యలు యువతలో ఎక్కువవుతున్నాయి. అలాంటి స్థితిలో..'మానసికంగా స్థిరంగా లేనప్పుడు, వివాహం చేసుకోవడం సమంజసం కాదేమో?' అని ప్రశ్నించుకుంటున్నారు.

ఆలస్యమైతే...

1. ఒంటరితనం

వయసు పెరిగే కొద్ది స్నేహాలు తగ్గుతాయి. కుటుంబంతోనూ ఎక్కువ ఉండేందుకు వీలు పడదు. ఈ క్రమంలో భావోద్వేగ మద్దతు లేకపోవడం వల్ల ఒంటరితనం తీవ్రమవుతుంది.

2. కుటుంబ ఒత్తిడి, విమర్శలు

'ఇంకెప్పుడు పెళ్లి?' 'పెళ్లి చేసుకోకుండా ఎంత సంపాదించి ఏం లాభం?' వంటి ప్రశ్నలు మానసికంగా గాయపరుస్తాయి.

3. రాజీ...పేచీ



30 ఏళ్ల వయసు దాటిన తర్వాత మంచి జీవిత భాగస్వామి దొరకడం కష్టం. అనేక రకాలుగా రాజీ పడాల్సి వస్తుంది. బాగా వయసు మీరిన తరవాత పెళ్లిళ్ల వల్ల...అమ్మాయి, అబ్బాయిలో స్వతంత్ర భావాలు అధికమై...తమ మాటే నెగ్గాలని పట్టుదలతో చిన్న చిన్న సమస్యలపై సర్దుకుని కాపురం చేయడానికి ఇష్టపడక విడాకుల వరకూ వెళుతున్నారు.

4. వృద్ధాప్యంలో భద్రతా సమస్యలు

పెళ్లి ఆలస్యమైతే... ఆ ప్రభావం సంతానంపైనా, వారి ఆలనాపాలనపైనా పడుతుంది. కుటుంబ సభ్యులు భావోద్వేగం, శారీరకం సహాయం చేసే పరిస్థితులు (తమ తల్లిదండ్రులు, అత్తమామలకూ పెద్దతనం వస్తుంది కాబట్టి) తగ్గుతాయి.

5. సామాజిక అసమతుల్యత

వివాహాలు తగ్గితే జనాభా నిష్పత్తి మారుతుంది. యువ జనాభా తగ్గుతుంది. వృద్ధుల సంఖ్య పెరుగుతుంది. సామాజిక వ్యవస్థలపై ప్రభావం పడుతుంది.

- ఈనాడు, హైదరాబాద్, అమరావతి, ప్రత్యేకవిభాగం

ఆరోగ్య సమస్యలు...

- వయసు మీరినా పెళ్లి చేసుకోకపోతే పిల్లలు పుట్టే అవకాశాలు తగ్గుతున్నాయని డాక్టర్లు చెబుతున్నారు.వయసు పెరిగే కొద్దీ అమ్మాయిల్లో పెల్విక్ బోన్స్ బలహీనపడి సాధారణ ప్రసవమయ్యే అవకాశాలు తగ్గుతాయి.
- సంతాన సాఫల్యతా తగ్గుతుంది. ఈ క్రమంలో అండాశయాన్ని ఉత్తేజిత పరిచే మందులు వాడాల్సి వస్తుంది. అప్పుడు 'ఓవేరియన్ హైపర్ సిమ్యులేషన్ సిండ్రోమ్' ఎదురవుతుంది. అది శరీరంలోని మిగిలిన వ్యవస్థల్ని ప్రభావితం చేస్తుంది.

పెళ్లికి సిద్ధమా... చెక్‌కరో!

గొడవలు తలెత్తినప్పుడు...
1 శాంతంగా పరిష్కారం వెతుకుతా
2 కొంచెం కోపం వస్తుంది. తర్వాత మాట్లాడతా.
3 కోపం.. మౌనం.. దూరం..

తప్పు నాదే అయితే...
1 అంగీకరించి క్షమాపణ చెబుతా.
2 సమర్థించుకునే ప్రయత్నం చేస్తాను
3 తప్పు ఒప్పుకోను.

బాధ్యతలను...
1 చెప్పకుండానే తీసుకుంటాను.
2 చెప్తే చేస్తాను.
3 తప్పించుకునే ప్రయత్నం...

భాగస్వామి మాట...
1 నాతో సమానంగా ప్రధానమైంది
2 వింటాను కానీ నాదే చివరి మాట.
3 పెద్దగా పట్టించుకోను.

ఒత్తిడిలో...
1 పరిష్కారాలపై దృష్టి.
2 అసహనం ప్రదర్శిస్తా.
3 పారిపోవాలని అనిపిస్తుంది.

కుటుంబ భవిష్యత్ గురించి...
1 వాస్తవిక ప్రణాళిక...
2 ఆలోచన ఉందిగాని ప్రణాళిక లేదు.
3 ఇప్పుడే ఆలోచన అవసరం లేదు. తర్వాత చూద్దాం.

ఇది మనసు అనే అద్దంలో మనల్ని మనం చూసుకునే ఓ చిన్న మానసిక వ్యాయామం.

1-లు 3 దాటితే ఆత్మీయ బంధాన్ని మోయటానికి, పెళ్లికి సిద్ధంగా ఉన్నట్లు
2లు ఎక్కువున్నా సిద్ధంగా ఉన్నట్లేగాని... మరింత అవగాహన అవసరమని సంకేతం.
3లు ఎక్కువగా ఉంటే... పెళ్లికి ఇంకా సమయం అవసరమని అర్థం.

గుర్తుంచుకోండి... పెళ్లికి ముందు ప్రతి ఒక్కరూ ఆలోచించుకోవాల్సింది... ఇవాల్టి నేను, రేపు ఎవరి జీవితానికైనా భద్రత, ప్రశాంతత ఇవ్వగలనా? అని! సమాధానం అవునైతే... శీఘ్రమేవ కల్యాణ ప్రాప్తిరస్తు!

ఈ బిచ్చగాడు.. కోటీశ్వరుడు



3 మేడలు, కారు, వడ్డీ వ్యాపారం

పుణ్యం వస్తుందనో, జాలిపడో మనం ధర్మం చేసే బిచ్చగాడు మనకంటే ధనవంతుడైతే? మధ్యప్రదేశ్‌లోని ఇందౌర్‌కు చెందిన మంగీలాల్ అలాంటి బిచ్చగాడే. ఈయన ఆస్తుల చిట్టా చూసి అధికారుల కళ్లు బైర్లు కమ్మాయి. ఇందౌర్‌ను బిచ్చగాళ్లు లేని నగరంగా మార్చడంలో భాగంగా అధికారులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి, గుర్తించిన వారిని పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నారు. ఇప్పటివరకు 6,500 మందిని గుర్తించి కౌన్సెలింగు చేశారు. ఈ క్రమంలో సరాఫ్ బజారు వద్ద చక్రాల బండిపై భిక్షాటన చేస్తున్న మంగీలాల్ అనే దివ్యాంగుడిని గుర్తించారు. అధికారుల విచారణలో దిమ్మతిరిగే నిజాలు బయటపడ్డాయి. మంగీలాల్‌కు ఇందౌర్‌లో మూడు మేడలు ఉన్నాయి. ఇందులో ఒకటి దివ్యాంగుడని రెడ్‌క్రాస్ సొసైటీ నుంచి ఉచితంగా పొందినది. సరాఫ్ బజారులోని కొంతమంది బంగారం వర్తకులకు ఈయన వడ్డీలకు ఇచ్చాడు. ఇందౌర్ దాటితే సొంత కారు స్విఫ్ట్ డిజైరు వాడతాడు. దీనికి డ్రైవరు ఉన్నాడు. మూడు ఆటోలు కొని అద్దెలకు తిప్పుతున్నాడు. మంగీలాల్ గురించి మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నట్లు అధికారి దినేష్ మిశ్ర తెలిపారు. -ఈటీవీ భారత్

ఉదయాన్నే ఈ తప్పు చేస్తున్నారా?



పొద్దున లేవగానే పంచదార కలిపిన టీ, కాఫీలు తాగడం, బ్రెడ్డును బ్రేక్‌ఫాస్ట్‌గా తీసుకుంటున్నారంటే మీకు మీరు హాని చేసుకుంటున్నట్లే. చక్కెర, శుద్ధిచేసిన కార్బోహైడ్రేట్లు ఉండే పదార్థాలను మీరు ఇష్టపడుతున్నారంటే మీరు స్వయంగా మీ శత్రువును ఆహ్వానిస్తున్నారని అర్థం.


- అరుణ్ కుమార్, హెల్త్ కన్సల్టెంట్

బంధాలకు సాక్ష్యం.. ఈ పరుగు పందెం



సంక్రాంతి సంబరాల్లో భాగంగా వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన ముగ్గుల పోటీలు, క్రీడా పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో మహిళలు, యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. అయితే, తమిళనాడులో కాస్త వినూత్నంగా భార్యలను చేతులపై ఎత్తుకుని భర్తలు పరిగెత్తే పోటీలు జరిగాయి. అరియలూరు జిల్లా సెందురై సమీపం చిరుకళత్తూరు మేల వీధిలో కనుమ సందర్భంగా శనివారం ఈ పోటీలు నిర్వహించారు. పలువురు భర్తలు తమ భార్యలను ఎత్తుకుని 20 మీటర్ల దూరం పరిగెత్తారు. ముందుగా లక్ష్యాన్ని చేరుకున్న వారికి బహుమతులు అందించారు. - న్యూస్‌టుడే, చెన్నై

ఒత్తులు లేని 'తేట తెలుగు'



ఒత్తులకు బదులు ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లు ప్రతిపాదించిన 'హంసగీత'లతో అక్షరాలిలా..

ఓ మాస్టారి వినూత్న యత్నం

ఒత్తులు అధికంగా ఉండటంతో తెలుగు భాష నేర్చుకునేందుకు విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని.. అంటారు ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం బస్వాపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లు. ఒత్తుల కారణంగా ఆంగ్ల మాధ్యమ విద్యార్థులకు తెలుగు రాయడం మరింత కష్టమవుతోందని చెబుతారు. దీనికి పరిష్కారంగా ఆయన హంసగీత పేరుతో ఒత్తుల్లేని తెలుగు వర్ణమాలను రూపొందించారు. దీనికోసం ఆయన దశాబ్దానికి పైగా కృషి చేశారు. ఆ వర్ణమాలతో ఇప్పటికే పుస్తకాన్ని తీసుకొచ్చిన ఆయన.. ప్రస్తుతం యాప్‌ను అందుబాటులోకి తెచ్చారు. 'తేట తెలుగు' పేరుతో రూపొందించిన ఈ యాప్‌ను తెలంగాణ వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదివారం ఆవిష్కరించారు. "తెలుగులో 33 ఒత్తులకు ప్రత్యామ్నాయంగా చిన్న 'హంసగీత' ఆధారంగా ఒత్తు పదాలైనా ద్విత్వ, సంయుక్త, సంశ్లేష పదాలను అత్యంత సులభంగా రాయవచ్చు. దీనికోసం రూ. 6.50 లక్షలు వెచ్చించి యాప్‌ను అభివృద్ధి చేయించా. ఎంతోమంది ఈ వర్ణమాలను అభినందించారు. పూర్వీకులు వేసిన పునాదులను కదిలించకుండానే తెలుగు భాషను ఆధునికీకరించడాన్ని ప్రజలు ఆదరిస్తారనే నమ్మకం ఉంది. యాప్‌ను www.theta telugu.com వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు" అని వెంకటేశ్వర్లు వివరించారు. - న్యూస్‌టుడే, కొణిజర్ల

సాలీడు.. సహజ ఆర్కిటెక్చర్..



సాలె పురుగు ఆహారం కోసం చెట్లపై గూడు అల్లుకుంటుంది. అందులోకి వచ్చే చిన్న పురుగులు, కీటకాలను బంధించి తింటుంది. మంచు కురుస్తుండడంతో.. ఈ సాలెగూడును బిందువులు అంటుకుని ఇలా కనువిందు చేస్తోంది. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో కనిపించిందీ దృశ్యం.

- న్యూస్‌టుడే, ఇబ్రహీంపట్నం

రక్షణ నిధితో వైద్యులకు సహాయం

- రాష్ట్ర వైద్య మండలి ఛైర్మన్ దగ్గుమాటి శ్రీహరిరావు



వైద్యులతో చర్చిస్తున్న శ్రీహరిరావు


తిరుపతి (వైద్యవిభాగం), న్యూస్‌టుడే: మరణించిన వైద్యుల కుటుంబ సభ్యులకు ఆర్థిక సహకారం అందించేందుకు రక్షణ నిధిని సేకరిస్తామని ఆంధ్రప్రదేశ్ వైద్య మండలి ఛైర్మన్ డాక్టర్ దగ్గుమాటి శ్రీహరిరావు ప్రకటించారు. ఆదివారం తిరుపతి రెడ్‌క్రాస్ కార్యాలయానికి వచ్చిన ఆయన వైద్యులు, మీడియాతో వేర్వేరుగా మాట్లాడారు. దేశంలోనే మొదటిసారి వైద్యుల రెన్యువల్ రిజిస్ట్రేషన్ సేవలను జిల్లాలకు చేరువ చేసినట్లు చెప్పారు. ఇప్పటి వరకు 7 వేల మంది ప్రయోజనం పొందారని గుర్తుచేశారు. రెండోసారి జిల్లాల్లో వైద్యుల రెన్యువల్ రీ రిజిస్ట్రేషన్ కేంద్రాలను అందుబాటులోకి తెస్తామని తెలిపారు. ఏపీఎంసీ వెబ్‌సైటను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. జాతీయ వైద్యుల సదస్సును విజయవాడలో, అంతర్జాతీయ వైద్యుల సదస్సును విశాఖపట్నంలో నిర్వహించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు, రెడ్‌క్రాస్ సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్‌గా వజ్జా శ్రీనివాసరావు

- కమిషనర్లుగా సింహాచలం నాయుడు, రవిబాబు, ఆదెన్న, కల్యాణ చక్రవర్తి


ఈనాడు-అమరావతి: రాష్ట్ర సమాచార కమిషన్‌కు ప్రధాన కమిషనర్‌తో పాటు నలుగురు కమిషనర్ల నియామకానికి గవర్నర్ ఆమోదముద్ర వేశారు. ప్రధాన సమాచార కమిషనర్‌గా వజ్జా శ్రీనివాసరావు, కమిషనర్లుగా పరవాడ సింహాచలం నాయుడు, వొంటేరు రవిబాబు, గాజుల ఆదెన్న, వట్టికూటి శరత్ చంద్ర కల్యాణ చక్రవర్తిలను నియమిస్తూ ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. వీరు మూడేళ్ల కాలం లేదా వారి వయస్సు 65 ఏళ్లు నిండే వరకు (ఏది ముందైతే అది) పదవిలో కొనసాగుతారని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

హైకోర్టు న్యాయవాది వజ్జా శ్రీనివాసరావు




సమాచార కమిషన్‌కు ప్రధాన కమిషనర్‌గా నియమితులైన వజ్జా శ్రీనివాసరావు హైకోర్టు న్యాయవాదిగా ఉన్నారు. పల్నాడు జిల్లా అచ్చంపేట మండలం చెరుకుంపాలెం గ్రామానికి చెందిన ఆయన.. మహారాష్ట్రలోని నాగపూర్ వర్సిటీ నుంచి ఎల్‌ఎల్‌బీ పట్టా పొందారు. 1995లో ప్రాక్టీస్ ప్రారంభించారు. కమిషనర్ ఆఫ్ అప్పీల్స్, డైరెక్టర్ ఆఫ్ సర్వే అండ్ సెటిల్‌మెంట్స్‌లో ప్రత్యేక ప్రభుత్వ న్యాయవాదిగా పనిచేస్తున్నారు. ఏడేళ్లుగా బార్ కౌన్సిల్ సభ్యుడిగా ఉన్నారు.

వ్యవసాయ కుటుంబం నుంచి సింహాచలం నాయుడు



కమిషనర్‌గా నియమితులైన పరవాడ సింహాచలం నాయుడు విశాఖపట్నం ప్రధాన జిల్లా కోర్ట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా బాధ్యతలు నిర్వహించారు. వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన ఆయన.. గతంలో ఏపీ టూరిజం బోర్డు డైరెక్టర్‌గా పనిచేశారు. ఆయన భార్య సుజాత భీమిలి వ్యవసాయ మార్కెట్ కమిటీలో ఉన్నారు. కుమారుడు మనోజ్‌కుమార్ హైకోర్టు న్యాయవాది. కుమార్తె జయశ్రీ భారతి దంత వైద్యురాలు.

కడపకు చెందిన రవిబాబు



కడప నగరానికి చెందిన వొంటేరు రవిబాబు శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం నుంచి న్యాయవాద పట్టా అందుకున్నారు. 1994 నుంచి హైకోర్టు న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నారు. 1996 నుంచి 2000 సంవత్సరం వరకు ఏపీ కాలేజ్ సర్వీసెస్ కమిషన్‌కు స్టాండింగ్ కౌన్సెల్‌గా వ్యవహరించారు. 2000 నుంచి 2004 వరకు ఏపీ అడ్మినిస్ట్రేటివ్ ట్రైబ్యునల్ ఏజీపీగా, 2015 నుంచి 2019 వరకు ఏపీఎస్‌సీఆర్‌డీసీకి ప్రభుత్వ న్యాయవాదిగా ఉన్నారు.

ఆదెన్న.. గతంలో పీసీబీ సభ్యుడిగా



అనంతపురం జిల్లాకు చెందిన గాజుల ఆదెన్న.. గతంలో కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడిగా పనిచేశారు. అనంతపురం నగరపాలక సంస్థ, అర్బన్ బ్యాంక్‌లకు న్యాయ సలహాదారుగా వ్యవహరించారు. పలు ప్రైవేటు సంస్థలకు కూడా న్యాయ సలహాదారుగా పనిచేశారు. ఓబుళాపురం మైన్స్ కేసులో చంద్రబాబు, తెదేపా నేతల తరఫున వాదించారు. పెద్దకుమారుడు నితీశ్‌కుమార్ ఏపీ హైకోర్టులో న్యాయవాదిగా పనిచేస్తున్నారు. రెండో కుమారుడు ధీరజ్‌సాయి బెంగళూరులో న్యాయవిద్య చదువుతున్నారు.

జర్నలిస్టుగా 21 ఏళ్లు పనిచేసిన చక్రవర్తి



తూర్పు గోదావరి జిల్లా బిక్కవోలుకు చెందిన వట్టికూటి శరత్‌చంద్ర కల్యాణ చక్రవర్తి తెలుగు విశ్వవిద్యాలయం నుంచి జర్నలిజంలో పోస్టు గ్రాడ్యుయేషన్ చేశారు. 21 ఏళ్ల పాటు జర్నలిస్టుగా పనిచేశారు. 'ఈనాడు'లో పాత్రికేయుడిగా వివిధ విభాగాల్లో బాధ్యతలు నిర్వర్తించారు. ఉత్తమ సినిమా పాత్రికేయుడిగా 2010 సంవత్సరంలో నంది అవార్డు అందుకున్నారు.



ఆలయం ఎదుట జస్టిస్ వి.శ్రీనివాస్ తదితరులు



దర్శనం అనంతరం కుటుంబ సభ్యులతో జస్టిస్ కిరణ్మయి తదితరులు

శ్రీవారిని దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తులు

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారిని ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ వి.శ్రీనివాస్, జస్టిస్ కిరణ్మయి మండవ దర్శించుకున్నారు. ఆదివారం ఉదయం వీఐపీ బ్రేక్ దర్శన సమయంలో కుటుంబ సభ్యులతో కలిసి ఆలయం వద్దకు చేరుకున్న న్యాయమూర్తులకు తితిదే అధికారులు స్వాగతం పలికి శ్రీవారి దర్శనం చేయించారు. అనంతరం వారికి రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం ఇవ్వగా, తితిదే అధికారులు తీర్థప్రసాదాలు అందించారు.

25న తిరుమలలో రథసప్తమి

ఏడు వాహనాలపై భక్తులను కటాక్షించనున్న మలయప్పస్వామి

తిరుమల, న్యూస్‌టుడే: సూర్య జయంతి సందర్భంగా ఈ నెల 25న తిరుమలలో రథసప్తమి నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా స్వామివారు ఆ రోజు ఏడు వాహనాలపై ఆలయ మాడవీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిస్తారు.


వాహన సేవల వివరాలు

- తెల్లవారుజామున 5.30 నుంచి 8 గంటలు: సూర్యప్రభ వాహనం
- ఉదయం 9 నుంచి 10 గంటలు: చిన్నశేష వాహనం
- 11 నుంచి మధ్యాహ్నం 12 గంటలు: గరుడ వాహనం
- మధ్యాహ్నం 1 నుంచి 2 గంటలు: హనుమంత వాహనం
- 2 నుంచి 3 గంటలు: చక్రస్నానం
- సాయంత్రం 4 నుంచి 5 గంటలు: కల్పవృక్ష వాహనం
- 6 నుంచి రాత్రి 7 గంటలు: సర్వభూపాల వాహనం
- 8 నుంచి 9 గంటలు: చంద్రప్రభ వాహనం

ఆర్జిత సేవలు, ప్రత్యేక దర్శనాలు రద్దు

రథసప్తమిని పురస్కరించుకుని కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవలను రద్దు చేశారు. సుప్రభాతం, తోమాల, అర్చన సేవలను ఏకాంతంగా నిర్వహిస్తారు. ఎన్ఆర్ఐలు, చంటిబిడ్డల తల్లిదండ్రులు, సీనియర్ సిటిజన్లు, దివ్యాంగులకు ప్రివిలేజ్ దర్శనాలు రద్దు చేశారు. తిరుపతిలో ఈ నెల 24 నుంచి 26 వరకు స్లాటెడ్ సర్వదర్శనం టోకెన్లు జారీ చేయరు. ప్రొటోకాల్ ప్రముఖులకు మినహా వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు, బ్రేక్ దర్శనాలకు సంబంధించి జనవరి 24న సిఫార్సు లేఖలు స్వీకరించరు.

మద్యం మత్తులో చెవి కొరికిన యువకుడు



గాయపడిన వై.మౌనీశ్వరరెడ్డి

పులివెందుల, సింహాద్రిపురం, న్యూస్‌టుడే: మద్యం మత్తులో ఓ యువకుడు మరో వ్యక్తి చెవి కొరికి తీవ్రంగా గాయపరిచాడు. ఈ ఘటన వైఎస్సార్ కడప జిల్లా సింహాద్రిపురం మండల పరిధిలో శనివారం అర్ధరాత్రి జరిగింది. పోలీసుల కథనం ప్రకారం రావులకొలను గ్రామానికి చెందిన వై.మౌనీశ్వరరెడ్డి, కె.రాజశేఖర్‌రెడ్డి కలిసి మద్యం తాగుతూ ఉండగా.. మాటామాటా పెరిగి ఘర్షణకు దిగారు. ఈ క్రమంలో రాజశేఖర్‌రెడ్డి.. మౌనీశ్వరరెడ్డి చెవి కొరకడంతో పాటు రాయితో దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన బాధితుడిని ఆసుపత్రికి తరలించారు. అతడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పులివెందుల గ్రామీణ సీఐ రమణ తెలిపారు.

స్వామివారి సన్నిధిలో.. ఆపన్నుల పెన్నిధిలా

- ప్రాణదానం ట్రస్టు నిధులతో మేలైన చికిత్సలు
- స్విమ్స్‌లో 27,258 మందికి ఉచిత సర్జరీలు

తిరుపతి (వైద్యవిభాగం), న్యూస్‌టుడే



స్విమ్స్ ఆసుపత్రి

మానవసేవే మాధవ సేవగా భావించే తిరుమల తిరుపతి దేవస్థానం.. 'శ్రీవేంకటేశ్వర ప్రాణదానం ట్రస్టు' ద్వారా ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారి జీవితాలకు అభయమిస్తోంది. భక్తులు ఈ ట్రస్టుకు అందిస్తున్న విరాళాలతో ఆరోగ్య సేవలను విస్తృతం చేస్తోంది. ప్రాణాపాయ స్థితిలోని పేదలకు తిరుపతిలో తితిదే ఆధ్వర్యంలోని శ్రీవేంకటేశ్వర వైద్యవిజ్ఞాన సంస్థ (స్విమ్స్) ద్వారా ఉచితంగా శస్త్రచికిత్సలు చేస్తూ ఆయువు పోస్తోంది. ఆరోగ్యశ్రీ, సీఎం రిలీఫ్ ఫండ్, ప్రధానమంత్రి ఆయుష్మాన్‌భవ వంటి పథకాలేవీ లేని రోజుల్లోనే.. 2001లో ఎస్వీ ప్రాణదానం ట్రస్టు పురుడుపోసుకుంది. 2014లో ఆరోగ్యశ్రీతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు ఇక్కడ అందుబాటులోకి రాగా, వాటి పరిమితికి మించి అయ్యే ఖర్చును ఈ ట్రస్టు ద్వారా సమకూరుస్తున్నారు. గత 23 ఏళ్లలో 27,258 మంది పేద రోగులు లబ్ధి పొందారు. ఈ ట్రస్టుకు రెండు దశాబ్దాల్లో రూ.వెయ్యి కోట్లకు పైగా విరాళాలు అందగా, వాటిలో రూ. 442 కోట్లు వైద్యసేవలకు వెచ్చించారు. 2025లో 2,223 మంది ప్రాణదానం ట్రస్టు ద్వారా లబ్ధి పొందారు.

> **చి**త్తూరు జిల్లా పూతలపట్టుకు చెందిన హేమకుమార్ (24) ఇటీవల ప్రమాదంలో గాయపడగా, బంధువులు తిరుపతి స్విమ్స్‌లో చేర్చారు. పరీక్షించిన వైద్యులు.. హేమకుమార్ బ్రెయిన్ డెడ్‌గా ప్రకటించారు. కుటుంబసభ్యుల సమ్మతి మేరకు అతని గుండె, కాలేయం, మూత్రపిండాలు సేకరించిన వైద్యులు.. అదే ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహిళ(62)కు కాలేయం, మరో మహిళ(61)కు మూత్రపిండం అమర్చారు. శ్రీపద్మావతి చిన్నపిల్లల హృదయాలయంలో ఓ యువకుడి (28)కి గుండెమార్పిడి శస్త్రచికిత్స చేశారు. సుమారు రూ.1.5 కోట్ల విలువైన మూడు సర్జరీలను తితిదే ఆధ్వర్యంలోని 'ప్రాణదానం' ట్రస్టు నిధులతో ఒకే రోజు నిర్వహించారు. ఇదొక రికార్డు!

> **గుం**టూరు జిల్లా మాచర్లకు చెందిన సైదాబీ (12) ఛాతీలో పెద్దగడ్డతో స్విమ్స్‌ను ఆశ్రయించారు. సీటీ సర్జరీ విభాగం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని గుండె, ఊపిరితిత్తులకు ఇబ్బంది లేకుండా గడ్డను తొలగించింది. ఆరోగ్యశ్రీ ద్వారా అందిన డబ్బులు పోనూ, అదనపు ఖర్చును ప్రాణదానం ట్రస్టు భరించింది.

> **అ**న్నమయ్య జిల్లాకు చెందిన సోమశేఖర్(50)కు గుండెలోని 4 కవాటాలూ పూర్తిగా పూడుకుపోయాయి. హైదరాబాద్‌లోని ఆసుపత్రులను సంప్రదించినా సర్జరీకి ముందుకురాలేదు. చివరకు స్విమ్స్‌లో ఆరోగ్యశ్రీ కింద చేర్చుకొని రెండు కవాటాలు మార్చి, మరో రెండింటిని బాగుచేశారు.

ఎలాంటి వ్యాధులకు?

అవయవాల మార్పిడి, కార్డియాలజీ, నెఫ్రాలజీ, కార్డియోథొరాసిక్, క్యాన్సర్, నెఫ్రాలజీ, న్యూరాలజీ, న్యూరో సర్జరీ, సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ, యూరాలజీ విభాగాలతో పాటు ఈఎన్‌టీ, గైనకాలజీ, పిడియాట్రిక్, ఆప్తల్మాలజీ, జనరల్ సర్జరీ తదితర వ్యాధులకు ఈ ట్రస్టు ద్వారా సేవలు అందుతున్నాయి. శ్రీవారి ఉదయాస్తమాన సేవ ద్వారా సేకరించిన నిధులను ప్రాణదానం ట్రస్టుకు బదలాయించి రూ. 230 కోట్లతో శ్రీపద్మావతి చిన్నపిల్లల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మిస్తున్నారు. అక్కడ జరిగే అన్నిరకాల అవయవ మార్పిడి శస్త్రచికిత్సలకు ప్రాణదానం నిధులు వెచ్చించనున్నారు.



సంక్లిష్ట శస్త్రచికిత్స తర్వాత కోలుకున్న రోగులతో సంచాలకుడు డాక్టర్ ఆర్వీ కుమార్

ఓపీ, ఎమర్జెన్సీ విభాగాల్లో సంప్రదించవచ్చు

ఆపరేషన్లు చేస్తే గానీ కోలుకోలేని పేదలు, ఇతరులు స్విమ్స్ ఎమర్జెన్సీ, ఓపీ (ఆదివారం మినహా) విభాగాల్లోని వైద్యులను సంప్రదించవచ్చు. వారు పరీక్షించి, రోగి పరిస్థితిని బట్టి అడ్మిట్ చేసుకుంటారు. ఆరోగ్యశ్రీ పరిధిలో లేని జబ్బులకు చికిత్స చేయాల్సి వస్తే రోగుల నుంచి డబ్బులు తీసుకోకుండా, ప్రాణదానం ట్రస్టు నిధులు వెచ్చిస్తాం. ఇందుకు ప్రత్యేక కమిటీ భేటీ అయ్యి, అర్హులకు ఆమోదం తెలుపుతుంది. రేషన్‌కార్డు లేని రోగులు, ఇతర రాష్ట్రాల ప్రజలకు వ్యాధి తీవ్రతను బట్టి చికిత్సలు అందిస్తాం.

- డాక్టర్ ఆర్వీ కుమార్, డైరెక్టర్ కమ్ వైస్ ఛాన్సలర్, స్విమ్స్

వసుంధర

vasundhara@eenadu.in

ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతున్నా తొలి ఏడాది 95% మార్కులొచ్చాయి. అది చూసి నాన్న సంతోషంగా కనిపించకపోగా నిరాశపడ్డారు. ఉద్యోగరీత్యా ఆయన వారానికోసారి ఇంటికొస్తారు. అయినా సరిగా మాట్లాడట్లేదు. నేను మాట్లాడించినా ఇతర విషయాలు చెబితే 'చదువు మీద శ్రద్ధ లేదు' అంటున్నారు. పుట్టిన రోజు నాడూ సమయం వృథా చేస్తున్నావని కోప్పడుతున్నారు. నాన్నకి ఏమైంది? మునుపటిలా నాపై నమ్మకం కలగాలంటే ఏం చేయాలి? - ఓ సోదరి

నాన్న ఎందుకిలా?

ఇంటర్ ప్రథమ సంవత్సరంలో చాలా మంచి మార్కులు సాధించావు. అందుకు నిన్ను అభినందించాల్సిందే! మీ నాన్న కూడా ముందు నిన్ను అందుకు అభినందించి, ఆపై తన మనసులో ఏముందో చెబితే బాగుండేది. నువ్వు ఏం మాట్లాడినా కోప్పడటం సరికాదు. బహుశా ఆయన మీద ఇతరుల ప్రభావం ఉండి ఉండవచ్చు. అంటే ఇంకా ఎక్కువ మార్కులు వస్తేనే ర్యాంకు వస్తుంది, ప్రొఫెషనల్ కోర్సుల్లో సీటొస్తుంది వంటి మాటలు అన్నారేమో. దాన్ని మనసులో ఉంచుకుని ఇలా ప్రవర్తిస్తుండొచ్చు. కాబట్టి, నువ్వు ఆయన మంచి మూడ్‌లో ఉన్నప్పుడు ప్రేమగా మాట్లాడు. నిన్నెలా చూడాలనుకుంటున్నారు, మంచి మార్కులు రావాలంటే ఇంకా నీవేం చేయాలో ఆయన్నే సలహా అడుగు. ఉద్యోగరీత్యా మీ నాన్నకి ఏమైనా ఒత్తిడి ఉందేమో కనుక్కో. నువ్వు ఆయన్ని ఎంత మిస్ అవుతున్నావో చెప్పు. అప్పుడు ఆయనా నిన్ను అర్థం చేసుకునే ప్రయత్నం చేస్తారు. ఒకవేళ అలా జరగకపోయినా నువ్వు మనసు పాడు చేసుకోకుండా లక్ష్యంపై దృష్టిపెట్టు. చేతల్లో నువ్వేంటో చేసి చూపించు. అప్పుడు మీ నాన్నా నీ సత్తా తెలుసుకుంటారు.

డియర్ వసుంధర



డా. స్వాతి పైడిపాటి
మానసిక నిపుణురాలు



కాస్ నాయుడు

క్రికెట్ కామెంటరీ అంటే ఒకప్పుడు మగవారి గొంతులే వినిపించేవి. కానీ, ఓ మహిళ ఈ రంగంలో రాణించడం పెద్ద విషయం. అయితే, ఆ గాజు తెరల్ని దాటి దక్షిణాఫ్రికా తొలి కామెంటేటర్‌గా నిలిచారు కాస్ నాయుడు. మహిళల క్రికెట్ ప్రపంచ కప్ పోటీల్లోనూ మన దేశంలో కామెంటేటర్‌గా చేసి తన చిరకాల కల నెరవేర్చుకున్నారు. ఇంతకీ తను తెలుగమ్మాయనే విషయం చాలా తక్కువమందికే తెలుసు.

ఆంధ్రా అమ్మాయి... దక్షిణాఫ్రికా కామెంటేటర్!

కస్తూరి నాయుడు... అంటే చాలామందికి తెలియక పోవచ్చు. కాస్ నాయుడు అనగానే క్రికెట్ ప్రేమికులు ఇట్టే గుర్తుపట్టేస్తారు. కామెంటేటర్‌గా ప్రపంచవ్యాప్తంగా ఆమెకు గుర్తింపు ఉంది. కాస్ పుట్టిపెరిగింది దక్షిణాఫ్రికాలోని డర్బన్ అయినా ఆమె మూలాలు ఉత్తరాంధ్రలో ఉన్నాయట. అనకాపల్లి తన స్వస్థలం. తల్లి భగవతి, తండ్రి సన్యాసి నాయుడు. ఆమెకిద్దరు అన్నయ్యలు. ఆమె తాతల కాలంలోనే దక్షిణాఫ్రికాకు వలస వెళ్లింది వీళ్ల కుటుంబం. క్రమంగా అక్కడే స్థిరపడ్డారు. తల్లివైపు తాతయ్యది అనకాపల్లి సమీపంలోని వెంకోజీపాలెం. కస్తూరి తల్లి అడపాదడపా అనకాపల్లికి వస్తుండేవాళ్లు. అలా తెలుగు నేలతో అనుబంధాన్ని పెంచుకున్నారు. ఆ విశేషాలను వింటూ పెరిగిన కాస్ కూడా భారత్‌పై అభిమానం పెంచుకున్నారు.

జర్నలిజం చదివి...

కాస్ చిన్నప్పుడు టామ్ బాయ్. క్రీడలంటే చాలా ఇష్టం. నెట్‌బాల్, రన్నింగ్‌ల్లో రాణించారు కూడా. అలాంటి తనను కామెంటరీ వైపు నడిపింది మాత్రం వెస్టిండీస్ కామెంటేటర్ డోన్నా సిమండ్స్. ఆమెను చూసి 14 ఏళ్ల వయసులో ఇటువైపు రావాలనుకున్నారు కాస్. ఉద్యోగం చేస్తూ చదువుకున్నారు. జర్నలిజం చదివి, కొన్నాళ్లు రిపోర్టర్‌గా, రేడియో, టీవీల్లో స్పోర్ట్స్ ప్రొడ్యూసర్‌గానూ పనిచేశారు. 2003లో కాస్‌కి ఐసీసీ క్రికెట్ వరల్డ్‌కప్‌లో టీవీ హోస్ట్‌గా పనిచేసే అవకాశం వచ్చింది. 2006లో హాంకాంగ్ సిక్సెస్‌లో అంతర్జాతీయ కామెంటరీ మొదలుపెట్టారు. ఇప్పటివరకూ నాలుగు వరల్డ్ కప్‌లకు యాంకరింగ్ చేశారు. ఇండియా-సౌతాఫ్రికా టూర్లు, ఇతర లీగ్‌లకీ చేస్తున్నారు. 2023 క్రికెట్ వరల్డ్ కప్‌లో ఐసీసీ ప్యానెల్‌లోనూ భాగమయ్యారు. పురుషులు, మహిళల క్రికెట్ రెండింటికీ అంతర్జాతీయ స్థాయిలో కామెంటరీ ఇచ్చారు. మహిళల ఆటను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో 'జీస్పోర్ట్' అనే సంస్థను స్థాపించారు. హిస్టారిక్ విమెన్ ఆధ్వర్యంలోని కామెంటరీ ప్యానెల్‌లో ఈసాగుహా, మిథాలీ రాజ్, సనామీర్ వంటి వాళ్లతో కలిసి పాల్గొన్నారు. ఎప్పటికైనా భారత్‌లో కామెంటరీ చెప్పాలన్నది కాస్ కల అట. తాజా మహిళల క్రికెట్ ప్రపంచ కప్ పోటీల్లో దాన్ని నెరవేర్చుకున్నారు.

ఇబ్బందులెన్నో దాటి...

కాస్ ఎప్పుడూ క్రికెట్ ఆడలేదు. అలాంటి తను కామెంటరీ ఎలా చేయగలదని చాలామంది అనుమానించారట. వాళ్లందరికీ తన పనితోనే సమాధానమిచ్చారామె. హర్షాభోగ్లే వంటివారి మెంటారింగ్‌లో నైపుణ్యాలను పెంచుకుని సత్తా చాటారు. 2006లో రేడియోలో మహిళల స్పోర్ట్స్ కవరేజ్ తక్కువ అని గమనించిన కస్తూరి... భర్త రైక్‌తో కలిసి జీస్పోర్ట్4గర్ల్స్ అనే వెబ్‌సైట్ ఆరంభించారు. మహిళా అథ్లెట్లను ప్రోత్సహించే ప్లాట్‌ఫాం ఇది. ఇప్పుడది దక్షిణాఫ్రికాలో నంబర్‌వన్ స్థానంలో ఉంది. కస్తూరి నాయుడు ముగ్గురు పిల్లల తల్లి. 'పేషన్, శ్రమించే తత్వం, మనమీద మనకి నమ్మకం ఉంటే... లక్ష్యం ఏదైనా చేరుకోవచ్చు' అంటారు కస్తూరి నాయుడు. మహిళల ఉనికే కనిపించని కొత్త దారిలో అడుగుపెట్టి, తనకంటూ గుర్తింపు తెచ్చుకున్నారు కాస్. ఆమె విజయం ఎందరికో స్ఫూర్తి.

అందరిలోనూ ఒంటరే!

మీరు ఒంటరిగా ఉన్నారా? ఈ ప్రశ్న అడగగానే... అబ్బే లేదండీ ఇంట్లో చాలామందే ఉంటారు. ఆఫీసులోనూ మాది పెద్ద టీమే... అంటూ సమాధానం చెబుతారేమో. ఇక్కడ ప్రశ్న శారీరకంగా కాదు, మానసికంగా! అర్థం కాలేదా? బెస్ట్ ఫ్రెండ్ నుంచి మెసేజ్. చూడగానే చాలా ఆనందంగా, అవతలి వ్యక్తిని మిస్ అవుతున్నట్లుగా అనిపించింది. మామూలుగా అయితే వెంటనే సమాధానం ఇవ్వాలి. కానీ ఇప్పుడు కాదులే... తరవాత మెసేజ్ చేద్దామని పక్కన పెట్టేశారు. ఇంకోసారి అంతే... ఫ్రెండ్‌తో బాగా మాట్లాడాలి అనిపించింది. కానీ ఫోన్‌లో ఏ సిరీస్‌నో చూస్తూ కూర్చున్నారు. ఇవన్నీ మీరు మానసికంగా ఒంటరి అనడానికి చిహ్నాలే. ఇవే కాదు, ఎవరైనా బయటికి రావొచ్చుగా అన్నా పార్టీకి పిలిచినా 'నేను నలుగురిలో కలవలేను' అని దూరంగా ఉండటం. ఏ పనీ చేయాలనిపించకపోవడం, చిన్నవాటికి కోపం, చిరాకు. పాత స్నేహితులే తప్ప కొత్త స్నేహాలకు ఆస్కారమే లేకపోవడం... వంటివీ దీనికి ఉదాహరణలే!



ఏముందిలే చిన్నదే అనుకుంటాం కానీ... ఇది శారీరకంగానే కాదు మానసికంగానూ అలసిపోయేలా చేయగలదు. ఈ సమస్య ఆడవాళ్లలోనే ఎక్కువగా కనిపిస్తోంది అంటున్నాయి అధ్యయనాలు. దారుణమేంటంటే దాన్ని ఎవరూ గుర్తించలేకపోవడం. పైగా అలసిపోయాను, బాగా బిజీగా ఉన్నా, త్వరగా కలవలేను కాబట్టే ఇలా అని సమాధానాలు చెప్పుకొంటున్నారట. దీర్ఘకాలం కొనసాగితే నా అన్నవాళ్లందరినీ పక్కనపెట్టి, మానసిక సమస్యలను కొని తెచ్చుకున్నట్లే అవుతుందంటున్నారు నిపుణులు. కాబట్టి, బయటపడాలంటే స్నేహితులతో సరదాగా మాట్లాడి, గడిపి ఎన్నాళ్లైంది? అని మిమ్మల్ని మీరు ప్రశ్నించుకోండి. అవసరమైతే మీరే మాట్లాడండి. ఏదైనా యాక్టివిటీ క్లబ్, కొత్త హాబీ సర్కిల్‌లో చేరండి. కొత్తవాళ్లతో మాట కలపండి. ఇవన్నీ మీ ఒంటరితనాన్ని దూరం చేస్తాయి. మనసునీ ఉత్తేజంగా మారుస్తాయి. గమనించుకుని పాటించండి మరి.

న్యూయార్క్‌లో చీరకట్టు చూడాలని...

ప్రేరణ

రోజూ చూసే చీరలే! వాటిలో కొత్తదనం తేవాలంటే భిన్నంగా ఆలోచించాలనుకున్నారు పాలక్ షా. తన సంస్థ 'ఏకయా' ద్వారా బనారస్ చీరలకు ప్రపంచస్థాయి బ్రాండ్ సృష్టిస్తున్నారు.

కింగ్స్ కాలేజ్ లండన్ నుంచి బిజినెస్ మేనేజ్‌మెంట్‌లో డిగ్రీ చేశారు పాలక్. వీరి కుటుంబం బనారస్ చీరల హోల్‌సేల్ వ్యాపారంలో ఉండేది. 2012లో ఈమె కూడా కుటుంబ వ్యాపారంలో చేరారు. రిటైల్ వ్యాపారంలో అడుగుపెడదామని తండ్రి భావిస్తే దానికి ఒక బ్రాండింగ్ తీసుకురావాలనుకున్న పాలక్... 'ఏకయా'ను మొదలుపెట్టారు.

- సంప్రదాయ బనారస్ చీరల ప్రామాణికతను కాపాడుతూనే ఆధునికతను జోడించారు. దీనికోసం వస్త్ర తయారీలో ఎప్పుడూ పనిచేయని ఆర్కిటెక్ట్‌లు, ఫ్యాషన్ నిపుణులు, జ్యూయలరీ డిజైనర్లతో కలిసి పనిచేస్తూ కొత్తదనం తెచ్చారు. తర్వాత అబ్రహం అండ్ ఠాకూర్, అర్చనా రావు, మసాబా గుప్తా లాంటి డిజైనర్లతోనూ అంతర్జాతీయ బ్రాండ్ల భాగస్వామ్యంలో పనిచేశారు. బనారస్ పట్టుకు ఫ్రెంచ్ టైలరింగ్, ప్యాటర్న్ ఉండేలా తెచ్చారు. రెడీ టు వేర్... ఓవర్ సైజ్డ్ జాకెట్లు, ఫ్లేర్డ్ ప్యాంట్స్, ఏ-లైన్ స్కర్ట్స్, ఆర్గాంజా షర్ట్స్ తెచ్చారు.
- 'మన దగ్గర అద్భుతమైన నేతకారులు ఉన్నారు. వాళ్ల పనితనాన్ని ప్రపంచానికి చూపాలనుకున్నా. కేవలం పసుపు, ఎరుపు రంగుల్లో ఉండే చీరలనే కాకుండా, ఇంకా భిన్నంగా తీసుకురావడంపైన దృష్టిపెట్టా. అలా చీరమీదకు బెల్టులు కట్టే స్టైల్‌ని తెచ్చాం. ప్రీ-డ్రేప్డ్ చీరలు, బ్రూచ్‌ల్లాంటి అదనపు ఆకర్షణలు తెచ్చాం. అంతర్జాతీయ ఫ్యాషన్ ఈవెంట్లలో మా ఉత్పత్తులు ప్రదర్శించాం' అని చెప్పే పాలక్... ఎనిమిదివేల మంది నేతకారులకు ఉపాధి కల్పిస్తున్నారు.
- దేశంలో అయిదు నగరాల్లో వీళ్లకి రిటైల్ దుకాణాలున్నాయి. ఎప్పటికైనా న్యూయార్క్ నగరంలోని ఫిఫ్త్ అవెన్యూలో స్టోర్‌ని ప్రారంభిస్తానంటారు పాలక్. అంతేకాదు, 'న్యూయార్క్, పారిస్‌ల్లో యువతులు స్టైల్‌కు చిహ్నంగా చీరల్ని కట్టుకునేలా చేయాలనేది నా కల' అని చెబుతారు.



పాలక్

చేతి వేళ్లు చాలు...



ఆత్మరక్షణ కోసం ఆయుధాలేమీ ఉండనవసరంలేదు, మన చేతి వేళ్లు చాలు. చూపుడు వేలికి మధ్యవేలుని కలిపి దేన్నైనా గట్టిగా వత్తి చూడండి ఎంత గట్టిగా ఉంటాయో. మనపైన దాడి చేయడానికి వచ్చే వ్యక్తిపై ప్రయోగించండి. ఇలా కలిపిన రెండు వేళ్లను గొంతులో దింపడమే. రోజూ ప్రాక్టీసు చేస్తే శక్తిమంతమైనన ఆయుధంలా పని చేస్తుంది. దీని ప్రాక్టీసు కోసం చిన్నగా ఎవరి గొంతు దగ్గర వాళ్లు పెట్టుకుని ప్రయత్నించవచ్చు. అప్పుడు మీ టెక్నిక్ ఇంపాక్ట్ తెలుస్తుంది. ఇది ఎంతో సులభమైన టెక్నిక్, వేగవంతంగానూ ప్రయత్నించవచ్చు.



– ప్రతిభ తక్కడపల్లి, మార్షల్ ఆర్ట్స్ నిపుణురాలు

రెఫరీ... రిపబ్లిక్ డే కవాతుకు!



చేని మంగ

ఆమె ఓ బాస్కెట్ బాల్ క్రీడాకారిణి. తరవాత రెఫరీగా మారారు. తాజాగా దిల్లీలో గణతంత్ర వేడుకల్లో ఎన్‌సీసీ క్యాడెట్లకు నేతృత్వం వహించే అవకాశం అందుకున్నారు... చేని మంగ.

మాది జగిత్యాల. చిన్నప్పట్నుంచీ బాస్కెట్ బాల్ క్రీడపై ఆసక్తి. జాతీయస్థాయి పోటీల్లోనూ పాల్గొన్నా. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి బ్యాచిలర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ పూర్తి చేసి, ఓ ప్రైవేటు పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయురాలిగా చేరా. 2016లో బాస్కెట్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (బీఎఫ్ఐ) నుంచి అర్హత సాధించి మహారాష్ట్ర, ఒడిశా, మధ్యప్రదేశ్, పంజాబ్ రాష్ట్రాల్లో నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో రెఫరీగానూ వ్యవహరించా. అయిదేళ్ల క్రితం మా పాఠశాలలో ఎన్‌సీసీ విభాగ నిర్వహణకు అనుమతి వచ్చింది. దీంతో క్యాడెట్లకు శిక్షణ ఇవ్వాలనుకున్నా. అందుకుగానూ అసోసియేట్ ఎన్‌సీసీ అధికారి (ఏఎన్‌వో) అర్హత కోసం 2022లో మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో రెండు నెలలు శిక్షణ తీసుకున్నా. అప్పట్నుంచీ ఏటా 50 మంది క్యాడెట్లకు మార్గనిర్దేశం చేస్తున్నా. ఈ నెల 26న దిల్లీలో జరిగే గణతంత్ర దినోత్సవ పరేడ్‌కు రాష్ట్రం నుంచి ఎంపికైన 136 మంది క్యాడెట్లకు నేతృత్వం వహించే ఇన్‌స్ట్రక్టర్‌గా ఎంపికయ్యా. రెండున్నర నెలలుగా ఆర్మీ ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్న క్యాడెట్లకు నేను మార్గనిర్దేశం చేస్తున్నా.

ఈ అవకాశం నేను అస్సలు ఊహించలేదు. దీనికి దిల్లీ డైరెక్టరేట్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్, హైదరాబాద్ గ్రూప్ కమాండర్స్ ఇంటర్వ్యూ నిర్వహించారు. కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, సంగారెడ్డి యూనిట్ల నుంచి 20 మంది ఏఎన్‌వోలు హాజరు కాగా నాకు అవకాశం వచ్చింది. గ్రూప్ కమాండర్స్ అడిగిన ప్రశ్నలకు తడబాటు లేకుండా సమాధానాలిచ్చా. ఇందుకు అసోసియేట్ ఎన్‌సీసీ అధికారి అర్హత సాధించేందుకు మధ్యప్రదేశ్‌లో తీసుకున్న శిక్షణ, బీఎఫ్ఐ రెఫరీగా నాలుగు రాష్ట్రాల్లో పర్యటించిన అనుభవం, ఆంగ్లం, హిందీ భాషల్లో ప్రావీణ్యం ఉండటం కలిసొచ్చింది. పరేడ్ పూర్తయ్యాక రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోదీ, రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, దిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తాలను కలిసే అవకాశం దొరుకుతుంది. ఇది నాలో ఉత్సాహం నింపుతోంది. మావారు సునీల్‌కుమార్, పాఠశాల ప్రిన్సిపల్ సిస్టర్ జోతిస్ మరియా ప్రోత్సాహంతోనే ఇదంతా సాధ్యమైంది.

– సిరిసిల్ల ఉమాశంకర్ శర్మ, జగిత్యాల

రివ్యూ చేస్తున్నారా?

ప్రశ్న వినగానే ఏ పుస్తకం గురించో, సినిమా గురించో అనుకునేరు! ఇది దుస్తుల గురించి. డ్రెస్సులు రివ్యూ చేయడమేంటా అన్న సందేహమొచ్చిందా? పండుగ అన్నిరోజులూ కొత్త దుస్తులే వేయం కదా! అందుకని బాగా నచ్చినవో, చాలాకాలం తరవాత కట్టాలనిపించో బీరువాలో నుంచి కొన్ని దుస్తులు తీసుంటారుగా! ఏమనిపించింది? వేసుకున్నాక ఖంగు తిన్నారా? 'ఏంటి లావయ్యానా?' అన్న సందేహమూ వచ్చుంటుంది. చాలామంది సమస్యే ఇది. పెరుగుతున్న వయసు, మారుతున్న జీవనశైలి, హార్మోనుల్లో వచ్చే మార్పులు... ఇలా ఎన్నో కారణాలు మన బరువులో హెచ్చుతగ్గులకు కారణమవుతూ ఉంటాయి.

టైలర్లు తక్కువ. ఏడాదికి ఒకటో రెండో సార్లు కొత్త దుస్తులు... ఇదీ ఒకప్పటి పరిస్థితి. దీంతో ఉన్నవాటినే జాగ్రత్తగా వేసుకునేవాళ్లు. మరి ఇప్పుడు? ఆన్‌లైన్ దూరమే కొనుగోళ్లు. మెషీన్ తయారీ, మారిపోయే ఫ్యాషన్... ఇలా కారణాలెన్నో వెరసి సందర్భం లేకపోయినా కొంటూ, బీరువాలో పేర్చుతూ పోతున్నాం. ఎప్పుడో గుర్తొస్తే తప్ప కిందవి కిందే... పైవి పైనే! దీంతో తీరా వేసుకుందాం అనుకునేసరికి రంగు వెలవడం, బిగుతుగా మారడం, వస్త్రం



చీకిపోవడం లాంటి సమస్యలెన్నో. ఇకప్పుడు ఫీలవుతాం... గిల్టీగా! ఈ గోలంతా ఎందుకు చెప్పండి. పైగా డబ్బులూ వృథానే. పట్టుచీరలంటే మాటిమాటికీ కట్టలేం కానీ... మిగతా డ్రెస్సులు, చీరలు ప్రయత్నించొచ్చు కదా! పైవాటిని వేసుకుంటూ ఉతకగానే వాటిని కింద పెడుతూ వెళ్లండి. దుస్తులు రొటేట్ అవుతాయి. మార్పులూ తెలుస్తాయి. ఒకటే కాకుండా కొత్తగా వేసుకున్న అనుభూతీ వస్తుంది. పట్టు బ్లవుజులు మాత్రం ప్రతి మూడు నెలలకీ చెక్ చేసుకుంటే సరి. తీరా ఏదైనా సందర్భానికి వేసుకోవాల్సి వచ్చినా కంగారు ఉండదు. ఏమంటారు? రివ్యూ చేసుకుంటారా మరి?

కొబ్బరి అలంకరణలు..!

స్వీట్ హోమ్











ఇల్లు కొత్తగా అందంగా కనిపించేందుకు ఎప్పటికప్పుడు సరికొత్త ట్రెండ్స్ అనుసరిస్తుంటారు గృహాలంకరణ ప్రియులు. అయితే అందంతోపాటు ఇల్లు ఎకో ఫ్రెండ్లీగానూ ఉండాలనుకుంటోంది నేటితరం. ఈ క్రమంలో వచ్చినవే ఈ కొబ్బరి మట్టలతో చేసిన అలంకరణలు. ఇంట్లో ఏ శుభకార్యం జరిగినా కొబ్బరి ఆకులతో తోరణాలు, పందిళ్లు, బొమ్మలు విరివిగా కనిపిస్తాయి. అంతేకాదు, కొబ్బరి పీచు, మట్టలతో తయారైన తాళ్లు, డోర్ మ్యాట్‌లు, కుర్చీ సీట్లు, పూల కుండీలు... వంటివి ఇప్పటికే మన ఇంట్లో భాగం అయిపోయి ఉంటాయి. ఇప్పుడు కొబ్బరి మట్టలు, కొబ్బరి ఆకులతో రకరకాల జంతువుల బొమ్మలుగా చేసి వాటిపై పెయింటింగ్స్ వేసి టీపాయ్, కాఫీ టేబుల్, వాల్, కార్నర్ డెకార్లుగా వీటిని అమర్చేస్తున్నారు.





ఆయన్ని చూసి... సైన్యంలోకి!



నాన్న ఇళ్లకు రక్ష! ఎండనకా వాననకా బ్యాటన్ పట్టుకుని రాత్రుళ్లు వీధుల్లో పహారా కాస్తుంటారు. ఆయన్ని చూసే ఆమె స్ఫూర్తి పొందారు. అయితే ఆమె ఒక ప్రాంతానికే పరిమితం కాదలచుకోలేదు. కాబట్టే, దేశాన్ని రక్షించే బాధ్యత తీసుకున్నారు ఇనోని.

మణిపుర్‌లోని రాలునామెయి అనే చిన్న గ్రామం ఇనోనిది. వీళ్లది మావో నాగా అనే గిరిజన తెగ. ఆరుగురు సంతానంలో ఆఖరి అమ్మాయి. నాన్న ప్రైవేటు సెక్యూరిటీ గార్డు. ఆయన జీతంలోనే వీళ్ల పోషణ, చదువు అంతా. పేదరికం చుట్టుముట్టినా, ఆర్థిక సమస్యలు ఎదురైనా పిల్లల కలలను ప్రోత్సహించాలనుకున్నారు ఇనోని అమ్మానాన్నలు. కాబట్టే, ఆమె సైన్యంలోకి వెళతానంటే కాదనలేదు. నిజానికి వాళ్ల తెగలో సైన్యంలోకి వెళ్లినవాళ్లు లేరు. ఎనిమిదో తరగతిలో ఉండగా ఇనోనికి సైనికురాలు కావాలనిపించింది. కారణం కూడా తండ్రే. ఆయన కాలంతో సంబంధం లేకుండా బ్యాటన్ పట్టుకుని రాత్రుళ్లు పహారా కాసేవారు. తనూ అలా దేశ సరిహద్దుల్లో విధులు నిర్వర్తించాలనుకున్నారు.

అందుకే స్కూల్లో ఎన్‌సీసీలో చేరారు. తరవాత శిక్షణ నిమిత్తం దిల్లీకి మారారు. ఇది ఆమె నిర్ణయాన్ని మరింత బలపరిచింది. అందుకే మిలిటరీ ప్రవేశపరీక్ష రాసి, చెన్నై ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీలో ప్రవేశం పొందారు. ఇక్కడ శిక్షణ శారీరకంగానే కాదు మానసికంగానూ అలసిపోయేలా చేసేదే. 'చాలా సార్లు అలసిపోయేదాన్ని. నేను చేయలేనేమో అన్న సందేహమూ వచ్చింది. అప్పుడు నాన్న కష్టం, త్యాగాలే గుర్తొచ్చాయి. అంతే... తిరిగి దృఢంగా తయారయ్యేదాన్ని. సవాళ్లని ధైర్యంగా దాటేదాన్ని' అనే 22ఏళ్ల ఇనాని ఇటీవలే శిక్షణ పూర్తి చేసుకున్నారు. ఇప్పుడామెను చూసి తన కుటుంబమే కాదు, ఊరంతా గర్వపడుతోంది. ఈశాన్య రాష్ట్రాల్లోని ఒక చిన్న పల్లె నుంచి ధైర్యం, పట్టుదలతో ఇనాని సాధించిన విజయమిది. అందుకే ఈమె ప్రయాణం యువతకే కాదు, సైన్యంలోకి రావాలనుకునే అమ్మాయిలకీ స్ఫూర్తిదాయకమే. కాబట్టే, ఇనాని కథ సోషల్‌మీడియాలో వైరలవుతోంది.



ఛాంపియన్


మిచెల్ 137

డబ్ల్యూపీఎల్‌లో ఈనాడు
గుజరాత్ × బెంగళూరు
వేదిక: వడోదర, రా॥ 7.30

సొంతగడ్డపై వన్డేల్లో టీమ్‌ఇండియా ఆధిపత్యానికి గండి. మూడేళ్ల తర్వాత మన జట్టు స్వదేశంలో వన్డే సిరీస్‌ను చేజార్చుకుంది. బంతితో తేలిపోయి, బ్యాటుతో తడబడిన భారత్.. మూడో వన్డేలో న్యూజిలాండ్‌కు తలవంచింది. మిచెల్, ఫిలిప్స్‌లు సూపర్ శతకాలతో కివీస్‌కు భారీ స్కోరును అందించగా.. ఛేదనలో టీమ్‌ఇండియా విఫలమైంది. కోహ్లి అద్భుత పోరాటంతో సెంచరీ సాధించినా.. ఫలితం లేకపోయింది. భారత్‌లో న్యూజిలాండ్ తొలిసారి వన్డే సిరీస్‌ను చేజిక్కించుకుంది.

కోహ్లి పోరాడినా..

విరాట్ శతకం వృథా


కోహ్లి 124

- మూడో వన్డేలో భారత్ ఓటమి
- న్యూజిలాండ్‌దే సిరీస్ ● మిచెల్, ఫిలిప్స్ సెంచరీలు

ఇండోర్


ఇటీవల స్వదేశంలో ఓటములు చవిచూస్తున్న భారత జట్టుకు మరో చేదు అనుభవం. ఈసారి వన్డేల్లో దెబ్బతింది! న్యూజిలాండ్‌తో మూడు వన్డేల సిరీస్‌ను టీమ్‌ఇండియా కోల్పోయింది. బంతి, బ్యాట్‌తో విఫలమైన శుభ్‌మన్ బృందం మూడో వన్డేలో 41 పరుగుల తేడాతో ఓటమి చవిచూసింది. ఆదివారం మొదట కివీస్ 8 వికెట్లకు 337 పరుగులు చేసింది. డరిల్ మిచెల్ (137; 131 బంతుల్లో 15×4, 3×6) వరుసగా రెండో సెంచరీ చేయగా.. గ్లెన్ ఫిలిప్స్ (106; 88 బంతుల్లో 9×4, 3×6) కూడా శతకం సాధించాడు. అర్ష్‌దీప్, హర్షిత్ చెరో మూడు వికెట్లు పడగొట్టారు. భారీ ఛేదనలో భారత్ 46 ఓవర్లలో 296 పరుగులకే ఆలౌటైంది. విరాట్ కోహ్లి (124; 108 బంతుల్లో 10×4, 3×6) వీరోచిత సెంచరీ, నితీశ్‌కుమార్ రెడ్డి (53; 57 బంతుల్లో 2×4, 2×6), హర్షిత్ (52; 43 బంతుల్లో 4×4, 4×6) మెరుపులు భారత్‌ను గెలిపించలేకపోయాయి. జాక్ ఫౌక్స్ (3/77), క్లార్క్ (3/54), లెనాక్స్ (2/42) భారత్‌కు కళ్లెం వేశారు.

కోహ్లి శతకబాదినా..: భారత్ ఇన్నింగ్స్ కూడా న్యూజిలాండ్ ఇన్నింగ్స్‌నే తలపించింది. అయితే టీమ్ ఇండియా ఫినిషింగ్ చేయలేకపోయింది. భారీ ఛేదనలో ఆరంభంలోనే భారత్‌కు ఎదురుదెబ్బ తగిలింది. రోహిత్‌శర్మ (11) తొలి వికెట్ రూపంలో ఔటయ్యాడు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (23), శ్రేయస్ అయ్యర్ (3)తో పాటు గత మ్యాచ్‌లో సెంచరీ చేసిన రాహుల్ (1) కూడా తక్కువ స్కోరుకే వెనుదిరగడంతో భారత్ 71/4తో కష్టాల్లో చిక్కుకుంది. ఈ స్థితిలో నితీశ్‌కుమార్‌తో కలిసి కోహ్లి స్కోరును ముందుకు తీసుకెళ్లాడు. నియంత్రణతో కూడిన షాట్లతో అతడు స్కోరు పెంచాడు. కుదురుకున్నాక తన షాట్లు ఆడిన విరాట్.. 51 బంతుల్లో అర్ధసెంచరీ చేశాడు. నితీశ్‌కుమార్ నుంచి అతడికి చక్కటి సహకారం అందింది. మరోవైపు ఫౌక్స్ బౌలింగ్‌లో ఓ మెరుపు సిక్స్ బాదిన నితీశ్.. ఫిలిప్స్ వేసిన బంతినీ స్టాండ్స్‌లోకి కొట్టాడు. ఇదే క్రమంలో వన్డేల్లో తొలి అర్ధసెంచరీని నమోదు చేశాడు. సాధించాల్సిన రన్‌రేట్ మరీ ఎక్కువగా లేకపోవడం, కోహ్లి-నితీశ్ కుదురుకోవడంతో భారత్‌కు విజయావకాశాలు కనిపించాయి. కానీ నితీశ్‌ను ఔట్ చేసిన క్లార్క్..భారత్‌ను దెబ్బ కొట్టాడు. తర్వాత జడేజా (12) కూడా ఔటైపోవడంతో భారత్ 178/6తో ఇక కష్టమే అనిపించింది. ఈ స్థితిలో కోహ్లికి జత కలిసిన హర్షిత్ మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. ఎడాపెడా షాట్లు బాదిన అతడు సాధించాల్సిన రన్‌రేట్‌ను కరిగించాడు. మరోవైపు ఫౌక్స్ బౌలింగ్‌లో సిక్స్, ఫోర్ బాదిన కోహ్లి.. అదే జోరుతో 91 బంతుల్లో సెంచరీ చేశాడు. జేమీసన్ వేసిన 43వ ఓవర్లో కోహ్లి-హర్షిత్ జంట 21 పరుగులు రాబట్టడంతో మ్యాచ్ ఆసక్తికరంగా మారింది. కానీ తర్వాతి ఓవర్లోనే వరుస బంతుల్లో హర్షిత్ రాణా, సిరాజ్ ఔట్ కావడంతో భారత్ పనైపోయింది. ఆఖరిదాకా పోరాడిన విరాట్.. తొమ్మిదో వికెట్ రూపంలో వెనుదిరిగాడు.

తడబడి నిలబడిన కివీస్: అంతకుముందు న్యూజిలాండ్ ఇన్నింగ్స్ మొదలైన తీరుకి.. ముగిసిన విధానానికి పొంతనే లేదు. 5 పరుగులకే 2 వికెట్లు.. 58కే 3 వికెట్లు ఇలా సాగింది ఆ జట్టు ఆట. కానీ భారీ స్కోరుతో ఇన్నింగ్స్‌ను ముగించిందంటే కారణం డరిల్ మిచెల్, గ్లెన్ ఫిలిప్స్‌ల సూపర్ బ్యాటింగే. గత మ్యాచ్ ఫామ్‌ను కొనసాగిస్తూ మిచెల్ మరో సెంచరీ బాదేయగా.. ఫిలిప్స్ సైతం శతకాన్ని అందుకోవడంతో భారత్ ముంగిట భారీ లక్ష్యం నిలిచింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్ 7 బంతుల వ్యవధిలో ఓపెనర్లు నికోల్స్ (0), డెవాన్ కాన్వే (5) వికెట్లను కోల్పోయింది. ఈ స్థితిలో మిచెల్, విల్ యంగ్ (30; 41 బంతుల్లో 5×4, 1×6) నిలిచారు. దీంతో కివీస్ 12 ఓవర్లకు 58/2తో కాస్త కోలుకుంది. యంగ్ ఔటైన తర్వాత మిచెల్, ఫిలిప్స్ కివీస్‌ను నడిపించారు. గత వన్డేలో మాదిరే స్పిన్నర్ కుల్‌దీప్ బౌలింగ్‌లోనే మిచెల్ ఎదురుదాడికి దిగాడు. అతడు వేసిన తొలి ఓవర్ తొలి బంతికే సిక్సర్ బాదేశాడు. తర్వాత కుల్‌దీప్ బౌలింగ్‌లోనే మరో ఫోర్‌తో మిచెల్ 56 బంతుల్లో అర్ధసెంచరీ అందుకున్నాడు. 21 ఓవర్లకు 101/3తో కివీస్ కోలుకుంది. అడపాదడపా షాట్లు ఆడిన ఫిలిప్స్ 53 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేశాడు. చక్కని బ్యాటింగ్‌ను కొనసాగించిన మిచెల్.. జడేజా బౌలింగ్‌లో ఓ సింగిల్‌తో 106 బంతుల్లో సెంచరీ మార్కు అందుకున్నాడు. శతకం తర్వాత మిచెల్ మరింత రెచ్చిపోగా.. ఫిలిప్స్ కూడా బ్యాట్ ఝుళిపించాడు. కుల్‌దీప్ వేసిన 41వ ఓవర్లో సిక్స్, ఫోర్‌తో 90ల్లోకి వచ్చిన ఫిలిప్స్... 83 బంతుల్లోనే శతకం పూర్తి చేశాడు. కానీ స్వల్ప తేడాతో ఫిలిప్స్, మిచెల్‌లను భారత్ పెవిలియన్ చేర్చింది. ఫిలిప్స్‌ను అర్ష్‌దీప్ ఔట్ చేశాడు. దీంతో మూడో వికెట్‌కు మిచెల్-ఫిలిప్స్ మధ్య 219 పరుగుల భారీ భాగస్వామ్యానికి భాగస్వామ్యానికి తెరపడింది. ఆ తర్వాత మిచెల్, మిచెల్ హే (2) కూడా స్వల్ప వ్యవధిలో ఔటైనా టెయిలెండర్లను భారత్ కట్టడి చేయలేకపోవడంతో కివీస్ భారీ స్కోరు చేసింది. బ్రాస్‌వెల్ (28 నాటౌట్; 18 బంతుల్లో 1×4, 3×6) న్యూజిలాండ్‌కు మెరుపు ముగింపునిచ్చాడు. భారత స్పిన్నర్లు మరోసారి విఫలమయ్యారు. హర్షిత్, అర్ష్‌దీప్ వికెట్లు తీసినా.. ధారాళంగా పరుగులు ఇచ్చేశారు.

54 — విరాట్ సాధించిన వన్డే శతకాల సంఖ్య. అత్యధిక వన్డే సెంచరీల జాబితాలో అతడు ఇప్పటికే అగ్రస్థానంలో ఉన్నాడు. సచిన్ (49) రెండో స్థానంలో ఉన్నాడు.


గిల్‌ను ఔట్ చేసిన ఆనందంలో జేమీసన్


ఫిలిప్స్ 106

న్యూజిలాండ్ ఇన్నింగ్స్: కాన్వే (సి) రోహిత్ (బి) హర్షిత్ రాణా 5; నికోల్స్ అర్ష్‌దీప్ (బి) 0; యంగ్ (సి) జడేజా (బి) హర్షిత్ రాణా 30; మిచెల్ (సి) కుల్‌దీప్ (బి) సిరాజ్ 137; ఫిలిప్స్ (సి) రాహుల్ (బి) అర్ష్‌దీప్ 106; బ్రాస్‌వెల్ నాటౌట్ 28; మైకేల్ హే ఎల్బీ (బి) కుల్‌దీప్ 2; ఫౌక్స్ (సి) కుల్‌దీప్ (బి) అర్ష్‌దీప్ 10; క్లార్క్ (బి) హర్షిత్ 11; జేమీసన్ నాటౌట్ 0; ఎక్స్‌ట్రాలు 8 **మొత్తం:** (50 ఓవర్లలో 8 వికెట్లకు) **337; వికెట్ల పతనం:** 1-5, 2-5, 3-58, 4-277, 5-283, 6-286, 7-304, 8-327; **బౌలింగ్:** అర్ష్‌దీప్ 10-1-63-3; హర్షిత్ రాణా 10-0-84-3; సిరాజ్ 10-0-43-1; నితీశ్ 8-0-53-0; కుల్‌దీప్ 6-0-48-1; జడేజా 6-0-41-0

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ (బి) క్లార్క్ (బి) ఫౌక్స్ 11; శుభ్‌మన్ (బి) జేమీసన్ 23; విరాట్ కోహ్లి (సి) మిచెల్ (బి) క్లార్క్ 124; శ్రేయస్ (సి) ఫౌక్స్ (బి) క్లార్క్ 3; రాహుల్ (సి) ఫిలిప్స్ (బి) లెనాక్స్ 1; నితీశ్‌కుమార్ (సి) యంగ్ (బి) క్లార్క్ 53; జడేజా (సి) యంగ్ (బి) లెనాక్స్ 12; హర్షిత్ రాణా (సి) నికోల్స్ (బి) ఫౌక్స్ 52; సిరాజ్ (సి) హే (బి) ఫౌక్స్ 0; కుల్‌దీప్ రనౌట్ 5; అర్ష్‌దీప్ నాటౌట్ 4; ఎక్స్‌ట్రాలు 8 **మొత్తం:** (46 ఓవర్లలో ఆలౌట్) **296; వికెట్ల పతనం:** 1-28, 2-45, 3-68, 4-71, 5-159, 6-178, 7-277, 8-277, 9-292; **బౌలింగ్:** జేమీసన్ 9-0-58-1; ఫౌక్స్ 9-0-77-3; క్లార్క్ 9-0-54-3; లెనాక్స్ 10-0-42-2; మిచెల్ 1-0-10-0; ఫిలిప్స్ 8-0-54-0

ఎందుకిలా..

ఈనాడు క్రీడావిభాగం

సొంతగడ్డపై టీమ్‌ఇండియా ఒకప్పుడు తిరుగులేని శక్తి. కానీ క్రమంగా ఆధిపత్యాన్ని కోల్పోతోంది. స్వదేశంలో సిరీస్‌లంటే అలవోకగా చేజిక్కించుకునేది.. ఇప్పుడు ఆపసోపాలు పడుతోంది. న్యూజిలాండ్‌తో ముగిసిన వన్డే సిరీస్.. పడిపోతున్న భారత జట్టు ప్రమాణాలకు తాజా నిదర్శనం. 2024లో ఇక్కడ మొట్ట మొదటిసారి టెస్టు సిరీస్ గెలిచిన (అది కూడా 3-0తో) కివీస్.. ఇప్పుడు తొలిసారి ఈ దేశంలో వన్డే సిరీస్‌నూ నెగ్గి టీమ్‌ఇండియాకు షాకిచ్చింది. గతంలో నాలుగు ఐసీసీ టోర్నీలు సహా వన్డే క్రికెట్ ఆడేందుకు 16 సార్లు భారత్‌కు వచ్చినా.. విఫలమైన కివీస్‌కు చేజేతులా వన్డే సిరీస్ అప్పగించిన ఘనత కెప్టెన్ శుభ్‌మన్ గిల్, చీఫ్ కోచ్ గౌతమ్ గంభీర్‌లదే అనడంలో సందేహం లేదు!


గంభీర్

ఎనిమిది మంది ఆటగాళ్లు తొలిసారిగా భారత పర్యటనకు వచ్చినా.. క్రమశిక్షణతో కూడిన ఆట తీరుతో కివీస్ వన్డే సిరీస్‌ను ఎగరేసుకుపోయింది. భారత జట్టు మాత్రం ప్రణాళిక లోపాలు, గందరగోళ వ్యూహాలతో ఘోరంగా తడబడింది. బ్యాటింగ్‌లో అస్థిరత్వం.. బౌలింగ్‌లో ప్రభావం చూపకపోవడం ఆ జట్టును దెబ్బ తీశాయి. బౌలింగ్ గురించి ఎంత తక్కువ చెబితే అంత మంచిది. మన బౌలర్లు పవర్ ప్లేలో వికెట్లు తీయలేకపోవడం కివీస్ బ్యాటర్లకు బాగా కలిసొచ్చింది. ఈ సిరీస్‌లో భారత బౌలర్లు ఓవర్‌కు సగటున 6.2 పరుగులు ఇచ్చారు. గత దశాబ్ద కాలంలో భారత్‌లో జరిగిన వన్డే సిరీస్‌లలో ఇదే అత్యధికం. ప్రత్యర్థిని స్పిన్‌తో కట్టడి చేయలేకపోవడం.. అదే సమయంలో స్పిన్‌ను ఎదుర్కోవడంలో తడబడడం భారత్‌ను దెబ్బతీసింది. జడేజా సిరీస్‌లో ఒక్కటంటే ఒక్క వికెట్ పడగొట్టలేకపోయాడు. కుల్‌దీప్ ధారాళంగా పరుగులిచ్చాడు. బ్యాటర్లలో విరాట్ కోహ్లి, కేఎల్ రాహుల్ మినహా మిగతా వాళ్లు స్థాయికి తగ్గట్లు ఆడలేకపోయారు. మిడిల్ ఓవర్లలో పరుగుల వేటలో వెనుకబడడం భారత్‌కు ప్రతికూలంగా మారింది. ఫీల్డింగ్‌లోనూ ఆరు క్యాచ్‌లు వదిలేసి మూల్యం చెల్లించుకుంది. కోచ్ గంభీర్ అస్పష్టమైన వ్యూహాలు సైతం భారత ఓటమికి దారితీశాయని చెప్పొచ్చు. ఆటగాడిగా దూకుడును ప్రదర్శించిన గంభీర్.. కోచ్‌గా అంచనాలను అందుకోలేకపోతున్నాడు. ఫామ్‌లో లేని జడేజాను పదే పదే ఆడిస్తుండటం.. అక్షర్ పటేల్ వంటి యువ ఆటగాళ్లను పక్కన పెట్టడం గంభీర్ వ్యూహాత్మక తప్పిదాలలో ఒకటి. తాను బాధ్యతలు చేపట్టాక సొంతగడ్డపై కివీస్, దక్షిణాఫ్రికాలకు టెస్టు సిరీస్‌లు కోల్పోయిన నేపథ్యంలో ఇప్పటికే విమర్శలు ఎదుర్కొంటున్న గంభీర్.. ఇప్పుడు వన్డే సిరీస్ పరాభవంతో మరింత ఒత్తిడిని ఎదుర్కోనున్నాడు.

విజయ్ హజారే విజేత విదర్భ

ఫైనల్లో సౌరాష్ట్రపై విజయం

బెంగళూరు: విదర్భ అదరగొట్టింది. దేశవాళీ వన్డే టోర్నీ విజయ్ హజారే ట్రోఫీని తొలిసారి కైవసం చేసుకుంది. ఆదివారం జరిగిన ఫైనల్లో విదర్భ 38 పరుగుల తేడాతో సౌరాష్ట్రపై గెలిచింది. మొదట విదర్భ నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్లకు 317 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అథర్వ తైడె (128; 118 బంతుల్లో 15×4, 3×6) అద్భుత శతకం సాధించాడు. అతడికి తోడు యశ్ రాథోడ్ (54), అమన్ మోఖడే (33) రాణించారు. అథర్వ, రాథోడ్ ద్వయం రెండో వికెట్‌కు 133 పరుగులు జోడించింది. అంకుర్ పన్వర్ నాలుగు వికెట్లతో మెరిశాడు. చిరాగ్ జాని, చేతన్ సకారియా చెరో రెండు వికెట్లు తీశారు. భారీ లక్ష్య ఛేదనలో సౌరాష్ట్ర.. 48.5 ఓవర్లలో 279 పరుగులకు ఆలౌటైంది. టోర్నీలో ఆ జట్టు తరఫున అత్యధిక పరుగులు చేసిన హార్విక్ దేశాయ్, సెమీఫైనల్ హీరో విశ్వరాజ్ జడేజా విఫలమవడం ఆ జట్టును దెబ్బ తీసింది. ప్రేరక్ మన్కడ్ (88), చిరాగ్ (64) పోరాటం సరిపోలేదు. యశ్ ఠాకూర్ నాలుగు, నచికేత్ భూటె మూడు వికెట్లు పడగొట్టారు.


విదర్భ కెప్టెన్ హర్ష్ దూబెకు ట్రోఫీని అందిస్తున్న బీసీసీఐ అపెక్స్ కౌన్సిల్ సభ్యుడు చాముండేశ్వరనాథ్

సబలెంకా శుభారంభం

అల్కరాస్, జ్వెరెవ్ కూడా

ఆస్ట్రేలియన్ ఓపెన్

మెల్‌బోర్న్

ఆస్ట్రేలియన్ ఓపెన్లో టైటిల్ ఫేవరెట్ అర్యానా సబలెంకా (బెలారస్) శుభారంభం చేసింది. ఆదివారం మహిళల సింగిల్స్ తొలి రౌండ్లో ఈ టాప్‌సీడ్ క్రీడాకారిణి 6-4, 6-1తో టియాంట్‌సోవా (ఫ్రాన్స్)ను ఓడించింది. తొలి సెట్లో మాత్రమే సబలెంకాకు ప్రత్యర్థి నుంచి కాస్త ప్రతిఘటన ఎదురైంది. ఒక దశలో 4-4తో స్కోరు సమమైంది. పదో గేమ్‌లో టియాంట్‌సోవా సర్వీస్ బ్రేక్ చేసిన సబలెంకా సెట్ గెలిచింది. రెండో సెట్లో సబలెంకా బలమైన సర్వీసులతో విజృంభించింది. రెండో గేమ్‌లోనే ప్రత్యర్థి సర్వీస్ బ్రేక్ చేసిన ఆమె.. ఆపై 5-1తో తిరుగులేని ఆధిక్యంలో నిలిచింది. అదే జోరుతో సెట్‌తో పాటు మ్యాచ్‌ను గెలుచుకుంది. మ్యాచ్‌లో సబలెంకా 2 ఏస్‌లతో పాటు 23 విన్నర్లు కొట్టింది. ఏడో సీడ్ పౌలిని (ఇటలీ), 12వ సీడ్ స్వితోలినా (ఉక్రెయిన్) కూడా ముందంజ వేశారు. పౌలిని 6-1, 6-2తో సంసోవిచ్ (రష్యా)పై, స్వితోలినా 6-4, 6-1తో బుసా (స్పెయిన్)పై గెలిచారు. 11వ సీడ్ అలెగ్జాండ్రోవా (రష్యా)కు షాక్ తగిలింది. ఆమె 5-7, 6-4, 4-6తో సోన్‌మెజ్ (తుర్కియే) చేతిలో కంగుతింది. మరో రష్యా అమ్మాయి పవ్లిచెంకోవా 4-6, 6-2, 6-7 (10-12)తో క్వాలిఫయర్ జుగ్జువాన్ (చైనా)కు తలొంచింది.


సబలెంకా

వీనస్ ఇంటికి: 45 ఏళ్ల వయసులో ఆస్ట్రేలియన్ ఓపెన్ మహిళల సింగిల్స్ డ్రాలో ఆడుతున్న పెద్ద వయస్కురాలిగా నిలిచిన వీనస్ విలియమ్స్ తొలి రౌండ్లోనే ఓడింది. వైల్డ్‌కార్డుతో బరిలో దిగిన ఈ అమెరికా వెటరన్ స్టార్...7-6 (7-5), 3-6, 4-6తో డానిలోవిచ్ (సెర్బియా) చేతిలో ఓడింది. తొలి సెట్లో తన శైలిలో దూకుడుగా ఆడిన వీనస్.. తర్వాత తేలిపోయింది. 38 అనవసర తప్పిదాలు చేయడంతో పాటు అయిదుసార్లు సర్వీస్ కోల్పోయి మూల్యం చెల్లించుకుంది. రదుకాను (బ్రిటన్), సకారి (గ్రీస్), రూజ్ (రొమేనియా), పొటపోవా (ఆస్ట్రియా), పుటింట్‌సెవా (కజకిస్థాన్) తొలి రౌండ్ దాటారు.


రదుకాను

అల్కరాస్ ముందుకు: కెరీర్ గ్రాండ్‌స్లామ్‌పై కన్నేసిన స్పెయిన్ స్టార్ కార్లోస్ అల్కరాస్ ఆ దిశగా తొలి అడుగు వేశాడు. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్లో అతడు 6-3, 7-6 (7-2), 6-2తో వాల్టన్ (ఆస్ట్రేలియా)ను ఓడించాడు. తొలి సెట్‌ను పెద్దగా కష్టపడకుండానే గెలుచుకున్న అల్కరాస్‌కు రెండో సెట్లో వాల్టన్ నుంచి గట్టిపోటీ ఎదురైంది. ఒక దశలో వాల్టన్ 3-1తో ఆధిక్యంలో నిలిచాడు. అయితే అయిదో గేమ్‌లో వాల్టన్ సర్వీస్ బ్రేక్ చేసిన అల్కరాస్.. ఆపై సర్వీస్ నిలబెట్టుకుని 3-3తో స్కోరు సమం చేశాడు. ఇద్దరూ తగ్గకపోవడంతో సెట్ టైబ్రేకర్‌కు మళ్లింది. టైబ్రేకర్‌లో సర్వీసుల్లో అదరగొట్టిన అల్కరాస్ సెట్ గెలిచి ఆధిక్యాన్ని రెట్టింపు చేసుకున్నాడు. మూడో సెట్లో అల్కరాస్ అదరగొట్టాడు. మెరుపు ఏస్‌లు, క్రాస్‌కోర్టు విన్నర్లతో విజృంభించాడు. ఆరో గేమ్‌లో ప్రత్యర్థి సర్వీస్ బ్రేక్ చేసి అదే దూకుడుతో సెట్‌తో పాటు మ్యాచ్‌ను గెలుచుకున్నాడు. మ్యాచ్‌లో అల్కరాస్ 7 ఏస్‌లు, 38 విన్నర్లు కొట్టాడు. మూడో సీడ్ జ్వెరెవ్ (జర్మనీ) ముందంజ వేశాడు. అతడు 6-7 (1-7), 6-1, 6-4, 6-2తో డియాలో (కెనడా)ను ఓడించాడు. పదోసీడ్ బబ్లిక్ (కజకిస్థాన్) 6-4, 6-4, 6-4తో బ్రూక్స్‌బే (అమెరికా)పై నెగ్గగా.. తియాఫో (అమెరికా) 7-6 (7-4), 6-3, 6-2తో కుబ్లెర్ (ఆస్ట్రేలియా)ను ఓడించాడు. మౌటెట్ (ఫ్రాన్స్), ఫెరీ (బ్రిటన్), జెంగ్ (అమెరికా), నోరి (బ్రిటన్), నవా (అమెరికా), హాఫ్‌మన్ (జర్మనీ) తొలి రౌండ్‌ను అధిగమించారు.


అల్కరాస్

ప్రజ్ఞానందపై అర్జున్ విజయం

విక్ ఆన్ జీ (నెదర్లాండ్స్): టాటా స్టీల్ మాస్టర్స్ చెస్ టోర్నీలో టాప్ సీడ్ అర్జున్ ఇరిగేశి శుభారంభం చేశాడు. మొదటి రౌండ్లో సహచర గ్రాండ్‌మాస్టర్ ప్రజ్ఞానందపై అర్జున్ విజయం సాధించాడు. ప్రపంచ ఛాంపియన్ దొమ్మరాజు గుకేశ్ డ్రాతో టోర్నీని మొదలుపెట్టాడు. ప్రపంచకప్ విజేత జవోఖిర్ సిందారోవ్ (ఉజ్బెకిస్థాన్)తో హోరాహోరీగా సాగిన గేమ్‌ను గుకేశ్ డ్రాగా ముగించాడు. మథియస్ బ్లూబామ్ (జర్మనీ)తో అరవింద్ చిదంబరం డ్రా చేసుకున్నాడు. అనీశ్ గిరి (నెదర్లాండ్స్)పై విన్సెంట్ కీమెర్ (జర్మనీ) గెలుపొందాడు.


అర్జున్

ముంబయి మారథాన్ విజేతలు అబేట్, యేషి

ముంబయి: టాటా ముంబయి మారథాన్‌లో ఇథియోపియా అథ్లెట్లు సత్తా చాటారు. ఆదివారం జరిగిన మారథాన్‌లో పురుషుల ఎలైట్, మహిళల ఎలైట్‌లో విజేతగా నిలిచారు. అబేట్ 2 గంటల 9 నిమిషాల 55 సెకన్లలో లక్ష్యాన్ని పూర్తి చేసి పురుషుల విజేతగా నిలిచాడు. లియోనార్డ్ (కెన్యా; 2:10.10) రెండో స్థానం, మెర్హవి (ఎరిత్రియా; 2:10.22) మూడో స్థానం సాధించారు. మహిళల విభాగంలో యేషి 2 గంటల 25 నిమిషాల 13 సెకన్లలో లక్ష్యాన్ని అందుకుని అగ్రస్థానం సాధించింది. ఇథియోపియాకే చెందిన కిడ్‌సన్ అలెమా (2:27.35) రెండో స్థానంలో, ఎన్యేవ్ (2:28.27) మూడో స్థానంలో నిలిచారు. భారత్ నుంచి పురుషుల విభాగంలో కార్తిక్ (2:19.55), మహిళల విభాగంలో సంజీవని (2:49.02) అగ్రస్థానంలో నిలిచారు.

పాక్ సంతతి ఆటగాళ్లకు భారత వీసాలు

దిల్లీ: టీ20 ప్రపంచకప్ కోసం భారత్‌కు వచ్చే పాకిస్థాన్‌కు చెందిన 42 మంది ఆటగాళ్లు, అధికారుల వీసా ప్రక్రియ సజావుగా సాగేందుకు ఐసీసీ రంగంలోకి దిగింది. పాక్ మూలాలు కలిగిన ఆదిల్ రషీద్, రెహాన్ అహ్మద్, సకిబ్ మహమూద్‌లు ప్రస్తుతం ఇంగ్లాండ్ తరఫున బరిలో దిగుతున్నారు. అమెరికాకు అలీ ఖాన్, నెదర్లాండ్స్‌కు షాయన్ జహంగీర్ ఆడుతున్నారు. ఇంగ్లాండ్, నెదర్లాండ్స్ ఆటగాళ్లకు ఇప్పటికే వీసాలు మంజూరైనట్లు తెలుస్తోంది. కెనడా సహాయక సిబ్బందిలోని సలీం జాఫర్‌కు కూడా వీసా వచ్చింది. పాక్ అధికారులతో పాటు దాయాది దేశం మూలాలున్న అమెరికా, యూఏఈ, ఇటలీ, బంగ్లాదేశ్, కెనడా క్రికెటర్లు.. సిబ్బందికి వీసా మంజూరు ప్రక్రియను వేగవంతం చేశారు. ఇందుకోసం ఐసీసీ ప్రత్యేకంగా చొరవ తీసుకుని.. భారత హై కమిషన్‌తో సమన్వయం చేస్తోంది.

సియంగ్, లిన్ చున్‌లకు టైటిళ్లు

ఇండియా ఓపెన్


సియంగ్

దిల్లీ: ఇండియా ఓపెన్ ప్రపంచ టూర్ సూపర్ 750 టోర్నీలో ఆన్ సియంగ్ (కొరియా), లిన్ చున్ యి (చైనీస్ తైపీ) విజేతలుగా నిలిచారు. మహిళల సింగిల్స్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ సియంగ్ టైటిల్ నిలబెట్టుకోగా.. పురుషుల విభాగంలో లిన్ చున్ తొలిసారిగా ఛాంపియన్ అయ్యాడు. ఆదివారం జరిగిన ఫైనల్లో టాప్ సీడ్ సియంగ్ 21-13, 21-11తో రెండో సీడ్ యింగ్ జి యి (చైనా)పై విజయం సాధించింది. పురుషుల సింగిల్స్ టైటిల్ పోరులో లిన్ చున్ 21-10, 21-18తో మూడో సీడ్ జొనాథన్ క్రిస్టీ (ఇండోనేసియా)పై గెలుపొందాడు. పురుషుల డబుల్స్‌లో లియాంగ్ వీ కెంగ్- వాంగ్ చాంగ్ (చైనా) జంట టైటిల్‌ను చేజిక్కించుకుంది. ఫైనల్లో ఈ ద్వయం 17-21, 25-23, 21-16తో హిరోకి మిదరోకివా- కొహెయ్ యమషిత (జపాన్) జోడీని ఓడించింది. మహిళల డబుల్స్ ఫైనల్లో షెంగ్ షు- టాన్ నింగ్ (చైనా) 21-11, 21-18తో ఫుకుషిమ- మత్సుమోటో (జపాన్)పై గెలిచి టైటిల్‌ను గెలుచుకుంది. మిక్స్‌డ్ డబుల్స్‌లో దెచపోల్- సుపిసర (థాయ్‌లాండ్) జోడీ విజేతగా నిలిచింది. హోరాహోరీగా సాగిన ఫైనల్లో ఈ జంట 19-21, 25-23, 21-18తో మథియాస్ క్రిస్టియాన్సెన్- అలెగ్జాండ్రా బోయె (డెన్మార్క్) ద్వయంపై విజయం సాధించింది.

ఛాతీలోకి తూటా వెళ్లకుండా జేబులోని ఫోను అడ్డుకొంది!

మధ్యప్రదేశ్‌లో ఆటోడ్రైవర్ విద్యాసాగర్‌తో కొందరు యువకులు గొడవపడి కాల్పులు జరపగా.. పిస్తోలు నుంచి దూసుకొచ్చిన బుల్లెట్ తను అతడి జేబులోని మొబైల్ ఫోను అడ్డుకొని ప్రాణాన్ని కాపాడింది. సత్నా జిల్లా కోలగవా పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం సాయంత్రం ఈ ఘటన జరిగింది. విద్యాసాగర్ ఆటో ఎదురుగా వచ్చిన బైకును స్వల్పంగా ఢీకొట్టింది. బైక్‌పై ఉన్న నలుగురు యువకులు వాగ్వాదానికి దిగారు. గొడవ ముదిరి ఆగ్రహంతో ఊగిపోయిన యువకులు విద్యాసాగర్‌పై విచక్షణ రహితంగా దాడి చేసి, తమ వద్ద ఉన్న పిస్తోళ్లతో కాల్పులు జరిపి పరారయ్యారు. ఒక బుల్లెట్ విద్యాసాగర్ కాలుకు తగలగా, మరోటి నేరుగా ఛాతీ వైపు దూసుకొచ్చింది. ఈ బుల్లెట్ జేబులో ఫోనుకు తగిలి ఆగిపోవడంతో పెనుప్రమాదం తప్పింది. గాయపడిన విద్యాసాగర్‌ను పోలీసులు జిల్లా ఆసుపత్రికి తరలించారు. అనుష్‌సింగ్‌తోపాటు మరో ముగ్గురు నిందితులను అరెస్టు చేసి కేసు నమోదు చేశారు.



కుక్కలు బైక్ వెంటపడితే.. మీట నొక్కితే చాలు

ద్విచక్ర వాహనాలపై వెళ్తున్నప్పుడు అకస్మాత్తుగా వీధికుక్కలు వెంటపడటం, ఆ భయంతో ప్రమాదాలు జరగటం చూస్తుంటాం. మధ్యప్రదేశ్‌లోని ఛింద్వాడా జిల్లా జోభనా ప్రాంతానికి చెందిన 9వ తరగతి విద్యార్థి ఆర్యన్ వర్మ దీనికి పరిష్కారంగా ఓ విధమైన పరికరం రూపొందించాడు. ఆర్యన్ అందరిలా చెప్పి ఊరుకోకుండా దీనికి ఓ పరిష్కారం కనుగొన్నాడు. ద్విచక్ర వాహనదారుల రక్షణ కోసం 'వాటర్ ప్రెజర్ సిస్టమ్' రూపొందించాడు. ఈ విధానంలో ఒక చిన్న వాటర్ పంప్ (కాలపరిమితి వాడిన) నుంచి నీరు ముక్కు పైపుల నెరవేరుస్తుంది. ఉంటుంది. ప్రయాణంలో ఎప్పుడైనా కుక్కలు వెంటపడితే ఏ వైపు నుంచి ముప్పు ఉందో ఆ వైపు మీట నొక్కగానే పైపుల ద్వారా నీరు అత్యంత వేగంగా (ఒత్తిడితో) వచ్చి వాటిపై పడుతుంది. నీటిధార తగలగానే కుక్కలు వెనక్కు తగ్గుతాయి. ఈ నమూనాను స్మార్ట్ మోటార్‌సైకిల్ ఫర్ హాస్పిటల్ యానిమల్ అని పేరు పెట్టినట్లు ఆర్యన్ తెలిపాడు. ఆర్యన్ ఆలోచన విన్నాక ఈ నమూనా తయారీలో అతడికి తోడ్పాటు అందించినట్లు ఉపాధ్యాయుడు హేమరాజ్ చెప్పారు.



భాజపా సారథి ఎన్నికలు నేడు

అధ్యక్షుడిగా నితిన్ నబీన్ ఏకగ్రీవమే

దిల్లీ: భాజపా జాతీయ అధ్యక్షుడి ఎన్నికలు సోమవారం దిల్లీలో పార్టీ ప్రధాన కార్యాలయంలో జరగనున్నాయి. ప్రస్తుతం కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ఉన్న నితిన్ నబీన్‌కే ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాల మద్దతు ఉండటంతో పార్టీ 12వ అధ్యక్షుడిగా ఆయన ఏకగ్రీవ ఎన్నిక లాంఛనమే కానుంది. పార్టీ జాతీయ రిటర్నింగ్ అధికారి కె.లక్ష్మణ్ ప్రకటించిన షెడ్యూలు ప్రకారం.. నామినేషన్లను మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు స్వీకరిస్తారు. ఆ సమయంలో నితిన్ నామినేషన్ వేస్తారు. సాయంత్రం 4-5 మధ్య నామినేషన్ల పరిశీలన ఉంటుంది. ఆ తర్వాత గంట సేపటిలోగా ఉపసంహరణలకు అవకాశం కల్పిస్తారు. ఒకరికి మించి బరిలో ఉంటే ఎన్నికలు నిర్వహించి, ఫలితం ప్రకటిస్తారు. పార్టీ సారథి ఎన్నిక ప్రక్రియలో పాల్గొనేందుకు భాజపా పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, రాష్ట్ర శాఖల అధ్యక్షులు, ఇతర ప్రముఖ నేతలు దిల్లీకి చేరుకుంటున్నారు. పార్టీ జాతీయ మండలి, రాష్ట్ర శాఖల ప్రతినిధులతో కూడిన ఎలక్టోరల్ కాలేజ్ ద్వారా నూతన అధ్యక్షుడు ఎన్నికవుతారు. బిహార్ నుంచి ఐదుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన అనుభవం నితిన్ నబీన్‌కు ఉంది.

'గ్రీన్‌లాండ్ సుంకం' ఘోర తప్పిదం

• ట్రంప్‌పై ఈయూ దేశాల ఆగ్రహం

లండన్: గ్రీన్‌లాండ్ విషయంలో తమకు మద్దతు తెలపని దేశాలపై 10శాతం అదనపు సుంకాలను విధిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటనపై బ్రిటన్‌తోపాటు ఈయూ దేశాలు మండిపడ్డాయి. అదనపు సుంకాల హెచ్చరిక ఘోర తప్పిదమని బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ స్పష్టం చేశారు. ఎటువంటి బెదిరింపులకు లొంగబోమని ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ వ్యాఖ్యానించారు. తమ దేశ భద్రత విషయంలో గ్రీన్‌లాండ్ ఎంతో ముఖ్యమని, దాన్ని స్వాధీనం చేసుకుంటామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పదేపదే చెబుతున్నారు. ఈ ప్రాంతం డెన్మార్క్ నియంత్రణలో ఉంది. ఈ నేపథ్యంలో ఐరోపా దేశాలు డెన్మార్క్‌కు మద్దతుగా నిలిచాయి. గ్రీన్‌లాండ్ భద్రత నాటో ఉమ్మడి బాధ్యతని పేర్కొన్నాయి. ఈ క్రమంలోనే ఫ్రాన్స్, జర్మనీ, స్వీడన్, నార్వే, ఫిన్లాండ్, నెదర్లాండ్స్, బ్రిటన్‌లు అక్కడికి బలగాలను తరలించాయి. ఈ పరిణామాల నడుమే డెన్మార్క్‌తోపాటు ఈ 7 దేశాలపై ట్రంప్ 10 శాతం అదనపు సుంకాలను ప్రకటించారు. ఇవి ఫిబ్రవరి 1 నుంచి అమల్లోకి వస్తాయని తెలిపారు. అప్పటికీ దిగిరాకపోతే జూన్ నుంచి ఆ సుంకాలను 25శాతానికి పెంచుతామని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో బ్రిటన్‌సహా ఈయూ దేశాలు స్పందించాయి.

■ 'నాటో సభ్య దేశాలుగా గ్రీన్‌లాండ్ భద్రత కోసం చర్యలు తీసుకుంటే సుంకాలు విధిస్తామని హెచ్చరించడం పూర్తిగా తప్పు. ఈ విషయాన్ని నేరుగా అమెరికా యంత్రాంగంతో తేల్చుకుంటాం' అని కీర్ స్టార్మర్ పేర్కొన్నారు. గ్రీన్‌లాండ్ ఎప్పటికీ డెన్మార్క్‌లో భాగమేనని స్పష్టం చేశారు.



గ్రీన్‌లాండ్‌లో ఆందోళన చేస్తున్న స్థానికులు

■ 'సుంకాల బెదిరింపులు ఆమోదయోగ్యం కాదు. ఏ బెదిరింపులకు లొంగేది లేదు' అని మెక్రాన్ వ్యాఖ్యానించారు. ఐరోపా దేశాలన్నీ తగిన సమాధానం ఇస్తాయని స్పష్టం చేశారు.

■ మిత్ర దేశాల మధ్య విభేదాలతో రష్యా, చైనాలకే ప్రయోజనం కలుగుతుందని ఈయూ విదేశాంగ విధాన చీఫ్ కాజా కల్లాస్ పేర్కొన్నారు.

■ తమను బ్లాక్ మెయిల్ చేయలేరంటూ స్వీడన్ ప్రధాని ఉల్ఫ్ క్రిస్టెర్సన్ స్పష్టం చేశారు.

■ అంతర్జాతీయ చట్టాన్ని కాపాడుకునే విషయంలో ఈయూ ఎల్లప్పుడూ దృఢంగా ఉంటుందని యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టా స్పష్టం చేశారు.

■ ట్రంప్ ప్రకటన ఆశ్చర్యకరమని డెన్మార్క్ విదేశాంగ మంత్రి రాస్మ్యూసెన్ తెలిపారు.

■ మిత్రుల మధ్య హెచ్చరికలు సరికావని నార్వే ప్రధాని జోనాస్ గర్ స్టోర్ వ్యాఖ్యానించారు.

■ చర్చల ద్వారా మిత్రుల మధ్య సమస్యలను పరిష్కరించుకోవాలని ఫిన్లాండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్ అభిప్రాయపడ్డారు.

ఝార్ఖండ్‌లో పెళ్లి బస్సు బోల్తా

9 మంది మృతి.. 80 మందికి గాయాలు

లాతేహార్: ఝార్ఖండ్‌లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ఓ పెళ్లి బస్సు బోల్తా పడి 9 మంది మృతిచెందగా.. 80మందికి పైగా గాయపడ్డారు. మృతుల్లో అయిదుగురు మహిళలు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. గాయపడిన వారిలో 32 మంది పరిస్థితి విషమంగా ఉందని పేర్కొన్నారు. ఈ బస్సు ఛత్తీస్‌గఢ్‌లోని బలరాంపుర్ జిల్లా నుంచి ఝార్ఖండ్‌లోని లాతేహార్ జిల్లా మహువాడనార్ వస్తున్న క్రమంలో ఆదివారం ఓర్సా బంగ్లాదర లోయ వద్ద ఈ ప్రమాదం జరిగింది. ఆ సమయంలో బస్సులో 90 మంది వరకు ఉన్నారు. బ్రేకులు విఫలం కావడంతోనే బస్సు ప్రమాదానికి గురైనట్లు పోలీసులు తెలిపారు.

మధ్యప్రదేశ్‌లో కారు బీభత్సం

■ మధ్యప్రదేశ్‌లోని జబల్‌పుర్‌లో ఆదివారం ఓ కారు బీభత్సం సృష్టించింది. మహిళా కార్మికులపైకి అది వేగంగా దూసుకెళ్లడంతో ఇద్దరు మృతిచెందగా, 11 మంది గాయపడ్డారు. రోడ్డు డివైడర్ రెయిలింగ్ పనుల కోసం వచ్చిన మహిళలు మధ్యాహ్నం భోజనం చేస్తున్న సమయంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది.

■ ఉత్తర్‌ప్రదేశ్‌లోని నొయిడాలో శనివారం భవన నిర్మాణం కోసం తవ్విన నీటి కుంటలో పడి యువరాజ్ మెహతా(27) అనే సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మృతిచెందారు. పొగమంచు వల్లే ప్రమాదం జరిగి ఉంటుందని భావిస్తున్నారు.

గాజా శాంతి మండలిలో భాగం పంచుకోండి

• మోదీకి ట్రంప్ లేఖ

దిల్లీ, వాషింగ్టన్: గాజాలో శాంతి నెలకొల్పేందుకు ఉద్దేశించిన మండలిలో భాగం పంచుకోవాలని భారత్ సహా కొన్ని దేశాలను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆహ్వానించారు. ఈ మేరకు భారత ప్రధాని నరేంద్ర మోదీకి ఆయన లేఖ రాశారు. దీనిని భారత్‌లో అమెరికా రాయబారి సెర్గియో గోర్ సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. "పశ్చిమాసియాలో శాంతిస్థాపనకు చరిత్రలో ఎంతో సంక్లిష్టమైన, మహత్తరమైన ప్రయత్నం జరుగుతోంది. దీనిలో చేరాల్సిందిగా మిమ్మల్ని ఆహ్వానించడం గొప్ప గౌరవంగా భావిస్తున్నా. ప్రపంచవ్యాప్త మద్దతులను పరిష్కరించడంలో ఇది వేదికగా నిలుస్తుంది" అని ట్రంప్ దీనిలో పేర్కొన్నారు. గాజాలో శాంతి-సుస్థిరతలకు అంతర్జాతీయ సంస్థగా ఈ మండలి ఏర్పాటైనట్లు తెలిపారు. ప్రపంచంలోని ఇతర ప్రాంతాల్లో ఘర్షణల పరిష్కారానికి కూడా ఇది సాయపడేలా దీనిని రూపొందిస్తున్నట్లు సమాచారం. గాజా పునరభివృద్ధికి నిధుల సమీకరణ, పాలన పర్యవేక్షణ మండలిని తొలుత ఉద్దేశించారు. గాజాలో ఇజ్రాయెల్-హమాస్ మధ్య కాల్పుల విరమణ రెండోదశలో భాగంగా దీనిని తెరపైకి తెచ్చారు.

షరీఫ్‌కూ అందింది: పాక్

శాంతి మండలిలో తమను సభ్యదేశంగా చేరాలని అమెరికా ఆహ్వానించిందని పాక్ విదేశాంగ శాఖ తెలిపింది. తాహిర్ అంద్రాబీ ఓ ప్రకటనలో ఈ విషయం వెల్లడించారు. పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌కు ట్రంప్ ఆహ్వానం పంపారని పేర్కొన్నారు. తమ దేశం ఇందులో భాగం కావాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఇజ్రాయెల్, పాక్ మధ్య సంబంధాల్లేవు. అందుకే ఈ మండలిలో చేరడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు కార్యాలయం మాత్రం ఈ మండలి ఏర్పాటుపై అమెరికాతో సమన్వయం లేదని పేర్కొంది.

మౌని అమావాస్య.. 4.52 కోట్ల మంది భక్తుల పుణ్యస్నానాలు

ప్రయాగ్‌రాజ్: మౌని అమావాస్య సందర్భంగా ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌కు భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. దీంతో ప్రయాగ్‌రాజ్ పరిసరాలు భక్త జనంతో సందడిగా మారాయి. త్రివేణి సంగమం వద్ద ఆదివారం తెల్లవారుజాము నుంచి సుమారు 4.52 కోట్లమంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించినట్లు అధికారులు వెల్లడించారు. 'మాఘ మేళా 2025-26' పవిత్ర స్నానాల కోసం మొత్తం 12,100 అడుగుల పొడవైన ఘాట్‌లను నిర్మించామని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ప్రాథమిక సౌకర్యాలు ఏర్పాటు చేశామని తెలిపారు. సాధారణ, ట్రాఫిక్ పోలీసులతో పాటు ఏదైనా అత్యవసర సమయంలో చికిత్స అందించడం కోసం వైద్య నిపుణుల బృందాలను అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.



వారంలో ఒక సాయంత్రం.. మీ కుటుంబ సమయం



వారంలో కనీసం ఒకరోజు సాయంత్రాన్ని మీ కుటుంబ సమయంగా ఖరారు చేసుకోండి. ఎన్ని పనులున్నా సరే దీన్ని విధిగా పాటించండి. సినిమా చూడటమో, రెస్టారెంటులో భోంచేయడమో, షాపింగ్‌కు వెళ్లడమో.. మీకు నచ్చిందేదో చేయండి కానీ దాన్ని కుటుంబంతో కలిసి ఆస్వాదించడం మరవకండి.

– మార్క్ రాండల్ఫ్, వ్యాపారవేత్త

రూ.7 చోరీ కేసు.. 50 ఏళ్ల తర్వాత మూసివేత

• ముంబయి కోర్టు ఉత్తర్వులు

ముంబయి: దాదాపు 50 ఏళ్ల పాటు పెండింగ్‌లో ఉన్న చోరీ కేసును ముంబయి కోర్టు మూసివేసింది. ఈ కేసులో తన 7.65 రూపాయలను ఎవరో చోరీ చేశారని 1977లో ముంబయికి చెందిన వ్యక్తి ఫిర్యాదు చేశారు. దీనిపై అప్పట్లో పోలీసులు ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. అనంతరం వారిని పట్టుకునేందుకు చర్యలు చేపట్టగా, నిందితుల ఆచూకీ తెలియరాలేదు. దీనిపై ముంబయిలోని మజగావ్ కోర్టు నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. మరోవైపు ఫిర్యాదుదారు ఆచూకీ కూడా తెలియరాలేదు. దాంతో అప్పటినుంచి ఇప్పటి వరకూ ఈ కేసు పెండింగ్‌లోనే ఉంది. ఎటువంటి పురోగతి లేకుండా ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న కేసులకు పరిష్కారం చూపడంలో భాగంగా మజగావ్ కోర్టు జడ్జి ఆర్తి కులకర్ణి ఈ కేసును ఈ నెల 14న మూసివేస్తున్నట్లు ప్రకటించారు. "ఎటువంటి పురోగతి లేకుండా దాదాపు 50 ఏళ్లుగా ఈ కేసు మూలుగుతోంది. ఈ కేసును ఇలాగే కొనసాగించడానికి ఏ అంశమూ కనిపించడం లేదు. అందువల్ల దీన్ని మూసేస్తున్నాం. ఈ కేసులో ఇద్దరు గుర్తుతెలియని నిందితులను నిర్దోషులుగా ప్రకటిస్తున్నాం. చోరీకి గురైన రూ.7.65 ఫిర్యాదు దారుడికి ఇవ్వాలి. అతడి సమాచారం తెలియకుంటే ఆ మొత్తాన్ని ప్రభుత్వ ఖాతాలో జమచేయాలి" అని న్యాయమూర్తి తన ఆదేశాల్లో పేర్కొన్నారు.

అన్నీ సవ్యంగా సాగినట్లైతే.. పాతతరం పక్కకు తప్పుకోవచ్చు: గడ్కరీ

నాగ్‌పుర్: యువతరం కొత్త బాధ్యతలు తీసుకోవాల్సిన అవసరం ఉందని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. పనులన్నీ సవ్యంగా సాగుతున్నట్లయితే.. ఇక పాతతరం పక్కకు తప్పుకొని, ఇతర పనులు చూసుకోవచ్చని సూచించారు. కొత్తతరం నెమ్మదిగానైనా ఆ దిశగా అడుగులు వేస్తుందని నమ్ముతున్నట్లు పేర్కొన్నారు. 'అడ్వాంటేజ్ విదర్భ-ఖస్దర్ ఆద్యోగిక్ మహోత్సవ్' అంశంపై నాగ్‌పుర్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ కార్యక్రమాన్ని పారిశ్రామిక అభివృద్ధి సమాఖ్య(ఏఐడీ) అధ్యక్షుడు ఆశిష్ కాలె నిర్వహించారు.

చార్‌ధామ్ ఆలయాల్లో మొబైల్స్ నిషేధం



ఈటీవీ భారత్: చార్‌ధామ్ యాత్రపై ఉత్తరాఖండ్ సర్కారు కీలక నిర్ణయం తీసుకుంది. 2026లో జరిగే యాత్ర సందర్భంగా చార్‌ధామ్ ఆలయాల్లోకి మొబైల్ ఫోన్లు, కెమెరాలు తీసుకెళ్లడంపై పూర్తిగా నిషేధం విధించనున్నట్లు అధికారులు తెలిపారు. గతేడాది ఆలయ ప్రాంగణంలోకి మొబైల్ ఫోన్లు, కెమెరాలు తీసుకెళ్లడంతో దర్శన నిర్వహణలో అనేక సమస్యలు తలెత్తడం వల్లే ఈ చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ఈ నెల 17న జరిగిన రిషికేశ్ ట్రాన్సిట్ క్యాంప్ ప్రాంగణంలో చార్‌ధామ్ యాత్ర నిర్వహణ, నియంత్రణ సంస్థ నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. గఢ్‌వాల్ కమిషనర్ వినయ్ శంకర్ పాండే అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బద్రీనాథ్ ధామ్‌లో సింహద్వారం దాటిన తర్వాత మొబైల్ ఫోన్లు, కెమెరాలను అనుమతించబోమని కమిషనర్ ప్రకటించారు. అలాగే, కేదార్‌నాథ్‌లో కూడా చబూతర ప్రాంతంలో కెమెరాలు ఉపయోగించడానికి అనుమతి ఉండదన్నారు. దీనికోసం బద్రీనాథ్, కేదార్‌నాథ్ టెంపుల్ కమిటీ క్లాక్ రూమ్ సదుపాయం ఏర్పాటు చేస్తుందని వెల్లడించారు. యాత్రికులు తమ ఫోన్లు, కెమెరాలను అక్కడ డిపాజిట్ చేసి, దర్శనం చేసుకుని తిరిగి వెళ్లేటప్పుడు వాటిని తీసుకోవచ్చని కమిషనర్ తెలిపారు.

గ్వాటెమాలా జైళ్లలో గార్డుల్ని బందీలుగా చేసుకున్న ఖైదీలు

గ్వాటెమాలా సిటీ: కారాగారాల్లోని ఖైదీలు 46 మంది జైలు గార్డుల్ని బందీలుగా చేసుకున్న పరిణామం గ్వాటెమాలాలో చోటుచేసుకుంది. ఖైదులో ఉన్న గ్యాంగ్‌లీడర్ల హక్కుల్లో కోత విధించాలన్న నిర్ణయంతో ఖైదీలు ఈ తరహా దుశ్చర్యకు దిగారు. ఒక పథకం ప్రకారం ఆటంకాలు కల్పించి మూడు జైళ్లలోని ఖైదీలు దీనికి పాల్పడ్డారు. వారి డిమాండ్లను ఆమోదించేది లేదని అంతర్గత వ్యవహారాల శాఖ మంత్రి మార్కో ఆంటోనియో విల్లెడ స్పష్టంచేశారు. వందలమంది పోలీసులు ఒక కారాగారంలో ప్రవేశించి గార్డులకు విముక్తి కల్పించారు. ఆ ప్రాంగణాన్ని తిరిగి నియంత్రణలోకి తీసుకువచ్చారు. ఆ తర్వాత గ్వాటెమాలాలో పోలీసులపై సాయుధుల దాడులు మొదలయ్యాయి. కనీసం పదిచోట్ల ఇలాంటి దాడులు జరిగాయని, ముగ్గురు ప్రాణాలు కోల్పోయారని అధికారులు తెలిపారు.

లఖ్‌నవూలో నేటి నుంచి జాతీయస్థాయి శాసన సదస్సులు

లఖ్‌నవూ: ఉత్తర్‌ప్రదేశ్ శాసనసభ ఆధ్వర్యంలో సోమవారం(జనవరి19) నుంచి 23 వరకు జాతీయ స్థాయి శాసన సదస్సులు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా 86వ అఖిల భారత అధ్యక్ష అధికారుల సదస్సుతో పాటు, 62వ రాష్ట్ర శాసనసభ, శాసన మండళ్ల కార్యదర్శుల సదస్సు ఒకేసారి జరుగుతాయి. సోమవారం లఖ్‌నవూలోని విధాన్ భవనంలో ఈ సదస్సులు అధికారికంగా ప్రారంభమవుతాయి. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ నారాయణ్ సింగ్, ఉత్తర్‌ప్రదేశ్ గవర్నర్ ఆనందీ బెన్ పటేల్, సీఎం యోగి ఆదిత్యనాథ్, సహా, పలు రాష్ట్రాల శాసనసభ స్పీకర్లు, మండలి ఛైర్మన్లు, కార్యదర్శులు పాల్గొంటారు.

స్ట్రాబెర్రీ.. లాభాలకు డోంట్ వర్రీ





ఈటీవీ భారత్: ఒడిశాలోని బ్రహ్మపుర సమీప సజన్‌పుర్ పంచాయతీకి చెందిన చరణ్ లెంక, సాదవ్ రౌలా అనే ఇద్దరు మిత్రులు గత నాలుగేళ్లుగా స్ట్రాబెర్రీ సాగుతో లాభాలు పండిస్తున్నారు. మొదట హిమాచల్ ప్రదేశ్ నుంచి 25 విత్తనాలు తెచ్చి ప్లాస్టిక్ సంచులతో విత్తగా.. మూడు నెలల్లో 18 కిలోలకు పైగా దిగుబడి వచ్చింది. క్రమంగా సాగు పెంచుకొంటూ ఇప్పుడు మహారాష్ట్రలోని మహాబలేశ్వర్ నుంచి విత్తనాలు తెప్పించి ఎకరం పొలంలో వీటిని పండిస్తున్నారు. బిందుసేద్యం ద్వారా ఆర్గానిక్ పద్ధతిలో పండిస్తున్న ఈ స్ట్రాబెర్రీలకు దుకాణాల నుంచి అడ్వాన్సు ఆర్డర్లు వస్తున్నట్లు చరణ్ లెంక తెలిపారు. అయిదుగురు కార్మికులకు ఉపాధి కల్పించామన్నారు.

కేరళలో బర్డ్‌ఫ్లూ హెచ్చరికలు

కన్నూర్: కేరళలోని ఇరిట్టి జిల్లా ఎడక్కనం ప్రాంతంలో ఉన్న కాకుల్లో హెచ్5ఎన్1 ఏవియన్ ఇన్‌ఫ్లుయెంజా అనే బర్డ్‌ఫ్లూ వ్యాధిని గుర్తించినట్లు అధికారులు వెల్లడించారు. ప్రస్తుతానికి పెంపుడు పక్షుల్లో ఇలాంటి కేసులు నమోదు కాలేదని, ఈ దశలో వాటిని చంపాల్సిన అవసరం లేదని తెలిపారు. ఇరిట్టి మున్సిపాలిటీ, సమీప ప్రాంతాల్లో ఈ వైరస్ వ్యాప్తిని నిరోధించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్యాధికారి, స్థానిక స్వపరిపాలన శాఖ సంయుక్త సంచాలకుడిని కలెక్టర్ ఆదేశించారు. ఈ వ్యాధికి గురై మృతి చెందిన పక్షులను మున్సిపల్ ప్రజారోగ్య విభాగం తగిన భద్రతా నియమాలను పాటిస్తూ వాటిని పూడ్చేస్తుందని వివరించారు.

సెర్బియాలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా భారీ ప్రదర్శనలు

నోవిసాద్: సెర్బియా అధ్యక్షుడు అలెగ్జాండర్ వుచిక్‌కు వ్యతిరేకంగా ఆదివారం దేశవ్యాప్తంగా భారీ ప్రదర్శనలు జరిగాయి. ఇందులో వేల మంది ప్రజలు పాల్గొన్నారు. సంవత్సరం నుంచి జరుగుతున్న ఈ ఆందోళనలకు విద్యార్థులు నాయకత్వం వహిస్తున్నారు. ప్రభుత్వంలో తీవ్ర అవినీతి జరుగుతోందని వారు ఆరోపిస్తున్నారు. 2024 నవంబరులో నోవిసాడ్‌లో జరిగిన రైల్వే స్టేషన్ ప్రమాదానికి ఈ అవినీతే కారణమని వారు పేర్కొంటున్నారు. నాటి ప్రమాదంలో 16 మంది ప్రాణాలు కోల్పోయారు. ఆ ఘటన తర్వాత దేశవ్యాప్తంగా అధ్యక్షుడు వుచిక్‌కు వ్యతిరేకంగా నిరసనలు ఊపందుకున్నాయి. ముందస్తు ఎన్నికలు నిర్వహించాలని ఆందోళనకారులు డిమాండ్ చేస్తున్నారు. వుచిక్ మాత్రం ఇందుకు తిరస్కరిస్తున్నారు.

సిరియాలో కాల్పుల విరమణ

ప్రభుత్వం, ఎస్డీఎఫ్ మధ్య ఒప్పందం

తబ్కా (సిరియా): సిరియాలో ప్రభుత్వానికి, కుర్దుల నేతృత్వంలోని సిరియన్ డెమొక్రటిక్ ఫోర్సెస్‌కు (ఎస్డీఎఫ్) మధ్య ఆదివారం కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. దీనిపై సిరియా అధ్యక్షుడు అహ్మద్ అల్ షరా సంతకం చేశారు. ఒప్పందం ప్రకారం.. యూఫ్రటిస్ నది పశ్చిమ భాగం నుంచి వైదొలగేందుకు ఎస్డీఎఫ్ అంగీకరించింది. తమ నియంత్రణలో ఉన్న భూభాగాలను ప్రభుత్వ దళాలకు అప్పగించనుంది. ఆదివారం ఉదయం.. రాకా ప్రావిన్సులోని తబ్కాలోకి ప్రభుత్వ దళాలు ప్రవేశించాయి. యూఫ్రటిస్ డ్యాం, సైనిక విమానాశ్రయం, కీలక చమురు, సహజవాయు క్షేత్రాలను తమ నియంత్రణలోకి తెచ్చుకున్నాయి. ఈ నేపథ్యంలోనే ఈ ఒప్పందం కుదిరినట్లు తెలుస్తోంది. ఈ ఒప్పందంతో దాదాపుగా దేశమంతా ప్రభుత్వ నియంత్రణలోకి వచ్చినట్లే. దశాబ్దానికిపైగా ఎస్డీఎఫ్‌తో జరుగుతున్న పోరాటానికి తెరపడినట్లే.

ధర్మమార్గంలో కొనసాగినంతకాలం..

భారతే 'విశ్వగురు': మోహన్ భాగవత్



ముంబయి: భారతదేశం ధర్మ మార్గంలో కొనసాగినంత కాలం 'విశ్వగురు'గా నిలుస్తుందని ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ అన్నారు. ప్రపంచంలో ఇలాంటి ఆధ్యాత్మిక జ్ఞానం ఎక్కడా లేదని, ఇది భారత్‌కు ప్రత్యేకమైందని చెప్పారు. ధర్మమే ఈ విశ్వాన్ని నడుపుతుందన్నారు. భారత్‌కు పూర్వీకుల నుంచి వచ్చిన గొప్ప ఆధ్యాత్మిక వారసత్వం ఉందన్నారు. ధర్మం మతానికి మాత్రమే పరిమితం కాదని, అది సృష్టి మొత్తాన్ని నడిపే మూల సూత్రమని పేర్కొన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా శనివారం మహారాష్ట్రలో నిర్వహించిన జన సంగోష్ఠి కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రేక్షకులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. ప్రతీ జీవికి సొంత ధర్మం ఉంటుందని వివరించారు. కుల వివక్ష పూర్తిగా నిర్మూలించాలంటే.. ముందుగా మన మనసుల నుంచి కుల భావనను తొలగించాల్సిందేనని అన్నారు. పూర్వకాలంలో కులం వృత్తితో అనుసంధానమై ఉండేదని.. క్రమంగా అది సమాజంలో బలంగా పాతుకుపోయి కుల వివక్షకు దారి తీసిందన్నారు. మనసులోంచి కుల భావనను తొలగిస్తే.. 10-12 ఏళ్లలోనే కుల వివక్ష అంతమవుతుందని వ్యాఖ్యానించారు.



గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ఉత్తరాయణ ఉత్సవం ముగింపు నేపథ్యంలో ఖోఖరా యూత్ ఫెడరేషన్ సభ్యులు ఆదివారం సేకరించిన పతంగుల దారాల (మాంజా) గుట్ట

చివరి నిమిషంలో తప్పుకొన్న మరో ఆత్మాహుతి బాంబర్

• ఎర్రకోట కారు బాంబు కేసు విచారణలో వెల్లడి

దిల్లీ, శ్రీనగర్: అంతా ఉమర్ నబీ అనుకున్నట్లు సవ్యంగా జరిగుంటే గత సంవత్సరం ఎర్రకోట వద్ద జరిగిన కారు పేలుడు ఘటనలో జమ్మూకశ్మీర్‌కు చెందిన యువకులు ఆత్మాహుతి దాడికి పాల్పడి ఉండేవారు. వైద్యుడి నుంచి ఉగ్రవాదిగా మారిన ఉమర్ నబీ ఇప్పుడు ప్రాణాలతో ఉండి తన ఉగ్రముఠా లక్ష్యాల కోసం మరికొంత మంది యువకులను బలిదానాలు చేసేందుకు రంగం సిద్ధం చేస్తుండేవాడు. కానీ...అలా జరగలేదు. ఉగ్రవాదం కంటే తనకు కుటుంబమే ముఖ్యమంటూ జమ్మూకశ్మీర్‌లోని శోపియాన్‌కు చెందిన యాసిర్ అహ్మద్ దార్ ఆత్మాహుతి దాడి ప్రణాళిక నుంచి బయటకు వచ్చేశాడు. వైట్ కాలర్ ఉగ్రవాదంపై జాతీయ విచారణ సంస్థ (ఎన్ఐఏ) మొదలు పెట్టిన దర్యాప్తులో తాజాగా ఈ విషయాలు బయటకు వచ్చాయి. దార్‌కు నబీ 2023 నుంచి తెలుసు. నబీ వైద్య వృత్తి, అతడి వాక్చాతుర్యం వల్లే అతడిని నమ్మి ఉగ్రవాదం వైపు తాను అడుగులు వేసినట్లు దార్ అంగీకరించాడు. ఆత్మాహుతి దాడికి పాల్పడేందుకు దార్‌ను నబీ విజయవంతంగా ఒప్పించగలిగాడు. కానీ... చివరి నిమిషంలో దార్ తన ఆలోచనను మార్చుకున్నాడు. ఇంటివద్ద పనులు, యాపిల్ సాగును కారణాలుగా చూపుతూ ...గత సంవత్సరం ఆగస్టులో జరిగిన చర్చల అనంతరం దార్ ఆత్మాహుతి దాడిని మానుకున్నాడు. అయితే...దార్ ఈ ప్రణాళికలో రెండో పావు మాత్రమే. శ్రీనగర్‌కు చెందిన పొలిటికల్ సైన్స్ విద్యార్థి జైసిర్ అలియాస్ డానిష్‌ను కూడా ఆత్మాహుతి దాడి కోసం నబీ సిద్ధం చేశాడు. ముఠాలో అంతా తనను కేవలం క్షేత్రస్థాయి కార్యకర్తగా నియమించాలన్నా...నబీ మాత్రం కొన్ని నెలలపాటు తన బ్రెయిన్‌వాష్ చేసి ఆత్మాహుతికి పాల్పడేందుకు సిద్ధం చేశాడని డానిష్ ఎన్ఐఏకు తెలిపాడు. కానీ..గతేడాది ఏప్రిల్‌లో జరిగిన చర్చల్లో తన ఆర్థిక పరిస్థితి కారణంగా ఆత్మాహుతి దాడి నుంచి తప్పుకొన్నానని పేర్కొన్నాడు.

బంగ్లాదేశ్‌లో మరో హిందూ వ్యాపారి హత్య

అరటి గెలలు చోరీ చేశాడని బాధితుడిపై దాడి

ఢాకా: బంగ్లాదేశ్‌లో మరో హిందూ వ్యాపారి హత్య జరిగింది. అరటిపళ్ల విషయంలో వాగ్వాదం చోటుచేసుకోవడంతో ఓ కుటుంబంలోని ముగ్గురు ఈ దారుణానికి ఒడిగట్టారు. లిటన్ చంద్ర ఘోష్(55) అనే వ్యాపారికి గాజీపుర్ జిల్లాలోని కలిగంజ్ ప్రాంతంలో బైశాఖి స్వీట్‌మీట్ అనే హోటల్ ఉంది. అదే ప్రాంతానికి చెందిన మాసుమ్ మియా(28) అనే వ్యక్తికి చెందిన అరటి తోటలోని కొన్ని గెలలు అదృశ్యమయ్యాయి. వీటిని మాసుమ్, అతడి తండ్రి స్వపన్ మియా(55), తల్లి మజేదా ఖాతున్(45)లు లిటన్ హోటల్‌లో గుర్తించారు. ఈ విషయమై వీరి మధ్య జరిగిన గొడవలో లిటన్‌ను నిందితులు తీవ్రంగా కొట్టి, కిందకు నెట్టేశారు. దీంతో లిటన్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. హత్యతో సంబంధమున్న ముగ్గురిని పోలీసులు అరెస్టుచేశారు. బంగ్లాదేశ్‌లో ఇటీవల హిందువులపై జరుగుతున్న వరుస దాడులతో ఈ హత్యకు సంబంధముందా? లేదా? అన్నది తెలియరాలేదు.

గర్భాశయంలో 5.21 కిలోల కణితి..

విజయవంతంగా తొలగించిన వైద్యులు

ఈటీవీ భారత్: మహిళ గర్భాశయం నుంచి 5.21 కిలోగ్రాముల బరువున్న ఒక పెద్ద ఫైబ్రాయిడ్(కణితి)ని వైద్యులు విజయవంతంగా తొలగించారు. ఆధునిక సాంకేతికతను ఉపయోగించి హిమాచల్‌ప్రదేశ్‌లోని మండీ జిల్లాకు చెందిన లాప్రోస్కోపిక్ సర్జన్ డాక్టర్ ఉదయ్ భాను రాణా తన నిపుణుల బృందంతో కలిసి రెండున్నర నుంచి మూడు గంటల పాటు ఈ చికిత్సను పూర్తి చేశారు.



ఇందుకోసం లాప్రోస్కోపిక్ సాంకేతికతను ఉపయోగించారు. ఈ తరహా విధానంలో ఇంతకు ముందు 4.5 కిలోగ్రాముల గర్భాశయ ఫైబ్రాయిడ్‌ను తొలగించగా.. ఇప్పుడు ఏకంగా 5.21 కిలోల ఫైబ్రాయిడ్‌ను తొలగించడం విశేషం. డాక్టర్ ఉదయ్‌భాను మాట్లాడుతూ.. ఈ రకమైన శస్త్రచికిత్సల్లో అతిపెద్ద సవాళ్లు రక్తస్రావాన్ని నియంత్రించడం, చుట్టుపక్కల అవయవాలను రక్షించడం ముఖ్యమన్నారు. శస్త్రచికిత్స తర్వాత రోగి పరిస్థితి స్థిరంగా ఉందని, ఆమె వేగంగా కోలుకుంటున్నారని తెలిపారు.

వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవానికి ఏర్పాట్లు పూర్తి

రేపు అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించనున్న ప్రభుత్వం



ఈనాడు డిజిటల్, భీమవరం, వాసవీ పెనుగొండ-న్యూస్‌టుడే: వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని ఏటా మాఘశుద్ధ విదియ తిథి నాడు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. అందులో భాగంగా పశ్చిమ గోదావరి జిల్లాలోని వాసవీ పెనుగొండలో నగరేశ్వర, మహిషాసురమర్దని వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారికి ఈ నెల 20న ప్రభుత్వం తరఫున మంత్రి నిమ్మల రామానాయుడు పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. ఈ మేరకు ప్రభుత్వం ఆదివారం సవరించిన ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కార్యక్రమం నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని దేవాదాయ శాఖ కమిషనర్‌ను ఆదేశించింది. త్యాగానికి ప్రతీకగా నిలిచే కన్యకాపరమేశ్వరి జన్మించిన ఊరిగా, ఆత్మార్పణ చేసుకున్న పవిత్ర స్థలంగా వాసవీ పెనుగొండ పేరుగాంచింది. ఈ ఏడాది పెనుగొండ గ్రామం పేరును వాసవీ పెనుగొండగా మార్చడంతో మరింత ప్రత్యేకత సంతరించుకుంది. ఉత్సవానికి సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ ఈవో గుబ్బల రామ పెద్దింట్లరావు తెలిపారు.

ఉత్తమ రచనలకు జాతీయ స్థాయి పురస్కారాలు

- తొలివిడత తెలుగు సహా 7 భాషలకు ప్రదానం
- తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటన

చెన్నై, న్యూస్‌టుడే: తెలుగు సహా వివిధ భాషల్లోని ఉత్తమ రచనలకు ఏటా జాతీయస్థాయి పురస్కారాలను ప్రదానం చేయనున్నట్లు తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ ప్రకటించారు. చెన్నైలో ఆదివారం జరిగిన 'చెన్నై ఇంటర్నేషనల్ బుక్ ఫెయిర్ -2026' ముగింపు వేడుకలో ఆయన ప్రసంగిస్తూ.. 2025 ఏడాదికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారాలను ఖరారు చేసి ప్రకటించే తరుణంలో కేంద్ర ప్రభుత్వ సాంస్కృతిక శాఖ జోక్యంతో అది ఆగిపోయిందని తెలిపారు. ఇకపై ఆ కార్యక్రమం జరుగుతుందో లేదో తెలియదని అనుమానం వ్యక్తం చేశారు. కళలు, సాహితీ పురస్కారాల్లో రాజకీయ జోక్యం ప్రమాదకరమని అన్నారు. తమిళనాడు ప్రభుత్వం దీనిపై తగిన వ్యతిరేకతను వ్యక్తం చేయాలని పలువురు రచయితలు, కళలు, సాంస్కృతిక సంస్థల వారు తనను అభ్యర్థించారని పేర్కొన్నారు. వివిధ భారతీయ భాషల్లో వెలువడే ఉత్తమ రచనలకు తమిళనాడు ప్రభుత్వం తరఫున ఏటా జాతీయ స్థాయి పురస్కారాలను ప్రదానం చేయాలని తాము నిర్ణయించినట్లు ప్రకటించారు. తొలి విడతగా తమిళం, తెలుగు, కన్నడం, మలయాళం, ఒడియా, బెంగాలీ, మరాఠీ భాషల్లోని ఉత్తమ రచనలకు ఏటా 'సెమ్మొళి ఇలక్కియ విరుదు (విశిష్ట భాషా సాహిత్య పురస్కారం)', రూ.5 లక్షల చొప్పున నగదు బహుమతి అందజేయనున్నట్లు తెలిపారు. రచనల సాహితీ ప్రమాణాలు, పారదర్శకమైన ఎంపిక విధానాన్ని నిర్దేశించడానికి ప్రతి భాషకు ప్రసిద్ధ రచయితలు, పురస్కార గ్రహీతలతో కూడిన కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.

అవసరాలు తీరేలా... అదనపు నీరు!

- రోజుకు 1,200 మిలియన్ లీటర్లు తెచ్చేలా ప్రభుత్వ ప్రణాళికలు
- రూ.15,887 కోట్లతో పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికి చర్యలు

ఈనాడు, అమరావతి: పట్టణ ప్రజల దాహార్తిని తీర్చడం, భవిష్యత్తు అవసరాలకు రోజూ 1,200 మిలియన్ లీటర్ల అదనపు నీటిని రెండేళ్లలో అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం ప్రణాళికల్ని అమలు చేస్తోంది. వైకాపా ప్రభుత్వంలో రాష్ట్ర వాటా నిధులివ్వక అసంపూర్తిగా నిలిచిన పలు ప్రాజెక్టులను రూ.15,887 కోట్లతో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటోంది. వీటిలో కొన్నింటి పనులు ఇటీవల ప్రారంభమై వివిధ దశల్లో ఉన్నాయి. ఇంకొన్ని ప్రాజెక్టుల పనులకు టెండర్లు పిలిచి గుత్తేదారు సంస్థలకు వర్క్ ఆర్డర్లు ఇచ్చారు. మరికొన్నింటికి టెండర్లు పిలవాలి. 2027 డిసెంబరు ఆఖరుకు పనులు పూర్తిచేసి ప్రతి ఇంటికీ పైపుల ద్వారా రక్షిత నీరు అందించాలనేది ప్రభుత్వ లక్ష్యం.





విశాఖలోని గాజువాక ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న నీటి ట్యాంకు ◆నెల్లూరులో తాగునీటి పైపులైను పనులు

ఇలా ముందుకు..

అమృత్-1లో 32 పుర, నగరపాలక సంస్థల్లో రూ.1,500 కోట్లతో ఇటీవల ప్రారంభించిన పెండింగ్ పనులు వివిధ దశల్లో ఉన్నాయి. కొత్త రిజర్వాయర్లు, పైపులైన్లు, తాగునీటి శుద్ధి ప్లాంట్లను నిర్మిస్తున్నారు.

◆ అమృత్-2లో రూ.8 వేల కోట్లతో ఇటీవల టెండర్లు పిలిచి గుత్తేదారు సంస్థలకు వర్క్ ఆర్డర్లు ఇచ్చారు. మరో 25 పట్టణ స్థానిక సంస్థల్లో తాగునీటి సరఫరాను మెరుగుపరుస్తారు.

◆ పట్టణ మౌలిక వసతుల అభివృద్ధి నిధి(యూఐడీఎఫ్)తో రెండు దశల్లో రూ.3,395.58 కోట్లతో తాగునీటి సరఫరా ప్రాజెక్టులు చేపట్టనున్నారు. మొదటి దశలో రూ.1,700 కోట్ల పనులకు వర్క్‌ఆర్డర్లు ఇచ్చారు. మిగిలిన మొత్తానికి టెండర్లు పిలవనున్నారు.

◆ ఏసియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు(ఏఐఐబీ) సాయంతో రూ.2,901.67 కోట్ల విలువైన పనులకు టెండర్లు పిలిచారు. వీటిలో 26 ప్రాజెక్టులున్నాయి. గత ప్రభుత్వం రాష్ట్ర వాటా సరిగా ఇవ్వని కారణంగా బ్యాంకు రుణం నిలిపివేసింది. కూటమి ప్రభుత్వం.. కేంద్రం ద్వారా బ్యాంకును ఒప్పించి పెండింగ్ పనులకు సవరించిన అంచనాల మేరకు టెండర్లు పిలిచి వర్క్ ఆర్డర్లు ఇచ్చింది.

పుర, నగరపాలక సంస్థల్లో వివిధ పథకాల కింద చేపడుతున్న తాగునీటి ప్రాజెక్టుల వివరాలు

పథకం	ప్రాజెక్టుల సంఖ్య	అంచనా వ్యయం (రూ.కోట్లలో)
అమృత్-1	52	1,500.00
ఏఐఐబీ	27	2,991.67
యూఐడీఎఫ్	90	3,395.58
అమృత్-2	240	8,000.00
మొత్తం	409	15,887.25

ప్రయోగాత్మకంగా 24x7 తాగునీటి సరఫరా

రెండేళ్లలో ప్రాజెక్టుల పనులు పూర్తి చేయించడంతోపాటు నగరపాలక సంస్థలో ఒక డివిజన్, పురపాలక సంఘంలో ఒక వార్డు చొప్పున ఎంపిక చేసి ప్రయోగాత్మకంగా 24 గంటలూ తాగునీటి సరఫరా చేయాలని అధికారులు భావిస్తున్నారు. 123 పట్టణ స్థానిక సంస్థల్లో ప్రస్తుతం రోజూ 2 వేల మిలియన్ లీటర్ల తాగునీరు సరఫరా చేస్తున్నారు. ప్రస్తుత ప్రాజెక్టుల పూర్తితో అదనంగా అందుబాటులోకి వచ్చే 1,200 మిలియన్ లీటర్లతో ఎంపిక చేసిన కొన్ని ప్రాంతాలకు 24 గంటలూ నీరు సరఫరా చేయొచ్చని అధికారుల అభిప్రాయం.

అవినీతికి చట్టబద్ధత కల్పించే చర్యగా మారుతుందనే ఎన్నికల బాండ్ల పథకం రద్దు

మాజీ సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్

చెన్నై, న్యూస్‌టుడే: అవినీతికి చట్టబద్ధత కల్పించే చర్యగా మారుతుందన్న కారణంగానే ఎన్నికల బాండ్ల పథకాన్ని రద్దు చేసినట్లు సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ వెల్లడించారు. ఓ ఆంగ్ల దినపత్రిక చెన్నైలో నిర్వహించిన సాహిత్య వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన చర్చా వేదికలో ఎన్నికల బాండ్లపై లేవనెత్తిన ఓ ప్రశ్నకు జస్టిస్ చంద్రచూడ్ స్పందిస్తూ.. 1966 నుంచి రాజకీయ పార్టీలకు కార్పొరేట్ సంస్థలు విరాళాలు ఇస్తున్నాయని, ఇది మన దేశంలో చట్టవిరుద్ధం కాదని తెలిపారు. అదే సమయంలో పేరు వెల్లడించకుండా విరాళం ఇచ్చే ఎన్నికల బాండ్లను అనుమతించడమనేది రాజకీయ అవినీతికి చట్టబద్ధత కల్పించే చర్యగా మారుతుందని పేర్కొన్నారు. అందుకే ఆ పథకాన్ని రద్దు చేస్తూ సుప్రీంకోర్టు తీర్పును వెల్లడించిందని తెలిపారు. పథకాన్ని రద్దు చేసినా కార్పొరేట్ సంస్థలు విరాళాలు ఇచ్చే విధానం కొనసాగుతూనే ఉందని చెప్పారు.

18 రోజుల్లో 144 స్క్రబ్‌టైఫస్ కేసులు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో స్క్రబ్‌టైఫస్ కేసులు తగ్గడం లేదు. కొత్త ఏడాదిలో ఈ నెల 18 వరకు 1,525 మందికి పరీక్షలు నిర్వహిస్తే.. 144 స్క్రబ్‌టైఫస్ పాజిటివ్ కేసులు వెలుగుచూశాయి. వీరిలో నలుగురు మరణించారు. తాజా మరణాలు అనకాపల్లి జిల్లాలో రెండు, కాకినాడ, కృష్ణా జిల్లాల్లో ఒక్కొక్కటి చొప్పున నమోదయ్యాయి. రాష్ట్రంలో 2023 నుంచి కేసుల తీవ్రత పరిశీలిస్తే.. గతేడాది అత్యధికంగా 2,190 పాజిటివ్ కేసులు, 22 మరణాలు నమోదయ్యాయి.

మన్యం గజగజ

జి.మాడుగులలో 3.5 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత

చింతపల్లి, న్యూస్‌టుడే: అల్లూరి సీతారామరాజు జిల్లా చలితో వణికిపోతోంది. జనవరి రెండో పక్షంలో మన్యంలో మరింతగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఆదివారం జి.మాడుగులలో అత్యల్పంగా 3.5 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్లు చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనాస్థానం వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ అప్పలస్వామి తెలిపారు. అరకులోయలో 3.8, చింతపల్లిలో 3.9, ముంచంగిపుట్టులో 4.3, పెదబయలులో 4.8, హుకుంపేటలో 6.6 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

పొగమంచుతో విమాన సర్వీసులు ఆలస్యం


గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: పొగ మంచు కారణంగా విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆదివారం ఉదయం విమానాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. తెల్లవారుజాము నుంచి ఉదయం 9.30 గంటల వరకు విమానాశ్రయ ప్రాంతాన్ని పొగ మంచు దుప్పటిలా కప్పేసింది. రన్ వే కనిపించక పోవడంతో ఎయిర్ ఇండియా దిల్లీ సర్వీస్ విమానం సుమారు 45 నిమిషాల పాటు గాల్లో చక్కర్లు కొట్టింది. అనంతరం పొగ మంచు తగ్గుముఖం పట్టడంతో రన్‌వేపై ల్యాండ్ అయ్యింది. ఉదయం హైదరాబాద్, చెన్నై, విశాఖపట్నం విమాన సర్వీసులు కూడా ఆలస్యంగా నడిచాయి.

మాతృభాషతోనే అదనపు నైపుణ్యాలు

- పిల్లలకు మన మూలాలను తెలపాలి
- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్
- విశాఖలో ఘనంగా లోక్‌నాయక్ ఫౌండేషన్ పురస్కారాల ప్రదానం



వేదికపై జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్, రఘురామకృష్ణరాజులతో సౌజన్య, కోటి సూర్యప్రభ, గంటా శ్రీనివాసరావు, యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, పురస్కార గ్రహీతలు వెలమల సిమ్మన్న, తోటకూర ప్రసాద్, ఆర్యన్ ఉదయ్ ఆరేటి, రాఘవేంద్రచౌదరి, గన్ని భాస్కరరావు



జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్

ఈనాడు, విశాఖపట్నం: అంతర్జాతీయంగా పేరు ప్రఖ్యాతులు గడించిన మన దేశస్థులకు ఆ ఖ్యాతి ఆంగ్ల భాషతో రాలేదని, మాతృభాషలో చదవడం వల్లే సాధ్యమైందని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ అన్నారు. అమ్మభాష ఎంత ముఖ్యమైనదో శాస్త్రీయంగా నిరూపితమైందని, ఉత్తర అమెరికాలో దీనిపై పరిశోధనలు జరిగాయని చెప్పారు. ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ ఆధ్వర్యంలో విశాఖలో ఆదివారం లోక్‌నాయక్ ఫౌండేషన్ పురస్కారాల ప్రదానోత్సవాన్ని నిర్వహించారు. ఏయూ విశ్రాంత ఆచార్యులు వెలమల సిమ్మన్నను సాహితీ పురస్కారంతో సత్కరించి రూ.2 లక్షల నగదు అందించారు. తానా ప్రపంచ సాహిత్య వేదిక వ్యవస్థాపకులు తోటకూర ప్రసాద్, సెంట్రల్ లండన్ డిప్యూటీ మేయర్ ఆర్యన్ ఉదయ్ ఆరేటి, హెన్రీ ఫోర్డ్ వైద్య పురస్కార గ్రహీత రాఘవేంద్రచౌదరిలను జీవన సాఫల్య పురస్కారాలతో పాటు రూ.లక్ష చొప్పున అందించి సత్కరించారు. క్యాన్సర్ వైద్య నిపుణుడు నోరి దత్తాత్రేయుడు రాలేకపోవడంతో ఆయన సన్నిహితులు గన్ని భాస్కరరావుకు పురస్కారం అందించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ మాట్లాడుతూ 'ఉత్తర అమెరికాలో బహు భాషలు మాట్లాడే కుటుంబాల నుంచి వచ్చిన పిల్లలు బాగా రాణిస్తున్నట్లు గుర్తించారు. అదే సమయంలో ఆంగ్లం మాతృభాషగా కలిగిన వారు వెనకబడుతున్నట్లు కనుగొన్నారు. దీనికి కారణాలపై కెనడా విద్యా పరిశోధన కేంద్రం ఆధ్వర్యంలో ఏడాది కిందట పరిశోధన చేశారు. రెండు భాషల కన్నా ఎక్కువ మాట్లాడే వారిలో అధికంగా భారతీయులు, ఇతర దేశీయులు ఉన్నారు. వారిలో విశ్లేషణ నైపుణ్యాలు, వ్యాకరణం, నేర్చుకునే సామర్థ్యాలు అధికంగా ఉంటున్నాయని తేల్చారు. ఫలితంగా అక్కడి విద్యాసంస్థల్లో జరిగే తల్లిదండ్రుల సమావేశాల్లో.. ఇంట్లో తప్పనిసరిగా మాతృభాషలోనే మాట్లాడాలని అక్కడి ఉపాధ్యాయులు చెబుతున్నారు' అని వివరించారు. 'చదువుకునే పిల్లలకు ఫస్ట్, సెకండ్ లాంగ్వేజ్‌లు ఉండొచ్చు. కానీ మాతృభాషను మరచిపోకుండా తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలి. నేను తెలుగు మాధ్యమంలోనే చదువుకున్నా' అని చెప్పారు. శాసనసభ ఉపసభాపతి రఘురామకృష్ణరాజు, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, సినీనటి కోటి సూర్యప్రభ తదితరులు ప్రసంగించారు.

క్యాన్సర్ పరీక్షలకు.. ఆరోగ్యశ్రీ సేవలను విస్తరించాలి

- డాక్టర్ నోరి దత్తాత్రేయుడు



తెలుగు రాష్ట్రాల్లో క్యాన్సర్ మరింత విస్తరించకుండా పలు విధానాలు అమలు చేస్తున్నట్లు అంతర్జాతీయ క్యాన్సర్ వ్యాధి నిపుణుడు డాక్టర్ నోరి దత్తాత్రేయుడు చెప్పారు. ఏపీలో ఎన్టీఆర్ వైద్యసేవ, తెలంగాణలో రాజీవ్ ఆరోగ్యశ్రీ సేవలను క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు, శస్త్రచికిత్సలకూ విస్తరిస్తే బాగుంటుందన్నారు. లోక్‌నాయక్ ఫౌండేషన్ జీవన సాఫల్య పురస్కారం అందుకునేందుకు ఆదివారం విశాఖ రావాల్సిన ఆయన విమానాల రద్దుతో హాజరు కాలేకపోయారు. తన ప్రసంగాన్ని వీడియో ద్వారా పంపించారు. 'రొమ్ము, ప్రొస్టేట్, సర్వైకల్ క్యాన్సర్లను గుర్తించే మామోగ్రాం, పీఎస్ఏ, పాప్‌స్మియర్ పరీక్షలతో పాటు రోబోటిక్ సర్జరీ, ఇమ్యునోథెరపీ, ఎముక మజ్జ మార్పిడి వంటి చికిత్సలనూ ఆరోగ్యశ్రీ సేవల్లో చేర్చాలి. క్యాన్సర్‌ను వీలైనంత త్వరగా గుర్తించి చికిత్స అందిస్తే రోగులను కాపాడొచ్చు. ఈ వ్యాధిని నోటిఫయబుల్ డిసీజ్‌గా గుర్తించాలి. అమెరికాలో 75 ఏళ్లుగా నోటిఫయబుల్‌గా గుర్తింపు ఉంది. మన దేశంలో చాలా తక్కువ రాష్ట్రాల్లో కొనసాగిస్తున్నారు. ఏపీ, తెలంగాణలో కొంతకాలం కిందట ప్రకటించారు. ఇలా చేయడం వల్ల ఎక్కడికక్కడ పరీక్షలు చేసి, సమాచారం సేకరించడం సులభమవుతుంది. సరైన సమయంలో చికిత్స అందించడానికి దోహదపడుతుంది' అని వివరించారు. 'చాలా ప్రాంతాల్లో ఎన్జీవోలు వైద్య శిబిరాలు, క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేపడుతుంటాయి. ఆ నివేదికలను ప్రభుత్వానికి అందించరు. అలాంటి నివేదికల్ని సేకరించడానికి, ఎన్జీవోలు ఏయే ప్రాంతాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలో ముందుగా చెప్పడానికి కమాండ్ సెంటర్‌లను అభివృద్ధి చేయాలి' అని దత్తాత్రేయుడు సూచించారు.

తమలపాకుల ధరకు రెక్కలు

100 పంతాలు రూ.7 వేలు



పొన్నూరు మండలం ములుకుదురులో తమలపాకు తోట

పొన్నూరు, న్యూస్‌టుడే: తమలపాకుల ధర ఆకాశాన్నంటింది. వంద పంతాల ధర రూ.7 వేలకు ఎగబాకింది. గతేడాది ఇదే రోజుల్లో రూ.2,500 నుంచి రూ.3,000 మాత్రమే ఉంది. రైతుల నుంచి వ్యాపారులు ఒక పంతం (కట్టకు 170-180 ఆకులు) రూ.70కి కొనుగోలు చేస్తుండగా, బహిరంగ మార్కెట్లో రూ.300 వరకు అమ్ముతున్నారు. ఈ లెక్కన ఒక ఆకు ధర రూ.1.75కు పైగా పలుకుతోంది. గుంటూరు జిల్లా పొన్నూరు మండల పరిధిలో తమలపాకు సాగు ఎక్కువ. చింతలపూడి, ములుకుదురు, మాచవరం, ఆరెమండ, దండమూడి, నిడుబ్రోలు తదితర ప్రాంతాల్లో సుమారు 700 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ఇక్కడి నుంచి చెన్నై, హైదరాబాద్, బెంగళూరు, మహారాష్ట్ర, దిల్లీ తదితర ప్రాంతాలకు ఎగుమతవుతాయి. ఇటీవలి తుపాను ప్రభావంతో కడప, నెల్లూరు, తూర్పు గోదావరి జిల్లాల్లో సాగవుతున్న తమలపాకు మొక్కల్లో ఎదుగుదల లోపించడంతో దిగుబడులపై ప్రభావం పడింది. గతంలో ఎకరాకు 3 వేల పంతాల లోపు దిగుబడి వచ్చేది. ప్రస్తుతం 800 నుంచి 1200 లోపు మాత్రమే వస్తుండటం.. ధర పెరుగుదలకు దోహదపడిందని రైతులు చెబుతున్నారు. ధర పెరగడంతో అన్నదాతల ముఖాల్లో ఆనందం కనిపిస్తోంది.

EENADU Vol: 52, Issue: 159 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

చిన్న నగరాల్లో ఈఎక్స్ఎల్ కేంద్రాలు

డేటా, కృత్రిమమేధ (ఏఐ) సేవలందించే నాస్‌డాక్ నమోదిత సంస్థ ఈఎక్స్ఎల్‌సర్వీస్ హోల్డింగ్స్, మన దేశంలో మరో 2 కేంద్రాలను రెండు-మూడో అంచె నగరాల్లో ఈ ఏడాదిలోనే ఏర్పాటు చేయనుంది. మౌలిక వసతులు, నిపుణుల లభ్యత ఉన్న చిన్న నగరాల్లో ఈ కేంద్రాలు నెలకొల్పుతామని సంస్థ సీఈఓ రోహిత్ కపూర్ చెప్పారు. అంతర్జాతీయంగా తమ 63,000 మంది సిబ్బందిలో 45,000 మంది భారత్‌లోని కేంద్రాల్లోనే పనిచేస్తున్నట్లు వివరించారు. కొత్తగా 2 కేంద్రాలను చిన్న నగరాల్లో ఏర్పాటు చేస్తామని, ఒక్కో కేంద్రంలో 100-500 మందికి అవకాశం ఉందని పేర్కొన్నారు.



రూ.1.84 లక్షల కోట్ల ఔషధ ఎగుమతులు

అంతర్జాతీయ అనిశ్చితుల నేపథ్యంలో వాణిజ్యం కుంటుపడుతున్నా.. మనదేశ ఔషధ ఎగుమతులు మాత్రం మెరుగ్గా రాణిస్తున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి 8 నెలల్లో మనదేశం నుంచి 20.48 బిలియన్ డాలర్ల (సుమారు రూ.1.84 లక్షల కోట్ల) విలువైన ఔషధాలు ఎగుమతి అయ్యాయని వాణిజ్య మంత్రిత్వశాఖ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. గత ఆర్థిక సంవత్సరం ఇదే సమయ ఎగుమతుల కంటే ఇవి 6.5% ఎక్కువ. మన ఔషధాల ఎగుమతులు బ్రెజిల్, నైజీరియా దేశాలకు వేగంగా పెరుగుతున్నాయని తేలింది.

✦ 2024-25 ఇదే సమయంతో పోలిస్తే, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి 8 నెలల్లో పశ్చిమ ఆఫ్రికా దేశమైన నైజీరియాకు 17.9 కోట్ల డాలర్లు (సుమారు రూ.1,600 కోట్ల) అధికంగా ఔషధాలు మనదేశం నుంచి ఎగుమతి అయ్యాయి. మన దేశం నుంచి పెరిగిన ఔషధ ఎగుమతుల్లో ఈ వాటా 14%. మన ఔషధాల ఎగుమతులు వేగంగా పెరిగింది ఈ దేశానికే.

✦ దక్షిణ అమెరికా దేశమైన బ్రెజిల్‌కు కూడా ఔషధ ఎగుమతులు 10 కోట్ల డాలర్ల (సుమారు రూ.900 కోట్ల) మేర అధికమయ్యాయి.

✦ నెదర్లాండ్స్‌కు ఎగుమతులు 58 మిలియన్ డాలర్లు (సుమారు రూ.522 కోట్లు) పెరిగాయి. ఐరోపా ఫార్మా పంపిణీ రంగంతో భారత ఔషధ కంపెనీలు మరింతగా అనుసంధానం అయ్యాయనడానికి ఇది నిదర్శనంగా చెబుతున్నారు.



కారణాలివీ..: వర్ధమాన దేశాల్లో ఆరోగ్య సంరక్షణ సేవలకు ప్రాధాన్యం - అవకాశాలు పెరగడం, అక్కడి ప్రభుత్వాలు సమీకరించే ఔషధాల విలువ అధికమవ్వడం, భారత ఔషధ కంపెనీలు తయారు చేస్తున్న జనరిక్స్‌పై విశ్వాసం పెరగడం వల్లే మనదేశం నుంచి ఔషధాల ఎగుమతులు వృద్ధి చెందేందుకు కారణమయ్యాయి.

అమెరికాకే అత్యధికం: ఇతర దేశాలకు భారత ఔషధాల ఎగుమతులు పెరుగుతున్నా, మొత్తం ఎగుమతి అయిన మన ఔషధాల్లో 31% అమెరికాకే చేరాయి. ఇతర దేశాలకూ ఎగుమతులు పెరగడం వల్ల, మన ఔషధ రంగం బలోపేతం అవుతోందని ఒక ఉన్నతాధికారి పేర్కొన్నారు.

ఈ దేశాలకూ ఎగుమతులు పెరుగుతున్నాయ్: ఫ్రాన్స్, నెదర్లాండ్స్, కెనడా, జర్మనీ, దక్షిణాఫ్రికా దేశాలకు కూడా మన ఔషధ ఎగుమతులు పెరుగుతున్నాయి.

5 త్రైమాసికాల గరిష్ఠానికి సీఐఐ వ్యాపార విశ్వాస సూచీ

అక్టోబరు-డిసెంబరులో 66.5కు..

Confederation of Indian Industry

వరుసగా మూడో త్రైమాసికంలో (అక్టోబరు-డిసెంబరు)నూ సీఐఐ వ్యాపార విశ్వాస సూచీ (బీసీఐ) పెరిగిందని భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) తెలిపింది. గిరాకీ, లాభదాయకత, పెట్టుబడి పరిస్థితుల్లో ఉన్న ఆశావాదం కారణంగా బీసీఐ 66.5కు చేరిందని, ఇది 5 త్రైమాసికాల గరిష్ఠ స్థాయి అని పేర్కొంది. దేశీయంగా లభిస్తున్న గిరాకీ కీలకమైన చోదక శక్తిగా ఉందని.. మూడింట రెండొంతుల సంస్థలు 2025-26 జులై-సెప్టెంబరులో అధిక డిమాండ్‌ను నివేదించాయని సీఐఐ వెల్లడించింది. మూడో త్రైమాసికంలో మరింత వృద్ధి లభించిందని 72% సంస్థలు పేర్కొన్నాయి. జీఎస్‌టీ రేట్లు తగ్గించడం, పండగ వినియోగం పెరగడం.. గిరాకీ వృద్ధికి దోహదపడతాయని తెలిపింది. దేశంలోని వేర్వేరు ప్రాంతాల్లో ఉన్న సూక్ష్మ, చిన్న, మధ్య, పెద్ద సంస్థలతో పాటు అన్ని పరిశ్రమల రంగాల అభిప్రాయాలను సేకరించి, ఈ అభిప్రాయానికి సీఐఐ వచ్చింది. తయారీ, సేవల్లో నిమగ్నమైన ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లోని 175 సంస్థల నిర్వాహకుల వద్ద 2025 డిసెంబరు తొలి - మూడో వారం మధ్య అభిప్రాయాలు సేకరించారు. కొత్త పెట్టుబడులు, కొత్త ఉద్యోగ నియామకాలపైనా ఆశావాదం బలంగా ఉన్నట్లు తేలింది. ప్రస్తుత త్రైమాసికంలో రెపోరేటును రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) మరింత తగ్గిస్తుందని 69% సంస్థలు ఆశిస్తున్నాయి. దేశ వృద్ధిరేటును ఉపకరించేలా రాబోయే బడ్జెట్‌లో సంస్కరణల వేగం కొనసాగుతుందని సీఐఐ విశ్వాసం వ్యక్తం చేసింది.

✦ సెప్టెంబరు 22 నుంచి అమల్లోకి వచ్చిన జీఎస్‌టీ కోతల వల్ల విక్రయాలకు ఊతం లభించింది. రాబోయే త్రైమాసికాల్లో తమ విక్రయాలు 5 - 20% పెరుగుతాయని 56.3% సంస్థలు ఆశాభావంతో ఉన్నాయి. సాహసోపేత సంస్కరణల చొరవతో, మన దేశం ప్రపంచంలోనే అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా స్థిరపడిందని సర్వే తేల్చింది. భౌగోళిక-రాజకీయ ఉద్రిక్తతలు, వాణిజ్య సుంకాలు, మందగిస్తున్న ప్రపంచ ఆర్థిక వ్యవస్థ వంటి అనిశ్చితుల నడుమ మన దేశం అద్భుతంగా రాణిస్తున్నట్లు సీఐఐ డైరెక్టర్ జనరల్ చంద్రజిత్ బెనర్జీ వెల్లడించారు.

ప్రారంభస్థాయి ఈవీలకు ప్రోత్సాహకాలివ్వండి

టాటా మోటార్స్

దిల్లీ: రాబోయే బడ్జెట్‌లో ప్రారంభస్థాయి విద్యుత్తు వాహనాల (ఈవీ)కు ప్రోత్సాహకాలు ఇవ్వాలని కోరుతున్నట్లు టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్ ఎండీ, సీఈఓ శైలేష్ చంద్ర తెలిపారు. పీఎం ఇ-డ్రైవ్ పథకం కింద వినియోగించే వాహనాలతో పాటు ప్రారంభస్థాయి ఈవీలకూ ప్రోత్సాహకాలను ఆశిస్తున్నట్లు వెల్లడించారు. జీఎస్‌టీ 2.0, రెపో రేటు తగ్గింపు, ఆదాయపు పన్ను సంస్కరణల వంటివి వాహనాలకు గిరాకీ పుంజుకునేలా చేసినా, ప్రారంభస్థాయి ఈవీలు ధరల ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయని వివరించారు. జీఎస్‌టీ 2.0లో పెట్రోల్ కార్ల ధరలు తగ్గడమే ఇందుకు కారణమని తెలిపారు. వాణిజ్య అవసరాలకు వినియోగించే వాహనాల్లో ఈవీల వాటా 7 శాతంగా ఉన్నట్లు గుర్తు చేశారు. ఈవీల తయారీ/వినియోగాన్ని పెంచేందుకు అమలు చేసిన ఫేమ్-2 పథకంలో, వ్యాపారం కోసం వినియోగించే ఈవీ కార్లు భాగమే అయినా, పీఎం ఇ-డ్రైవ్ పథకంలో చేర్చనట్లు వివరించారు.

భారత కంపెనీలకు పోటీతత్వమే కీలకం

బీసీజీ ఇండియా హెడ్ రాహుల్ జైన్



దావోస్: సోమవారం నుంచి అయిదు రోజుల పాటు ఇక్కడ జరిగే ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యూఈఎఫ్) వార్షిక సమావేశాలకు భారత్ నుంచి వ్యాపార ప్రముఖులు హాజరు కానున్నారు. కంపెనీలకు ఖర్చు, స్థాయి, సామర్థ్యాల్లో పోటీతత్వాన్ని తీసుకురావడమే కీలకంగా మారిందని కన్సల్టెన్సీ సంస్థ బీసీజీ ఇండియా అధిపతి రాహుల్ జైన్ తెలిపారు. 2030 నాటికి ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ నిలిచే అవకాశం ఉందన్నారు. డబ్ల్యూఈఎఫ్ సమావేశాల్లో భారత్‌కు సంబంధించి ఇది కీలకమైన చర్చనీయాంశం కానుంది. '2028 నాటికే ఈ మైలురాయిని చేరుకోవడానికి వృద్ధిని మరింత వేగవంతం చేయొచ్చా అనేది ముఖ్యమైన ప్రశ్న. ఇందుకోసం ప్రస్తుతం జీడీపీలో 15-17 శాతంగా ఉన్న తయారీ రంగాన్ని, 20% లేదా అంతకంటే ఎక్కువకు తీసుకువెళ్లాల్సి ఉంటుంది. ఇదే జరిగితే ఈ లక్ష్యాన్ని సాధించడం ఎప్పుడూ అనే ప్రస్తావన ఉండదు' అని జైన్ పేర్కొన్నారు.

✦ శుద్ధ ఇంధనం, ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్ల వంటి వర్ధమాన రంగాల్లో పెట్టుబడులతో భారత్‌లో కొత్త వృద్ధి అవకాశాలు సృష్టించొచ్చని జైన్ వెల్లడించారు. ఎలక్ట్రానిక్స్, వాహన విడిభాగాలు, పునరుత్పాదక ఇంధన, హార్డ్‌వేర్, డేటా కేంద్రాలు, సెమీకండక్టర్ వ్యవస్థలను విస్తరించడం ద్వారా అంతర్జాతీయ సరఫరా వ్యవస్థలో భారత్ మరింత చొచ్చుకువెళ్లొచ్చని అంచనా వేశారు.

భారత్‌తో భాగస్వామి అవ్వండి.. భవితకు బాట వేయండి

మన దేశంలో పెట్టుబడులు పెట్టాలని అంతర్జాతీయ పెట్టుబడిదార్లను ఈ సమావేశాల్లో భారత్ ఆహ్వానించనుంది. 'భారత్‌తో భాగస్వామి అవ్వండి.. భవితకు బాట వేయండి' అని భారత పెవిలియన్ కోరుతోంది. సీఐఐ కూడా తమ పెవిలియన్‌లో ఇదే తరహా సందేశాన్ని ఉంచింది. టీసీఎస్, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్, టెక్ మహీంద్రా వంటి భారత ఐటీ దిగ్గజ సంస్థలు సొంత పెవిలియన్‌లు, లాంజ్‌లను సిద్ధం చేశాయి. ఇందులో కృత్రిమ మేధ (ఏఐ) లాంజ్ కూడా ఉంది. ప్రభుత్వ బృందంతో పాటు 100 మందికి పైగా భారతీయ సీఈఓలు దావోస్ చేరుకున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఝార్ఖండ్, ఉత్తర్‌ప్రదేశ్, కేరళ రాష్ట్రాలు పెవిలియన్‌లు ఏర్పాటు చేశాయి. ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రి కె.రామ్మోహన్ నాయుడు సహా పలువురు కీలక నాయకులు ఈ సమావేశాలకు హాజరుకానున్నారు.

మరిన్ని అనుబంధ సంస్థలు ఐపీఓకు

కోల్‌ఇండియా సీఎండీ బి.సాయిరాం



తమ అనుబంధ సంస్థ భారత్ కోకింగ్ కోల్ (బీసీసీఎల్) పబ్లిక్‌ఇష్యూకు లభించిన అద్భుత స్పందన నేపథ్యంలో, మరిన్ని అనుబంధ సంస్థలను పబ్లిక్ ఇష్యూకు తెస్తామని కోల్ ఇండియా ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ బి.సాయిరాం వెల్లడించారు. బీసీసీఎల్ ఇష్యూ ప్రారంభమైన నిమిషాల్లోనే పూర్తిస్థాయి స్పందన రాగా, ఇష్యూ ముగిసేసరికి 146 రెట్లు అధికంగా బిడ్లు దాఖలైనట్లు తెలిసిన నేపథ్యంలో, ఆయన ఇలా పేర్కొన్నారు. 'ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ఒక అనుబంధ సంస్థను మార్కెట్‌కు తెచ్చాం. మరికొన్ని సంస్థలను మార్కెట్‌కు తేవడం ద్వారా, వాటి అసలైన సామర్థ్యాన్ని వెలుగులోకి తెస్తాం' అని సాయిరాం వివరించారు. ఈనెల 19న బీసీసీఎల్ షేరు స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదు కానుంది. సెంట్రల్ మైన్ ప్లానింగ్ అండ్ డిజైన్ ఇన్‌స్టిట్యూట్ లిమిటెడ్ (సీఎంపీడీఐ)లో 10% వాటాకు సమానమైన 7.14 కోట్ల షేర్లను ఆఫర్ ఫర్ సేల్‌లో కోల్ ఇండియా మార్చిలోపే విక్రయించనుంది. ఇందుకు అనుమతి కోరుతూ, సెబీకి ఇప్పటికే దరఖాస్తు చేసింది. మహానది కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్ (ఎంసీఎల్), సౌత్‌ఈస్టర్న్ కోల్‌ఫీల్డ్స్ (ఎస్‌ఈసీఎల్) కూడా పబ్లిక్ ఇష్యూకు వచ్చేందుకు కోల్‌ఇండియా బోర్డు ఆమోదం తెలిపింది. ఇవి 2026-27లో ఐపీఓకు వస్తాయి.

టాటా ట్రస్ట్ బోర్డు సమావేశం రద్దు

దిల్లీ: టాటా గ్రూప్ ప్రస్తుత ఛైర్మన్ నోయల్ టాటా కుమారుడు నెవిల్లే టాటాను ట్రస్టీగా నియమించే ప్రతిపాదనను చర్చించాల్సిన సర్ రతన్‌టాటా ట్రస్ట్ (ఎస్ఆర్‌టీటీ) బోర్డు సమావేశం రద్దయ్యింది. శనివారం ఈ సమావేశం జరగాల్సి ఉన్నా, సమావేశానికి అవసరమైన కనీస సభ్యుల సంఖ్య లేనందునే రద్దయిందని చెబుతున్నారు. కొత్త ట్రస్టీని నియమించాలంటే, బోర్డు సమావేశానికి సభ్యులందరూ హాజరు కావాల్సి ఉంది. ఈ ప్రతిపాదనపై చర్చించేందుకే 2 నెలల క్రితం తలపెట్టిన సమావేశం కూడా రద్దు కావడం గమనార్హం. మళ్లీ కొన్ని రోజుల్లో బోర్డు సమావేశానికి తేదీ ఖరారు చేస్తారని సమాచారం.

టాటా గ్రూప్ ప్రధాన సంస్థ టాటా సన్స్‌లో 23.6% వాటా ఎస్ఆర్‌టీటీకి ఉంది.

✦ ఎస్ఆర్‌టీటీలో నోయల్ టాటా, వేణు శ్రీనివాసన్, విజయ్ సింగ్ జిమ్మీ ఎన్ టాటా, జహంగీర్ హెచ్.సి. జహంగీర్, డారియస్ ఖంబాటా ట్రస్టీలుగా ఉన్నారు. ఇందులో జీవిత కాల ట్రస్టీగా ఉన్న వేణు శ్రీనివాసన్, నెవిల్లే టాటా నియామకానికి అభ్యంతరం తెలిపారు.

✦ గత నవంబరులో నెవిల్లే టాటా, భాస్కర్ భట్‌లను సర్ దొరాబ్జీ టాటా ట్రస్ట్ (ఎస్‌డీటీటీ)లో ట్రస్టీలుగా నియమించారు. టాటా సన్స్‌లో ఎస్‌డీటీటీ వాటా 28%.

కోడి గుడ్లు

19న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	500	తూ/ప గోదావరి	515
వరంగల్	502	విశాఖపట్నం	515
విజయవాడ	510	చిత్తూరు	563

2025లో 24% పెరిగిన వాహన ఎగుమతులు

సియామ్ నివేదిక

దిల్లీ: విదేశీ విపణుల్లో కార్లు, ద్విచక్ర, వాణిజ్య వాహనాలకు గిరాకీ పెరగడంతో.. 2025లో మన దేశం నుంచి 63,25,211 వాహనాలు ఎగుమతి అయ్యాయని వాహన తయారీదార్ల సంఘం సియామ్ తెలిపింది. 2024లో ఎగుమతి అయిన 50,98,474 వాహనాలతో పోలిస్తే ఇవి 24.1% అధికం. పశ్చిమాసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాల నుంచి మన వాహనాలకు గిరాకీ స్థిరంగా లభిస్తోందని వెల్లడించింది.



✦ మోటార్ సైకిల్ ఎగుమతులు 27% పెరిగి 43,01,927కు చేరాయి. స్కూటర్ల ఎగుమతులు 8% వృద్ధితో 6,20,241గా నమోదయ్యాయి. మొత్తం వాణిజ్య వాహనాల ఎగుమతులు 27% పెరిగి 91,759కి చేరాయి.

✦ ప్రయాణికుల వాహనాలు (పీవీ- కార్లు, ఎస్‌యూవీలు, ఎంపీవీ) 2024లో 7,43,979 ఎగుమతి కాగా, 2025లో 16% వృద్ధితో 8,63,233కు చేరాయి. మారుతీ సుజుకీ 2024లో 3.26 లక్షల వాహనాలు ఎగుమతి చేయగా.. 2025లో ఈ సంఖ్య 3.95 లక్షలకు చేరింది. మొత్తం ప్రయాణికుల వాహనాల ఎగుమతుల్లో 46% వాటా ఎంఎస్ఐ దే అని సంస్థ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రాహుల్ భారతి వివరించారు.

2025లో వాహన ఎగుమతుల వివరాలు

వాహనం	2025	2024	వృద్ధి(%)
పీవీలు	8,63,233	7,43,979	16
యుటిలిటీ	4,27,219	3,23,624	32
కార్లు	4,25,396	4,12,148	3
ద్విచక్ర	49,39,706	39,77,162	24
త్రిచక్ర	4,25,527	2,98,235	43

వెండిలో అప్రమత్తత

కమొడిటీస్ ఈ వారం

పసిడి



పసిడి ఫిబ్రవరి కాంట్రాక్టు ఈవారం రూ.1,44,204 కంటే పైకి వెళితేనే లాంగ్ పొజిషన్లు కొనసాగించాలి. దీన్ని అధిగమిస్తే రూ.1,45,892; రూ.1,48,194 వరకు పెరగొచ్చు. ఒకవేళ కిందకు వస్తే రూ.1,40,215 వద్ద మద్దతు లభించే అవకాశం ఉంటుంది. ఈ స్థాయినీ కోల్పోతే రూ.1,37,912; రూ.1,36,225 వరకు దిగివస్తుందని అనుకోవచ్చు.

వెండి



వెండి ధరలు ఇప్పటికే బాగా పెరిగిన సూచనలున్నా, ఇంకా కొనుగోళ్లు వస్తున్నాయి. సాంకేతికంగా మాత్రం దిద్దుబాటు సూచనలున్నాయి. మార్చి కాంట్రాక్టు ఈవారం రూ.3,12,726 కంటే పైకి వెళ్తేనే సానుకూలంగా ఉంటుంది. దావోస్‌లో పరపతి విధానంపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యాఖ్యలేమైనా చేస్తే, వెండి కాంట్రాక్టుపై ప్రభావం పడొచ్చని భావిస్తున్నారు.

ప్రాథమిక లోహాలు



● రాగి జనవరి కాంట్రాక్టు రూ.1,319.95 కంటే పైన చలిస్తే రూ.1,349.95; రూ.1,368.85 వరకు పెరిగే అవకాశం ఉంటుంది. రూ.1,271.05 కంటే కిందకు వస్తే, రూ.1,252.15; రూ.1,222.15 వరకు దిగిరావచ్చు.

● సీసం జనవరి కాంట్రాక్టును రూ.189.15 లక్ష్యంతో రూ.193.15 సమీపంలో షార్ట్ సెల్ చేయడం మంచి వ్యూహం అవుతుంది.

● జింక్ జనవరి కాంట్రాక్టుకు రూ.308.25 వద్ద మద్దతు లభించొచ్చు. ఇది కోల్పోతే రూ.303.75; రూ.298.15 వరకు దిగిరావచ్చు. ఒకవేళ రూ.318.35 కంటే ఎగువకు వెళితే రూ.323.95; రూ.328.45 వరకు రాణించొచ్చు..

● అల్యూమినియం జనవరి కాంట్రాక్టు రూ.312.80 కంటే కిందకు వస్తే రూ.308.95; రూ.304.70 వరకు దిగిరావచ్చు. ఒకవేళ రూ.320.90 ఎగువకు వెళ్తే రూ.325.15; రూ.329 వరకు పెరుగుతుందని అనుకోవచ్చు.

ఇంధన రంగం



● ముడి చమురు ఫిబ్రవరి కాంట్రాక్టు రూ.5,291 కంటే దిగువన ట్రేడయితే దిద్దుబాటుకు ఆస్కారం ఉంటుంది. ఒకవేళ రూ.5,614 కంటే పైకి వెళితే రూ.5,779; రూ.5,937 వరకు పెరగొచ్చు.

● సహజవాయువు జనవరి కాంట్రాక్టుకు రూ.307.45 వద్ద నిరోధం ఉంది. కిందకొస్తే రూ.263.55 వద్ద మద్దతు లభించొచ్చు. ఈ స్థాయినీ కోల్పోతే రూ.246.05; రూ.219.65 వరకు దిద్దుబాటు అయ్యే అవకాశం ఉంది.

వ్యవసాయ ఉత్పత్తులు



● పసుపు ఏప్రిల్ కాంట్రాక్టుకు రూ.18,023 వద్ద నిరోధం ఉంది. దీన్ని అధిగమిస్తే రూ.18,576; రూ.19,137 వరకు పెరిగే అవకాశం ఉంది. ఒకవేళ కిందకు వస్తే రూ.16,909 వద్ద మద్దతు ఉంది. ఇది కోల్పోతే రూ.15,795 వరకు దిద్దుబాటు కావచ్చు.

● జీలకర్ర మార్చి కాంట్రాక్టుకు రూ.23,966 వద్ద నిరోధం ఎదురుకావచ్చు. దీన్ని అధిగమిస్తే రూ.24,418; రూ.24,852 వరకు రాణించొచ్చు. ఒకవేళ కిందకు వస్తే రూ.23,081 వద్ద మద్దతు ఉంది.

– ఆర్ఎల్‌పీ కమొడిటీ అండ్ డెరివేటివ్స్

గతవారం కదలికలు ఇలా

కమొడిటీ	ప్రారంభం (రూ.లలో)	ముగింపు (రూ.లలో)	వృద్ధి/క్షీణత (శాతంలో)
పసిడి (ఫిబ్రవరి)	1,39,600	1,42,517	2.09
వెండి (మార్చి)	2,62,834	2,87,762	9.48
రాగి (జనవరి)	1,294.95	1,290.00	-0.38
సీసం (జనవరి)	192.95	191.40	-0.80
జింక్ (జనవరి)	311.45	312.80	0.43
అల్యూమినియం (జనవరి)	320.70	316.65	-1.26
ముడి చమురు (ఫిబ్రవరి)	5,376	5,499	1.36
సహజ వాయువు (జనవరి)	293.90	281.00	-4.39
పసుపు (ఏప్రిల్)	17,500	17,470	-0.17
జీలకర్ర (మార్చి)	23,140	23,515	1.62

సూచీల స్థిరీకరణకు అవకాశం!

స్టాక్ మార్కెట్ ఈ వారం

● బడ్జెట్‌పై మదుపర్లు దృష్టిపెట్టొచ్చు ● కార్పొరేట్ ఫలితాలూ కీలకమే
● ఐటీ, లోహ, సిమెంటు షేర్లు రాణించొచ్చు ● విశ్లేషకుల అంచనాలు



దేశీయ సూచీలు ఈ వారంలో స్థిరీకరించుకోవచ్చని, సెంటిమెంట్ బలహీనంగానే కొనసాగొచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. 2026-27 బడ్జెట్ ప్రతిపాదనలు ఫిబ్రవరి 1న వెలువడనుండటంతో, మదుపర్లు దానిపై దృష్టి పెట్టొచ్చు. భారత్-అమెరికా వాణిజ్య ఒప్పంద పరిణామాలు, కార్పొరేట్ సంస్థల మూడో త్రైమాసిక ఫలితాల నుంచి సంకేతాలు తీసుకోవచ్చు. గత వారం మార్కెట్లు ముగిశాక రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్ ఫలితాలు వెలువడ్డాయి. ఆయా షేర్లపై ఫలితాల ప్రభావం సోమవారం (నేడు) ఉండొచ్చు. ఈ వారం నిఫ్టీ-50 సూచీకి 25,835 పాయింట్ల వద్ద నిరోధం, 25550- 25600 శ్రేణిలో మద్దతు లభించొచ్చని సాంకేతిక నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ నెలలో ఇప్పటివరకు విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపర్లు (ఎఫ్‌పీఐ) రూ.22,530 కోట్ల పెట్టుబడులు ఉపసంహరించుకున్నారు. వివిధ రంగాలపై విశ్లేషకులు అంచనా ఇలా..

● నిఫ్టీ **బ్యాంక్** సూచీకి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్ ఫలితాలు దిశానిర్దేశం చేయనున్నాయి. ఈ సూచీ 59,500 పాయింట్ల ఎగువన ఉన్నంత వరకు, లాభాలు కొనసాగించొచ్చు. 60,800 పాయింట్ల వరకు వెళ్లే అవకాశం ఉంది.

● **ఐటీ** షేర్లకు సానుకూలతలు కొనసాగే అవకాశం ఉంది. ఫలితాల నేపథ్యంలో షేరు ఆధారిత కదలికలు చోటుచేసుకోవచ్చు. కంపెనీల యాజమాన్యాల వ్యాఖ్యలపై దృష్టి పెట్టొచ్చు. ఈ వారం ఎల్‌టీఐ మైండ్‌ట్రీ, పర్సిస్టెంట్, ఎంఫసిస్, సైయెంట్ ఫలితాలు వెలువడనున్నాయి.

● గిరాకీ పుంజుకునే సంకేతాలు కనిపిస్తుండటం, పలు బ్రోకరేజీలు సానుకూల అంచనాలు ఇవ్వడంతో **సిమెంటు** రంగ షేర్లు రాణించొచ్చు. పలు ప్రాంతాల్లో ధరలు మెరుగుపడటం కలిసిరావొచ్చు.

● **ఎఫ్ఎంసీజీ** కంపెనీల షేర్లు నష్టాలను కొనసాగించొచ్చు. ఐటీసీ షేరు బలహీనంగా కనిపిస్తోంది. నిఫ్టీ ఎఫ్ఎంసీజీ సూచీకి 50,600-51000 మధ్య మద్దతు, 53,200 స్థాయిలో నిరోధం ఎదురుకావొచ్చు. హెచ్‌యూఎల్ షేర్లకు మదుపర్లు మొగ్గుచూపొచ్చు.

● డిసెంబరు త్రైమాసిక ఫలితాల నేపథ్యంలో **యంత్రపరికరాల** రంగంలో షేరు ఆధారిత కదలికలు ఉంటాయి. భెల్ (సోమవారం), సుప్రీం ఇండస్ట్రీస్, కీ ఇండస్ట్రీస్ (బుధవారం) ఫలితాలు వెలువడనున్నాయి.

● **టెలికాం** కంపెనీల షేర్లు స్వల్పకాలంలో ఒక శ్రేణిలో కదలాడొచ్చు. ఈ కంపెనీల త్రైమాసిక ఫలితాలు కీలకం కానున్నాయి. వొడాఫోన్ ఐడియా బకాయిలకు సంబంధించిన వార్తలు, రిలయన్స్ జియో ఐపీఓ వార్తలను గమనించాలి.

● ఇరాన్ ఉద్రిక్తతల వల్ల భౌగోళిక అనిశ్చితులు పెరగడంతో, **చమురు-గ్యాస్** కంపెనీల షేర్లు పరిమిత శ్రేణిలో కదలాడొచ్చు. నిఫ్టీ ఆయిల్-గ్యాస్ సూచీకి 11,340- 11,400 వద్ద మద్దతు, 12,000- 12,100 వద్ద నిరోధం కనిపిస్తోంది.

● **వాహన** కంపెనీల షేర్లు డీలా పడొచ్చు. వరుసగా రెండో వారం నష్టపోయిన నిఫ్టీ వాహన సూచీ, స్వల్పకాలంలో అదే ధోరణిలో సాగొచ్చు.

● త్రైమాసిక ఫలితాల కారణంగా **ఔషధ** కంపెనీల షేర్లు ఒక శ్రేణికి లోబడి ట్రేడవవచ్చు. సరఫరా ఇబ్బందుల నేపథ్యంలో సిప్లా షేరు ఒడుదొడుకులు ఎదుర్కోవచ్చు. ఎంపిక చేసిన కొన్ని షేర్లు కాస్త పెరగొచ్చు. ఏడాదికి పైగా స్థిరీకరణలో ఉన్న నిఫ్టీ ఫార్మా సూచీ ఈ వారమూ అదే ధోరణిని కొనసాగించొచ్చు.

● **లోహ**, గనుల కంపెనీల షేర్లు ఈ వారం మెరిసే అవకాశం ఉంది. సరఫరా ఇబ్బందులు, అంతర్జాతీయ విధాన అనిశ్చితుల కారణంగా ప్రాథమిక లోహ ధరలు దూసుకెళ్తుండటమే ఇందుకు కారణం. నిఫ్టీ లోహ సూచీకి 11050- 11300 శ్రేణిలో మద్దతు, 12000 పాయింట్ల వద్ద నిరోధం ఎదురుకావొచ్చు.

బ్యాంకింగ్	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	931.10	945.50	912.00
ఐసీఐసీఐ బ్యాంక్	1410.80	1442.10	1384.50
ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్	83.79	84.80	82.50
ఇండస్‌ఇండ్ బ్యాంక్	953.85	972.90	928.60
కోటక్‌మహీంద్రా బ్యాంక్	418.20	431.50	410.50
పీఎన్‌బీ	132.36	135.40	127.10
ఎస్‌బీఐ	1042.30	1058.40	1020.30
ఐటీ	**ప్రస్తుత ధర**	**నిరోధం**	**మద్దతు**
హెచ్‌సీఎల్ టెక్	1698.00	1724.00	1651.80
ఇన్ఫోసిస్	1689.80	1719.70	1638.50
పర్సిస్టెంట్ సిస్టమ్స్	6403.00	6564.00	6229.00
టీసీఎస్	3206.70	3250.80	3149.00
టెక్ మహీంద్రా	1670.50	1731.10	1569.70
విప్రో	267.45	273.60	260.00
సిమెంటు	**ప్రస్తుత ధర**	**నిరోధం**	**మద్దతు**
ఏసీసీ	1755.60	1794.10	1693.30
అంబుజా సిమెంట్స్	553.75	565.40	539.90
ఇండియా సిమెంట్స్	478.55	489.50	463.30
శ్రీ సిమెంట్	27840.00	28233.30	27173.30
అల్ట్రాటెక్ సిమెంట్	12378.00	12799.30	11589.30
ఎఫ్ఎంసీజీ	**ప్రస్తుత ధర**	**నిరోధం**	**మద్దతు**
బ్రిటానియా ఇండస్ట్రీస్	5898.50	5983.50	5819.50
కోల్గేట్ పామోలివ్	2104.80	2122.50	2079.70
డాబర్ ఇండియా	514.55	523.90	507.30
ఇమామీ	505.50	510.70	499.80
హిందుస్థాన్ యునిలీవర్	2360.40	2384.70	2336.70
ఐటీసీ	329.20	340.70	322.80
మారికో	760.15	772.60	743.60
యంత్రపరికరాలు	**ప్రస్తుత ధర**	**నిరోధం**	**మద్దతు**
భెల్	265.40	271.80	260.70
సీజీ పవర్	561.70	588.90	546.60
ఎల్ అండ్ టీ	3856.40	3938.30	3807.70
సీమెన్స్	2919.20	3004.10	2860.50
థెర్మాక్స్	2970.30	3010.10	2900.10
టెలికాం	**ప్రస్తుత ధర**	**నిరోధం**	**మద్దతు**
భారతీ ఎయిర్‌టెల్	2016.40	2052.60	1970.60
ఎమ్‌టీఎన్‌ఎల్	33.63	34.10	33.30
టాటా కమ్యూనికేషన్స్	1754.60	1787.50	1725.70
వొడాఫోన్ ఐడియా	10.82	11.20	10.60

చమురు	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
రిలయన్స్ ఇండస్ట్రీస్	1457.90	1489.20	1439.40
బీపీసీఎల్	363.20	372.70	353.20
హెచ్‌పీసీఎల్	457.90	467.60	440.10
ఐఓసీఎల్	161.32	163.40	158.80
ఓఎన్‌జీసీ	247.17	251.20	240.40
ఆయిల్ ఇండియా	448.65	459.00	436.50
వాహన	**ప్రస్తుత ధర**	**నిరోధం**	**మద్దతు**
అశోక్ లేలాండ్	184.25	187.80	182.00
బజాజ్ ఆటో	9489.00	9725.30	9271.30
ఐషర్ మోటార్స్	7315.00	7462.00	7225.00
హీరో మోటోకార్ప్	5651.50	5781.50	5552.50
ఎం అండ్ ఎం	3658.20	3759.20	3599.60
మారుతీ	15859.00	16369.00	15515.00
టీవీఎస్ మోటార్	3667.80	3755.90	3596.70
ఔషధ	**ప్రస్తుత ధర**	**నిరోధం**	**మద్దతు**
అరబిందో ఫార్మా	1172.70	1207.40	1149.00
బయోకాన్	377.65	389.90	368.40
సిప్లా	1397.50	1433.70	1349.10
డాక్టర్ రెడ్డీస్	1175.50	1206.80	1155.80
గ్లెన్‌మార్క్ ఫార్మా	2000.70	2044.20	1968.20
నాట్కో ఫార్మా	859.40	908.30	828.50
లోహ	**ప్రస్తుత ధర**	**నిరోధం**	**మద్దతు**
హిందాల్కో	934.65	980.20	907.20
హిందుస్థాన్ జింక్	637.75	662.20	621.90
ఎన్ఎండీసీ	82.74	84.80	81.30
సెయిల్	149.37	154.90	145.80
టాటా స్టీల్	188.21	192.50	185.20
వేదాంతా	682.70	699.30	656.00

ఈనాడు సినిమా

కీర్తికి మరో అవకాశం

హిందీలో మరో అవకాశం కీర్తి సురేశ్‌ సొంతమైంది. ఈసారి ఆమె బాలీవుడ్‌ యాక్షన్‌ హీరో టైగర్‌ ష్రాఫ్‌తో కలిసి నటించనుంది. 2024లో 'బేబీ జాన్‌' సినిమాతో ఆమె హిందీ తెరకు పరిచయమైంది. అయితే ఆ చిత్రం ఆశించిన స్థాయిలో ఆదరణ పొందలేదు. అయితేనేం, మరో కీలకమైన అవకాశం ఆమె తలుపు తట్టింది. టైగర్‌ ష్రాఫ్‌, విద్యుత్‌ జమ్వాల్‌ కలిసి ఓ యాక్షన్‌ ప్రేమకథలో నటించనున్నారు. ఇందులోనే కీర్తి కథానాయికగా ఎంపికైంది. మొదట కృతిశెట్టి పేరు కూడా వినిపించింది. కానీ చివరకు కీర్తిసురేశ్‌ పేరుని చిత్రబృందం ఖరారు చేసినట్టు సమాచారం. ప్రస్తుతం తెలుగులో విజయ్‌ దేవరకొండతో కలిసి 'రౌడీ జనార్దన' చిత్రంలో నటిస్తోంది కీర్తి. మలయాళంలోనూ ఓ చిత్రం చేస్తోంది. 2024లో ఆంటోనీ తటిల్‌ని పెళ్లి చేసుకున్న ఆమె కెరీర్‌ పరంగా కాస్త వేగం తగ్గించినట్టు కనిపించినా, ఇప్పుడు మళ్లీ వరుస ప్రాజెక్టులతో బిజీ అయిపోయింది.


కీర్తి సురేశ్‌

'కల్కి 2' సన్నాహాలు


ప్రభాస్‌

కథానాయకుడు ప్రభాస్‌ ప్రస్తుతం 'ది రాజాసాబ్‌'తో థియేటర్లలో సందడి చేస్తున్నారు. దీని తర్వాత ఆయన నుంచి 'ఫౌజీ', 'స్పిరిట్‌' సినిమాలు తెరపైకి రానున్నాయి. ఈ రెండూ ఇప్పుడు చిత్రీకరణ దశలో ఉన్న సంగతి తెలిసిందే. త్వరలో ఈ జాబితాలోకి 'కల్కి 2' చేరనుంది. విజయవంతమైన 'కల్కి 2898ఏడీ'కి కొనసాగింపుగా నాగ్‌ అశ్విన్‌ తెరకెక్కించనున్న చిత్రమిది. వైజయంతీ మూవీస్‌ సంస్థ నిర్మిస్తోంది. అమితాబ్‌ బచ్చన్‌, కమల్‌హాసన్‌ తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఈ సీక్వెల్‌ ఫిబ్రవరి నుంచి చిత్రీకరణ ప్రారంభించుకోనున్నట్లు సమాచారం. ప్రభాస్‌ మార్చి తర్వాత సెట్‌లోకి అడుగు పెట్టనున్నట్లు తెలిసింది. దీనికి తగ్గట్లుగా ఇప్పటికే పూర్వ నిర్మాణ పనుల్ని వేగవంతం చేసినట్లు తెలుస్తోంది. మహాభారత నేపథ్యంతో ముడిపడిన సైన్స్‌ ఫిక్షన్‌ యాక్షన్‌ డ్రామా ఇది. ప్రభాస్‌ దీంట్లో భైరవగా, కర్ణగా రెండు పాత్రల్లో అలరించనున్నారు.

ఈసారి జపనీస్‌ నేర్చుకొని వస్తా!



గతేడాది 'ది గర్ల్‌ఫ్రెండ్‌', 'కుబేర' లాంటి వరుస సినిమాలతో తెరపై సందడి చేసింది కథానాయిక రష్మిక. ప్రస్తుతం 'మైసా'తో అలరించడానికి ముస్తాబవుతోందీ తార. ఆమె.. అల్లుఅర్జున్‌ జంటగా నటించిన 'పుష్ప 2: ది రూల్‌' ఇటీవలే జపాన్‌లో 'పుష్ప కునిన్‌' పేరుతో విడుదలైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ప్రచార కార్యక్రమాల్లో భాగంగా జపాన్‌ వెళ్లిన రష్మికకు అక్కడి ప్రేక్షకులు తమ అభిమానాన్ని చాటుకుంటూ పలు బహుమతులు, లేఖలు అందించారు. తాజాగా ఈ విషయాన్ని తెలుపుతూ.. ఇన్‌స్టా వేదికగా ఓ పోస్ట్‌ను పెట్టిందామె. "జపాన్‌లో ఒకరోజు ఉన్నా. ఆ ఒక్కరోజులోనే నాకు అంతులేని ప్రేమ లభించింది. ఎన్నో లేఖలు, బహుమతులు. వాటన్నింటినీ చదివాను. బహుమతులన్నీ ఇంటికి తెచ్చుకున్నాను. ఇవన్నీ చూస్తుంటే ఎంత భావోద్వేగానికి గురయ్యానో మాటల్లో చెప్పలేను. మీ ప్రేమకు ధన్యవాదాలు. నేను మళ్లీ వస్తాను. ఈసారి ఎక్కువ రోజులు ఉండేలా ప్లాన్‌ చేసుకుంటా. మళ్లీ వచ్చినప్పుడు కచ్చితంగా జపనీస్‌ నేర్చుకొని వస్తా" అని ఆ పోస్ట్‌లో పేర్కొంది రష్మిక.


జపాన్‌ అభిమానులు ఇచ్చిన లేఖలు చూస్తున్న రష్మిక

వరుస మారి... విజయ తీరం చేరి


చిరంజీవి

"కుడి ఎడమైతే పొరపాటు లేదోయ్‌.. ఓడిపోలేదోయ్‌" అంటాడు దేవదాస్‌. కొన్నిసార్లు సినీతారల సినిమాలు కూడా ఇలా కుడిఎడమవుతుంటాయి. ఎప్పుడో గుమ్మడికాయ కొట్టేసుకున్న సినిమా తెరపైకి వచ్చేలోపు.. దానికన్నా వెనక శ్రీకారం చుట్టుకున్న చిత్రం బాక్సాఫీస్‌ బరిలో నిలిచి హిట్టు కొట్టడం అప్పుడప్పుడూ జరుగుతుంటుంది. ఇప్పుడలాంటి మ్యాజిక్‌ అనుభవమే తెలుగులో పలువురు కథానాయకులకు ఎదురైంది.

ఈ సంక్రాంతి బరిలో 'మన శంకర వరప్రసాద్‌ గారు'గా వినోదాలు పంచుతున్నారు కథానాయకుడు చిరంజీవి. 'సంక్రాంతికి వస్తున్నాం' విజయం తర్వాత అనిల్‌ రావిపూడి తెరకెక్కించిన చిత్రమిది. ఆరు రోజుల్లోనే రూ.261కోట్ల గ్రాస్‌ రాబట్టి ఇప్పుడు రూ.300కోట్ల క్లబ్‌కు చేరువైంది. చిరు కెరీర్‌లోనే బిగ్గెస్ట్‌ బ్లాక్‌బస్టర్‌గా నిలవబోతోంది. అయితే నిజానికిది చిరు లైనప్‌ ప్రకారం 'విశ్వంభర' తర్వాత రావాల్సిన సినిమా. దానికి గుమ్మడికాయ కొట్టే నాటికి ఈ చిత్రమే పట్టాలెక్కలేదు. కానీ, గ్రాఫిక్స్‌ పనులు ఆలస్యమవడంతో గతేడాది తెరపైకి రావాల్సిన 'విశ్వంభర' ఈ వేసవికి వాయిదా పడింది. దీంతో ఈ గ్యాప్‌లోనే అనిల్‌ జెట్‌ స్పీడ్‌తో 'మన శంకర వరప్రసాద్‌..'ని సిద్ధం చేసేయడం.. ముగ్గుల పండగ బరిలో దూకి హిట్టు మాట వినిపించేయడం చకచకా జరిగిపోయాయి. ఇప్పుడీ విజయంతో చిరు - వశిష్ఠల చిత్రంపై ప్రేక్షకుల్లో అంచనాలు రెట్టింపయ్యాయి. దీంతో దాని మార్కెట్‌ లెక్కలు పూర్తిగా మారనున్నట్లు అర్థమవుతోంది. ప్రస్తుతం నిర్మాణానంతర పనుల్లో ఈ సినిమా త్వరలోనే విడుదల తేదీ ప్రకటించుకొని ప్రచారాన్ని పదునెక్కించనుంది.


శర్వానంద్‌

విజయ్‌ దేవరకొండ

సాయి శ్రీనివాస్‌


❑ ఈ పండక్కి చిరుతో పాటు బాక్సాఫీస్‌ బరిలో నిలిచి ఓ చక్కటి విజయాన్ని ఖాతాలో వేసుకున్న మరో హీరో శర్వానంద్‌. ప్రస్తుతం ఆయన నటించిన 'నారీ నారీ నడుమ మురారి' థియేటర్లలో ప్రేక్షకుల్ని కడుపుబ్బా నవ్విస్తోంది. వాస్తవానికి ఇది శర్వా మరో సినిమా 'బైకర్‌' తర్వాత తెరపైకి రావాల్సి ఉంది. దాన్ని తొలుత డిసెంబరు 6న విడుదల చేయనున్నట్లు ప్రకటించినప్పటికీ కొన్ని కారణాల వల్ల వాయిదా వేశారు. దీంతో అది జనవరి బరిలో నిలవనున్నట్లు ప్రచారం సాగినప్పటికీ.. శర్వా పండక్కి తగ్గట్లుగా 'నారీ నారీ..'ని బరిలో దింపేందుకు మొగ్గు చూపడంతో వెనక రావాల్సిన సినిమా ముందుగా ప్రేక్షకుల్ని పలకరించింది. ఇప్పుడా వ్యూహానికి మంచి ఫలితం దక్కడంతో 'బైకర్‌'పైనా ఒక్కసారిగా అంచనాలు రెట్టింపయ్యాయి. ప్రస్తుతం నిర్మాణానంతర పనుల్లో ఉన్న ఈ రేసింగ్‌ నేపథ్య చిత్రం ఈ వేసవిలోనే థియేటర్లలోకి రానుంది. త్వరలోనే దీని విడుదల తేదీపై స్పష్టత రానుంది.

❑ బెల్లంకొండ సాయి శ్రీనివాస్‌ గతేడాది 'కిష్కింధపురి'తో చక్కటి విజయాన్ని ఖాతాలో వేసుకున్న సంగతి తెలిసిందే. గత సెప్టెంబరులో ప్రేక్షకుల్ని పలకరించిన ఈ హారర్‌ థ్రిల్లర్‌ బాక్సాఫీస్‌ బరిలో మంచి వసూళ్లనే దక్కించుకుంది. అయితే నిజానికి సాయి శ్రీనివాస్‌ లైనప్‌ ప్రకారం దీని కన్నా ముందు విడుదలకు సిద్ధమైన చిత్రం మరొకటుంది. అదే 'టైసన్‌ నాయుడు'. గతేడాది వేసవిలోనే తెరపైకి రావాల్సిన ఈ సినిమా రకరకాల కారణాల వల్ల వాయిదా పడుతూ వచ్చింది. ఈలోగానే శ్రీనివాస్‌ నుంచి 'భైరవం'తో పాటు 'కిష్కింధపురి' బయటకు రావడం.. అది విజయాన్ని అందుకోవడం జరిగాయి. ఇప్పుడీ ఆలస్యం ఒకరకంగా 'టైసన్‌ నాయుడు'కి కూడా కలిసొచ్చినట్లయింది. ప్రస్తుతం తుది మెరుగులు దిద్దుకుంటున్న ఈ సినిమా ఈ వేసవికే థియేటర్లలో సందడి చేయనుంది.

విజయ్‌ లెక్క మారనుంది!

కథానాయకుడు విజయ్‌ దేవరకొండ తన 14వ చిత్రాన్ని రాహుల్‌ సంకృత్యాన్‌ దర్శకత్వంలో.. 15వ సినిమాని దర్శకుడు రవికిరణ్‌ కోలాతో చేస్తున్న సంగతి తెలిసిందే. ఆ రెండూ ప్రస్తుతం సమాంతరంగా చిత్రీకరణ చేసుకుంటున్నాయి. కానీ, వీటిలో తొలుత తెరపైకి వచ్చేది రవికిరణ్‌ తెరకెక్కిస్తున్న 'రౌడీ జనార్దన' అనే తెలుస్తోంది. రాహుల్‌ సినిమా స్కేల్‌ పరంగా.. సెటప్‌ పరంగా భారీ హంగులతో కూడిన సినిమా కావడం.. చిత్రీకరణకు కాస్త ఎక్కువ సమయం కావాల్సి ఉండటం వల్ల విజయ్‌ తొలుత రవికిరణ్‌ చిత్రాన్ని పూర్తి చేయడంపై దృష్టి సారించినట్లు తెలిసింది. ఈ రూరల్‌ యాక్షన్‌ డ్రామా ఈ ఏడాది డిసెంబరులో తెరపైకి రానున్నట్లు ఇప్పటికే అధికారికంగా ప్రకటించారు.

కింగ్‌ రాక ఆ రోజేనా?


షారుక్‌ ఖాన్‌

'కింగ్‌' సినిమాతో మరోసారి తనలోని యాక్షన్‌ కోణాన్ని తెరపై ఆవిష్కరించడానికి సన్నద్ధమవుతున్నారు బాలీవుడ్‌ అగ్రహీరో షారుక్‌ ఖాన్‌. ఆయన ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ చిత్రాన్ని సిద్ధార్థ్‌ ఆనంద్‌ తెరకెక్కిస్తున్నారు. దీపికా పదుకొణె కథానాయిక. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ శరవేగంగా జరుగుతోన్న సంగతి తెలిసిందే. తాజాగా దీన్ని ఈ ఏడాది క్రిస్మస్‌కి విడుదల చేయాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. "'పఠాన్‌' తర్వాత షారుక్‌, సిద్ధార్థ్‌ కలయికలో రాబోతున్న సినిమా ఇది. అందుకే ఈ చిత్ర విడుదల కోసం పలు తేదీలను పరిశీలించిన తర్వాత డిసెంబరులో థియేటర్లలోకి తీసుకురావాలని ప్రణాళికలు సిద్ధం చేశారు. త్వరలో దీనిపై అధికారిక ప్రకటన వెలువడనుంద"ని షారుక్‌ సన్నిహిత వర్గాలు తెలిపాయి. ఈ యాక్షన్‌ థ్రిల్లర్‌లో సుహానా ఖాన్‌ కూడా భాగమైనట్లు సమాచారం.

బాధించడం నా ఉద్దేశం కాదు

- ఏఆర్‌ రెహమాన్‌



"సంగీతం ద్వారా ఉత్తేజపరచడం, గౌరవించడం, సేవ చేయడమే నా లక్ష్యం. ఎవరికీ ఎప్పుడూ బాధ కలిగించాలని కోరుకోలేద"ని అంటున్నారు ప్రముఖ సంగీత దర్శకుడు ఏఆర్‌ రెహమాన్‌. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఆయన బాలీవుడ్‌పై చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపిన విషయం తెలిసిందే. దీనిపై పలువురు సినీ తారలు తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తూ .. వ్యతిరేకించారు. తాజాగా తన మాటల వెనుక ఉన్న ఉద్దేశాన్ని తెలియజేస్తూ.. ఇన్‌స్టాలో ఓ వీడియోను పోస్ట్‌ చేశారు రెహమాన్‌. ఇందులో.. "భారత్‌ నాకు స్ఫూర్తి. ఈ దేశం నా గురువు, ఇల్లు. భారతీయుడిగా ఉండడం అదృష్టంగా భావిస్తున్నాను. నా భావాలను స్వేచ్ఛగా పంచుకుని, భిన్న స్వరాలతో పనిచేసే అవకాశాన్ని ఈ దేశం కల్పించింది. కొన్నిసార్లు ఒకరి ఉద్దేశాలను ఇతరులు తప్పుగా అర్థం చేసుకునే అవకాశం ఉందని తెలుసుకున్నాను. నా నిజాయతీని అర్థం చేసుకుంటారని ఆశిస్తున్నాను. వేవ్స్‌ సమ్మిట్‌లో ప్రధాని మోదీ ఎదుట ప్రదర్శించిన 'ఝాలా' సంగీతం నుంచి.. యువ నాగా సంగీతకారులతో కలిసి పనిచేయడం వరకు, దేశంలో మొట్టమొదటి మల్టీ కల్చరల్‌ వర్చువల్‌ బ్యాండ్‌ను సృష్టించడం నుంచి హాన్స్‌ జిమ్మర్‌తో కలిసి రామాయణం సినిమాకు సంగీతం అందించడం వరకు.. ప్రతి ప్రయాణం నా లక్ష్యాన్ని బలపరిచింద"ని రెహమాన్‌ వీడియోలో పేర్కొన్నారు. ఇటీవల ఓ మీడియా సంస్థకు ఆయన ఇంటర్వ్యూ ఇచ్చారు. అందులో 'బాలీవుడ్‌లో తమిళ లేదా మహారాష్ట్రేతరులపై పక్షపాతం ఉంటుందా?' అనే ప్రశ్నకు.. వ్యక్తిగతంగా తానెప్పుడూ ఎలాంటి వివక్షను ఎదుర్కోలేదని తెలిపారు. "ఎనిమిదేళ్లుగా ఇండస్ట్రీలో 'పవర్‌ షిఫ్ట్‌' నెలకొంది. సృజనాత్మకత లేని వారే కీలకంగా వ్యవహరిస్తున్నారు. దీనికి మతపరమైన అంశం ఓ కారణమై ఉండొచ్చు. అది నాకు నేరుగా ఎదురుకాలేదు. కానీ, గుసగుసలు వినిపించాయి. నేను పని కోసం వెతకను. చిత్తశుద్ధి ఉంటే పనే మన వద్దకు వస్తుందని విశ్వసిస్తా" అని రెహమాన్‌ అన్నారు.

త్వరలో లక్ష్య యాక్షన్‌ షురూ

'కిల్‌', 'బ్యాడ్స్‌ ఆఫ్‌ బాలీవుడ్‌' లాంటి వైవిధ్యమైన కథలతో అలరించే ప్రయత్నం చేస్తున్నారు హిందీ యువ కథానాయకుడు లక్ష్య. ప్రస్తుతం అనన్యతో కలిసి 'చాంద్‌ మేరా దిల్‌'తో బిజీగా గడుపుతున్న ఈయన ఖాతాలో 'దోస్తానా 2' కూడా ఉన్నట్లు వార్తలు వస్తోన్న సంగతి తెలిసిందే. ప్రేమ, యాక్షన్‌, కామెడీ లాంటి అంశాలతో తీర్చిదిద్దుతున్న చిత్రంలో విక్రాంత్‌ మాస్సే కూడా కీలక పాత్రలో నటిస్తున్నారు. జాన్వీ కపూర్‌ కథానాయిక. తాజాగా ఈ సినిమా చిత్రీకరణను ఫిబ్రవరిలో మొదలెట్టనున్నట్లు సమాచారం. షూటింగ్‌కు సంబంధించిన వివరాలు గోప్యంగా ఉన్నప్పటికీ.. ఇందులో విక్రాంత్‌, లక్ష్యల కాంబినేషన్‌ తెరపై ఆకట్టుకునేలా కనిపించనుందని చిత్ర సన్నిహిత వర్గాలు తెలిపాయి. 2008లో విడుదలై బాలీవుడ్‌ ప్రేక్షకుల్ని విశేషంగా ఆకట్టుకున్న 'దోస్తానా' సినిమాకు సీక్వెల్‌గా వస్తోన్న ఈ చిత్రాన్ని కరణ్‌ జోహార్‌ నిర్మిస్తున్నారు.


లక్ష్య

పట్టాలెక్కబోతున్న మమిత లవ్‌స్టోరీ


మమితా బైజు

దేవదాస్‌ సార్‌ అంటూ.. ఇటీవలే 'డ్యూడ్‌' చిత్రంలో కనిపించి థియేటర్లో ప్రేక్షకుల్ని అలరించింది మలయాళ నటి మమితా బైజు. అగ్ర తారలతో పాటు యువ కథానాయకుల చిత్రాలలోనూ నటిస్తూ.. చకాచకా ప్రాజెక్టులను పట్టాలెక్కించేస్తోందీ భామ. తాజాగా మమిత మరో సినిమా చిత్రీకరణకు సన్నద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. గతేడాది మమిత, సంగీత్‌ ప్రతాప్‌ ప్రధాన పాత్రల్లో పేరు ఖరారు చేయని ఓ చిత్రాన్ని ప్రకటించారు. తాజాగా ఈ సినిమా చిత్రీకరణను ఏప్రిల్‌ నుంచి ప్రారంభించనున్నట్లు సన్నిహిత వర్గాల సమాచారం. ప్రేమకథా నేపథ్యంలోనే తెరకెక్కుతోన్న ఈ సినిమా ఆషిక్‌ ఉస్మాన్‌ సమర్పణలో రూపొందుతోంది. మమిత ప్రస్తుతం నివిన్‌ పౌలీ సరసన 'బెత్లెహెం కుడుంబ యూనిట్‌' అనే చిత్రాన్ని చేస్తోంది. ఈ సినిమాకి 'ప్రేమలు' ఫేమ్‌ గిరీశ్‌ ఏ.డి దర్శకత్వం వహిస్తున్నారు. తమిళ నటుడు విజయ్‌ 'జన నాయకుడు' చిత్రంలోనూ మమిత నటించింది. ఇంకా ఆమె ఖాతాలో నటుడు సూర్యతో కలిసి ఓ చిత్రంతో పాటు పలు తమిళ చిత్రాలు ఉన్నాయి.

నీ కోసం ఈ రోమియో వస్తాడు!


షాహిద్‌ కపూర్‌, త్రిప్తి దిమ్రీ

'ఓ రోమియో' అంటూ మరికొద్ది రోజుల్లో ప్రేక్షకుల్ని పలకరించడానికి సిద్ధమవుతోంది బాలీవుడ్‌ కథానాయిక త్రిప్తి దిమ్రీ. ఆమె, కథానాయకుడు షాహిద్‌ కపూర్‌ జంటగా నటిస్తున్న చిత్రమిది. విశాల్‌ భరద్వాజ్‌ దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ సినిమా నుంచి 'హమ్‌ తో తేరే హాయ్‌ లియే..' అనే మొదటి గీతాన్ని విడుదల చేసింది చిత్రబృందం. 'నీ కోసం ఈ రోమియో వస్తాడు' అంటూ భావోద్వేగంగా సాగుతున్న ఈ గీతంలో త్రిప్తి, షాహిద్‌ల జోడీ సినీప్రియుల దృష్టిని ఆకర్షిస్తుంది. ఈ రొమాంటిక్‌ డ్రామాను సాజిద్‌ నడియాడ్‌వాలా నిర్మిస్తున్నారు. ప్రేమికుల రోజు సందర్భంగా ఫిబ్రవరి 13న థియేటర్లలోకి రానుంది చిత్రం.

మహిళలకు బలాన్నిచ్చే చిత్రం


రాణీ ముఖర్జీ

'మర్దానీ 3'లో పోలీసు అధికారిణిగా తుపాకి చేతపట్టి.. నిందితుల్ని పరుగులు పెట్టించడానికి సన్నద్ధమవుతోంది బాలీవుడ్‌ సీనియర్‌ కథానాయిక రాణీ ముఖర్జీ. హిందీ ప్రేక్షకుల్ని విశేషంగా ఆకట్టుకున్న 'మర్దానీ' ఫ్రాంఛైజీలో రాబోతున్న మూడో భాగమిది. అభిరాజ్‌ మినావాలా దర్శకత్వం వహించారు. ఇటీవలే విడుదలైన ట్రైలర్‌ సినిమాపై అంచనాల్ని పెంచింది. మహిళలు, పిల్లలపై జరిగే నేరాల కథాంశంతో దీన్ని తీర్చిదిద్దారు. ఈ నెల 30న రాబోతుందీ సినిమా. ఈ నేపథ్యంలోనే ఇటీవలే ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న రాణి ఈ సినిమా గురించి కొన్ని ఆసక్తికర విషయాల్ని పంచుకుంది. "మర్దానీ 3' కేవలం ఒక సినిమా మాత్రమే కాదు. దీన్ని చూసినప్పుడు ప్రేక్షకుల్లో అవగాహన పెరుగుతుంది. ప్రతి మహిళకు ఆశ, బలాన్నిచ్చే కథ. అందుకే ఈ చిత్రానికి నేను ఎక్కువ ప్రాధాన్యత ఇస్తా. ప్రతి స్త్రీ ఈ సినిమా చూసి ప్రేరణ పొందాలని కోరుకుంటున్నా" అని చెప్పుకొచ్చింది. యశ్‌రాజ్‌ ఫిల్మ్స్‌ ఈ చిత్రాన్ని నిర్మించింది.

మరింత వైవిధ్యం కాబిల్‌ 2


యామి గౌతమ్‌, హృతిక్‌ రోషన్‌

దృష్టి లోపమున్న ఇద్దరు ప్రేమికుల మధ్య కొనసాగిన లవ్‌స్టోరీ ఆధారంగా రూపొందిన చిత్రం 'కాబిల్‌'. బాలీవుడ్‌ హీరో హృతిక్‌ రోషన్‌, యామీ గౌతమ్‌ జంటగా నటించారు. సంజయ్‌ గుప్తా తెరకెక్కించిన ఈ రొమాంటిక్‌ యాక్షన్‌ థ్రిల్లర్‌ 2017లో విడుదలై ప్రేక్షకుల్ని విశేషంగా ఆకట్టుకుంది. ఇందులో అంధుడి పాత్రలో కనిపించి తనదైన నటనతో కట్టిపడేశారు హృతిక్‌. ఇప్పుడీ సినిమాకి సీక్వెల్‌ రాబోతున్నట్లు ప్రకటించారు దర్శకుడు సంజయ్‌ గుప్తా. ఇటీవలే ఆయన సామాజిక మాధ్యమాల వేదికగా 'కాబిల్‌ 2' ఎప్పుడు వస్తుందంటూ ఓ అభిమాని అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ.. "సీక్వెల్‌ సిద్ధంగా ఉంది. ఇప్పుడు రాబోయే చిత్రం మునుపటి కన్నా మరింత వైవిధ్యంగా ఉంటుంద"ని వెల్లడించారు. దీంతో ప్రేక్షకుల్లో 'కాబిల్‌ 2'పై అంచనాలు మొదలయ్యాయి. ప్రస్తుతం హృతిక్‌ 'క్రిష్‌ 4' సినిమాతో బిజీగా ఉన్నారు.

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ఆఫీస్ అటెండెంట్ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.

- ఆఫీస్ అటెండెంట్: 572 పోస్టులు

అర్హత: పదో తరగతి. **వయసు:** జనవరి 1, 2026 నాటికి 18 నుంచి 25 ఏళ్లు ఉండాలి. ఎస్సీ, ఎస్టీకి ఐదేళ్లు, ఓబీసీకి మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది. **వేతనం:** నెలకు రూ.46,029

దరఖాస్తు ఫీజు: జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్‌లకు రూ.450, ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూబీడీ, ఈఎస్‌ఎంలకు రూ.50.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 04.02.2026

ఎంపిక: రాత పరీక్షతో

వెబ్‌సైట్: https://opportunities.rbi.org.in

జిప్‌మర్‌లో సీనియర్ రెసిడెంట్లు

జవహర్‌లాల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పోస్టు గ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్ (జిప్‌మర్), పుదుచ్చేరి ఒప్పంద ప్రాతిపదికన సీనియర్ రెసిడెంట్ (నాన్-అకడమిక్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- సీనియర్ రెసిడెంట్ (నాన్-అకడమిక్) - 110 పోస్టులు

అర్హత: సంబంధిత విభాగంలో ఎండీ/ ఎంఎస్/ డీఎన్‌బీ ఉండాలి.

విభాగాలు: అనస్థీషియాలజీ, క్రిటికల్ కేర్, జనరల్ సర్జరీ, జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్స్, పీడియాట్రిక్స్, రేడియో-డయాగ్నోసిస్, అనాటమీ, బయోకెమిస్ట్రీ, ఈఎన్‌టీ, డెంటిస్ట్రీ. **వయసు:** 45 ఏళ్లు మించకూడదు. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.

వేతన శ్రేణి: నెలకు రూ.67,700 - 1,30,000.

ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూలతో.

దరఖాస్తు ఫీజు: జనరల్‌కు రూ.500. ఎస్సీ, ఎస్టీలకు రూ.250. దివ్యాంగులకు ఫీజు లేదు. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 03.02.2026

వెబ్‌సైట్: https://jipmer.edu.in

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రలో

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర.. అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- అప్రెంటిస్ - 600 పోస్టులు

అర్హత: డిగ్రీ, స్థానిక భాషలో ప్రావీణ్యం కావాలి.

వయసు: 20-28 ఏళ్ల మధ్య ఉండాలి.

వేతనం: నెలకు రూ.12,300. **ఎంపిక:** విద్యార్హతల మెరిట్‌తో

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 25.01.2026.

దరఖాస్తు ఫీజు: ఎస్సీ, ఎస్టీలకు రూ.100. దివ్యాంగులకు ఉండదు. మిగిలిన వారికి రూ.150. జీఎస్‌టీ అదనం.

వెబ్‌సైట్: https://bankofmaharashtra.bank.in

రిసెర్చ్ సైంటిస్టులు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ), దిల్లీ ఒప్పంద ప్రాతిపదికన ప్రాజెక్ట్ రిసెర్చ్ సైంటిస్ట్, ప్రాజెక్ట్ టెక్నికల్ సపోర్ట్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- ప్రాజెక్ట్ రిసెర్చ్ సైంటిస్ట్-II: 09 ◗ ప్రాజెక్ట్ రిసెర్చ్ సైంటిస్ట్-III: 02
- ప్రాజెక్ట్ టెక్నికల్ సపోర్ట్-III: 06

అర్హత: సంబంధిత విభాగంలో కనీసం 75 శాతం మార్కులతో ఎమ్మెస్సీ/ ఎంటెక్/ ఎంబీఏ (పర్యావరణ/ వాతావరణ శాస్త్రాలు, ఫిజిక్స్, మ్యాథమెటిక్స్, స్టాటిస్టిక్స్, పబ్లిక్ హెల్త్ లేదా ఇంజినీరింగ్)తో పాటు ఉద్యోగానుభవం ఉండాలి. **వేతనం:** నెలకు ప్రాజెక్ట్ రిసెర్చ్ సైంటిస్ట్-IIకు రూ.67,000. ప్రాజెక్ట్ రిసెర్చ్ సైంటిస్ట్-IIIకు రూ.78,000. ప్రాజెక్ట్ టెక్నికల్ సపోర్ట్-IIIకు రూ.28,000. **దరఖాస్తు:** ఈమెయిల్ ద్వారా.. agnik@cas.iitd.ac.inకు పంపాలి. **దరఖాస్తుకు చివరి తేదీ:** జనవరి 30 **ఎంపిక:** ఇంటర్వ్యూతో

వెబ్‌సైట్: https://ird.iitd.ac.in

కోర్సు పూర్తయితే కొలువు!

కోర్సు పూర్తయిన వెంటనే కొలువులు అందించే చదువులు కొన్నే ఉంటాయి. అలాంటి వాటిలో చెప్పుకోదగ్గవి ప్లాస్టిక్ డిప్లొమాలు. తక్కువ వయసులోనే సత్వర ఉపాధి పొందాలనుకునేవారికి ఇవి హామీగా నిలుస్తాయి. కేంద్ర రసాయనాలు, ఎరువుల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నెలకొల్పిన సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్స్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (సిపెట్) వీటిని అందిస్తోంది. ఈ సంస్థ హైదరాబాద్, విజయవాడ సహా దేశవ్యాప్తంగా 29 కేంద్రాల్లో డిప్లొమా, పీజీ డిప్లొమా, పోస్టు డిప్లొమా కోర్సులు నడుపుతోంది. వీటిలో ప్రవేశాలకు ఇటీవలే ప్రకటన వెలువడింది.

దైనందిన జీవితంలో ప్లాస్టిక్‌కు ఎంతో ప్రాధాన్యముంది. మనం ఉపయోగిస్తున్న దాదాపు అన్ని వస్తువుల్లోనూ ఇది ఒక భాగమైంది. తేలిక, మన్నిక, సౌకర్యవంతం, తక్కువ ధరలో రూపొందడం.. ఇలా పలు కారణాలతో ప్రపంచవ్యాప్తంగా ప్లాస్టిక్‌కు ఆదరణ పెరుగుతోంది. కోరుకున్న రూపంలోకి సులువుగా మారిపోవడం దీని ప్రత్యేకత. విస్తృత ప్రయోజనాల రీత్యా పరిశ్రమలు పెద్ద మొత్తంలో ప్లాస్టిక్‌ను వినియోగిస్తున్నాయి. అలాగే ఉత్పత్తి చేస్తున్నాయి. ఈ ప్రక్రియలో భాగం కావడానికి ప్లాస్టిక్ టెక్నాలజీపై పట్టున్నవారిని ఉద్యోగంలోకి తీసుకుంటున్నాయి. ప్లాస్టిక్, అనుబంధ విభాగాల్లో మేటి మానవ వనరులను పరిశ్రమలకు అందించే లక్ష్యంతో కేంద్ర రసాయనాలు, ఎరువుల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో చెన్నైలో సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్స్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (సిపెట్) ఏర్పాటైంది. గతంలో దీన్ని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాస్టిక్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీగా పిలిచేవారు. ఈ సంస్థకు అనుబంధంగా దేశవ్యాప్తంగా ఉన్న కేంద్రాల్లో డిప్లొమా, పోస్టు డిప్లొమా, పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లొమా కోర్సులు అందిస్తున్నారు. పరీక్షలో ప్రతిభతో ప్రవేశం లభిస్తుంది.

అవకాశాలిలా

ప్లాస్టిక్ డిప్లొమాలు పూర్తి చేసుకున్నవారు ప్రాంగణ నియామకాల్లో మేటి సంస్థల్లో ఉద్యోగాలు సొంతం చేసుకుంటున్నారు. ఓఎన్‌జీసీ, ఓల్టాస్, మిల్టన్, సెలో, ఎల్‌అండ్‌టీ, మారుతీ సుజుకీ, రిలయన్స్, ఐఎఫ్‌బీ, బీపీఎల్, హెచ్‌సీఎల్, ఏషియన్ పెయింట్స్, బటర్‌ఫ్లై, టాటా.. తదితర సంస్థలు వీరిని ఎంపిక చేసుకుంటున్నాయి. ఆటోమోటివ్, ప్యాకేజింగ్, కన్జ్యూమర్ గూడ్స్, మెషీన్ మాన్యుఫ్యాక్చరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఆర్ అండ్ డీ.. తదితర విభాగాలకు చెందిన సంస్థల్లో సేవలందించడానికి ప్లాస్టిక్‌పై పట్టున్నవారు అవసరం. అందువల్ల ఈ కోర్సులు చదివినవారి ఉపాధికి ఢోకా లేదు. కొన్నేళ్ల అనుభవంతో మెరుగైన వేతనాలూ అందుకోవచ్చు. సొంతంగానూ చిన్న పరిశ్రమను నెలకొల్పవచ్చు.

డిప్లొమా, పోస్టు డిప్లొమా, పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లొమా కోర్సులను దేశవ్యాప్తంగా 29 సిపెట్ కేంద్రాల్లో అందిస్తున్నారు. ఇవి.. హైదరాబాద్, విజయవాడ, అహ్మదాబాద్, అమృత్‌సర్, ఔరంగాబాద్, బడ్డీ, బాలాసోర్, భోపాల్, భువనేశ్వర్, చంద్రపూర్, చెన్నై, దేహ్రాదూన్,

ఎక్కడంటే

గువాహటి, హాజీపుర్, హల్దియా, ఇంఫాల్, జయపుర్, కొచి, లఖ్‌నవూ, మధురై, ముర్థల్, మైసూరు, రాయ్‌పుర్, రాంచీ, కోర్బ, అగర్తల, గ్వాలియర్, వారణాసి, భగల్‌పుర్‌లలో ఉన్నాయి.

పరీక్ష

అన్ని కోర్సులకూ పరీక్షను ఆన్‌లైన్‌లో విడిగా నిర్వహిస్తారు. దీని వ్యవధి 60 నిమిషాలు. ప్రశ్నలన్నీ ఆబ్జెక్టివ్ తరహాలోనే ఉంటాయి. మొత్తం యాభై ప్రశ్నలు వస్తాయి. రుణాత్మక మార్కులు లేవు. మాదిరి ప్రశ్నలు సిపెట్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. వాటిని పరిశీలించి, ప్రశ్నాంశాలపై అవగాహన పెంచుకోవచ్చు. జనరల్ నాలెడ్జ్ విభాగంలో స్పోర్ట్స్, హిస్టరీ, పాలిటిక్స్, కంప్యూటర్ సైన్స్, ఎంటర్‌టైన్‌మెంట్, కరెంట్ అఫైర్స్ ప్రశ్నలు వస్తాయి. మూడేళ్ల డిప్లొమా కోర్సుల్లో సైన్స్, ఇంగ్లిష్ ప్రశ్నలు పదో తరగతి సిలబస్ స్థాయిలోనే ఉంటాయి. అందువల్ల పాఠ్యపుస్తకాలు బాగా చదువుకున్నవారు ఎక్కువ మార్కులు పొందవచ్చు.

(సిపెట్‌లో బీటెక్ కోర్సులూ ఉన్నాయి. ప్లాస్టిక్ ఇంజినీరింగ్, మెకానికల్ ఇంజినీరింగ్, మాన్యుఫ్యాక్చరింగ్ ఇంజినీరింగ్, పెట్రో కెమికల్స్ ఇంజినీరింగ్ కోర్సులు బీటెక్‌లో భాగంగా అందిస్తున్నారు. అలాగే ఎంటెక్, ఎమ్మెస్సీ, పీహెచ్‌డీ కోర్సులూ ఇక్కడ చదువుకోవచ్చు. వీటిలో ప్రవేశాలకు విడిగా ప్రకటన వెలువడుతుంది)

కోర్సులు, అర్హత, పరీక్ష వివరాలు...

కోర్సు: డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ మౌల్డ్ టెక్నాలజీ (డీపీఎంటీ)
వ్యవధి: మూడేళ్లు (6 సెమిస్టర్లు)
అర్హత: పదో తరగతి/ సమాన స్థాయి ఉత్తీర్ణత. ప్రస్తుతం పదో తరగతి చదువుతున్నవారూ అర్హులే.
పరీక్షలో: జనరల్ నాలెడ్జ్ 25, సైన్స్ 20, ఇంగ్లిష్ 5 ప్రశ్నలు వస్తాయి.

కోర్సు: డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ టెక్నాలజీ (డీపీటీ)
వ్యవధి: మూడేళ్లు (6 సెమిస్టర్లు)
అర్హత: పదో తరగతి/ సమాన స్థాయి ఉత్తీర్ణత. ప్రస్తుతం పదో తరగతి చదువుతున్నవారూ అర్హులే.
పరీక్షలో: జనరల్ నాలెడ్జ్ 25, సైన్స్ 20, ఇంగ్లిష్ 5 ప్రశ్నలు వస్తాయి.

కోర్సు: పోస్టు డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ మౌల్డ్ డిజైన్ విత్ క్యాడ్/క్యామ్ (పీడీ-పీఎండీ)
వ్యవధి: 18 నెలలు (3 సెమిస్టర్లు)
అర్హత: మెకానికల్/ ప్లాస్టిక్ టెక్నాలజీ/ టూల్/ ప్రొడక్షన్/ ఆటోమొబైల్/ మెకట్రానిక్స్/ టూల్ డై అండ్ మేకింగ్/ సిపెట్ నుంచి డీపీఎంటీ/ డీపీటీ వీటిలో ఎందులోనైనా మూడేళ్ల డిప్లొమా ఉండాలి. చివరి ఏడాది కోర్సులో ఉన్నవారూ అర్హులే.
పరీక్షలో: జనరల్ నాలెడ్జ్ 20, సైన్స్ 10, ఇంగ్లిష్ 10, సంబంధిత డిప్లొమా నుంచి 10 ప్రశ్నలు వస్తాయి.

కోర్సు: పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ ప్రాసెసింగ్ అండ్ టెస్టింగ్ (పీజీడీ-పీపీటీ)
వ్యవధి: రెండేళ్లు (4 సెమిస్టర్లు)
అర్హత: ఏదైనా సైన్స్ డిగ్రీ ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. చివరి ఏడాది విద్యార్థులూ అర్హులే.
పరీక్షలో: జనరల్ నాలెడ్జ్ 20, సైన్స్ 10, ఇంగ్లిష్ 10, బీఎస్సీ స్థాయి కెమిస్ట్రీ, ఫిజిక్స్, బయాలజీ, మ్యాథ్స్ 10 ప్రశ్నలు వస్తాయి.

పై కోర్సులన్నీ హైదరాబాద్ క్యాంపస్‌లో అందిస్తున్నారు. పీడీ-పీఎండీ తప్ప మిగతా మూడూ విజయవాడ క్యాంపస్‌లో ఉన్నాయి. అన్ని కోర్సులకూ ఏ వయసు వారైనా దరఖాస్తు చేసుకోవచ్చు.



వివరాలు

ఆన్‌లైన్ దరఖాస్తుకు గడువు తేదీ: మే 28.
పరీక్ష ఫీజు: ఎస్సీ, ఎస్టీలకు రూ.250. మిగిలిన అందరికీ రూ.500.
పరీక్ష తేదీ: జూన్ 7
వెబ్‌సైట్: https://www.cipet.gov.in/

ఈసీఐఎల్‌లో టెక్నీషియన్లు

ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఈసీఐఎల్), హైదరాబాద్.. 20 టెక్నీషియన్, సూపర్‌వైజర్ పోస్టులను భర్తీచేయనుంది. ఐటీఐ/ డిప్లొమా అర్హతతో దరఖాస్తు చేసుకోవచ్చు. రాత పరీక్ష, స్కిల్/ట్రేడ్ టెస్ట్‌లతో నియామకాలు ఉంటాయి.

ఒప్పంద ప్రాతిపదికన ఏడాది కాలానికి ఎంపిక చేసినప్పటికీ నాలుగేళ్లు పొడిగించే అవకాశం ఉంది.

పోస్టు: టెక్నీషియన్
ఖాళీలు: 13
అర్హత: మెషినిస్ట్/ టర్నర్/ మెషినిస్ట్ గ్రైండింగ్/ ఫిట్టర్/ వెల్డర్ ట్రేడ్‌తో ఐటీఐ. మొత్తంగా ఐదేళ్లు, సీఎన్‌సీ మెషిన్ టెక్నీషియన్‌గా మూడేళ్ల ఉద్యోగానుభవం ఉండాలి.
వేతనం: మొదటి ఏడాది నెలకు రూ.30 వేలు, రెండో ఏడాది రూ.32 వేలు, మూడో ఏడాది రూ.34 వేలు, నాలుగో ఏడాది రూ.36 వేలు చెల్లిస్తారు.

పోస్టు: సూపర్‌వైజర్
ఖాళీలు: 5
అర్హత: మెకానికల్/ ప్రొడక్షన్/ ఎలక్ట్రికల్ డిప్లొమా. సీఎన్‌సీ మెషిన్ల నిర్వహణ, ప్రోగ్రామింగ్, 3డీ మోడలింగ్, డ్రాఫ్టింగ్‌లలో ఐదేళ్ల అనుభవం ఉండాలి.
వేతనం: మొదటి ఏడాది నెలకు రూ.35 వేలు, రెండో ఏడాది రూ.37 వేలు, మూడో ఏడాది రూ.39 వేలు, నాలుగో ఏడాది రూ.41 వేలు చెల్లిస్తారు. మూలవేతనానికి అదనంగా టీఏ/డీఏ, పీఎఫ్, వైద్య, బీమా సదుపాయాలు ఉంటాయి.



పోస్టు: డ్రాఫ్ట్స్‌మ్యాన్ సూపర్‌వైజర్
ఖాళీలు: 2 **అర్హత:** మెకానికల్ ఇంజినీరింగ్, 3డీ మోడలింగ్, డ్రాఫ్టింగ్‌లో ఐదేళ్ల అనుభవం ఉండాలి. క్యాడ్/క్యామ్‌లో సర్టిఫికెట్ కోర్సు చేసినవారికి అదనపు ప్రాధాన్యమిస్తారు.
ఎంపిక: ఐటీఐ/ డిప్లొమాలో సాధించిన మార్కులతో 1:4 నిష్పత్తిలో అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేస్తారు. దీనితో ధ్రువపత్రాల పరిశీలన, రాత పరీక్ష/ స్కిల్ టెస్ట్‌లకు ఎంపిక చేస్తారు. వీటిని హైదరాబాద్‌లో నిర్వహిస్తారు.

- ఐటీఐ/ డిప్లొమా పర్సెంటేజ్‌కు 20, రాతపరీక్షకు 40, ట్రేడ్‌టెస్ట్/ స్కిల్‌టెస్ట్ + వైవాకు 40 మార్కులు కేటాయిస్తారు.

వివరాలు

వయసు: 31.12.2025 నాటికి 35 సంవత్సరాలు మించకూడదు. ఓబీసీ-ఎన్‌సీఎల్‌కు మూడేళ్లు, ఎస్సీ/ఎస్టీకి ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
వేతనం: నెలకు రూ.30,000-41,000.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 20.01.2026
వెబ్‌సైట్: www.ecil.co.in

న్యూట్రిషనిస్ట్ అవ్వాలంటే?

బైపీసీ గ్రూపుతో ఇంటర్మీడియట్ చదువుతున్నాను. న్యూట్రిషనిస్ట్ అవ్వాలంటే ఏ కోర్సులు చదవాలి? కెరియర్ ఎలా ఉంటుంది?

– చంద్రిక

బైపీసీ గ్రూపుతో ఇంటర్మీడియట్ చదువుతున్న వారిలో ఎక్కువమంది ఎంబీబీఎస్, బీడీఎస్, అగ్రికల్చర్, హార్టికల్చర్, నర్సింగ్ లాంటి కోర్సుల గురించే ఆలోచిస్తారు. ఆధునిక జీవన శైలి, ఆహారపు అలవాట్లతో డయాబిటిస్, హృదయ వ్యాధులు, స్థూలకాయం లాంటి సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో ఆహార పోషక నిపుణులకు గిరాకీ ఎక్కువవుతోంది. న్యూట్రిషనిస్ట్ అంటే డైట్ సూచనలు ఇచ్చే వ్యక్తి మాత్రమే కాదు, శరీరానికి అవసరమైన పోషకాలను శాస్త్రీయంగా విశ్లేషించి, ఆరోగ్యాన్ని మెరుగుపరిచే మార్గదర్శిగా కూడా పనిచేస్తారు.



- బైపీసీతో ఇంటర్మీడియట్ పూర్తయ్యాక న్యూట్రిషనిస్ట్ అవ్వాలంటే ముందుగా సంబంధిత డిగ్రీ కోర్సును ఎంచుకోవాలి. సాధారణంగా బీఎస్సీ న్యూట్రిషన్, బీఎస్సీ న్యూట్రిషన్ అండ్ డైటెటిక్స్, బీఎస్సీ క్లినికల్ న్యూట్రిషన్, బీఎస్సీ ఫుడ్ సైన్స్ అండ్ న్యూట్రిషన్ లాంటి కోర్సులు అందుబాటులో ఉంటాయి. వీటిలో ప్రవేశం సీయూఈటీ యూజీ/ నీట్ స్కోరు/ ఈఏపీసెట్/ ఇంటర్మీడియట్ మార్కులతో లభిస్తుంది.
- డిగ్రీ తర్వాత పీజీ చదివితే కెరియర్ మరింత బాగుంటుంది. ఎమ్మెస్సీ న్యూట్రిషన్, ఎమ్మెస్సీ క్లినికల్ న్యూట్రిషన్, ఎమ్మెస్సీ డైటెటిక్స్, పబ్లిక్ హెల్త్ న్యూట్రిషన్ లాంటి కోర్సులు నైపుణ్యాల్ని పెంపొందిస్తాయి. ముఖ్యంగా ఆసుపత్రుల్లో పనిచేయాలనుకునే వారికి క్లినికల్ న్యూట్రిషన్ కోర్సులు ఉపయోగపడతాయి. పరిశోధన, బోధన రంగాల్లోకి వెళ్లాలనుకునే వారికి పోస్ట్ గ్రాడ్యుయేషన్ కనీస విద్యార్హత.
- ప్రస్తుతం న్యూట్రిషనిస్టులకు కెరియర్ అవకాశాలు చాలా ఉన్నాయి. ఆసుపత్రులు, మెడికల్ కాలేజీలు, డైట్ క్లినిక్స్, ఫిట్‌నెస్ సెంటర్లు, క్రీడా శిక్షణ కేంద్రాలు, ఆహార పరిశ్రమలు లాంటి చోట్ల వివిధ ఉద్యోగాలు ఉంటాయి. పాఠశాలలు, కళాశాలల్లో పోషకాహారంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, ప్రభుత్వ ఆరోగ్య పథకాలలో భాగంగా పనిచేయడం లాంటి అవకాశాలు కూడా ఉన్నాయి. సొంత డైట్ క్లినిక్ ఏర్పాటు చేయడం లేదా ఆన్‌లైన్ ద్వారా డైట్ కన్సల్టేషన్ అందించడం మొదలైన మార్గాల్లో స్వయం ఉపాధి కూడా సాధ్యమే.
- వేతనాలు ప్రారంభ స్థాయిలో సాధారణంగా నెలకు ఇరవై వేల నుంచి ముప్పై వేల రూపాయల వరకు ఉండవచ్చు. అనుభవం, అర్హతలు, పనిచేసే రంగాన్ని బట్టి ఆదాయం క్రమంగా పెరుగుతుంది. ప్రముఖ ఆసుపత్రుల్లో సేవలు లేదా సొంత ప్రాక్టీస్ ద్వారా నెలకు యాభైవేల నుంచి లక్ష రూపాయల వరకూ సంపాదించే అవకాశాలు ఉన్నాయి. ఆన్‌లైన్ సేవలు, సోషల్ మీడియా ద్వారా అవగాహన కల్పిస్తున్న న్యూట్రిషనిస్టులు అదనపు ఆదాయం పొందడానికీ అవకాశం ఉంది.
- న్యూట్రిషనిస్టుగా విజయవంతం కావడానికి కష్టమర్లు/రోగులతో సహనంగా మాట్లాడగలగటం, ఆరోగ్యం పట్ల ఆసక్తి, నిరంతరం కొత్త విషయాలు నేర్చుకునే తత్వం, శాస్త్రీయంగా ఆలోచించే సామర్థ్యం ఎంతో ముఖ్యం. వ్యక్తులవారీ శారీరక పరిస్థితులు, అవసరాలను అర్థం చేసుకుని, తగిన ఆహార సలహాలు ఇవ్వగలగడం వీరి ముఖ్య బాధ్యత. సరైన కోర్సులు ఎంచుకుని, ప్రాక్టికల్ అనుభవం సంపాదించి, సేవాభావంతో పనిచేస్తే ఈ రంగంలో మంచి గుర్తింపు, స్థిరమైన ఆదాయం రెండూ పొందవచ్చు.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

ఇంటర్న్‌షిప్స్ | వర్క్ ఫ్రమ్ హోమ్

మార్కెటింగ్ అండ్ గ్రోత్

సంస్థ: బెటా ఇన్‌సైట్స్ **నైపుణ్యాలు:** ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఎంఎస్-ఆఫీస్ **స్టైపెండ్:** రూ.2,000-13,000 **దరఖాస్తు గడువు:** ఫిబ్రవరి 13 ☛ https://tinyurl.com/y6cmh7jj

యానిమేషన్

సంస్థ: హ్యాప్ మీడియా ప్రై.లి. **నైపుణ్యాలు:** అడోబ్ ఆఫ్టర్ ఎఫెక్ట్స్, వీడియో ఎడిటింగ్ **స్టైపెండ్:** రూ.8,000-12,000 **దరఖాస్తు గడువు:** ఫిబ్రవరి 13 ☛ https://tinyurl.com/3rdz6wue

న్యూస్‌లెటర్ ఆపరేషన్స్

సంస్థ: సీఎస్‌టీఈ ఇంటర్నేషనల్ **నైపుణ్యం:** కంటెంట్ మార్కెటింగ్ **స్టైపెండ్:** రూ.3,000-5,000 **దరఖాస్తు గడువు:** ఫిబ్రవరి 13 ☛ https://tinyurl.com/h86tftc3

సోషల్ మీడియా మార్కెటింగ్

సంస్థ: కేనిబాల్స్ మీడియా ప్రై.లి. **నైపుణ్యాలు:** ఇంగ్లిష్ మాట్లాడటం, సోషల్ మీడియా మార్కెటింగ్ **స్టైపెండ్:** రూ.4,000 **దరఖాస్తు గడువు:** ఫిబ్రవరి 13 ☛ https://tinyurl.com/5e82wpaa

ప్రీ-సేల్స్ ఎగ్జిక్యూటివ్

సంస్థ: యాడ్ డిజిటల్ కమ్యూనికేషన్స్ **నైపుణ్యాలు:** ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఇంటర్‌పర్సనల్ స్కిల్స్, నెట్‌వర్క్ ప్రొటోకాల్స్, సేల్స్ స్ట్రాటజీ **స్టైపెండ్:** రూ.11,000-25,000 **దరఖాస్తు గడువు:** ఫిబ్రవరి 13 ☛ https://tinyurl.com/4zxercnu

హ్యూమన్ రిసోర్సెస్ (హెచ్‌ఆర్)

సంస్థ: ఫోకస్ బిజినెస్ సొల్యూషన్స్ ప్రై.లి. **నైపుణ్యాలు:** ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, ఎంఎస్-ఎక్సెల్, ఎంఎస్-ఆఫీస్, ఎంఎస్-వర్డ్ **స్టైపెండ్:** రూ.5,000 **దరఖాస్తు గడువు:** ఫిబ్రవరి 13 ☛ https://tinyurl.com/ycy75fkp

డిజిటల్ ఇండియా కార్పొరేషన్‌లో

డిజిటల్ ఇండియా కార్పొరేషన్, దిల్లీ తాత్కాలిక ప్రాతిపదికన వివిధ విభాగాల్లో ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

◗ టెక్నికల్ లీడ్: 01 ◗ బిజినెస్ అనలిస్ట్: 01 ◗ ఫుల్ స్టాక్ డెవలపర్: 03 ◗ ఏఐ/ఎంఎల్ ఇంజినీర్: 01 ◗ డేటా సైంటిస్ట్ (ఏఐ): 01 ◗ డెవోప్స్ ఇంజినీర్: 01 ◗ టెస్టర్ (ఏఐ): 01

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీతోపాటు పని అనుభవం ఉండాలి. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 26-01-2026. **ఎంపిక:** ఇంటర్వ్యూతో

వెబ్‌సైట్: https://dic.gov.in/careers/

న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్‌లో

న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఎన్‌పీసీఐఎల్).. 114 పోస్టులను భర్తీచేయనుంది. ఇంజినీరింగ్ డిప్లొమా/ డిగ్రీతో దరఖాస్తు చేసుకోవచ్చు. రాత పరీక్ష, ఇంటర్వ్యూలతో నియామకాలు ఉంటాయి.

ఎక్కువ సంఖ్యలో ఖాళీలున్న పోస్టుల వివరాలు...

పోస్టు: స్టైపెండరీ ట్రెయినీ/ సైంటిఫిక్ అసిస్టెంట్ (ఎస్‌టీ/ఎస్‌ఏ)- కేటగిరీ-1
ఖాళీలు: 95
అర్హత: 60 శాతంతో మెకానికల్/ ఇన్‌స్ట్రుమెంటేషన్/ ఎలక్ట్రికల్/ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ డిప్లొమా. పదోతరగతి లేదా ఇంటర్మీడియట్ స్థాయిలో ఇంగ్లిష్‌ను ఒక సబ్జెక్టుగా చదివుండాలి. లేటరల్ ఎంట్రీతో డిప్లొమా చేసినవారు దరఖాస్తుకు అనర్హులు.
వయసు: 18 నుంచి 25 సంవత్సరాల మధ్య ఉండాలి.
వేతనం: నెలకు రూ.34,286.
ఎంపిక: రెండు దశల్లో ఎంపిక చేస్తారు. స్టేజ్-1లో మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలతో 100 మార్కులకు ఆన్‌లైన్ టెస్ట్ ఉంటుంది. వ్యవధి 90 నిమిషాలు. సబ్జెక్టు సంబంధిత ప్రశ్నలు 50 ఇస్తారు. ప్రశ్నకు రెండు మార్కులు. ప్రతి తప్పు సమాధానానికీ అరమార్కు తగ్గిస్తారు. ఇందులో జనరల్ అభ్యర్థులు 40 శాతం, ఎస్సీ/ ఎస్టీ/ ఓబీసీ-ఎన్‌సీఎల్/ ఈడబ్ల్యూఎస్/ దివ్యాంగులు 30 శాతం కనీసార్హత మార్కులు సాధించాలి.

- పోస్టుకు ఐదు మంది చొప్పున పర్సనల్ ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు. ఇంటర్వ్యూకు 100 మార్కులు. ఇంటర్వ్యూలో హిందీ లేదా ఇంగ్లిష్‌లో సమాధానాలు చెప్పొచ్చు. ఇందులో జనరల్ అభ్యర్థులు 40 శాతం, ఎస్సీ/ ఎస్టీ/ ఓబీసీ-ఎన్‌సీఎల్/ ఈడబ్ల్యూఎస్/ దివ్యాంగులు 30 శాతం కనీసార్హత మార్కులు సాధించాలి.
- ఆన్‌లైన్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూకు 50:50 వెయిటేజీ ఉంటుంది.



పోస్టు: అసిస్టెంట్ గ్రేడ్-1
ఖాళీలు: 15
అర్హత: 50 శాతంతో ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత.
వయసు: 21 నుంచి 28 సంవత్సరాల మధ్య ఉండాలి.
వేతనం: నెలకు రూ.40,290.

- మూలవేతనానికి అదనంగా టీఏ, హెచ్‌ఆర్‌ఏ, సైట్ లొకేషన్ అలవెన్స్, ఎల్‌టీసీ, పర్ఫార్మెన్స్ రిలేటెడ్ ఇన్సెంటివ్స్, పీఎఫ్, గ్రాట్యుటీ, గ్రూప్ ఇన్స్యూరెన్స్, పదవీవిరమణ అనంతరం వైద్య సదుపాయాలు ఉంటాయి.

ఎంపిక: రెండు దశల్లో జరుగుతుంది. స్టేజ్-1లోని ఆన్‌లైన్ ప్రిలిమినరీ టెస్టులో 50 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఇస్తారు. వ్యవధి 90 నిమిషాలు. ప్రశ్నకు మూడు మార్కుల చొప్పున మొత్తం 150 మార్కులు. ప్రతి తప్పు సమాధానానికీ ఒకమార్కు తగ్గిస్తారు.

- జనరల్ అభ్యర్థులు 40 శాతం, ప్రత్యేక వర్గాలకు చెందినవారు 30 శాతం కనీసార్హత మార్కులు సాధించాలి. వీరిని స్టేజ్-2లోని అడ్వాన్స్‌డ్ టెస్టుకు ఎంపిక చేస్తారు.
- అడ్వాన్స్‌డ్‌కు 150 మార్కులు. వ్యవధి రెండు గంటలు. 50 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఇస్తారు. క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ నుంచి 25 ప్రశ్నలు, క్రిటికల్ రీజనింగ్ నుంచి 25 ప్రశ్నలు ఉంటాయి. ప్రశ్నలకు మూడు మార్కులు. ప్రతి తప్పు సమాధానానికీ ఒక మార్కు తగ్గిస్తారు. ఇందులో జనరల్ అభ్యర్థులు 30 శాతం, ప్రత్యేక వర్గాలకు చెందినవారు 20 శాతం కనీసార్హత మార్కులు సాధించాలి. ధ్రువపత్రాల పరిశీలన అనంతరం తుది ఎంపిక చేస్తారు. వీరికి ఏడాది ప్రొబేషన్ ఉంటుంది. ఆ సమయంలో టైప్‌రైటింగ్, కంప్యూటర్ ప్రొఫిషియన్సీ టెస్టులు నిర్వహిస్తారు.

వివరాలు

వయసు: పోస్టులను అనుసరించి గరిష్ఠ వయసులో తేడాలు ఉన్నాయి. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీ-ఎన్‌సీఎల్‌కు మూడేళ్లు, దివ్యాంగులకు పది నుంచి పదిహేనేళ్ల సడలింపు ఉంటుంది.
దరఖాస్తు ఫీజు: స్టైపెండరీ ట్రెయినీ (ఎస్‌టీ/ఎస్‌ఏ)కు రూ.150. అసిస్టెంట్ గ్రేడ్-1కు రూ.100.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 04.02.2026
వెబ్‌సైట్: http://www.npcilcareers.co.in/

కరెంట్ అఫైర్స్ — మాదిరి ప్రశ్నలు



◆ ఐక్యరాజ్య సమితి టూరిజం (యూఎన్ టూరిజం) కొత్త సెక్రటరీ జనరల్‌గా ఇటీవల ఎవరు నియమితులయ్యారు? (1975లో ఈ సంస్థను ఏర్పాటు చేసిన నాటి నుంచి ఈ పదవికి ఎంపికైన తొలి మహిళగా ఈ యూఏఈ మహిళ ఘనత సాధించారు. నాలుగేళ్ల పాటు ఈమె ఈ పదవిలో ఉంటారు.) **జ:** షైఖా నాజర్ అల్ నోవైస్

◆ ప్రపంచ దయ దినోత్సవం (వరల్డ్ కైండ్‌నెస్ డే)ను ఏటా ఏ రోజున నిర్వహిస్తారు? (1998లో ప్రపంచ దయ ఉద్యమం ద్వారా ఈ దినోత్సవాన్ని ప్రారంభించారు.) **జ:** నవంబరు 13

◆ హరియాణా రాష్ట్ర మహిళా కమిషన్ బ్రాండ్ అంబాసిడర్‌గా ఏ భారత మహిళా క్రికెటర్ నియమితులయ్యారు? (ఐసీసీ మహిళల క్రికెట్ ప్రపంచ కప్ 2025 ఫైనల్ మ్యాచ్‌లో ఈమె 87 పరుగులు చేసి, 2 వికెట్లు తీసి భారత్ తన మొదటి మహిళా ప్రపంచ కప్ టైటిల్ గెలుచుకోవడంలో కీలక పాత్ర పోషించింది.) **జ:** షఫాలీ వర్మ

◆ 2026, ఆగస్టు 15 నుంచి 30 వరకు ఎఫ్ఐహెచ్ హాకీ ప్రపంచకప్‌నకు ఏ రెండు దేశాలు సంయుక్తంగా ఆతిథ్యం ఇవ్వనున్నాయి? (ఈ పోటీల్లో 16 చొప్పున పురుషులు, మహిళల జట్లు పాల్గొననున్నాయి.)
జ: బెల్జియం - నెదర్లాండ్స్

మరింత సమాచారం

ఏపీపీఎస్సీ పరీక్షలు — భారతీయ సమాజం

వ్యక్తిగత విశ్వాసాలకు సామాజిక రూపం!

మానవ జాతి ఆచరించే విధానాల్లో మతం అతి ముఖ్యమైంది. జనన మరణాలపై మనుషులకు సహజంగా కలిగిన ప్రశ్నలు, సామాజిక అవసరాలు, భయాలు, ఆసక్తులకు సమాధానంగా అది పుట్టింది. మానవ నాగరికతలో భాగమైపోయి వివిధ కాలాలకు అనుగుణంగా అభివృద్ధి చెందింది. విశ్వాసాలు, ఆచారాలు, నియమాలు, సంస్కృతులన్నింటి కలయికగా రూపుదిద్దుకుంది. జీవితానికి అర్థాన్ని చెబుతూ, నైతిక మార్గదర్శనం చేస్తుంది. అతీంద్రియ శక్తులతో అనుసంధానిస్తూ, ఆధ్యాత్మిక సంతృప్తితో పాటు ఓదార్పునూ అందించే మతం పుట్టుక, అందులోని ప్రాథమికాంశాలపై పోటీ పరీక్షార్థులకు అవగాహన ఉండాలి. సమాజ నిర్మాణంలో కీలకంగా మారిన మతం మౌలికాంశాలను, దాని ఆవిర్భావాన్ని వివరించే పలు సిద్ధాంతాలు, ఆ క్రమంలో మానవ శాస్త్రవేత్తలు పరిశోధించి వెల్లడించిన ముఖ్యమైన వివరాలనూ తెలుసుకోవాలి.



మతం

మానవుడు సంఘజీవి మాత్రమే కాదు, మత, ఆధ్యాత్మిక జీవి కూడా. మనిషికి ఆసక్తి ఉన్న విషయాల్లో మతం ప్రధానమైంది, ఎంతో పురాతనమైంది, సార్వజనీనమైంది, శాశ్వతమైంది, నిరంతర ఆసక్తిని రేకెత్తించే అంశం. మనిషికి జైవిక, ఆర్థిక, సామాజిక అవసరాలతో పాటు మతపరమైన అవసరాలూ ఉంటాయి. భౌతిక అవసరాలు తీరినప్పటికీ మతపరమైన అన్వేషణ మానవుడిలో వ్యాకులతను కలిగిస్తూనే ఉంటుంది. మతం అనేది అనాదిగా ఉంది. దాని పుట్టుపూర్వోత్తరాలు ఎవరికీ తెలియవు. "మతం అనేది పవిత్ర విషయాలకు సంబంధించిన విశ్వాసాలు, ఆచారాలు, వాటిని పాటించే వాళ్లనందరినీ ఏకం చేస్తుంది" అని 'మతజీవితపు ప్రాథమిక రూపాలు' అనే గ్రంథంలో 'దుర్క్ హైమ్' నిర్వచించాడు.

మతంలోని మౌలికాంశాలు

మానవాతీత శక్తుల పట్ల విశ్వాసం: మానవాతీత శక్తులను నమ్మేవారిని బహుదేవతారాధకులు (Polytheists) అంటారు. వీరు అనేక మానవాతీత శక్తులను విశ్వసిస్తారు. మరికొందరు ఒకే శక్తిని నమ్ముతారు. ఆ శక్తే దైవం లేదా సర్వశక్తిమంతుడు. ఆ దైవం నిరాకారుడు, సర్వాంతర్యామి. దైవాన్ని అనేక రూపాల్లో కొలుస్తారు. వీరిని ఏకేశ్వరారాధకులు (Monotheists) అంటారు.

పవిత్ర, అపవిత్ర భావనలు: మానవుడి చర్యలను పవిత్రం, అపవిత్రం, ధర్మబద్ధం, నీతిమంతం, ధర్మవిరుద్ధం, అవినీతిమంతం అని విభజిస్తారు. మంచి పనులు, ధర్మబద్ధంగా చేసే పనుల వల్లే మనిషికి శుభం, పవిత్రత కలుగుతుందని భావించి సత్ప్రవర్తనను ప్రోత్సహించడం, దుష్ప్రవర్తనను నిరసించడం ప్రతిమతంలోనూ కనిపిస్తుంది. అన్ని సమాజాల్లోనూ మానవుడి చర్యలను పవిత్రమైనవి, అపవిత్రమైనవిగా వర్గీకరించడం ఉందని దుర్క్ హైమ్ పేర్కొన్నాడు. ప్రతి మతం మానవుడికి ఇహబంధాల నుంచి ముక్తి లభించే మార్గాలను పేర్కొంటుంది. బౌద్ధులు నిర్వాణం వల్లనే మనిషి భగవంతుడిలో లీనమయ్యేందుకు వీలుంటుందని భావిస్తే, హిందువులు జనన మరణాల నుంచి విముక్తులు కావడాన్ని మోక్షమని, ముక్తి అని భావిస్తారు. మోక్ష సాధనకు యోగమార్గం, జ్ఞానమార్గం, భక్తిమార్గం, కర్మమార్గం అనే నాలుగు మార్గాలను సూచిస్తారు.




మత ఆవిర్భావ సిద్ధాంతాలు


1) భయ సిద్ధాంతం: మానవుడిలోని భయభావమే మతం అవతరించడానికి మూలమని కొందరు పేర్కొంటారు. ఈ భావం గ్రీకు, రోమన్ల కాలం నాటి నుంచే ఉన్నట్లు తెలుస్తోంది. రోమన్ తత్వవేత్త, కవి అయిన లెక్రేటియస్ దేవుడిపై విశ్వాసానికి ఆధారం భ్రాంతి అని, భయమే మతానికి మూలమని భావించాడు. 18వ శతాబ్దానికి చెందిన డేవిడ్ హ్యూమ్ అనే బ్రిటిష్ తత్వవేత్త 'ద నేచురల్ హిస్టరీ ఆఫ్ రిలీజియన్' అనే గ్రంథంలో 'ప్రకృతి శక్తుల వల్ల కలిగిన భయమే, ఆ శక్తులను అదుపు చేసి నడిపించేది దేవుడనే భావానికి కారణమైంది. దేవుడి పట్ల భయభక్తులను సృష్టించింది" అని చెప్పాడు. ఇలాంటి అభిప్రాయాన్నే జర్మన్ తత్వవేత్త మాక్స్‌ముల్లర్ కూడా వ్యక్తం చేశాడు.


డేవిడ్ హ్యూమ్


2) సర్వాత్మవాద సిద్ధాంతం: ఈ సిద్ధాంత ప్రస్తావన ఇ.బి.టైలర్ 1871లో రచించిన 'ప్రిమిటివ్ కల్చర్' గ్రంథంలో కనిపిస్తుంది. సర్జైన్ లుబాక్, హెర్బర్ట్ స్పెన్సర్‌లు దానిని బలపరిచారు. మరణించిన వారి ఆత్మ పట్ల విశ్వాసమే ఈ సర్వాత్మవాదమని టైలర్ స్పష్టం చేశాడు. మానవ చరిత్ర తొలిదశల్లో మనిషికి వచ్చే కలలు, భ్రమలు, నిద్ర, మరణం లాంటి వాటికి వివరణ కావాల్సి వచ్చింది. వాటిని అర్థం చేసుకోవాల్సిన అవసరం ఏర్పడటమే ఆత్మ ఉందనే నమ్మకానికి దారి తీసిందన్నాడు.


ఇ.బి.టైలర్

3) సంకేతారాధన: మనిషి దగ్గర ఒక వస్తువు ఉన్నా, ఉపయోగించినా అది అతడు కోరిన ఫలితాలను ఇస్తుందని నమ్మినప్పుడు దానిని 'సంకేతం' అంటారు. ఆ సంకేతాలను ఆరాధించే మతాన్ని 'సంకేతారాధన' అంటారు. అసాధారణంగా కనిపించే ఆకును లేదా రాతిని, దానికి రహస్య శక్తులు ఉన్నాయనే నమ్మకంతో ఆరాధించవచ్చు. లెస్లి లార్సన్ ఈ అభిప్రాయాన్ని బలపరిచారు. కొన్ని నిర్జీవ పదార్థాలకు మార్మిక శక్తులు ఉంటాయని ఆదిమానవులు నమ్ముతారు. వాటిని 'మాన' అని పిలుస్తారు. ఈ పదాన్ని మొదటగా ఆర్. హెచ్.కాడ్రింగ్టన్ అనే మానవ శాస్త్రవేత్త ఉపయోగించాడు.



కాడ్రింగ్టన్

4) టోటెమిజమ్: ఇది సంకేతారాధనకు విస్తృత రూపం. 'డిక్షనరీ ఆఫ్ సోషియాలజీ'లో టోటెమ్ అంటే ఒక గణంతో లేదా ఒక వంశంతో లేదా ఇతర సామాజిక బృందంతో ప్రత్యేక సంబంధం ఉన్నట్లు పరిగణించే రూపం. ఒక వర్గం వస్తువులకు అంటే సాధారణంగా ఒక జాతి జంతువులకు, ఒక్కోసారి ఒక జాతి చెట్లకు, నిర్జీవ వస్తువులకు ఆ గుర్తింపు లభిస్తుంది. అవి ఆ తండాకు భక్తి రూపంగా మారతాయి. ఉదాహరణకు ఒక గిరిజన తండాకు టోటెమ్‌తో సంబంధం ఉన్నప్పుడు దానికి వారు ఒక పేరు పెట్టుకుని, పూజిస్తారు. అందుకే టోటెమ్‌ను వివిధ గిరిజన సమూహాల ప్రత్యేకతను సూచించే చిహ్నంగా పరిగణిస్తారు. జేమ్స్ ఫ్రేజర్ ప్రకారం ఒక తెగకు చెందిన వారంతా తమ టోటెమ్ పట్ల మూఢనమ్మకాన్ని, ఆరాధనాభావాన్ని ప్రదర్శిస్తారు. తూర్పు ఆస్ట్రేలియాలోని ఆదిమ తెగలవారు పాటించే 500 టోటెమ్‌లలో దాదాపు 460 జంతువులకు, చెట్లకు సంబంధించినవే. కేవలం 40 మాత్రమే సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు, అగ్ని, పొగ, నీరు మొదలైన వాటికి చెందినవని దుర్క్ హైమ్ గుర్తించాడు. గిరిజన తెగలు వాటి టోటెమ్‌లకు అతిలోక శక్తులు ఉంటాయని విశ్వసిస్తాయి. టోటెమ్‌కు గిరిజన తెగల్లో పాటించే బహిర్వివాహ వ్యవస్థతో సన్నిహిత సంబంధం ఉందని పరిశీలకులు పేర్కొన్నారు. టోటెమ్‌కు, దానికి సంబంధించిన సభ్యుల మధ్య సంబంధాన్ని రక్త సంబంధంగా పరిగణిస్తారు.


జేమ్స్ ఫ్రేజర్



5) ప్రకార్య సిద్ధాంతం: సామాజిక నియంత్రణకు మతం ఒక సాధనమనే వాదాన్ని దుర్క్ హైమ్ ప్రారంభించాడు. మతానికి, ఉత్సవాది ఆచారాలకు సంబంధించిన నాలుగు ప్రధాన సామాజిక విధులను ఆయన గుర్తించాడు. అవి- 1) క్రమశిక్షణకు, సన్నాహాలకు తోడ్పడుతుంది. 2) ఉత్సవాది కర్మకాండలు సదృఢాత్మక విధి నిర్వర్తిస్తాయి. 3) పునఃచైతన్య కారకంగా మతం తోడ్పడుతుంది. 4) సుసంగతమైన సామాజిక వ్యక్తి జీవితానికి సంబంధించిన ఉల్లాస భావనల వ్యవస్థాపనకు మతం దోహదపడుతుంది.


దుర్క్ హైమ్


రచయిత: బద్దం పురుషోత్తం రెడ్డి

సీనియర్ ఇంటర్ గణితం- 2A — సమీకరణవాదం

ఫైనల్ పరీక్షలు 2026 — ముఖ్యమైన ప్రశ్నలు - జవాబులు

2 మార్కులు

1\. 2, 3, 6లు మూలాలుగా ఉన్న 3వ తరగతి బహుపది సమీకరణాన్ని రూపొందించండి.

జ: కావాల్సిన బహుపది సమీకరణం $(x-2)(x-3)(x-6)=0$

$\therefore x^3-11x^2+36x-36=0$

2\. 1, −1, 3లు మూలాలుగా ఉన్న బహుపది సమీకరణం కనుక్కోండి.

జ: కావాల్సిన బహుపది సమీకరణం $(x-1)(x+1)(x-3)=0$

$\therefore x^3-3x^2-x+3=0$

3\. $2\pm\sqrt{3}$, $1\pm 2i$ లు మూలాలుగా ఉన్న బహుపది సమీకరణం కనుక్కోండి.

జ: కావాల్సిన బహుపది సమీకరణం

$\left[x-\left(2+\sqrt{3}\right)\right]\left[x-\left(2-\sqrt{3}\right)\right]\left[x-(1+2i)\right]\left[x-(1-2i)\right]=0$

$x^4-6x^3+14x^2-22x+5=0$

4\. 0, 0, 2, 2, −2, −2లు మూలాలుగా ఉన్న బహుపది సమీకరణాన్ని రూపొందించండి.

జ: కావాల్సిన బహుపది సమీకరణం

$(x-0)(x-0)(x-2)(x-2)(x+2)(x+2)=0$

$x^2(x^2-4)^2=0 \Rightarrow x^6-8x^4+16x^2=0$

5\. $x^4+ax^3+bx^2+cx+d=0$ యొక్క మూలాలు 1, 2, 3, 4 అయితే a, b, c, d విలువలను కనుక్కోండి.

జ: దత్త సమీకరణం మూలాలు 1, 2, 3, 4 కాబట్టి

$-a=1+2+3+4 \quad \therefore a=-10$

$b=1.2+1.3+1.4+2.3+2.4+3.4$

$\therefore b=35$

$-c=1.2.3+1.2.4+1.3.4+2.3.4$

$\therefore c=-50$

$d=(1)(2)(3)(4) \quad \therefore d=24$

6\. $2x^3+x^2-7x-6=0$ యొక్క మూలాలు −1, 2, α అయితే α విలువ కనుక్కోండి.

జ: మూలాల మొత్తం $=(-1)+(2)+\alpha=-\frac{1}{2} \Rightarrow \alpha=-\frac{3}{2}$

7\. $x^3-6x^2+9x-4=0$ సమీకరణం మూలాలు 1, 1, α అయితే α విలువను కనుక్కోండి.

జ: మూలాల మొత్తం $=(1)+(1)+(\alpha)=6 \Rightarrow \alpha=4$

8\. $x^3-2x^2+ax+6=0$ యొక్క మూలాలు 1, −2, 3 అయితే a విలువను కనుక్కోండి.

జ: దత్త సమీకరణానికి 1 ఒక మూలం కాబట్టి

$1-2+a+6=\Rightarrow a=-5$

ముఖ్యమైన ప్రశ్నలు-జవాబులు


రచయిత: బి. ఈశ్వరరావు

అంటిపెట్టుకుని.. అవసర పోషకాలను అందించి!



దేశంతో పాటు ప్రపంచవ్యాప్తంగా అంతకంతకు వృద్ధి చెందుతున్న జనాభాకు ఆహారాన్ని సమకూర్చడం అతిపెద్ద సవాలుగా మారుతోంది. అదే సమయంలో భూతాపానికి, పర్యావరణ క్షీణతకు కారణమైన ప్రధాన అంశాల్లో ఆధునిక వ్యవసాయం ఒకటిగా నిలిచింది. ఈ క్రమంలో సాగును మరింత సమర్థంగా, పర్యావరణ హితంగా చేయడానికి సాంకేతికత అవసరం ఏర్పడింది. అంటే ఉత్పాదకత పెరగాలి, రసాయన ఎరువుల వాడకం తగ్గి నేల, నీటి వనరులు సురక్షితంగా ఉండాలి. ఈ నేపథ్యంలో సేంద్రియ వ్యవసాయం, సమగ్ర నీటి సంరక్షణ పద్ధతులు, చీడపీడలను తట్టుకునే వంగడాలు, డిజిటల్ పరిజ్ఞానంతో స్మార్ట్ సాగు తదితరాలకు దోహదపడే సరికొత్త సాంకేతికతలపై పోటీ పరీక్షార్థులకు ప్రాథమిక అవగాహన ఉండాలి. సుస్థిర సాగుకు ప్రభుత్వాలు చేస్తున్న కృషి, పాటిస్తున్న పద్ధతులు, జీవ ఎరువుల వాడకాన్ని ప్రోత్సహిస్తున్న పథకాలు, వివిధ వాతావరణాల్లో మొక్కలు పెరిగేందుకు అందుబాటులో ఉన్న విధానాలనూ తెలుసుకోవాలి.

వ్యవసాయం - పర్యావరణ సాంకేతికతలు

1\. సేంద్రియ వ్యవసాయానికి సంబంధించిన అంశాల్లో సరైనవి ఏవి?



ఎ) ఎలాంటి రసాయనాలు వాడకుండా ప్రకృతిలో లభించే సేంద్రియ పదార్థాలను ఉపయోగించి చేసే వ్యవసాయాన్ని 'సేంద్రియ వ్యవసాయం' అంటారు.
బి) సేంద్రియ వ్యవసాయ పితామహుడిగా 'సర్ అల్బర్ట్ హోవార్డ్'ను పిలుస్తారు.
సి) భారతదేశం సేంద్రియ వ్యవసాయదారుల సంఖ్యలో, సేంద్రియ వ్యవసాయ విస్తీర్ణంలో మొదటి స్థానంలో ఉంది.

1) సి 2) ఎ, బి, సి 3) ఎ, బి 4) ఎ, సి

2\. సేంద్రియ వ్యవసాయానికి సంబంధించిన అంశాల్లో సరికానివి ఏవి?

ఎ) 2003లో సిక్కిం అధికారికంగా సేంద్రియ వ్యవసాయానికి మారాలని ఒక తీర్మానాన్ని ఆమోదించింది.
బి) 2016, జనవరిలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గుజరాత్‌ను భారతదేశపు మొదటి పూర్తి సేంద్రియ రాష్ట్రంగా ప్రకటించారు.
సి) నేషనల్ సెంటర్ ఫర్ ఆర్గానిక్ ఫార్మింగ్ హైదరాబాద్‌లో ఉంది.

1) సి 2) బి, సి 3) బి 4) ఎ

3\. పరంపరాగత్ కృషి వికాస్ యోజనకు సంబంధించిన అంశాల్లో సరైనవి?



ఎ) పరంపరాగత్ కృషి వికాస్ యోజనను 2023లో ప్రారంభించారు.
బి) సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించడం, సేంద్రియ ఉత్పత్తులను మార్కెట్‌తో అనుసంధానించడం పరంపరాగత్ కృషి వికాస్ యోజన పథకం ఉద్దేశం.
సి) ఈ పథకం క్లస్టర్ ఆధారిత విధానంలో అమలవుతోంది.
డి) ఇది నేషనల్ మిషన్ ఆన్ సస్టైనబుల్ అగ్రికల్చర్ కింద సాయిల్ హెల్త్ మేనేజ్‌మెంట్ విస్తరించిన భాగం.

1) ఎ, బి, సి 2) సి, డి
3) బి, సి, డి 4) ఎ, బి, డి

4\. 'పార్టిసిపేటరీ గ్యారెంటీ స్కీమ్' వేటి ధ్రువీకరణకు సంబంధించింది?

1) సేంద్రియ ఉత్పత్తులు
2) రసాయన ఉత్పత్తులు
3) ఎలక్ట్రికల్ ఉత్పత్తులు
4) చమురు ఉత్పత్తులు

5\. నార్త్ ఈస్ట్ రీజియన్‌లో సేంద్రియ విలువ గొలుసు అభివృద్ధి మిషన్‌కు సంబంధించిన అంశాల్లో సరైనవి ఏవి?



ఎ) ఈ మిషన్ ఈశాన్య భారతదేశం సేంద్రియ వ్యవసాయ సామర్థ్యాన్ని వినియోగించుకునే కేంద్ర రంగ పథకం.
బి) ఈ మిషన్‌ను 2015లో ప్రారంభించారు.
సి) రైతులను వినియోగదారులతో అనుసంధానించి సేంద్రియ ఉత్పత్తులను అభివృద్ధి చేయడం ఈ పథకం లక్ష్యం.
డి) ఇది నేషనల్ మిషన్ ఫర్ సస్టైనబుల్ అగ్రికల్చర్ కింద ఉప మిషన్.

1) ఎ, బి, సి 2) సి, డి
3) ఎ, బి, సి, డి 4) ఎ, బి, డి

6\. జీరో బడ్జెట్ నేచురల్ ఫార్మింగ్ (జడ్‌బీఎన్ఎఫ్)నకు సంబంధించిన అంశాల్లో సరైనవి?

ఎ) జడ్‌బీఎన్ఎఫ్ అంటే ఎలాంటి ఎరువులు, పురుగు మందులు లేదా ఇతర బాహ్య పదార్థాలను ఉపయోగించకుండా పంటలు పెంచడం.
బి) జపనీస్ రైతు, తత్వవేత్త ఫుకుయోకా ఈ పదాన్ని తన పుస్తకం 'ది వన్-స్ట్రా రెవల్యూషన్'లో పరిచయం చేశారు.
సి) 1990ల మధ్యకాలంలో వ్యవసాయ శాస్త్రవేత్త ఎం.ఎస్. స్వామినాథన్ భారత్‌లో ఈ భావనను ప్రచారం చేశారు.

1) బి, సి 2) ఎ, బి, సి
3) ఎ, బి 4) ఎ, సి

7\. జడ్‌బీఎన్ఎఫ్ సూత్రాల్లో సరైనవి ఏవి?




ఎ) **బీజామృతం:** విత్తనాలను స్థానికంగా లభించే ఆవు పేడ, మూత్రంతో తయారుచేసిన సూత్రీకరణలతో చికిత్స చేయడం.
బి) **జీవామృతం:** ఆవు పేడ, గోమూత్రాన్ని ఉపయోగించి జీవామృతాన్ని తయారుచేస్తారు.
సి) **అచ్ఛదానా/మల్చింగ్:** మల్చింగ్ అంటే పెరుగుదల, అభివృద్ధికి మంచి గాలిని అందజేయడం.
డి) **వాపాస/తేమ:** పంట వ్యర్థాలు/ సేంద్రియ వ్యర్థాలు లేదా కవర్ పంటలతో పైమట్టిని కప్పే ప్రక్రియ.

1) ఎ, బి, సి, డి 2) సి, డి
3) ఎ, బి 4) ఎ, బి, డి

జనరల్ స్టడీస్ - పర్యావరణ అంశాలు

8\. భారతీయ ప్రకృతి కృషి పద్ధతి పథకానికి సంబంధించిన అంశాల్లో సరైనవి?



ఎ) బీపీకేపీ పథకాన్ని 2020-21లో వ్యవసాయ, రైతుల సంక్షేమ మంత్రిత్వ శాఖ ప్రారంభించింది.
బి) ఇది పరంపరాగత్ కృషి వికాస్ యోజన ఉప పథకం.
సి) దీన్ని సంప్రదాయ స్వదేశీ పద్ధతుల ప్రచారం కోసం ప్రారంభించారు.

1) బి, సి 2) ఎ, బి, సి
3) ఎ, బి 4) ఎ, సి

9\. వాదన–(ఎ): వాతావరణంలోని నత్రజని మొక్కలకు ఉపయోగపడాలంటే ముందుగా అందుకు అనువైన రూపంలోకి మారాలి.

కారణం–(ఆర్): నత్రజని స్థిరీకరణ అనేది ముఖ్యమైన జీవప్రక్రియ. ఈ ప్రక్రియలో రైజోబియం, అజటోబాక్టర్ లాంటి కొన్ని బ్యాక్టీరియా జాతుల ద్వారా వాతావరణంలోని నైట్రోజన్ అమ్మోనియాగా మారుతుంది.

1) ఎ, ఆర్ నిజం; ఆర్ అనేది ఎ కు సరైన వివరణ.
2) ఎ నిజం కానీ, ఆర్ తప్పు.
3) ఎ, ఆర్ నిజం; కానీ ఆర్ అనేది ఎ కు సరైన వివరణ కాదు.
4) ఎ తప్పు కానీ, ఆర్ నిజం.

10\. కింది వాటిలో నత్రజనిని స్థిరీకరించే జీవ ఎరువులు ఏవి?

ఎ) రైజోబియం
బి) అజటోబాక్టర్
సి) అజోస్పిరిల్లం
డి) బాసిల్లస్ తురింజియెన్సిస్
ఇ) నీలి ఆకుపచ్చ నాచు
ఎఫ్) అజొల్లా - అనబీనా

1) ఎ, బి, సి, ఇ, ఎఫ్ 2) ఎ, బి, ఇ, ఎఫ్
3) ఎ, బి, సి, ఇ 4) బి, సి, ఎఫ్

11\. జీవ ఎరువులకు సంబంధించిన అంశాల్లో సరైనవి?

ఎ) భూమిలో నిల్వ ఉండి, లభ్యంకాని భాస్వరాన్ని కొన్నిరకాల బ్యాక్టీరియాలు, శిలీంధ్రాలు అవి ఉత్పత్తి చేసే ఆమ్లాలు, వివిధ ఎంజైమ్‌ల ద్వారా కరిగించి మొక్కలకు అందజేస్తాయి.
బి) మైకోరైజా అనే బ్యాక్టీరియా భాస్వరం, వివిధ సూక్ష్మపోషకాలను వేరుకు అందిస్తుంది.
సి) బాసిల్లస్, సూడోమోనాస్, ఆస్పర్జిల్లస్, పెన్సీలియం లాంటి శిలీంధ్రాలు భాస్వరాన్ని కరిగించి మొక్కకు అందిస్తాయి.

1) ఎ, బి, సి 2) ఎ, సి
3) ఎ, బి 4) బి, సి

12\. జీవ ఎరువులకు సంబంధించిన అంశాల్లో సరికానివి?

ఎ) ఇవి రసాయనిక ఎరువుల మాదిరిగా ఎలాంటి కాలుష్యాన్ని కలిగించవు.
బి) ఇవి వాడటానికి చాలా పరిజ్ఞానం అవసరం. ఖర్చు కూడా ఎక్కువ.
సి) ఇవి ఎక్కువగా వాడితే నేల నిస్సారమవుతుంది. రసాయనిక ఎరువులు నేలను సారవంతం చేసి, నీటిని అందించే శక్తిని పెంచుతాయి.
డి) రసాయనిక ఎరువులు నీటిలో కరిగి కొట్టుకుపోతాయి. జీవ ఎరువులు నేలను అంటిపెట్టుకుని మొక్కలకు పోషకాలను అందిస్తాయి.

1) ఎ, బి, సి, డి 2) ఎ, సి
3) బి, డి 4) బి, సి

13\. మైక్రోబియల్ బయోపెస్టిసైడ్స్‌కు సంబంధించిన అంశాల్లో సరైనవి?

ఎ) బాసిల్లస్ తురింజియెన్సిస్ పత్తి పంటలకు కలిగే బోల్‌వార్మ్ తెగుళ్ల నివారణకు ఉపయోగపడుతుంది.
బి) న్యూక్లియో పాలిహెడ్రో వైరస్ అనేక కీటకాలు, గొంగళి పురుగులపై దాడి చేస్తుంది. ఇది పచ్చశనగ పురుగుపై కూడా దాడి చేస్తుంది.
సి) ట్రైకోడెర్మా అనే శిలీంధ్రం పంటలను నష్టపరిచే క్రిములపై మైక్రోటాక్సిన్లను విడుదల చేస్తుంది.

1) ఎ, బి, సి 2) ఎ, సి
3) ఎ, బి 4) బి, సి

14\. 'ప్లాంట్ ఇన్‌కార్పొరేటెడ్ ప్రొటెక్టెంట్స్' అనే పదం కింది వాటిలో దేనికి సరిపోతుంది?

1) నాణ్యమైన రసాయన ఎరువులు, అవి వాణిజ్య పరంగా తయారుచేస్తారు.
2) మొక్కల్లోకి ఒక మేలు పదార్థం.
3) మొక్కకు జోడించిన జన్యుపదార్థాల నుంచి మొక్క ఉత్పత్తి చేసే పురుగు మందుల పదార్థాలు.
4) మొక్కకు జోడించిన జన్యుపదార్థాల నుంచి మొక్క ఉత్పత్తి చేసే ఒక ఎరువు.

15\. బయోపెస్టిసైడ్స్‌కు సంబంధించిన అంశాల్లో సరైనవి ఏవి?



ఎ) సహజ లేదా జీవసంబంధమైన మూలం నుంచి తీసుకున్న వీటిని స్థిరమైన వ్యవసాయంలో తెగులు నియంత్రణకు ఉపయోగిస్తారు.
బి) ఇవి పర్యావరణ అనుకూలమైనవి. తక్కువ అస్థిర సమ్మేళనాలు, తక్కువ పర్యావరణ ప్రమాదాలను కలిగి ఉంటాయి.
సి) ఇవి తక్కువ సంఖ్యలో అవశేషాలను ఉత్పత్తి చేస్తున్నందున నీరు, గాలి, భూసంబంధ పర్యావరణ వ్యవస్థల్లో వాటి ఉనికి దాదాపు చాలా తక్కువగా ఉంటుంది.

1) బి 2) సి 3) ఎ, బి 4) ఎ, బి, సి

16\. ఇంటిగ్రేటెడ్ పెస్ట్ మేనేజ్‌మెంట్‌కు సంబంధించిన అంశాల్లో సరికానివి ఏవి?

ఎ) ఇంటిగ్రేటెడ్ పెస్ట్ మేనేజ్‌మెంట్ అనేది తెగుళ్లను నిర్వహించడానికి సమర్థ, స్థిరమైన విధానం.
బి) ఇది పంటలు, మానవ ఆరోగ్యం, పర్యావరణానికి రక్షణ కల్పిస్తూ రసాయన పురుగుమందుల వినియోగాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తుంది.
సి) ఇది బహుళ నియంత్రణ పద్ధతులను మిళితం చేసే సమగ్ర వ్యూహం, దీర్ఘకాలిక తెగులు నిర్వహణను సాధించడానికి నివారణ, పర్యవేక్షణ, లక్ష్య జోక్యాలను నొక్కి చెబుతుంది.

1) బి 2) ఎ, సి
3) ఎ, బి 4) బి, సి


రచయిత: ఈదుబిల్లి వేణుగోపాల్

సమాధానాలు

1-3, 2-2, 3-3, 4-1, 5-3, 6-3, 7-3, 8-2, 9-1, 10-1, 11-2, 12-4, 13-1, 14-3, 15-4, 16-1.

బారువడ్డీ

- అసలు (P): నియమిత కాలానికి అప్పు తీసుకున్న లేదా ఇచ్చిన సొమ్ము
- వడ్డీరేటు (I): డబ్బును వాడుకున్నందుకు చెల్లించే అదనపు సొమ్ము
- రేటు శాతం (R): రూ.100పై ఒక ఏడాదికి వసూలు చేసే వడ్డీని రేటు శాతం అంటారు.
- కాలం (T): డబ్బు చెల్లించేందుకు తీసుకునే సమయం (T)
- బారువడ్డీ (SI): అప్పు తీసుకున్న మొత్తానికి నియమిత కాలంలో ఒకే రకమైన వడ్డీని లెక్కిస్తే దాన్ని బారువడ్డీ లేదా సాధారణ వడ్డీ అంటారు.

బారువడ్డీ $I = \frac{PTR}{100}$

$P = \frac{100I}{TR}$, $T = \frac{100I}{PR}$, $R = \frac{100I}{PT}$ అవుతుంది.

మొత్తం (A) = అసలు + వడ్డీ

$A = P + I$

$A = P + \frac{PTR}{100} \Rightarrow A = P\left(1 + \frac{TR}{100}\right)$



ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
అరిథ్‌మెటిక్

నాలుగేళ్లకు రెట్టింపైతే.. ఎన్నేళ్లకు ఎనిమిది రెట్లు?

మాదిరి ప్రశ్నలు

1. ఏడాదికి 6% చొప్పున రూ.10000లకు 9 నెలల్లో అయ్యే వడ్డీ?

1) రూ.540 2) రూ.450 3) రూ.900 4) రూ.600

సాధన: $I = \frac{PTR}{100} = \frac{10000 \times \frac{9}{12} \times 6}{100} =$ రూ.450

సమాధానం: 2

2. 11% బారువడ్డీతో ఆరేళ్లలో కొంత పెట్టుబడి పెడితే అసలు కంటే రూ.2720 వడ్డీ తక్కువగా వచ్చింది. అయితే పెట్టిన పెట్టుబడి ఎంత?

1) రూ.6000 2) రూ.7000 3) రూ.8000 4) రూ.7500

సాధన: పెట్టుబడి = 100% అనుకుందాం

11% వడ్డీరేటు చొప్పున ఆరేళ్లకు అయ్యే వడ్డీ = 66%

వడ్డీ అసలు కంటే తక్కువ

$100\% - 66\% = 34\% \Rightarrow 34\% = 2720$

$100\% = \frac{2720}{34} \times 100 =$ రూ.8000

సమాధానం: 3

3. రూ.7500లను 12% సరళవడ్డీతో రెండు సంవత్సరాల కాలానికి పెట్టుబడి పెడితే మొత్తం ఎంత అవుతుంది? (రూ.లలో)

1) 1800 2) 9300 3) 8900 4) 9100

సాధన: వడ్డీరేటు R = 12%; రెండేళ్లలో వడ్డీ = 24%

$I = 7500 \times \frac{24}{100} = 1800$

మొత్తం = 7500 + 1800 = రూ.9300 **సమాధానం: 2**

4. రూ.7000లలో కొంత సొమ్మును 6 %, మిగతా సొమ్మును 4%కి అప్పుగా ఇచ్చారు. ఈ రెండు మొత్తాలపై 5 ఏళ్లకు సామాన్య వడ్డీ రూ.1600 అవుతుంది. అయితే 6% వద్ద అప్పు ఇచ్చిన మొత్తం సొమ్ము ఎంత? (రూ.లలో)

1) 1500 2) 1750 3) 2000 4) 2250

సాధన: 6% చొప్పున రూ.x అప్పు తీసుకున్నారనుకుందాం.

4% చొప్పున అప్పు తీసుకున్న సొమ్ము (7000 – x)

$\frac{x \times 6 \times 5}{100} + \frac{(7000 - x) \times 4 \times 5}{100} = 1600$

$\frac{3x}{10} + \frac{7000 - x}{5} = 1600 \Rightarrow \frac{3x + 14000 - 2x}{10} = 1600$

$x = 16000 - 14000 = 2000$ **సమాధానం: 3**

5. కొంత సొమ్ము బారువడ్డీ రేటుతో నాలుగేళ్లకు రెట్టింపు అవుతుంది. అయితే ఆ సొమ్ము అదే వడ్డీరేటుతో ఎన్నేళ్లకు 8 రెట్లు అవుతుంది?

1) 32 2) 28 3) 24 4) 20

సాధన: బారువడ్డీతో t సంవత్సరాలకు n రెట్లు అయితే

m రెట్లు అయ్యేందుకు పట్టే కాలం $= \left(\frac{m-1}{n-1}\right) \times t$

$\Rightarrow \left(\frac{8-1}{2-1}\right) \times 4 = 28$ ఏళ్లు

సమాధానం: 2

6. కొంత సొమ్మును మూడేళ్ల కాలానికి కొంత సరళవడ్డీ రేటుతో డిపాజిట్ చేశారు. ఈ వడ్డీరేటు కంటే 4% ఎక్కువ వడ్డీతో డిపాజిట్ చేస్తే రూ.120 వడ్డీ అధికంగా లభిస్తుంది. అయితే డిపాజిట్ చేసిన సొమ్ము ఎంత? (రూ.లలో)

1) 1000 2) 500 3) 1200 4) 1500

సాధన: $P = \frac{100I}{RI} = \frac{100 \times 120}{4 \times 3} =$ రూ.1000

సమాధానం: 1

7. సాధారణ వడ్డీతో పెట్టుబడి పెట్టిన కొంత మొత్తం 8 ఏళ్లలో రెండింతలు అవుతుంది. అయితే ఆ పెట్టుబడి మూడింతలు అయ్యేందుకు ఎన్ని సంవత్సరాలు పడుతుంది?

1) 8 2) 12 3) 16 4) 24

సాధన: రెండింతలు అయితే I = P అవుతుంది.

$I = \frac{PTR}{100}$, $P = \frac{P8R}{100}$

$R = \frac{100}{8} = \frac{25}{2}$

మూడింతలు కావాలంటే I = 2P కావాలి

$\therefore 2P = \frac{P \times T \times 25}{100 \times 2} \Rightarrow \frac{2 \times 200}{25} = T \Rightarrow T = 16$

సమాధానం: 3

8. విజయ స్వప్న దగ్గర కొంత సొమ్ము అప్పుగా తీసుకుంది. వడ్డీరేటు మొదటి రెండు సంవత్సరాలకి 8%, తర్వాతి మూడు సంవత్సరాలకు 11%, అయిదేళ్ల తర్వాత 14% నిర్ణయించారు. స్వప్నకు 8 ఏళ్ల తర్వాత రూ.10920 వడ్డీగా లభించింది. అయితే విజయ తీసుకున్న అప్పు ఎంత? (రూ.లలో)

1) 10000 2) 12000 3) 14000 4) 15000

సాధన: తీసుకున్న అప్పు రూ.x అనుకుందాం.

$\frac{x \times 2 \times 8}{100} + \frac{x \times 3 \times 11}{100} + \frac{x \times 3 \times 14}{100} = 10920$

$\frac{16x + 33x + 42x}{100} = 10920 \Rightarrow \frac{91x}{100} = 10920$

$x = \frac{10920 \times 100}{91} = 12000$

సమాధానం: 2

9. రూ.400 నాలుగేళ్లలో రూ.480 అవుతుంది. వడ్డీరేటు 2% పెరిగితే మొత్తం ఎంత అవుతుంది? (రూ.లలో)

1) 487 2) 560 3) 512 4) 550

సాధన: $I = \frac{PTR}{100} \Rightarrow 80 = \frac{400 \times 4 \times R}{100} \Rightarrow R = 5$

$R = 7$ అయితే $\Rightarrow I = \frac{400 \times 4 \times 7}{100} = 112$

మొత్తం = 400 + 112 = రూ.512

సమాధానం: 3

10. కొంత సొమ్మును సాధారణ వడ్డీకి నిర్ణీత వడ్డీరేటుతో ఇస్తే ఆరేళ్లకు, తొమ్మిదేళ్లకు వరుసగా వచ్చే వడ్డీల నిష్పత్తి?

1) 1 : 3 2) 2 : 3 3) 1 : 4 4) 2 : 5

సాధన: $\frac{P \times 6 \times R}{P \times 9 \times R} = \frac{6}{9} = \frac{2}{3}$

సమాధానం: 2



రచయిత
హెచ్. అరుణ శివప్రసాద్,
విషయ నిపుణులు

895 Word of the Day

Tawdry

Telugu meaning: ఆడంబరమైన, మెరుస్తున్న

English meaning: The word tawdry (టాడ్రీ) is an adjective that describes something that is showy, cheap, or flashy in appearance but lacks real value or taste.

Synonyms: Gaudy, Showy ***Antonyms:*** Elegant, Tasteful

Usage: 1. The politician's tawdry display of wealth during the crisis angered the public.

2. She avoided buying the dress because its tawdry decorations made it look inexpensive.

కరెంట్ అఫైర్స్



ప్రధాని నరేంద్ర మోదీ 2026, జనవరి 16న న్యూదిల్లీలోని భారత మండపంలో నిర్వహించిన 'స్టార్టప్ ఇండియా' పదో వార్షికోత్సవ సదస్సులో పాల్గొని ప్రసంగించారు. భారతదేశంలో స్టార్టప్ సంస్థలు తయారీ, డీప్ టెక్నాలజీ రంగాలపై దృష్టి పెట్టాలని మోదీ పేర్కొన్నారు.

- దశాబ్దం క్రితం దేశంలో 500 అంకుర సంస్థలు ఉంటే, ప్రస్తుతం 2 లక్షల పైనే ఉన్నాయి. 2014లో నాలుగు యూనికార్న్‌లు మాత్రమే ఉంటే ఇప్పుడు వాటి సంఖ్య 125కు చేరుకున్నట్లు మోదీ వెల్లడించారు. 45 శాతం స్టార్టప్‌లలో స్త్రీల భాగస్వామ్యం ఉన్నట్లు చెప్పారు.



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఛైర్మన్‌గా గాజా శాంతి మండలి ఏర్పాటైంది. ఇందులో గాజా కాల్పుల విరమణ ఒప్పందంలో మధ్యవర్తులుగా వ్యవహరించిన ఈజిప్ట్, తుర్కియే, ఖతార్ దేశాల ప్రతినిధులు ఉంటారు. వీరితో పాటు.. బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ నేతలను కూడా మండలిలోకి ఆహ్వానించారు. శాంతి మండలి కార్యనిర్వాహక కమిటీకి డైరెక్టర్ జనరల్‌గా ఐక్యరాజ్యసమితి మాజీ ప్రత్యేక సమన్వయకర్త, బల్గేరియా మాజీ దౌత్యవేత్త మ్లాదెనోవ్ వ్యవహరిస్తారు. ఈ బోర్డులో స్టీవ్ విట్కాఫ్, ట్రంప్ అల్లుడు జారెడ్ కుష్నర్, బ్రిటన్ మాజీ ప్రధాని టోనీ బ్లెయిర్, ప్రపంచ బ్యాంక్ అధ్యక్షుడు అజయ్ బంగా సభ్యులుగా ఉంటారు.



దిల్లీకి చెందిన 21 ఏళ్ల ఆర్యన్ వర్ష్నే గ్రాండ్‌మాస్టర్ హోదా సొంతం చేసుకున్న భారత 92వ ఆటగాడిగా నిలిచాడు. అర్మేనియాలో అంద్రానిక్ మార్గరియాన్ టైటిల్‌ను గెలుచుకోవడం ద్వారా అతడు ఈ ఘనత సాధించాడు. టోర్నీలో 8వ రౌండ్లో అంబర్ట్సుమియన్‌తో గేమ్‌ను డ్రా చేసుకోవడంతో గ్రాండ్‌మాస్టర్‌కు అవసరమైన మూడో నార్మ్‌ను అతడు సొంతం చేసుకున్నాడు.

మరిన్ని కరెంట్ అఫైర్స్ కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

ఎన్‌డీఆర్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

జనవరి 19
చరిత్రలో ఈనాడు

ప్రజా జీవనానికి తీవ్ర నష్టం కలిగించే పరిస్థితినే విపత్తు అంటారు. ప్రకృతి వైపరీత్యాలతోపాటు మానవ చర్యల ఫలితంగా ఇవి సంభవిస్తాయి. వీటి కారణంగా ప్రాణ, ఆస్తి నష్టాలు కలుగుతాయి. మన దేశంలోనూ అనేక ప్రాంతాలు విపత్తులను ఎదుర్కొంటున్నాయి. అలాంటి దుర్బల పరిస్థితుల్లో బాధితులకు సహాయ సహకారాలు అందించడానికి ఏర్పాటైన ప్రత్యేక దళమే 'నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎన్‌డీఆర్ఎఫ్)'. ఇది దేశంలో సంభవించే విపత్తులను నిర్వహించడంలో, విపత్తు ప్రమాద తగ్గింపు (Disaster Risk Reduction) గురించి అవగాహన కల్పించడంలో కీలకపాత్ర పోషిస్తుంది. దీని స్థాపనకు గుర్తుగా ఏటా జనవరి 19న 'ఎన్‌డీఆర్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం'గా (NDRF Raising Day) నిర్వహిస్తారు. వైపరీత్యాల సమయంలో ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది చూపే తెగువ, ధైర్యాన్ని గౌరవించడంతోపాటు వారి సేవలపై ప్రజల్లో అవగాహన కల్పించడం ఈ రోజు ముఖ్య ఉద్దేశం.

దేశంలో విపత్తు నిర్వహణ - నిర్మాణం

భారతదేశంలో 1900, 1905, 1907లో వరసగా కరవులు సంభవించాయి. 1937లో బిహార్-నేపాల్ సరిహద్దుల్లో భూకంపం వచ్చింది. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకున్న బ్రిటిష్ ప్రభుత్వం విపత్తు నిర్వహణ కోసం ఒక నిర్దిష్టమైన వ్యవస్థాగత నిర్మాణం ఉండాలని భావించింది. 1937లో మొదటిసారి వైపరీత్యాల వల్ల నష్టపోయిన ప్రభావిత ప్రాంతాల ప్రజలను ఆదుకునే వ్యవస్థను ఏర్పాటు చేసింది. స్వాతంత్ర్యానంతరం కూడా ఇదే వ్యవస్థను కొనసాగించారు.

- ఐక్యరాజ్య సమితి 1990 దశాబ్దాన్ని 'అంతర్జాతీయ విపత్తు తగ్గింపు దశాబ్దం'గా ప్రకటించింది. దీంతో మన దేశంలో కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో విపత్తు నిర్వహణ విభాగాన్ని ఏర్పాటు చేశారు.

చారిత్రక నేపథ్యం




దేశవ్యాప్తంగా విపత్తుల నిర్వహణకు ప్రత్యేక దళం ఉండాలనే ఉద్దేశంతో విపత్తు నిర్వహణ చట్టం, 2005 ద్వారా నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎన్‌డీఆర్ఎఫ్) ఏర్పాటైంది. 2006, జనవరి 19న దేశానికి చెందిన ప్రాథమిక విపత్తు ప్రతిస్పందన దళంగా ఇది ఉనికిలోకి వచ్చింది. దీని ఏర్పాటును పురస్కరించుకుని 2007 నుంచి ప్రతి సంవత్సరం జనవరి 19న ఎన్‌డీఆర్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవంగా జరుపుతున్నారు.

ఎన్‌డీఆర్ఎఫ్ ఏర్పాటు, విధులు, గతంలో అడిగిన ప్రశ్నలు - జవాబుల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

జనరల్ స్టడీస్ - భారతదేశ సమాజం

వివాహాలు - రకాలు



భారత సమాజంలోని విభిన్న జాతులు, తెగల్లో అనేక రకాలుగా వివాహాలు జరుగుతాయి. కొందరు కన్యాశుల్కం చెల్లిస్తారు. ఇంకొందరు వధువు కుటుంబానికి సేవలు చేసి మెప్పిస్తారు. కొందరు యువతులు నచ్చిన యువకుడి ఇంట్లోకి ప్రవేశించి, చివరికి ఆ ఇంటి కోడలిగా మారిపోతారు. యువకులు జాతరలు, సంతల్లో కాపుకాసి నచ్చిన యువతి నుదుటిపై బొట్టు పెడతారు. చేయి పట్టి పరిణయమాడతారు.

వివాహం ఒక జీవన అవసరం. రెండు జీవితాలను కలిపి ఉంచే పవిత్ర బంధం. సమాజ నిర్మాణంలో మూలస్తంభం. ఇందులో నిర్దిష్ట నియమాలను అనుసరించి జీవిత భాగస్వామిని ఎంచుకుంటారు. ఆచార వ్యవహారాలను పాటిస్తారు. సంప్రదాయాల ప్రకారం ఏకమవుతారు. ఇది అనేక రకాలుగా జరుగుతుంది. అవి:

- సంప్రదింపుల వివాహం
- ఓలి చెల్లించడం ద్వారా వివాహం
- సేవా వివాహం
- వినిమయ వివాహం
- అనాహూత వివాహం
- పరీక్షావధి వివాహం
- అపహరణ పద్ధతి ద్వారా వివాహం
- సహపలాయనం ద్వారా వివాహం
- భౌతిక పరిగ్రహణ వివాహం
- ప్రయోగ వివాహం

ప్రజనన సిద్ధాంతం, కుటుంబ చీలికా సిద్ధాంతం, సహకార సిద్ధాంతం మొదలైన అంశాలతో సహా పూర్తి సమాచారం 'ఈనాడు ఈప్రతిభ' వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో ఈ-బుక్ రూపంలో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Latest Updates

Project Associate Posts

CSIR - National Geophysical Research Institute (CSIR-NGRI) in Hyderabad is conducting interviews for filling positions in various departments on a contractual basis. Total no.of posts is 15. The interview will be conducted on 2026 January 20, 21, 22.

Posts in NIO

CSIR - National Institute of Oceanography (NIO), a public sector undertaking under the Ministry of Science and Technology, is inviting applications for the Technician and Graduate Apprenticeship Trainee posts on a contract basis. Total no.of posts is 14. The interview will be conducted on 22 January 2026.

Individual Consultant Posts

Rail India Technical and Economic Service Limited (RITES), a public sector undertaking located in Gurugram, is inviting applications for Individual Consultant positions in various departments on a contract basis. Total no.of posts is 14. The last date for online applications is 26 January 2026.

Did You Apply..?

Today (January 19) is the last date for the following Jobs

- 40 Junior Resident Jobs at AIIMS Raipur. ***Eligibility:*** MBBS.
- 41 Nurse Jobs at AIIMS Raipur. ***Eligibility:*** Diploma/Degree/MBBS/BDS/MCH.

For more information and other notifications - scan QR code

SSC Exams
English

Homonyms

Directions (Q.s:1 - 20): *Select the most appropriate homonyms to fill in the blank/blanks.*

1. The inquiry revealed that the data had been deliberately .... to support a predetermined conclusion.
A) distorted B) diverted
C) diffused D) diluted

2. The judgment emphasised that administrative discretion must not be exercised in a .... manner.
A) captious B) capricious
C) cautious D) copious

3. The analyst argued that the conclusions were ...., resting more on speculation than evidence.
A) transient B) tentative
C) tenuous D) trivial

4. The regulator warned that repeated violations could .... severe penalties under the amended law.
A) endure B) occur
C) ensure D) incur

5. The policy debate exposed a deep .... between stated intentions and actual implementation.
A) disparity B) despair
C) disparitying D) parity

6. The panel concluded that the allegations were entirely .... and lacked substantive proof.
A) basic B) base
C) baseless D) basis

7. The economist cautioned that short-term gains might .... long-term fiscal stability.
A) justify B) jeopardise
C) jettison D) juxtapose

8. The report was criticised for its failure to .... between correlation and causation.
A) deliberate B) defer
C) diverge D) differentiate

9. The committee's recommendations were largely ...., offering little that was new or actionable.
A) redundant B) reluctant
C) resilient D) resolute

10. The negotiator adopted a ....approach, carefully balancing firmness with flexibility.
A) rigid B) dogmatic
C) arbitrary D) pragmatic

11. The expert committee warned that any attempt to .... with the findings would undermine public trust in the investigation.
A) temper B) tamper
C) tinker D) tender

12. The report noted that the benefits of the scheme were .... distributed, favouring urban regions over rural areas.
A) evenly B) evenly-handed
C) unevenly D) unfair

13. The scholar argued that the policy was based on .... assumptions rather than empirical evidence.
A) rationality B) rationale
C) rationalistic D) rational

14. The leader's speech sought to .... fears rather than inflame public anxiety.
A) align B) alley
C) allay D) allow

15. The court observed that the argument lacked .... and failed to establish a clear causal link.
A) adherence B) coherence
C) concurrence D) correspondence

16. The committee's findings were deemed ...., as they were based on selective data rather than comprehensive analysis.
A) impartial B) partial
C) particle D) partner

17. The economist warned that excessive state intervention could .... market efficiency in the long run.
A) impair B) repair
C) pair D) pare

18. The court noted that the evidence was purely .... evidence and lacked any direct corroboration.
A) circumstantial
B) circumferential
C) ceremonial
D) sentimental

19. The policy was introduced as a .... measure until a permanent framework could be established.
A) temporal B) temperate
C) temporary D) transitory

20. The new regulation seeks to .... the misuse of public funds by strengthening audit mechanisms.
A) curd
B) curb side
C) curve
D) curb

Scan the QR code for Key

Writer: P. Manoj Kumar, Subject Expert

వీవీఐపీల వేదిక దావోస్

- ప్రపంచ నేతలు, వ్యాపారవేత్తల ఆర్థిక చర్చలకు పుట్టినిల్లు
- నేటి నుంచి 5 రోజులపాటు సదస్సు
- 3,000 మందికిపైగా హాజరయ్యే అవకాశం



స్విట్జర్లాండ్‌లోని దావోస్.. దీని గురించి తెలియని ప్రభుత్వాధినేతగానీ, వ్యాపారవేత్తగానీ ఉండరంటే అతిశయోక్తి కాదు. దావోస్ వేదికగా ఏటా జరిగే ప్రపంచ ఆర్థిక సదస్సులో (డబ్ల్యూఈఎఫ్) పాలుపంచుకోవాలని ప్రతి నేతా, ప్రతి వ్యాపారవేత్తా కలలు కంటుంటారు. నేరుగా పెట్టుబడులు సాధించవచ్చని, వ్యాపారవేత్తలతోనే మంచి అవకాశాలున్న ప్రాంతాలు ఎక్కువన్నాయో తెలుసుకోవచ్చని ఇక్కడికి వస్తుంటారు. సోమవారం నుంచి ప్రారంభం కానున్న ఈ సదస్సుకు దేశ విదేశాల నుంచి 3,000 మందికిపైగా ప్రతినిధులు హాజరవుతున్నారు. ఇందులో అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తదితరులున్నారు. 5 రోజులపాటు జరగనున్న ఈ సదస్సుకు మన దేశం నుంచి పలు ముఖ్యమంత్రులు వెళ్తున్నారు.

✦ 400 మంది రాజకీయ నేతలు సదస్సుకు హాజరవుతున్నారు. అందులో 64 మంది దేశాధినేతలున్నారు.

✦ 1,000 మంది సీఈవోలు సదస్సుకు వస్తున్నారు. ఇంకా పౌర సమాజ, కార్మిక ప్రతినిధులు, సాంస్కృతిక ప్రముఖులు, సామాజికవేత్తలు, విద్యావేత్తలు, మేధావులు, నిపుణులు పాల్గొంటున్నారు.

పర్వతాల మధ్య..

దావోస్ పర్వతాల మధ్య ఉండే అతి శీతల ప్రాంతం. 1880లో ఐరోపాలో టీబీ మహమ్మారి పీడించేది. దీంతో చాలా మంది స్వచ్ఛమైన గాలి కోసం దావోస్ పర్వత ప్రాంతాలకు వెళ్లేవారు. అలా వెళ్లిన వారు అక్కడే ఒక చర్చిని నిర్మించారు. అదే చర్చి.. ఇప్పుడు ప్రపంచ ఆర్థిక సదస్సుకు వేదికగా నిలుస్తోంది. అమెరికా ఆధ్వర్యంలో దశాబ్దాలుగా సదస్సు ఇందులోనే జరుగుతోంది. ఇక్కడే ట్రంప్‌తోపాటు ఆయన క్యాబినెట్ సహచరులు, వ్యాపారవేత్తలు, ఇతర నేతలు ఆర్థిక చర్చల్లో పాల్గొంటారు. 19వ శతాబ్దంలో ఆరోగ్య పర్యాటకానికి వేదికగా నిలిచిన ఈ స్కీయింగ్ రిసార్ట్ పట్టణం ఇప్పుడు ప్రపంచ నేతల ఆర్థిక చర్చలకు ఆతిథ్యమిస్తోంది.

✦ 1970లో ఈ ఇంగ్లిష్ కిర్క్ చర్చిని కూల్చి అపార్టుమెంటు నిర్మించాలని ప్రభుత్వం భావించగా స్థానికులు అడ్డుకున్నారు. అదివిన్న వారసత్వ సంపద అని.. ఇది 'హెర్మాన్ హెస్' స్నేహితుడు ఆర్నెస్ట్ జోన్ నివసించిన ప్రాంతం. తన భార్య అనారోగ్యం నుంచి కోలుకోవడానికి ఆయన ఇక్కడికి వచ్చి ఉన్నారు.

✦ వేసవిలో ఆరోగ్య పర్యాటక ప్రాంతంగా ఉన్న ఆల్ఫ్స్ పర్వత సానువుల్లోని దావోస్ శీతాకాలంలో క్రీడల హబ్‌గా మారింది. అయితే గత 5 దశాబ్దాలుగా ఇది ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సుతో ప్రాముఖ్యం సంతరించుకుంది. 1971 నుంచి ఏటా జనవరిలో ఈ సదస్సు జరుగుతోంది. తొలుత ఈ సదస్సును యూరోపియన్ మేనేజ్‌మెంట్ ఫోరం నిర్వహించేది. మొదటి సదస్సుకు డబ్ల్యూఈఎఫ్ వ్యవస్థాపకుడు క్లాజ్ ష్వాబ్.. 400 మంది ఐరోపా వ్యాపారవేత్తలను పిలిచారు. ఆ తర్వాతి నుంచి అది ప్రపంచ దేశాల నేతల ఆర్థిక చర్చల వేదికగా నిలుస్తూ వస్తోంది.

✦ జెనీవా కేంద్రంగా ఏర్పడిన డబ్ల్యూఈఎఫ్ ఏటా ఈ సదస్సును నిర్వహిస్తోంది. ఈ ఏడాది 56వ సదస్సు జరుగుతోంది. 3,000 మందికిపైగా ప్రపంచ దేశాల నేతలు, వ్యాపారవేత్తలు భాగమయ్యే ఈ సదస్సును కవర్ చేయడానికి 500 మంది జర్నలిస్టులు వస్తారు.

హాజరవుతున్న ప్రముఖులు

సదస్సుకు హాజరవుతున్న వారిలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, కెనడా ప్రధాని మార్క్ కార్నీ, జర్మనీ ఛాన్సలర్ ఫ్రెడరిక్ మెర్జ్, ఐరోపా కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాండర్ లెయెన్, చైనా ఉప ప్రధాని హి లిఫెంగ్, స్విట్జర్లాండ్ అధ్యక్షుడు గయ్ పర్మెలిన్, పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, పాలస్తీనా ప్రధాని మహమ్మద్ ముస్తఫా, ఇజ్రాయెల్ అధ్యక్షుడు ఇసాక్ హెర్జోగ్, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తదితరులున్నారు. ఇంకా అర్జెంటీనా, ఇండోనేసియా, ఆర్మేనియా, అజర్‌బైజాన్, కొలంబియా, కాంగో, ఈక్వెడార్, ఫిన్లాండ్, మొజాంబిక్, పోలండ్, సెర్బియా, సింగపూర్, సిరియా అధ్యక్షులు, స్పెయిన్, బెల్జియం, గ్రీస్, నెదర్లాండ్స్, ఖతార్ ప్రధానులు వస్తున్నారు.

✦ ఐక్యరాజ్య సమితి, ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీవో), ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్, నాటో, ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో), యూఎన్‌డీపీ, ఓఈసీడీ సంస్థల అధిపతులు రానున్నారు.

✦ దావోస్ సదస్సు భద్రత కోసం స్విట్జర్లాండ్ ప్రభుత్వం రూ.101.67 కోట్లు (90,00,000 స్విస్ ఫ్రాంక్‌లు) ఖర్చు పెడుతోంది.

✦ ఇక్కడే దేశాల మధ్య సంధి ఒప్పందాలూ జరిగాయి. 1988లో గ్రీస్, టర్కీయేలు దావోస్ డిక్లరేషన్‌పై సంతకాలు చేశాయి. యుద్ధం జరగకుండా అడ్డుకోగలిగాయి. 1989లో ఉత్తర, దక్షిణ కొరియాలు తొలి మినిస్టీరియల్ సమావేశాన్ని దావోస్‌లో నిర్వహించాయి. గాజా, జెరికోలపై ఇజ్రాయెల్, పాలస్తీనాల మధ్య 1994లో ఇక్కడే ఒప్పందం కుదిరింది.

✦ జర్మనీ పునరేకీకరణకు సంబంధించిన చర్చలను అప్పటి ఛాన్సలర్ హెల్మట్ కోల్ దావోస్‌లోనే చర్చించారు. ఆ తర్వాతే బెర్లిన్ గోడను బద్దలుకొట్టారు.

ఒక్కసారే దావోస్ బయట..

ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సు ఒకే ఒక్కసారి దావోస్ బయట జరిగింది. 2001లో అమెరికాపై ఉగ్ర దాడుల నేపథ్యంలో బాధితులకు సంఘీభావంగా 2002లో సదస్సును న్యూయార్క్‌లో నిర్వహించారు.

✦ కరోనా కారణంగా 2021లో సదస్సును వర్చువల్‌గా నిర్వహించారు. 2022లో సదస్సు మే నెలకు వాయిదా పడింది.

వసతి సమస్యే

అంతమంది వీవీఐపీలు వచ్చే దావోస్‌లో కనీస సౌకర్యాలు కరవే. అక్కడ ఉండటానికి వీలుండదు. దావోస్‌తోపాటు సమీపంలోని క్లోస్టర్స్, డార్ఫ్‌లతో కలిపితే 10 మధ్య స్థాయి, 40 చిన్న స్థాయి హోటళ్లున్నాయి. దీంతో ఆ చుట్టుపక్కల ప్రాంతాలన్నీ ఈ 5 రోజులూ కిక్కిరిసిపోతాయి.

భారత్ నుంచి భారీగానే..

దావోస్ సదస్సులో పాల్గొనేందుకు భారత్ నుంచి భారీగానే ప్రతినిధులు హాజరవుతున్నారు. కేంద్ర మంత్రులు అశ్వినీ వైష్ణవ్, శివరాజ్ సింగ్ చౌహాన్, ప్రహ్లాద్ జోషి, కె.రామ్మోహన్ నాయుడు, ముఖ్యమంత్రులు చంద్రబాబు నాయుడు, రేవంత్ రెడ్డి, దేవేంద్ర ఫడణవీస్, హిమంత బిశ్వ శర్మ, మోహన్ యాదవ్, హేమంత్ సోరెన్ వెళ్తున్నారు. 100 మంది అత్యున్నత స్థాయి సీఈవోలు వెళ్తున్నారు.

✦ వ్యాపార ప్రముఖుల్లో ముకేశ్ అంబానీ, ఎన్.చంద్రశేఖరన్, సంజీవ్ బజాజ్, హరి ఎస్ భారతీయ, సుదర్శన్ వేణు, అనీశ్ షా, అమితాబ్ చౌదరి, నదీర్ గోద్రెజ్, సజ్జన్ జిందాల్, నిఖిల్ కామత్, సునీల్ భారతీ మిత్తల్, నందన్ నీలేకని, సలిల్ ఎస్ పరేఖ్, రిషద్ ప్రేమ్‌జీ, ప్రశాంత్ రుయా, విజయ్ శేఖర్ శర్మ, సుమంత్ సిన్హా ఉన్నారు.

గట్టి భద్రత

అతిరథ మహారథులు హాజరవుతున్న దావోస్ సదస్సుకు 5,000 మంది సాయుధ బలగాలతో గట్టి భద్రతనే ఏర్పాటు చేశారు. స్నైపర్లను నియమించారు. ఏఐతో పని చేసే డ్రోన్లను వినియోగిస్తున్నారు. స్పైవేర్‌లను, చొరబాట్లను అడ్డుకోవడానికి ప్రత్యేక పరికరాలను వాడుతున్నారు


- నేషనల్ డెస్క్



తెదేపా ఎన్నారై విభాగం ఆధ్వర్యంలో దుబాయ్‌లో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సభ్యులు

దుబాయ్‌లో ఎన్టీఆర్ వర్ధంతి

ఈనాడు, అమరావతి: దుబాయ్‌లో ఎన్నారై తెదేపా ఆధ్వర్యంలో ఎన్టీఆర్ వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. తెలుగు వారి గుండెల్లో ఆయన చిరస్థాయిగా నిలిచిపోతారని వక్తలు కొనియాడారు. ఎన్టీఆర్ ఆశయాల్ని కొనసాగించాల్సిన బాధ్యత ప్రతి తెలుగువాడిపై ఉందని తెలిపారు. కార్యక్రమంలో ప్రవాసాంధ్రులు, ఎన్టీఆర్ అభిమానులు పాల్గొన్నారు.



ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా తెలుగుదేశం సింగపూర్ ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన సంస్మరణ కార్యక్రమంలో పాల్గొన్న సభ్యులు

ఆరోగ్య శాఖలోనూ 'అవేర్' సేవలు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో సీజనల్ వ్యాధులను రియల్ టైమ్‌లో పర్యవేక్షించి.. వ్యాధులు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకునేందుకు ఆర్టీజీఎస్‌లోని అవేర్ సేవలు వినియోగించుకోనున్నట్లు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ తెలిపారు. అవేర్ ద్వారా వ్యాధుల తీవ్రత, వ్యాప్తికి ఉన్న అవకాశాలను ప్రాథమిక దశలోనే గుర్తించి కట్టడికి చర్యలు తీసుకుంటామని ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామాలు, సచివాలయాల వారీగా గత ఐదారేళ్ల అంటువ్యాధుల గణాంకాల విశ్లేషణ, వాతావరణ పరిస్థితుల ఆధారంగా ఎలాంటి వ్యాధులు ప్రబలుతాయో ముందుగానే పసిగట్టి సమర్థ చర్యలు తీసుకోవచ్చని వెల్లడించారు.

పల్నాడు ప్రశాంతతకు భంగం కలిగిస్తే ఉపేక్షించం

మంత్రి గొట్టిపాటి రవికుమార్ హెచ్చరిక

ఈనాడు, అమరావతి: పల్నాడు ప్రాంత ప్రశాంతతకు భంగం కలిగిస్తే ఉపేక్షించేది లేదని మంత్రి గొట్టిపాటి రవికుమార్ హెచ్చరించారు. పల్నాడు జిల్లా పిన్నెల్లిలో వ్యక్తుల మధ్య జరిగిన ఘర్షణకు రాజకీయ రంగు పులిమి వైకాపా నాయకులు కుట్రలు చేస్తున్నారని ఆదివారం ఓ ప్రకటనలో మండిపడ్డారు. 'వైకాపా ప్రభుత్వంలో పల్నాడు ప్రాంతంలో రక్తం ఏరులైపారింది. పిన్నెల్లి గ్రామం నుంచి 300 మంది ప్రాణభయంతో పారిపోయారు. 12 మందిని వైకాపా నాయకులు హత్య చేశారు. వీరిలో ఎస్సీ, బీసీలు ఉన్నారు. బాధితుల్ని పరామర్శించడానికి ముఖ్యమంత్రిని చంద్రబాబును వెళ్లనివ్వకుండా అడ్డుకున్నారు' అని రవికుమార్ గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఊళ్ల నుంచి వెళ్లిపోయిన వారంతా తిరిగి వస్తున్నారని స్పష్టం చేశారు.

బలులు, రక్తాభిషేకాలు, నరకడాలే వైకాపా తత్వం

మంత్రి అనగాని సత్యప్రసాద్

ఈనాడు, అమరావతి: వైకాపా అధినేత జగన్ ఫ్లెక్సీల ముందు జంతువులను బలి ఇవ్వడం, రక్తాభిషేకాలు చేయడం.. రప్పా.. రప్పా.. అని నరకడాలే ఆ పార్టీ తత్వమని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఎద్దేవా చేశారు. ఇలాంటి సైకో తత్వాన్ని సహించేది లేదని హెచ్చరించారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'సంక్రాంతి పండగ వాతావరణాన్ని దెబ్బతీసేందుకు వైకాపా నేతలు కుట్రలు పన్నారు. తుని నియోజకవర్గంలో లాలం బంగారయ్యను అతి కిరాతకంగా చంపారు. పల్నాడులో రెండు వర్గాల మధ్య ఘర్షణకు రాజకీయ రంగు పులిమి లబ్ధి పొందాలని చూశారు' అని సత్యప్రసాద్ పేర్కొన్నారు.



హంగేరీలోని జమార్డిలో గడ్డకట్టిన బాలాటాన్ సరస్సుపై ఆదివారం పర్యాటకుల సందడి

ఇరాన్‌లో కొత్త నాయకత్వం రావాలి

ఖమేనీ పాలన అంతమవ్వాలి: ట్రంప్

వాషింగ్టన్: ఇరాన్‌లో కొత్త నాయకత్వం రావాల్సిన అవసరం ఉందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న ఆయతుల్లా అలీ ఖమేనీ పాలన అంతం కావాలని అన్నారు. ఇరాన్ సుప్రీం నేత స్థానంలో ఉంటూ ఖమేనీ వేల మంది ప్రజలను చంపుతూ.. తన దేశాన్ని తనే నాశనం చేస్తున్నాడని మండిపడ్డారు. ప్రజలు ఆయనకు నాయకత్వం కట్టబెట్టింది ఇటువంటి భయాలు, మరణాలు సృష్టించడానికి కాదని అన్నారు. ఇంతమంది ప్రాణాలు తీసిన ఖమేనీ ఇరాన్‌ను పాలించడానికి అనర్హుడని పేర్కొన్నారు. ఇక ఆయన అధికారం నుంచి దిగిపోవాల్సిన సమయం వచ్చిందన్నారు. ఇరాన్‌కు కొత్త నాయకుడిని ఎన్నుకోవాలని ఆ దేశ ప్రజలకు పిలుపునిచ్చారు.

✦ అమెరికా స్థావరాలపై తాము దాడులకు సన్నాహాలు చేస్తున్నామన్న ఆరోపణలను ఇరాన్ తోసిపుచ్చింది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలను పెంచడానికి వాషింగ్టన్ ప్రయత్నిస్తోందని విమర్శించింది. ఈ మేరకు ఇరాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ పర్షియన్ భాషలో సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్ట్ పెట్టింది. అమెరికా ఆస్తులపై జరిగే ఏదైనా దాడిని చాలా బలమైన శక్తితో ఎదుర్కొంటామని, తమ దగ్గర అన్ని ప్రత్యామ్నాయాలు పరిశీలనలో ఉన్నాయని అమెరికా విదేశాంగ శాఖ పోస్ట్ చేసిన నేపథ్యంలో ఇరాన్ ఈ మేరకు స్పందించింది.

శ్రీలంక పర్యాటకుల్లో భారతీయులే ఎక్కువ

కొలంబో: శ్రీలంకను 2025లో సందర్శించిన పర్యాటకుల్లో భారతీయులే ఎక్కువగా ఉన్నట్లు అక్కడి పర్యాటక విభాగం తెలిపింది. గతేడాది మొత్తం 23 లక్షల మంది శ్రీలంకలో పర్యటించగా.. వారిలో 5,31,511 మంది భారతీయులే ఉన్నారని పేర్కొంది. దీంతో తమ పర్యాటక రంగానికి భారత్ తిరుగులేని మూల మార్కెట్‌గా కొనసాగుతోందని తన అధికారిక ప్రకటనలో శ్రీలంక పేర్కొంది.

సైబర్ నేరాల్లో ఖాతాల స్తంభనపై అభ్యర్థన సీజేఐ ధర్మాసనానికి

దిల్లీ: సైబర్ నేరాల దర్యాప్తులో బ్యాంకు ఖాతాల స్తంభన, విడుదలకు సంబంధించి ప్రామాణిక నిర్వహణ విధానాన్ని (ఎస్‌వోపీని) రూపొందించేలా కేంద్ర ప్రభుత్వానికి, ఆర్‌బీఐకి ఆదేశాలు ఇవ్వాలన్న అభ్యర్థనను భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం ముందుంచాలని సుప్రీంకోర్టు నిర్ణయించింది. జస్టిస్ పంకజ్ మిథల్, జస్టిస్ ఎస్.వి.ఎన్.భట్‌ల ధర్మాసనం ఈ మేరకు రిజిస్ట్రీని ఆదేశించింది. డిజిటల్ అరెస్టులపై సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం ఇప్పటికే సుమోటో విచారణ జరుపుతోందని కేంద్రం తెలిపిన మీదట ఈ పరిణామం చోటుచేసుకుంది. రాతపూర్వక ఉత్తర్వులు లేకుండా, ఖాతాదారునికి 24 గంటల్లోపు సమాచారం ఇవ్వకుండా ఖాతాలను స్తంభింపజేయడానికి వీల్లేదనే అభ్యర్థనను పరిశీలించడానికి సుప్రీంకోర్టు ఇదివరకే అంగీకరించింది. దీనికి కొనసాగింపుగా దేశవ్యాప్తంగా ఖాతాల స్తంభన, విడుదలకు ఒకేరకమైన ఎస్‌వోపీ ఉండేలా చేస్తే చర్యలు ఏకపక్షం కాబోవని, ప్రక్రియ పారదర్శకంగా ఉంటుందని వచ్చిన అభ్యర్థనపై సుప్రీంకోర్టు ఈ నెల 16న విచారణ జరిపింది.

ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు

- లఖ్‌నవూలో అత్యవసర ల్యాండింగ్

లఖ్‌నవూ: దిల్లీ నుంచి పశ్చిమబెంగాల్‌లోని బాగ్‌డోగరాకు వెళ్తున్న ఇండిగో విమానానికి బాంబు బెదిరింపులు వచ్చాయి. దీంతో విమానాన్ని లఖ్‌నవూలో అత్యవసరంగా ల్యాండింగ్ చేశారు. అధికారుల వివరాల ప్రకారం.. ఏడుగురు విమాన సిబ్బంది, 222 మంది ప్రయాణికులతో ఆదివారం ఉదయం 8.46 గంటలకు దిల్లీ నుంచి బాగ్‌డోగరాకు ఇండిగో విమానం బయల్దేరింది. విమానం గాల్లో ఉన్న సమయంలో టాయిలెట్‌లోని ఓ టిష్యూ పేపర్‌పై బాంబు పెట్టినట్లు రాసి ఉన్న బెదిరింపు నోట్‌ని సిబ్బంది గుర్తించారు. అప్రమత్తమైన పైలట్లు లఖ్‌నవూ ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్‌కి సమాచారం అందించి విమానాన్ని అత్యవసరంగా దించారు. ప్రయాణికులను, సిబ్బందిని సురక్షితంగా తరలించారు. అనంతరం తనిఖీలు నిర్వహించారు. 'విమానంలో బాంబు ఉంది' అని రాసి ఉన్న టిష్యూ పేపర్‌ను భద్రతా సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు.

ఇండోనేసియాలో కూలిన విమానం

జకార్తా: ఇండోనేసియాలోని సులావేసి ద్వీపం వద్ద 11 మందితో ప్రయాణిస్తున్న ఓ విమానం కుప్పకూలిపోయింది. శనివారం జావా నుంచి మకాస్సార్‌కు వెళ్తోన్న సమయంలో టర్బోప్రాప్ ఏటీఆర్ 42-500 విమానం రాడార్ నుంచి అదృశ్యమైంది. దీన్ని చివరిగా మధ్యాహ్నం 01:17 గంటలకు మారోస్‌లోని లియాంగ్-లియాంగ్ ప్రాంతంలో గుర్తించారు. ఈ విమాన శకలాలను ఆదివారం సులావేసి ద్వీపంలో గుర్తించారు. ఈ విమానంలో ఎనిమిది మంది సిబ్బంది సహా సముద్ర వ్యవహారాలు, మత్స్యమంత్రిత్వ శాఖకు సంబంధించిన ముగ్గురు అధికారులున్నారు.

ఈశాన్య రాష్ట్రాల కళాత్మకతను ప్రతిబింబించేలా రాష్ట్రపతి 'ఎట్ హోమ్' ఆహ్వానం

దిల్లీ: ఈ ఏడాది గణతంత్ర దినోత్సవాన రాష్ట్రపతి భవన్‌లో జరిగే 'ఎట్ హోమ్' కార్యక్రమానికి హాజరయ్యే అతిథులకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వినూత్నంగా ఆహ్వానం పంపారు. ఈశాన్య రాష్ట్రాల సంప్రదాయాలను ప్రతిబింబించే ఓ పెట్టెను పంపారు. 8 ఈశాన్య రాష్ట్రాలను 'అష్టలక్ష్మి'గా పిలుస్తారు. ఈ రాష్ట్రాల కళాత్మకతను ప్రతిబింబించేలా అహ్మదాబాద్‌కు చెందిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్ (ఎన్ఐడీ) ఈ పెట్టెను తయారు చేసింది. ఈసారి 'ఎట్ హోమ్'కు హాజరయ్యే అతిథులకు ప్రత్యేకంగా 'ఎరి సిల్క్' అనే శాలువాను బహూకరించనున్నారు. 'ఎరి సిల్క్'ను అహింస సిల్క్ అని కూడా అంటారు. ఈశాన్య రాష్ట్ర సంప్రదాయాల్లో, ఆర్థిక వ్యవస్థలో ఈ శాలువా ఓ ముఖ్య భాగం.

భాజపా మేయరు.. శిందేకు ఇష్టం లేదు

- సంజయ్ రౌత్ వెల్లడి

ముంబయి: భాజపా నేత ముంబయి (బీఎంసీ) మేయరు కావడం శివసేన అధినేత ఏక్‌నాథ్ శిందేతో పాటు ఆ పార్టీ కార్పొరేటర్లకు ఇష్టం లేదని శివసేన (ఉద్ధవ్) నేత సంజయ్ రౌత్ పేర్కొన్నారు. ఈ విషయంలో తెరవెనుక చాలా జరుగుతున్నాయని తెలిపారు. బీఎంసీ ఎన్నికల్లో మహాయుతి కూటమికి స్వల్ప మెజారిటీ వచ్చిన నేపథ్యంలో తన 29 మంది కార్పొరేటర్లను ముంబయిలోని ఓ హోటల్‌కు శివసేన తరలించింది. ఈ ఘటనపై రౌత్ స్పందించారు. బాల్ ఠాక్రే అనుచరులుగా ఉండి.. ప్రస్తుతం శివసేన తరఫున ఎన్నికైన కార్పొరేటర్లు.. భాజపా మేయరును వ్యతిరేకిస్తున్నారని వివరించారు. వారిని హోటల్‌లో బంధిస్తే.. వారితో సంప్రదించడానికి రకరకాల మార్గాలున్నాయని తెలిపారు. భాజపాకు పూర్తి మెజారిటీ రాని నేపథ్యంలో శివసేన కార్పొరేటర్లు కీలకంగా మారారు. 'అనేక మంది శివసేన కార్పొరేటర్లు.. శివ సైనికులు. భాజపా మేయరు వద్దని అందరూ కోరుకుంటున్నారు. శిందే అదే అభిప్రాయంతో ఉన్నారు' అని రౌత్ పేర్కొన్నారు. మేయరు పదవిపై ఉద్ధవ్, రాజ్ ఠాక్రేలు చర్చించారని తెలిపారు. ప్రస్తుతానికి తటస్థంగా ఉండి పరిస్థితిని గమనిస్తున్నామని, తెర వెనుక ఏం జరుగుతోందో చూస్తున్నామని వివరించారు.

✦ హోటల్ చుట్టూ రాజకీయాలు సాగుతున్నాయని సంజయ్ రౌత్ ఆరోపించడాన్ని శివసేన నేత శీతల్ మాత్రే ఖండించారు. శివసేన, భాజపా కలిసే మహాయుతి కూటమిగా పోటీ చేశాయని, తమ పార్టీ నుంచి ఎన్నికైన 29 మందిలో 20 మంది కొత్తవారేనని తెలిపారు. వారంతా ఉద్ధవ్ అభ్యర్థులనే ఓడించారని, తమకు రిసార్టు రాజకీయాలు చేయాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.

✦ 227 సీట్లున్న బృహన్ ముంబయి మున్సిపల్ కార్పొరేషన్‌లో మహాయుతి కూటమికి 118 సీట్లు దక్కాయి. ప్రతిపక్షాల బలం 106గా ఉంది. ఈ నేపథ్యంలో ఉత్కంఠ నెలకొంది.

కరాచీ మాల్‌లో అగ్నిప్రమాదం

- ఆరుగురి మృతి
- 18 మంది గల్లంతు
- 24 మందికి గాయాలు

కరాచీ: పాకిస్థాన్‌లోని కరాచీలో ఉన్న పాత, అతి పెద్ద షాపింగ్ మాల్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో ఆరుగురు మరణించారు. మరో 18 మంది గల్లంతయ్యారు. 24 మందికి గాయాలయ్యాయి. ఈ ఘటనపై దర్యాప్తునకు ఆదేశించినట్లు ఆదివారం అధికారులు తెలిపారు.

కరాచీలో అత్యంత రద్దీగా ఉండే ఎంఏ జిన్నా రోడ్డులోని బహుళ అంతస్తుల గుల్ ప్లాజాలో శనివారం రాత్రి 10.45 గంటల సమయంలో మంటలు ఎగసిపడ్డాయని, అవి వెంటనే అంతటా వ్యాపించాయని సింధ్ ఐజీ జావేద్ ఆలం తెలిపారు. బేస్‌మెంట్‌లో మంటలు మొదలయ్యాయని, వెంటనే పై అంతస్తులకు వ్యాపించాయని వివరించారు. 20 గంటలైనా మంటలు పూర్తిగా అదుపులోకి రాలేదని వెల్లడించారు. ఈ ప్రమాదంలో అగ్నిమాపక అధికారిసహా ఆరుగురు మరణించారని తెలిపారు. 18 మంది ఆచూకీ తెలియడం లేదని వివరించారు. మాల్‌లో 1,200 దుకాణాలున్నాయని, వాటిలో మండిపోయే స్వభావమున్న వస్తువులున్నాయని, అవన్నీ అగ్నికి ఆహుతి అయ్యాయని తెలిపారు.

గుల్ ప్లాజాను 1980లలో నిర్మించారు. అన్ని వర్గాల వారికి ఇది అందుబాటులో ఉండే మార్కెట్. ఇక్కడ క్రాకరీ, డెకరేషన్, ఫర్నీచరు, ఎలక్ట్రానిక్స్, దుస్తులు, కాస్మెటిక్స్, సెంట్ల వంటి దుకాణాలున్నాయి.



ఘటనాస్థలిలో ఎగసిపడుతున్న మంటలు

భాగస్వాములను దెబ్బతీయడమే భాజపా వ్యూహం: కపిల్ సిబల్

దిల్లీ: భాజపాపై రాజ్యసభ సభ్యుడు కపిల్ సిబల్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఆ పార్టీ అధికారం/మెజారిటీ లేని రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలతో పొత్తు పెట్టుకోవడం, అధికారంలోకి వచ్చాక ఆ పార్టీలను పక్కన పెట్టేయడం అనే వ్యూహాన్ని అమలు చేస్తోందన్నారు. ఈ వ్యూహం బిహార్‌లో విజయవంతమైందని, ప్రస్తుతం మహారాష్ట్రలో అమలు చేస్తోందని ఆరోపించారు. అందుకే ముంబయి, పుణెల్లో శివసేన, ఎన్సీపీలకు ఓడించిందని తెలిపారు. కాంగ్రెస్‌తో నేరుగా పోటీపడే ఉత్తర్‌ప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో భాజపా రాజీపడకుండా చూసుకుంటోందని పేర్కొన్నారు. తమిళనాడులో ప్రాబల్యాన్ని విస్తరించుకోవడానికి ప్రయత్నిస్తున్న కాషాయ పార్టీ ఇప్పటికే అనేకసార్లు విఫలమైందని వ్యాఖ్యానించారు. అందుకే ఇప్పుడు దేవాలయాల రాజకీయాలకు పాల్పడుతోందని ఆరోపించారు. నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీలో చీలికను ప్రస్తావించిన సిబల్.. అవకాశవాద రాజకీయాలపై హెచ్చరికలు చేశారు. అజిత్ పవార్‌ను ఉద్దేశిస్తూ.. వారితో (భాజపాతో) రాజీపడటంవల్ల డిప్యూటీ సీఎం కావొచ్చేమోగానీ భవిష్యత్తు ముగిసిపోయినట్లేనని హెచ్చరించారు.

దుక్కి లేని సాగు.. దుంపల లాభం బాగు

ఈటీవీ భారత్: వరి, గోధుమలాంటి పంటలు చేతికొచ్చాక పనికిరావని భావించే వాటి వ్యర్థాలను రైతులు కాల్చేస్తుంటారు. దీని వల్ల వాయు కాలుష్యం పెరుగుతుంది. దున్నకం లేని (జీరో - టిల్లేజ్) పంటసాగు పద్ధతి అందుబాటులోకి వచ్చాక చాలామంది రైతులు పంటల వ్యర్థాలూ తదుపరి పంటకు ప్రయోజనకరమే అని గ్రహించారు. బిహార్‌లోని నలందా జిల్లా కుకుర్‌బర్ గ్రామ రైతు విజేంద్ర చౌధరి ఇదే పద్ధతిని అనుసరించి.. తన పొలంలోని ఎండిన వరి వ్యర్థాలపై నేరుగా విత్తనాలు, ఎరువులను చల్లి బంగాళాదుంపలు సాగు చేస్తున్నారు. పొలాన్ని దున్నకుండా, అందులోని పంట వ్యర్థాలను తొలగించకుండా చేసే ఈ సాగుకు ఒక ప్రత్యేక డ్రిల్లింగు యంత్రాన్ని ఉపయోగిస్తారు. దీనివల్ల దున్నకం, ఇంధన ఖర్చులు ఉండవు. నీటి అవసరం తగ్గిపోతుంది. విత్తనాలకు రక్షణ కల్పించే పైకప్పులా పంట వ్యర్థాలు పనిచేస్తాయి. కలుపు మొక్కల పెరుగుదలకూ అవకాశాలు తక్కువ. తన పొలంలో 30 కిలోల బంగాళాదుంప విత్తిన విజేంద్ర.. ఆ విత్తనాలను మట్టితో కాకుండా 10 అంగుళాల వరి గడ్డితో కప్పారు. ఇదంతా చూసి పరిహాసమాడిన పొరుగు రైతులు ఇప్పుడు విజేంద్ర పొలంలో కళకళలాడుతున్న పంటను, ఎనిమిది రెట్ల లాభాలను చూసి ముక్కున వేలేసుకొంటున్నారు.






రిగ్గింగ్ ఆరోపణలకు చెక్ పెట్టే
అల్ట్రా సెక్యూరిటీ ఈవీఎం!

ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల (ఈవీఎం) విశ్వసనీయతపై దేశంలో వాడి వేడి రాజకీయ చర్చలు జరుగుతున్న వేళ.. ఇంకా ఓటుహక్కు కూడా రాని ఇద్దరు ఇంటర్ ఫస్టియర్ విద్యార్థినులు ఓ ఆవిష్కరణతో ముందుకొచ్చారు. కోల్‌కతాకు చెందిన మాహెరా ఫర్హాద్, ధ్రుతి దాస్ రూపొందించిన అల్ట్రా సెక్యూరిటీ ఓటింగ్ మెషీను ప్రత్యేకత ఏమిటంటే.. ఇందులో ఒక వ్యక్తి ఒకటికి మించి ఓట్లను వేయలేడు. ఫలితంగా పోలింగ్ బూత్‌లో రిగ్గింగుకు అవకాశం ఉండదు. ఎన్నికల విధుల్లో పాల్గొన్న తమ సహ విద్యార్థినుల తల్లిదండ్రులు ఎదుర్కొన్న కొన్ని సవాళ్లు మాహెరా, ధ్రుతిలను ఆలోచింపజేసి ఈ మెషీను రూపకల్పనకు దారి తీశాయి. దీన్ని అన్‌లాక్ చేయాలంటే (తెరవాలంటే) ప్రిసైడింగ్ అధికారి వేలిముద్ర తప్పనిసరి. ఓటరు ముందుగా తన వేలిముద్రను సమర్పించాలి. తర్వాత కెమెరాకు ముఖం చూపించి వ్యక్తిగత గుర్తింపును నిర్ధారించుకోవాలి. ఆ తర్వాతే ఈవీఎం అన్‌లాక్ అవుతుంది. ఓటు వేయగానే మెషీను లాక్ అయిపోతుంది. ఇప్పటికే పలు సైన్స్ అండ్ టెక్నాలజీ ఫెయిర్‌లలో దీన్ని ప్రదర్శించిన మాహెరా, ధ్రుతి దాస్.. ఈసీ అధికారులు అవకాశమిస్తే తమ ఈవీఎం గురించి వివరిస్తామని తెలిపారు.





పుష్కర్ తీరాన సప్తపదితో
స్పానిష్ జంట పెళ్లి

రాజస్థాన్‌లోని అజ్మేర్‌లో ఓ స్పానిష్ జంట వేద మంత్రాల సాక్షిగా వివాహ బంధంలోకి అడుగు పెట్టింది. స్పెయిన్‌కు చెందిన కలేరా, రావుల్ గత ఏడేళ్లుగా ప్రేమలో ఉండి సహజీవనం చేస్తున్నారు. రావుల్‌కు పని ఒత్తిళ్ల కారణంగా ఇంత కాలం వివాహం చేసుకోలేకపోయామని కలేరా తెలిపింది. ఒకరినొకరు మరింతగా తెలుసుకోవాలని భారత పర్యటనకు వచ్చినట్లు పేర్కొంది. అజ్మేర్ పక్కనున్న ఆధ్యాత్మిక నగరి పుష్కర్‌కు చేరుకొని ఇక్కడే హిందూ సంప్రదాయంలో వివాహం చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. పుష్కర్ సరస్సులోని కృష్ణ ఘాట్ వద్ద పండితుల వేదమంత్రాల మధ్య సప్తపదితో వీరి వివాహ కార్యక్రమం ఘనంగా జరిగింది. భారతీయ సంప్రదాయ వస్త్రాలు ధరించిన కలెరా నుదుటిపై రావుల్ సిందూరం దిద్ది ఆమెను భార్యగా స్వీకరించారు. ఇద్దరూ దండలు మార్చుకొన్నారు. ఈ జంట మహాదేవునికి జలాభిషేకం చేసినట్లు వివాహాన్ని జరిపించిన పండితుడు లఖన్ పరాశర్ తెలిపారు.



నిద్రలేమి సమస్యలకు క్యాన్సర్‌తో సంబంధం

నిద్రలేమి సమస్యలకు క్యాన్సర్‌కు మధ్య గట్టి సంబంధం ఉందని భోపాల్‌లోని ఎయిమ్స్ శాస్త్రవేత్తల పరిశోధనలో తేలింది. క్రమంతప్పకుండా, సరిపడా నిద్రపోవడం వల్ల రోగ నిరోధక శక్తి మెరుగుపడటమే కాకుండా ఇన్‌ఫెక్షన్లు, క్యాన్సర్ వంటి తీవ్రస్థాయి రుగ్మతలకు ఆస్కారం తగ్గుతుందని వెల్లడైంది. "రాత్రిపూట ఆలస్యంగా నిద్రపోవడం, నైట్ షిఫ్టులలో పనిచేయడం, రోజువారీ పనుల్లో క్రమపద్ధతి లేకపోవడం వల్ల శరీర జీవ గడియారం అవరోధాలకు గురవుతుంది. దీనివల్ల హార్మోన్ సమతౌల్యం దెబ్బతినడం, జీర్ణప్రక్రియపై ప్రభావంపడటం జరుగుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో క్యాన్సర్ కణాల వృద్ధి, వ్యాప్తికి అవకాశం దొరుకుతుంది" అని పరిశోధనకు నాయకత్వం వహించిన ప్రొఫెసర్ అశోక్ కుమార్ తెలిపారు. క్యాన్సర్ నివారణకు ఔషధాలు ఒక్కటే సరిపోవని, జీవనశైలిపరంగా జాగ్రత్తలు అవసరమని సూచించారు. సరిపడా నిద్రపోవడం, సకాలంలో భోజనం చేయడం, ఆరోగ్యకరమైన జీవనశైలికి మళ్లడం వంటివి అవసరమన్నారు.